
# చరిత్ర మరియు పౌరశాస్త్రం

## ఏడవ తరగతి



# భారత సంవిధానము

## పార్ట్ – IV A

## ప్రాథమిక బాధ్యతలు

**51 ఎ) ప్రాథమిక బాధ్యతలు**

**ప్రతి పౌరుడు ఈ క్రింది బాధ్యతలను మనసారా స్వీకరించి బాధ్యతాయుతంగా ప్రవర్తించవలెను.**

ఎ) రాజ్యాంగ శాసనబద్ధుడై యుండుట. శాసనమందలి ఆశయములనూ, శాసనం స్థాపించే సంస్థలనూ, జాతీయ పతకాన్ని, జాతీయ గీతాన్ని అంకితభావంతో గౌరవించుట.

బి) స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో అన్ని రంగాలలో వ్యవహరించుట.

సి) దేశ సార్వభౌమత్వాన్ని, సమన్వయతనూ, సమగ్రతను రక్షించుట.

డి) దేశరక్షణలో అనుక్షణం సంసిద్ధుడై ఉండుట.

ఇ) ప్రజాజీవనంలో అన్యోన్యతనూ, భ్రాతృభావాన్ని పోషించుట, మత, భాష, ప్రాంతీయతత్త్వాలకు వర్గవైరుధ్యములకు అతీతముగా ఉండుట. స్త్రీలను అగౌరవపరచే ఆచారములను విడనాడుట.

ఎఫ్) అమూల్యమైన భారతీయ చారిత్రక సంపదనూ, సుసంపన్న సంస్కృతినీ పరిరక్షించుట.

జి) పర్యావరణాన్ని అడవులను, కొలనులనూ, నదులనూ రక్షించుట, అభివృద్ధి పరచుట, మృగరక్షణ జలజంతు జీవరాసులపై కరుణార్ద్రత.

హెచ్) శాస్త్రీయ మరియు మానవతా దృక్పథాలను అలవరచుకొనుట, జిజ్ఞాసను పెంపొందించు కొనుట, సంస్కరణ తత్వమును పెంపొందించుట.

ఐ) హింసను విడనాడుట, ప్రజల ఆస్తుల విధ్వంసం చర్యలను నిరోధించుట.

జె) వ్యక్తిత్వ శక్తి సామర్థ్యాల ఔన్నత్యాన్ని పెంపొందించుకొనుట ద్వారా మరియూ సమిష్టి కృషి ద్వారా అన్ని రంగాలలో గణనీయమైన స్థాయిని చేరుటకొరకు, శిఖరాగ్ర సాధనకొరకు నిరంతరం కృషి సల్పుట.

కె) రక్షకులు లేదా సంరక్షకులుగా ఉన్నవారందరూ ఆరు నుంచి 14 సంవత్సరముల లోపల పసివారికి విద్యాభ్యాసము చేయు అవకాశమును కల్పించవలెను.

ప్రభుత్వ తీర్మానం క్రమ సంఖ్య : అభ్యాస్ - 2116/(ప్ర.క్ర. 43/16) ఎస్ డి-4 తేదీ 25.4.2016 అనుసారం స్థాపించబడిన
సమన్వయ సమితి యొక్క తేదీ 3.3.2017 రోజున జరిగిన సభలో ఈ పాఠ్య పుస్తకమును నిర్దేశించుటకుగాను అనుమతి ఇవ్వబడినది.

# చరిత్ర మరియు పౌరశాస్త్రం

## ఏడవ తరగతి

మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె

మీ స్మార్ట్‌ఫోన్‌తో DIKSHA APP నుపయోగించి పాఠ్యపుస్తకం మొదటి పుటలోని QR CODE ను స్కాన్ చేసిన డిజిటల్ పాఠ్యపుస్తకం మరియు ప్రతి పాఠంలోని QR CODE ను స్కాన్ చేసిన ఆ పాఠానికి సంబంధించిన అధ్యయన-అధ్యాపనలకు ఉపయుక్తమగు దృశ్య-శ్రవణ సాహిత్యం లభిస్తుంది.

ప్రథమ ముద్రణ : 2018
పునర్ముద్రణ : అక్టోబర్ 2021

© మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె - 411004.
ఈ పుస్తకమునకు సంబంధించిన సర్వహక్కులు మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థవి. మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ సంచాలకుల లిఖితపూర్వక అనుమతి లేనిదే ఈ పుస్తకమునందలి ఏ భాగమును గాని ఉటంకించుట లేదా పునర్ముద్రించుట చేయరాదు.

**చరిత్ర విషయ సమితి :**
డా. సదానంద్ మోరే, అధ్యక్షులు
శ్రీ మోహన్ శేటే, సభ్యులు
శ్రీ పాండురంగ్ బలకవడే, సభ్యులు
డా. అభిరామ్ దీక్షిత్, సభ్యులు
శ్రీ బాపుసాహెబ్ శిందే, సభ్యులు
శ్రీ బాలకృష్ణ చోపడే, సభ్యులు
శ్రీ ప్రశాంత్ సరుడ్కర్, సభ్యులు
శ్రీ మోగల్ జాధవ్, కార్యదర్శి-సభ్యులు

**పౌరశాస్త్ర విషయ సమితి :**
డా. శ్రీకాంత్ పరాంజపే, అధ్యక్షులు
ప్రా. సాధనా కులకర్ణీ, సభ్యురాలు
డా. మోహన్ కాశీకర్, సభ్యులు
శ్రీ వైజనాథ్ కాళే, సభ్యులు
శ్రీ మోగల్ జాధవ్, కార్యదర్శి-సభ్యులు

**చరిత్ర మరియు పౌరశాస్త్రం అధ్యయన సమూహం :**
శ్రీ రాహుల్ ప్రభు
శ్రీ సంజయ్ వఝురేకర్
శ్రీ సుభాష్ రాఠోడ్
సౌ. సునీతా దళవీ
ప్రా. శివానీ లిమయే
శ్రీ భావూ సాహెబ్ ఉమాటే
డా. నాగనాథ్ యెవలే
శ్రీ సదానంద్ డోంగరే
శ్రీ రవీంద్ర పాటిల్
శ్రీ విక్రమ్ అడసూల్
సౌ. రూపాలీ గిర్కర్
డా. మీనాక్షీ ఉపాధ్యాయ్
సౌ. కాంచన కేత్కర్
సౌ. శివకన్యా పటవే
డా. అనిల్ సింగారే
డా. రావుసాహెబ్ శెళ్కే
శ్రీ మరీభా చందన్ శివే
శ్రీ సంతోష్ శిందే
డా. సతీశ్ చాపలే
శ్రీ విశాల్ కులకర్ణీ
శ్రీ శేఖర్ పాటిల్
శ్రీ సంజయ్ మెహతా
శ్రీ రామదాస్ ఠాకర్
డా. అజిత్ ఆప్టే
డా. మోహన్ ఖడసే
సౌ. శివకన్యా కదేర్కర్
శ్రీ గౌతమ్ డాంగే
డా. వ్యంకటేశ్ ఖరాత్
శ్రీ రవీంద్ర జిందే
డా. ప్రభాకర్ లోంఢే

**ఆహ్వానితులు :**
డా. సోమనాథ్ రోడే, డా. గణేశ్ రావూత్

**ముఖచిత్రం మరియు అలంకరణ :**
శ్రీ దేవదత్త ప్రకాశ్ బలకవడే

**కోటల ఛాయాచిత్రాలు :**
శ్రీ ప్రవీణ్ భోంస్లే

**మాన చిత్రపటములు :**
శ్రీ రవికిరణ్ జాధవ్

**అక్షర కూర్పు :**
సృష్టి, ఖార్ఘర్, నవి ముంబయి

**కాగితం :**
70 జి.ఎస్.ఎమ్. క్రీమ్‌వోవ్

**ముద్రణాదేశం :**

**ముద్రణ:**

**సంయోజకులు :**
శ్రీ మోగల్ జాధవ్, విశేషాధికారి, చరిత్ర మరియు పౌరశాస్త్రం.
సౌ. వర్షా సరోదే
విషయ సహాయకులు, చరిత్ర మరియు పౌరశాస్త్రం పాఠ్యపుస్తక సంస్థ, పుణె

**అనువాదం**
**అనువాదం :** శ్రీ బొడ్డు శంకరయ్య బాలయ్య
**సమీక్షణ :** శ్రీ మురహరి వేంకటేశ్వర్లు నరసయ్య
**అనువాద సంయోజకులు :**
డా॥ శ్రీమతి తులసి భారత్
విశేషాధికారిణి తెలుగు, పాఠ్యపుస్తక సంస్థ

**నిర్మితి**
శ్రీ సచ్చితానంద్ ఆఫలే, ముఖ్య నిర్మితి అధికారి
శ్రీ ప్రభాకర్ పరబ్, నిర్మితి అధికారి
శ్రీ శశాంక్ కణికదలే, సహాయక నిర్మితి అధికారి

**ప్రకాశకులు :**
శ్రీ వివేక్ ఉత్తమ్ గోసావీ, నియంత్రకులు
పాఠ్యపుస్తక నిర్మితి సంస్థ, ప్రభాదేవి, ముంబయి - 25

# భారత సంవిధానము

## ప్రస్తావన

**భారతదేశ ప్రజలమగు మేము**, భారతదేశమును **సార్వభౌమ్య**
**సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణరాజ్యముగ**
నెలకొల్పుటకు మరియు అందలి పౌరులెల్లరకు
సామాజిక, ఆర్థిక, రాజకీయ **న్యాయమును**,
భావము, భావప్రకటన, విశ్వాసము,
ధర్మము, ఆరాధన -- వీటి **స్వాతంత్ర్యమును**,
అంతస్తులోను, అవకాశములోను **సమానత్వమును**
చేకూర్చుటకు; మరియు వారందరిలో
వ్యక్తి గౌరవమును, జాత్యైక్యతను,
అఖండతను తప్పక ఒనగూర్చు **సౌభ్రాత్రమును**,
పెంపొందించుటకు; సత్యనిష్ఠా పూర్వకముగ తీర్మానించుకొని,
ఈ 1949వ సంవత్సరము నవంబరు ఇరువది యారవ
దినమున **మా సంవిధాన సభయందు ఇందుమూలముగ,**
**ఈ సంవిధానమును అంగీకరించి, అధిశాసనము చేసి**
**మాకు మేము ఇచ్చుకొన్నవారమైతిమి.**

## జాతీయ గీతము

జనగణమన – అధినాయక జయ హే
భారత – భాగ్యవిధాతా
పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కల, బంగ,
వింధ్య, హిమాచల, యమునా, గంగా,
ఉచ్ఛల జలధితరంగ,
తవ శుభ నామే జాగే, తవ శుభ ఆశిస మాగే,
గాహే తవ జయగాథా,
జనగణ మంగలదాయక జయ హే,
భారత – భాగ్యవిధాతా
జయ హే, జయ హే, జయ హే,
జయ జయ జయ, జయ హే

## ప్రతిజ్ఞ

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరు నా సహోదరులు.

నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషిచేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

# ప్రస్తావన

విద్యార్థి మిత్రులారా!

మూడవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు చరిత్ర మరియు పౌరశాస్త్రం విషయాన్ని మీరు 'పరిసరాల అధ్యయనం - 1' మరియు 'పరిసరాల అధ్యయనం -2'లో అభ్యసించారు. ఆరవ తరగతి నుంచి పాఠ్యప్రణాళికలో చరిత్ర మరియు పౌరశాస్త్రం అనునవి స్వతంత్ర విషయాలు. కావున ఆరవ తరగతి నుంచి ఈ రెండు విషయాలను ఒకే పాఠ్యపుస్తకంలో సమావేశ పరచడం జరిగింది. ఏడవ తరగతి పాఠ్యపుస్తకాన్ని మీ చేతికి అందిస్తున్నందుకు మాకు సంతోషంగా ఉంది.

ఈ విషయం చక్కగా అర్థం కావాలని, ఆనందదాయకంగా ఉండాలని, మన పూర్వీకులు చేసిన కార్యముల నుంచి ప్రేరణ లభించాలనే ఉద్దేశంతో ఈ పాఠ్యపుస్తకం రచింపబడింది. ఈ పాఠ్యపుస్తకం యొక్క అభ్యసనం ద్వారా జ్ఞానంతోబాటు ఆనందం కూడా కలగాలని మా భావన. అందుకోసం ఈ పాఠ్యపుస్తకంలో రంగురంగుల చిత్రాలు, మానచిత్రపటాలు ఇవ్వబడినవి. పాఠ్యపుస్తకంలోని ప్రతి పాఠం జాగ్రత్తగా అభ్యసించండి. అందులోని ఏ భాగం మీకు అర్థం కాదో ఆ భాగాన్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ద్వారా అర్థం చేసుకోండి. గడులలో ఇవ్వబడిన అంశాలు మీ జ్ఞానాన్ని అభివృద్ధి పరుస్తాయి! చరిత్ర అనే విషయం మనోరంజకమైనది కావున దానిని మీ స్నేహితునిగా భావించి ఈ పుస్తకాన్ని అభ్యసించినచో మీకు దాని తీయదనం ఖచ్చితంగా తెలుస్తుంది.

చరిత్ర విషయ విభాగంలో 'మధ్యయుగ భారతదేశ చరిత్ర' ఇవ్వబడినది. మధ్యయుగ భారతదేశ చారిత్రక సంఘటనలలో మహారాష్ట్ర యొక్క స్థానం మరియు భూమికను కేంద్ర స్థానంగా ఉంచుకొని ఈ పాఠ్యపుస్తకం రూపొందించడం జరిగింది. దానితో మీకు మనం భారతదేశ పౌరులమనే భావనతో బాటు మీ బాధ్యతలను కూడా తెలుసుకోవడం ఆశించడమైనది. పౌరశాస్త్ర విభాగంలో భారతదేశ సంవిధానం (రాజ్యాంగం) యొక్క పరిచయం చేయబడినది. భారతదేశ సంవిధాన నిర్మితి యొక్క నేపథ్యం, సంవిధానం యొక్క పీఠిక/ప్రస్తావన సంవిధానంలోని ప్రాథమిక హక్కులు మరియు ఆదేశిక సూత్రాలు అను అంశాలను కూర్పు చేయడం జరిగింది. మనదేశంలోని పరిపాలన సంవిధానం, చట్టాలు మరియు నియమాల ననుసరించి జరుపబడుతుందని సులభమైన భాషలో చెప్పడం జరిగింది. మీ అధ్యయనం వీలైనంతమేరకు కృత్యప్రధానంగా ఉండుట కొరకు ఉపక్రమాలు ఇవ్వబడినవి. మీరు దేశం యొక్క భావిపౌరులు, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేవారు అనే భావనతో పై తరగతిలో ప్రవేశించెదరు.

చరిత్ర అధ్యయనం ద్వారా మన పూర్వీకుల సామర్థ్యం, గొప్పదనం తెలియవస్తుంది. దానికి పౌరశాస్త్రం యొక్క అధ్యయనం జత కలిస్తే దేశం మరియు సమాజం యొక్క భవిష్యత్తును తీర్చిదిద్దే దిశగా మన బాధ్యతలు ఏమిటో కూడా అవగతమవుతాయి. అందుకోసమే ఈ సంయుక్త అభ్యసన ఉపక్రమం తయారుచేయబడింది.



(డా. సునిల్ మగర్)

సంచాలకులు

మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి

మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ.

పుణె

తేదీ : 28 మార్చ్ 2017

## ఉపాధ్యాయుల కొరకు

ఆరవ తరగతి చరిత్ర మరియు పౌరశాస్త్రం పాఠ్యపుస్తకాన్ని మీరు బోధించారు. ప్రస్తుతపు ఏడవ తరగతి పాఠ్యపుస్తకంలో మధ్యయుగ భారతదేశ చరిత్ర యొక్క కూర్పుచేయబడినది. ఈ విధంగా మహారాష్ట్రను కేంద్రస్థానంగా చేసికొని ఈ చరిత్ర పాఠ్యపుస్తకం తయారుచేయుటయే దీని యొక్క విశిష్టత. మన ప్రాంతం భారతదేశ సమాఖ్య రాజ్యంలోని అంశం అయినప్పటికి చరిత్రను అవగతం చేసుకుంటున్నప్పుడు మహారాష్ట్ర దృష్ట్యా అనగా భారతదేశ చరిత్రలో మహారాష్ట్ర యొక్క స్థానం, భూమిక మరియు తోడ్పాటును దృష్టిలో ఉంచుకొని అర్థం చేసుకొన్నచో విద్యార్థులలో జాతీయ భావన అధికంగా పరిపక్వం అవుతుంది. అందులో మన పూర్వీకులు దేశం కోసం ముఖ్యంగా ఏం చేశారో తెలుస్తుంది. తద్వారా దేశంపట్ల మన జాతీయ బాధ్యతలు మరియు కర్తవ్యాల గురించిన అవగాహన కూడ వికసితమవుతుంది.

ఈ సందర్భంలో సహజంగానే 'పదిహేడవ' శతాబ్దంలో శివఛత్రపతి శివాజీ మహారాజు స్థాపించిన స్వరాజ్య ప్రాముఖ్యత నిర్ధారితమవుతుంది. స్వరాజ్య నిర్మాణం గురించి అర్థం చేసుకోవాలంటే శివాజీ మహారాజు జననానికి పూర్వం భారతదేశంలోని మరియు మహారాష్ట్రలోని పరిస్థితులు తెలుసుకోవలసియున్నది. అనగా భారతదేశ చరిత్ర తెలియవలెను. అందువలననే ఈ పద్ధతిలో దీనిని కూర్పు చేయడం జరిగింది. శివాజీ మహారాజు స్థాపించిన స్వరాజ్యంపై శివాజీ మహారాజు మరణానంతరం ఉత్తరం నుండి వచ్చిన దండయాత్రలను మహారాష్ట్ర ఏ విధంగా ఎదుర్కొన్నది మరియు స్వరాజ్యాన్ని ఎలా రక్షించుకొన్నదో చర్చించడం జరిగింది. ఈ ఆక్రమణను తిప్పికొట్టిన తరువాత మరాఠీయులు మహారాష్ట్ర సరిహద్దులను విస్తరించి భారతదేశంలో అధిక శాతం వ్యాపింపజేయడం జరిగింది. స్వరాజ్యమును సామ్రాజ్యంగా రూపొందించడం గురించిన వివేచన అనునది దీని తరువాత విషయం. బ్రిటిషువారు భారతదేశాన్ని జయించి పరిపాలన చేశారనునది అందరికి తెలిసినదే. కాని ఈ ప్రక్రియలో బ్రిటిషువారిని నిలువరించడంలో మహారాష్ట్ర ఏ విధంగా ముందంజవేసిందో తెలుసుకొనుట కూడా అంతే ముఖ్యం. బ్రిటిషు వారు మరాఠీయులతో పోటీపడి, వారిని ఓడించిన పిదపనే భారతదేశాన్ని జయించగలిగారు. ఇది మన సామర్థ్యం మరియు మన కర్త్యవ్యాలకు తార్కాణం. బోధనాధ్యయనాల సందర్భంలో ఈ భావన విద్యార్థుల మనస్సులలో నెలకొనవలెనని ఆశించబడినది. పాఠ్యపుస్తకం యొక్క ఈ భూమిక చిత్రరూపంలో వ్యక్తపరచే ముఖచిత్రంపై మరాఠీ అధికార విస్తరణను చూపే భారతదేశ స్థూల మానచిత్రపటము ఉపయోగించబడింది.

పౌరశాస్త్ర విభాగంలో భారతదేశ సంవిధానం యొక్క పరిచయం చేయబడింది. ఈ విషయం ఒకే విద్యా సంవత్సరంలో బోధించడం సాధ్యం కాకపోవడం వలన రెండు తరగతులలో దానిని విభజించడం జరిగింది. ఈ తరగతి సంవిధానం యొక్క ఆవశ్యకత, సంవిధానంలో గల విలువలు, పీఠిక/ప్రస్తావన, ప్రాథమిక హక్కులు, బాధ్యతలు మరియు ఆదేశిక సూత్రాలకు సంబంధించిన అంశాలకు ప్రాముఖ్యత కలదు. సంవిధానంలోని ప్రభుత్వ యంత్రాంగం యొక్క స్వరూపం మరియు దానిపై ఆధారపడిన రాజకీయ ప్రక్రియ యొక్క అధ్యయనం ఎనిమిదవ తరగతిలో చేయవలసి ఉన్నది. కావున ఏడవ తరగతి మరియు ఎనిమిదవ తరగతి పౌరశాస్త్రంలోని అంశాలు పరస్పర పరిపూరకాలు. దీనిని విద్యార్థులకు బాగుగా అర్థం అగునట్లు మరియు నవీనరీతిలో పొందుపరచడం జరిగింది. అది జ్ఞాననిర్మితి సిద్ధాంతము ననుసరించి ఉన్నది. అంతేగాక ఇంకా ముందుకు ఆలోచించి రాజకీయ వ్యవస్థకు సంబంధించిన ఉదాసీనతను తొలగించి విద్యార్థులను సమాజంలో భాగస్వాములను చేయుటకు అధిక ప్రాధాన్యం ఇవ్వబడింది. విషయాలు మిక్కిలి సులభశైలిలో కూర్చబడినవి. ఈ విధమైన కూర్పు పుస్తకమును పఠించాలనే ఆసక్తిని పెంపొందుటకు సహాయపడుతుంది.

ఉపాధ్యాయులు ప్రస్తుత పాఠ్యపుస్తకమును బోధించునపుడు వార్తాపత్రిక, దూరదర్శిని వార్తలు, నిపుణులు చేసిన విమర్శలు మొదలగు వాటినుపయోగించి విద్యార్థులలో సమగ్ర దృష్టికోణాన్ని వికసింప చేయుటకు సహాయపడాలి. చరిత్ర మరియు పౌరశాస్త్ర అధ్యయన అధ్యాపనలు ప్రస్తుత సంఘటనల సందర్భాలతో జోడించి చేసినచో మిక్కిలి అర్థవంతంగా ఉంటుంది. దానితోబాటు విద్యార్థులు విలువల్ని గ్రహించుటకు తోడ్పడుతుంది.

# విషయ సూచిక

## మధ్యయుగ భారతదేశ చరిత్ర


| క్ర. స. | పాఠం పేరు | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | చారిత్రక ఆధారాలు ..................................... | 1 |
| 2. | శివాజీకి పూర్వం భారతదేశం........................... | 5 |
| 3. | మత సామరస్యం ......................................... | 11 |
| 4. | శివాజీకి పూర్వం మహారాష్ట్ర ............................ | 14 |
| 5. | స్వరాజ్య స్థాపన ........................................... | 19 |
| 6. | మొఘులులతో పోరాటం................................ | 24 |
| 7. | స్వరాజ్య పరిపాలన .................................... | 29 |
| 8. | ఆదర్శ పరిపాలకుడు .................................. | 33 |
| 9. | మరాఠీయుల స్వాతంత్ర్య సంగ్రామం .................. | 37 |
| 10. | మరాఠీయుల రాజ్య విస్తరణ........................... | 44 |
| 11. | దేశరక్షకులు మరాఠీయులు ............................ | 47 |
| 12. | సామ్రాజ్య ప్రస్థానం....................................... | 53 |
| 13. | మహారాష్ట్రలోని సామాజిక జీవనం ..................... | 57 |



**S.O.I. Note :** The following foot notes are applicable : (1) © Government of India, Copyright : 2017. (2) The responsibility for the correctness of internal details rests with the publisher. (3) The territorial waters of India extend into the sea to a distance of twelve nautical miles measured from the appropriate base line. (4) The administrative headquarters of Chandigarh, Haryana and Punjab are at Chandigarh. (5) The interstate boundaries amongst Arunachal Pradesh, Assam and Meghalaya shown on this map are as interpreted from the "North-Eastern Areas (Reorganisation) Act. 1971," but have yet to be verified. (6) The external boundaries and coastlines of India agree with the Record/Master Copy certified by Survey of India. (7) The state boundaries between Uttarakhand & Uttar Pradesh, Bihar & Jharkhand and Chattisgarh & Madhya Pradesh have not been verified by the Governments concerned. (8) The spellings of names in this map, have been taken from various sources.

| అధ్యయన – ఆధ్యావన ప్రక్రియ | అధ్యయన ఫలితాలు |
|---|---|
| **అధ్యయనార్థికి జతగా/సమూహంలో/వ్యక్తిగతంగా అధ్యయన అవకాశం కల్పించి, వారిని తర్వాతి అంశాలకై ప్రేరేపించుట.**<br>• భిన్నత్వం, భేదవావం, ప్రభుత్వం/సర్కారు, జీవనోవాధి వంటి సంకల్పనలకు సంబంధించిన చర్చల్లో పాల్గొనుట.<br>• కుటుంబం, పాఠశాల, సమాజంలో ప్రజలతో నడచుకొనే మంచి/చెడు ప్రవర్తనను పరిశీలించుట.<br>• సమాజంలో ప్రభుత్వం యొక్క భూమికను అర్థం చేసుకొనుట, కుటుంబ వ్యవహారాలు/సంఘటనలు మరియు గ్రామంలోని/పట్టణంలోని వ్యవహారాలు/సంఘటనలు వీటిలోని భేదాన్ని అర్థం చేసుకొనుట.<br>• సమీపంలోని పరిసరాల/గ్రామం యొక్క వృత్తుల విషయంలో వ్యక్తి అభ్యాసం (Case Study) చేసి వర్ణించుట.<br>• పాఠ్యపుస్తకాలపై ఆధారపడిన అభ్యసనం : ఏదేని గ్రామ పంచాయితీ లేక నగరపాలిక/మహానగరపాలికల ప్రత్యక్ష పరిపాలన చూచుట, ప్రత్యక్ష పరిశీలన చేయుట. (విద్యార్థులు ఉండే చోటు ననుసరించి) | అధ్యయనార్థి –<br>07.73H.01 వైచారిక మరియు సాంస్కృతికతలను ఇచ్చిపుచ్చుకోవటం వలన మానవుని జ్ఞానం చాలా పెంపొందుతుందని అర్థం చేసుకొంటారు.<br>07.73H.02 మన చుట్టు ప్రక్కల కనిపించే వైవిధ్యత విషయంలో దోషరహిత ప్రవృత్తితో మెలగుత్రారు.<br>07.73H.03 వివిధ రూపాలలో గల సమానత్వం మరియు విషయతలలోని భేదాన్ని స్పష్టం చేస్తారు. మరియు దోషరహిత పద్ధతిలో వాటికి ఎదురెళ్ళుతారు.<br>07.73H.04 ప్రభుత్వ భూమికను వర్ణిస్తారు. ముఖ్యంగా స్థానిక స్థాయిలో.<br>07.73H.05 ప్రభుత్వంలోని వివిధ స్థాయిలను గుర్తిస్తారు. స్థానిక, ప్రాంతీయ, జాతీయ.<br>07.73H.06 గ్రామీణ మరియు పట్టణ స్థానిక ప్రభుత్వ సంస్థల ఆరోగ్య, విద్యా క్షేత్రాలలోని కార్యపద్ధతిని విశ్లేషిస్తారు.<br>07.73H.07 గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోగల వృత్తులకు కారణమయ్యే అంశాలను గూర్చి వివరిస్తారు.<br>07.73H.08 వ్యక్తి, కుటుంబం, మరియు సంస్థలు కలిపి సమాజం తయారవుతుందని తెలుసుకొంటారు.<br>07.73H.09 జాతీయ సమైక్యత కొరకు సర్వమత సామరస్యత అవసరమని తెలుసుకొంటారు.<br>07.73H.10 స్థానిక ప్రభుత్వ సంస్థలు ప్రజాస్వామ్యానికి పునాది అని గుర్తిస్తారు.<br>07.73H.11 సార్వజనిక సమస్యలను పరిష్కరించుటకు ప్రతిఒక్కరి భాగస్వామ్యం ముఖ్యమైనదని. స్పష్టం చేస్తారు.<br>07.73H.12 జిల్లా పరిపాలన యొక్క వివరాలు సేకరిస్తారు. |

# 1. చారిత్రక ఆధారాలు

భారతదేశ ప్రాచీన కాలఖండం యొక్క అధ్యయనం మనం గత సంవత్సరం చేశాం. ఈ సంవత్సరం మనం మధ్య యుగ కాలఖండం గురించి అధ్యయనం చేద్దాం. భారతీయ చరిత్రలోని మధ్యయుగం యొక్క కాలవ్యవధి సుమారు క్రీ.శ. తొమ్మిదవ శతాబ్దం నుండి పద్దెనిమిదవ శతాబ్దాంతం వరకు అని భావింపబడుతుంది. ఈ పాఠంలో మనం మధ్యయుగ చారిత్రక ఆధారాలను గూర్చి అధ్యయనం చేద్దాం.

భూతకాలంలో జరిగిన సంఘటనలను కాల క్రమానుసారం, శాస్త్రీయ మరియు క్రమబద్ధంగా ఇవ్వబడిన వివరాలే చరిత్ర.



**మీకు తెలుసా?**


చరిత్రను ఇతిహాసమని కూడా అంటారు. ఇతిహాస్ అను పదం 'ఇతి + హ + ఆస్' ఇలా తయారైనది. ఈ పదానికి 'ఇలా జరిగింది' అని అర్థం.

వ్యక్తి, సమాజం, స్థలం మరియు కాలం ఈ నాలుగు అంశాలు చారిత్రక దృష్ట్యా చాలా ముఖ్యమైనవి. చరిత్ర విశ్వసనీయమైన ఋజువులపై ఆధారపడి ఉండవలసి వస్తుంది. ఈ ఋజువులనే చారిత్రక ఆధారాలు అని అంటారు.

ఈ ఆధారాలను భౌతిక ఆధారాలు, లిఖిత ఆధారాలు మరియు మౌఖిక ఆధారాలు అని వర్గీకరించి వాటి వివరాలను మనం తెలుసుకొందాం. అటులనే చారిత్రక ఆధారాల మూల్యాంకనం కూడా చేద్దాం.

ఏ చారిత్రక సంఘటన గురించి అధ్యయనం చేయవలెనో దానికి సంబంధించిన అనేక అంశాలను ఆలోచించ వలసి వస్తుంది. అందుకోసం చారిత్రక ఆధారాల సహాయం తీసుకోవలసి వస్తుంది. ఆ ఆధారాలను పరీక్షించడం అవసరమవుతుంది. వాటి ప్రామాణికతను పరిశీలించ వలసి వస్తుంది. ఈ ఆధారాలను నిస్పాక్షికంగా మరియు విమర్శనాత్మకంగా ఉపయోగించడం అవసరమవుతుంది.

**భౌతిక ఆధారాలు :**




పై వస్తువులు మరియు కట్టడాలు లేక వాటి అవశేషాలను చరిత్ర యొక్క **'భౌతిక ఆధారాలు'** అని అంటారు.

భౌతిక ఆధారాలలో కోటలకు ముఖ్యమైన స్థానం ఉంది. కోటలలోని కొన్ని ముఖ్య రకాలు పర్వత దుర్గాలు, వనదుర్గాలు, జలదుర్గాలు, భూమి మీది కోటలు. అటులనే స్మారకాలలో సమాధులు, గోరీలు, అవశేషాలు అదేవిధంగా భవనాలలో రాజభవనాలు, మంత్రుల నివాసాలు, అంతః పురాలు, సామాన్య ప్రజల ఇండ్లు మున్నగునవి చేర్చబడినవి. వీటినిబట్టి మనకు ఆ కాలఖండం గురించి బోధపడుతుంది. కట్టడాల ప్రగతి అర్థమవుతుంది. ఆ కాలంలోని ఆర్థిక స్థితి, కళల నాణ్యత, కట్టడాల శైలి, ప్రజల జీవన విధానం మొదలగు వివరాలు లభిస్తాయి.



**చెప్పుకోండి చూద్దాం!**

నాణేలు చరిత్రను ఎలా చెబుతాయి?



**తెలుసుకొందాం.**

ప్రాచీన కాలం నుండి గవ్వ, దమ్మిడి, ధేలా, రూక, పైసా, అణా, రూపాయి ఈ నాణెములు చలామణిలో ఉండెను. నాణెములపై కొన్ని సామెతలు, జాతీయాలు వాడుకలోకి వచ్చాయి. ఉదా:,

* ఒక చిల్లి గవ్వ కూడ ఇవ్వను.
* రూక లేనివాడు పోక విలువ చేయడు!
* పైసా పైసా వసూలు చేయి.
* గడియ తీరిక లేదు గవ్వ రాబడి లేదు.



అవశేషాలు

వివిధ రాజులకాలాలలో బంగారు, వెండి, రాగి లోహాలతో తయారు చేసిన నాణేలు ముఖ్యమైన చారిత్రక ఆధారాలు. నాణేలను బట్టి రాజులు ఎవరు, వారి కాలం, పరిపాలన, మత సంకల్పన, వ్యక్తిగత వివరాలు మొదలగు సమాచారం లభిస్తుంది. అటులనే ఆర్థిక వ్యవహారాలు మరియు ఆర్థిక స్థితిగతుల గురించి తెలుస్తుంది. ఆ కాలం లోని లోహ విజ్ఞానం యొక్క అభివృద్ధి గురించి తెలుస్తుంది. చక్రవర్తి అక్బర్ యొక్క నాణేలపై గల సీతారాముల చిత్రం లేక హైదరాలి యొక్క నాణేలపై గల శివపార్వతుల చిత్రాల ముద్రల ద్వారా ఆ కాలంనాటి మత సామరస్యత గురించి తెలుస్తుంది. పేశ్వాల నాణేలపై అరబిక్ లేక పర్షియన్ భాష ఉపయోగించబడేది. దీని ద్వారా ఆ కాలంలోని భాషా వ్యవహారాల గురించి తెలుస్తుంది.



పేశ్వాకాలంనాటి నాణెములు



హైదర్అలీ నాణెములు

'శిలాశాసనాలు' అనగా రాతిపై లేక గోడపై చెక్కబడిన శాసనాలు. ఉదా - తంజావూర్‌లోని బృహదీశ్వరాలయ పరిసరాలలోని శాసనాలు. చాళుక్య, రాష్ట్రకూట, చోళ, యాదవ రాజుల కాలంలో చెక్కబడిన అనేక శిలాశాసనాలు లభించాయి. శిలాశాసనాలు చరిత్రను రాయుటకు చాలా ముఖ్యమైన మరియు విశ్వసనీయమైన రుజువులుగా భావింపబడతాయి. అవి భాష, లిపి, సామాజికజీవనం వంటి అంశాలు తెలుసుకోవటానికి తోడ్పడుతాయి. రాగి రేకులపై చెక్కబడిన శాసనాలను 'తామ్ర శాసనాలు' అంటారు. రాగి శాసనాలపై రాజశాసనాలు (ఆజ్ఞలు), నిర్ణయాలు మొదలగు రకరకాల సమాచారాలు చెక్కబడి ఉంటాయి.



**మీకు తెలుసా?**

చైత్యాలు, విహారాలు, దేవాలయాలు, చర్చ్‌లు, మసీదులు, అగ్యారీలు, దర్గాలు, మక్బరాలు, గురుద్వారాలు, ఛత్రములు, శిల్పాలు, బావులు, మెట్లబావులు, మినార్లు, గ్రామ ప్రహరీ గోడలు, దుస్తులు, ఆయుధాలు, పాత్రలు, ఆభరణాలు, వస్త్రములు, అలంకరణ వస్తువులు ఆటవస్తువులు, పనిముట్లు, వాద్యాలు ఇవన్నీ భౌతిక ఆధారాలు.

**లిఖిత ఆధారాలు :** ఆ కాలంలోని దేవనాగరి, అరేబియన్, పర్షియన్, మోడీ మొదలగు లిపుల శైలి (స్టైల్), వివిధ భాషల స్వరూపాలు, భూర్జపత్రాలు, మతగ్రంథాలు, కావ్యాలు, ఉత్తర్వులు, చరిత్రలు, చిత్రాలు వీటి ద్వారా మనకు మధ్యయుగంలోని ముఖ్యమైన చారిత్రక సంఘటనల గురించిన సమాచారం లభిస్తుంది. అదే విధంగా ఆహారపానీయాలు, ప్రజాజీవనం, వస్త్రధారణ, ఆచారవ్యవహారాలు, పండుగలు-ఉత్సవాల గురించి కూడా సమాచారం లభిస్తుంది.

ఈ వస్తువులన్నింటిని చరిత్ర యొక్క 'లిఖిత ఆధారాలు' అని అంటారు.

**లిఖిత ఆధారాలు**

- రాజ దర్బారులోని కార్యకలాపాల దస్తావేజులు
- వంశావళి, శకావళి
- ఉత్తర ప్రత్యుత్తరాలు, నివేదికలు
- తీర్పులు, ఆజ్ఞాపత్రాలు
- గ్రంథాలు, చరిత్రలు
- విదేశీ పర్యాటకుల యాత్రావర్ణనలు
- కథనాలు, వృత్తాంతం

ఈ కాలంలో విదేశీ పర్యాటకులు భారత దేశానికి వచ్చారు. వారు తమ పర్యటనా వివరాలు రచించారు. అందులో అల్బెరూని, ఇబ్న్ బతూతా, నికోలస్ మనుచి అనువారు ఉన్నారు. 'బాబరు చరిత్ర', కవి పరమానంద్ సంస్కృత భాషలో రాసిన 'శ్రీ శివభారతం' అను శివచరిత్ర, వివిధ రాజుల చరిత్రలు మరియు ఉత్తరప్రత్యుత్తరాల ద్వారా మనకు వారి ఆలోచనాసరళి, పరిపాలనా వ్యవస్థ, రాజకీయ సంబంధాలకు సంబంధించిన అంశాల గురించి తెలుస్తుంది.

తవారిక్ (దినచర్య) లేక తారీఖ్ అనగా సంఘటనల క్రమం. అల్బెరూని, జియ ఉద్దీన్ బర్నీ, మౌలానా అహ్మద్, యాహ్యాబిన్ అహ్మద్, మీర్జా హైదర్, భీంసేన్ సక్సేనా మొదలగువారు రాసిన దినచర్య(డైరీ)లు అందుబాటులో ఉన్నాయి.

బఖర్ అను పదం ఖబర్ అను పదం నుండి వచ్చింది. ఖబర్ అనగా వార్త. బఖర్ అనునది మహారాష్ట్రలో ఏర్పడిన ఒక చరిత్ర లేఖన పద్ధతి. బఖర్‌లు ఆనాటి సమాకాలీన రాజకీయ సంఘటనలు, భాషా వ్యవహారాలు, సాంస్కృతిక జీవనం, సామాజిక పరిస్థితులు మొదలగు అంశాలు తెలుసుకొనుటకు దోహద పడతాయి. మరాఠీలోని అనేక బఖర్‌లు సంఘటనలు జరిగిన చాల సంవత్సరాల తరువాత రాయడం వలన అందులో చాలాసార్లు శ్రుత (విన్న) సమాచారానికి ప్రాముఖ్యతనిచ్చినట్లు కనిపిస్తుంది. అవి మహికావతి బఖర్, సభాసద్ బఖర్, ఎక్క్యాణ్ణవ్ కలమీ బఖర్, చిట్ణీస్ బఖర్, భావూ సాహెబ్ బఖర్, ఖర్డ్యా పోరాటం యొక్క బఖర్ అనునవి. రాబర్ట్ ఆర్మ్, ఎమ్.సీ. స్ప్రెంగల్ మరియు గ్రాంట్ డఫ్ అలనాటి సమకాలీన పాశ్చాత్య చరిత్రకారుల గ్రంథాలు కూడా ముఖ్యమైనవి.




**చేసి చూడండి.**

- పొవాడాలు (బుర్రకథలు/జానపద వీరగాథలు), ఆదివాసుల జానపద గీతాలను సేకరించండి.
- పాఠశాల సాంస్కృతిక కార్యక్రమాలలో వాటిని ప్రదర్శించండి.

**మౌఖిక ఆధారాలు:** ప్రజాసంస్కృతిలో తరతరాలుగా వస్తున్న వంశావళిపై ఓవీలు (పద్యాలు), జానపదగేయాలు, పొవాడాలు, కథలు, జానపదకథలు, హాస్యోక్తుల ద్వారా మనకు ప్రజాజీవనం యొక్క వివిధ అంశాలు తెలుస్తాయి.

ఇటువంటి ఆధారాలను చరిత్ర యొక్క 'మౌఖిక ఆధారాలు' అని అంటారు.




పై మూడు రకాల ఆధారాల సహాయంతో చరిత్ర రాయబడుతుంది. ఒకసారి చరిత్రను రాసినప్పటికిని దానికి సంబంధించిన పరిశోధన నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఈ పరిశోధన ద్వారా కొత్త ఆధారాలు, కొత్త సమాచారం మన ముందుకు వస్తుంది. దానినిబట్టి చరిత్రను మళ్ళీ వ్రాయ వలసి వస్తుంది. ఉదా - మన తాతయ్య - నానమ్మల కాలంనాటి, అమ్మా నాన్నల కాలం నాటి మరియు మన కాలం నాటి చరిత్ర పుస్తకాలలో కొంత మేరకు మార్పు జరిగినట్లు కనిపిస్తుంది.



**మీకు తెలుసా ?**

**తానాజీ యొక్క - పొవాడా (బుర్రకథలు):** ఈ పొవాడా సృష్టికర్త తులసీదాస్ శాహీర్. ఈ పొవాడాలో సింహగడ్ దండయాత్ర యొక్క వర్ణన ఉన్నది. పొవాడాలో తానాజీ, శేలార్ మామా, శివాజీ మహారాజ్, వీరమాత జీజాబాయిల గురించిన అందమైన 'గుణగణాల వర్ణన' ఇవ్వబడినది.

ఆ పొవాడాలోని కొంత భాగం ఇక్కడ ఇవ్వబడింది.

*मामा बोलाया तो लागला । ऐशी वर्षीचा म्हातारा ।।*
*"लगिन राहिले रायबाचे तो मजला सांगावी ।।*
*माझ्या तानाजी सुभेदारा । जे गेले सिंहगडाला ।।*
*त्याचे पाठिरे पाहिले । नाही पुढारे पाहिले ।।*
*ज्याने आंबारे खाईला । बाठा बुजरा लाविला ।।*
*त्याचे झाड होउनि आंबे बांधले ।*
*किल्ला हाती नाही आला ।।*
*सिंहगड किल्ल्याची वार्ता ।*
*काढू नको तानाजी सुभेदारा ।।*
*जे गेले सिंहगडाला । ते मरूनशानी गेले ।।*
*तुमचा सपाटा होईल । असे बोलू नको रे मामा ।।*
*आम्ही सूरमर्द क्षत्री । नाही भिणार मरणाला ।।"*

**చెప్పండి :**

చారిత్రక ఆధారాలను సంరక్షించే ఉపాయాలను చెప్పండి.

**చారిత్రక ఆధారాల మూల్యాంకనం:** ఈ ఆధారాలన్ని ఉపయోగించడానికి ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. వాటి విశ్వసనీయతను పరీక్షించ వలసి ఉంటుంది. వాటిలో నిజమైన ఆధారాలు, నకిలీ ఆధారాలు ఏవో కనుక్కోవలసి ఉంటుంది. అంతర్గత (ప్రమాణాలు) రుజువులను చూచి వాటి నాణ్యతను నిర్ణయించ వచ్చును. రచయిత యొక్క నిజానిజాలు, వారి వ్యక్తిగత ప్రయోజనం, కాలం, రాజకీయ ఒత్తిడి వంటి వాటి గురించి కూడా అధ్యయనం చేయవలసి వస్తుంది. ఈ వివరాలు విన్నవా లేక స్వయంగా వారు చూసినవా అను అంశాలు కూడా ముఖ్యమైనవి. లేఖనంలోని అతిశయోక్తి, చిత్రాలు, దృష్టాంతాలు, అలంకారాల గురించి కూడా ఆలోచించవలసి వస్తుంది. ఇతర సమకాలీన ఆధారాలతో ఈ వివరాలను పరీక్షించవలసి ఉంటుంది. మనకు లభ్యమైన వివరాలు ఏకపక్షంగా, అసంగతముగా లేక అతిరంజితముగా ఉండే అవకాశాన్ని తిరస్కరించలేము. అందువలన వాటిని ఉపయోగించునపుడు విచారణ శక్తిని ఉపయోగించవలసి వస్తుంది. నిరంతర విశ్లేషణ చేసిన తరువాతనే ఈ ఆధారాలను ఉపయోగించేటట్లుగా జాగ్రత్త తీసుకోవడం అవసరం. చరిత్ర లేఖనంలో (రచయిత) చరిత్రకారుని నిష్పక్షపాత వైఖరి మరియు తటస్థత చాలా ముఖ్యమైనవి.

## అభ్యాసం

**1. కింది చతుర్భుజంలోని గడులలో దాగిన చారిత్రక ఆధారాల పేర్లు వెదకి రాయండి.**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| రా | జా | న | ప | ద | క | థ | లు |
| తా | గి | న | ఉ | కో | గు | కా | డా |
| రీ | మ | ఫ | ప | త్త | శ్లో | రు | వా |
| ఖు | క | ప | ల | ద | ర్యు | ప | పా |
| లు | త్ర | రి | చ | కా | గే | లు | చి |
| శి | లా | శా | స | నా | లు | యా | త్రా |
| ర | శ | లు | ని | వే | ది | క | లు |

**2. రాయండి.**

(1) స్మారకాలలో ఏయే అంశాలు ఉంటాయి?

(2) తవారిఖ్ అనగానేమి?

(3) చరిత్ర లేఖనంలో చరిత్రకారుడు దేనికి ప్రాముఖ్యత నివ్వాలి?

**3. సమూహానికి చెందని పదాన్ని వెదకి రాయండి.**

(1) భౌతిక ఆధారాలు, లిఖిత ఆధారాలు, అలిఖిత ఆధారాలు, మౌఖిక ఆధారాలు.

(2) స్మారకాలు, నాణేలు, గుహలు, కథలు

(3) భూర్జపత్రాలు, దేవాలయాలు, గ్రంథాలు, చిత్రాలు

(4) ఓవీలు, తవారిఖ్‌లు, కథలు, హాస్యోక్తులు

**4. భావనలను స్పష్టం చేయండి.**

(1) భౌతిక ఆధారాలు

(2) లిఖిత ఆధారాలు

(3) మౌఖిక ఆధారాలు

**5.** చారిత్రక ఆధారాలను మూల్యాంకనం చేయడం అవసరమా? మీ అభిప్రాయం చెప్పండి.

**6. మీ అభిప్రాయం రాయండి.**

(1) శిలాశాసనం చరిత్ర లేఖనం యొక్క విశ్వసనీయ రుజువుగా భావింపబడును.

(2) మౌఖిక ఆధారాల సహాయంతో ప్రజా జీవనం యొక్క వివిధ అంశాలు అర్థమవుతాయి.

**ఉపక్రమం :**

ఏదేని దగ్గరలోని వస్తుప్రదర్శనశాలను సందర్శించండి. మీరు అధ్యయనం చేస్తున్న కాలఖండంలోని చరిత్ర యొక్క ఆధారాల వివరాలు సంగ్రహించి, వాటిని ఉపక్రమ పుస్తకంలో నమోదు చేయండి.

# 2. శివాజీకి పూర్వం భారత దేశం

ఈ పాఠంలో మనం శివాజీకి పూర్వం భారత దేశంలోని వివిధ రాజ్యాధికారాల అధ్యయనం చేయనున్నాం. ఈ కాలంలో భారత దేశంలో వివిధ రాజ్యాధికారాలు అమలులో ఉండెను.

ఎనిమిదవ శతాబ్దంలో 'పాల్' అను రాజవంశం బెంగాలులో ప్రసిద్ధిగాంచింది. మధ్య భారతదేశంలో గుర్జర్-ప్రతిహార్ రాజ్యపరిపాలకులు ఆంధ్ర, కళింగ, విదర్భ, పశ్చిమ కాఠేవాడ్, కనోజ్, గుజరాత్ వరకు రాజ్యాన్ని విస్తరించారు.

ఉత్తర భారతదేశంలోని రాజపుత్ర వంశంలో గాహడ్వాల్ వంశం, పరమార్ వంశాలు ముఖ్యమైనవి. రాజపుత్రులలోకెల్ల చౌహాన్ వంశంలోని పృథ్వీరాజ్ చౌహాన్ పరాక్రమవంతుడైన రాజు. తరాయి వద్ద మొదటి యుద్ధంలో పృథ్వీరాజ్ చౌహాన్ ముహమ్మద్ ఘోరీని ఓడించెను. కాని తరాయిలోని రెండవ యుద్ధంలో ముహమ్మద్ ఘోరీ పృథ్వీరాజ్ చౌహానును ఓడించాడు.

తమిళనాడులోని చోళ వంశంలోని మొదటి రాజరాజు మరియు మొదటి రాజేంద్రుడు ముఖ్యమైన రాజులు. చోళులు నౌకాదళ బలంతో మాల్దీవులను, శ్రీలంకను జయించారు. కర్నాటకలోని హోయసల వంశానికి చెందిన విష్ణువర్ధనుడనే రాజు సంపూర్ణ కర్నాటకను జయించాడు.

మహారాష్ట్రలో రాష్ట్రకూట వంశంలోని మూడవ గోవిందుని ఏలుబడిలో రాష్ట్రకూటుల రాజ్యం కనోజ్ నుండి రామేశ్వరం వరకు వ్యాపించింది. తరువాత మూడవ కృష్ణుడు అలహాబాదు వరకు గల ప్రాంతాన్ని జయించాడు.

శిలాహారుల మూడు వంశాలు పశ్చిమ మహారాష్ట్రలో ఉదయించెను. మొదటి వంశం ఉత్తర కొంకణంలోని ఠాణె మరియు రాయగడ్, రెండవ వంశం దక్షిణ కొంకణంలో, మూడవ వంశం కొల్హాపూర్, సాతారా, సాంగ్లీ మరియు బెళ్‌గావ్ జిల్లాలలోని కొన్ని ప్రాంతాలలో పరిపాలన చేస్తుండేవారు.

శివాజీకి పూర్వం చివరి వైభవోపేతమైన రాజ్యం అనగా మహారాష్ట్రలోని యాదవుల రాజ్యం. యాదవ వంశంలోని ఐదవ భిల్లం యొక్క రాజధాని ఔరంగబాదు సమీపంలో గల దేవగిరి వద్ద ఉన్నది. అతడు కృష్ణానదికి అవతలివైపు రాజ్యాన్ని విస్తరించాడు.

యాదవుల కాలాన్ని మరాఠీ భాష మరియు సాహిత్యాలకు సువర్ణ కాలంగా భావింపవలసి వస్తుంది. ఇదే కాలంలో మహారాష్ట్రలో కృష్ణభక్తి మరియు వార్కరీ (తీర్థయాత్ర) సంప్రదాయాలు వెలుగులోకి వచ్చాయి.

## వాయవ్యదిశ నుండి ఆక్రమణలు:

మహారాష్ట్రంలో రాష్ట్రకూటులు, యాదవుల వంటి స్థానిక వంశీయుల అధికారం ఉన్నప్పటికిని ఉత్తరం వైపు మాత్రం వాయవ్యం నుంచి వచ్చిన ఆక్రమణదారులు అక్కడి స్థానికుల రాజ్యాలను గెలిచి తమ అధికారాన్ని నెలకొల్పారు.

ఆ మధ్యకాలంలో తూర్పు మధ్య ప్రాంతంలో అరబ్బుల అధికారం ప్రారంభమైనది. సామ్రాజ్యాన్ని విస్తరించుటకు అరబ్బు రాజులు భారతదేశం వైపు మళ్ళారు. ఎనిమిదవ శతాబ్దంలో మొహ్మద్‌బిన్ కాసీం అను అరబ్బు దేశ సేనాపతి సింధూ ప్రాంతంపై దండెత్తాడు. అక్కడి దాహీర్ రాజు ప్రతిఘటనను అణచివేసి అతడు సింధూ ప్రాంతాన్ని జయించాడు. ఈ దండయాత్ర వల్ల అరబ్బులకు భారతదేశం తో మొదటిసారిగా రాజకీయ సంబంధం ఏర్పడింది. ఆ తర్వాతి కాలంలో మధ్య ఆసియాలోని టర్కీ, ఆఫ్ఘాన్, మొఘలులు మొదలగువారు భారతదేశంలోకి వచ్చి తమ అధికారాన్ని స్థాపించారు.

క్రీ.శ. పదకొండవ శతాబ్దంలో భారత దేశంపై తుర్కుల ఆక్రమణలు జరుగసాగాయి. వారు తమ రాజ్యాన్ని విస్తరిస్తూ భారతదేశ వాయవ్య సరిహద్దుల వరకు వచ్చారు. గజనీ యొక్క సుల్తాన్ మహమూద్ భారతదేశంపై అనేక దాడులు చేశాడు. ఈ దాడులలో అతడు మథుర, బృందావన్, కనోజ్, సోమనాథ్ వద్దగల సంపన్న దేవాలయాలను దోచుకొని అచ్చటి అధిక సంపత్తిని తమతోబాటు తీసుకెళ్ళాడు.

## ఉత్తరంలోని సుల్తాన్ శాహీ

క్రీ.శ. 1175 మరియు 1178లో అఫ్ఘనిస్తాన్‌లోని ఘూర్ వద్దగల సుల్తాన్ ముహమ్మద్ ఘోరీ భారతదేశంపై దండయాత్రలు చేశాడు. భారతదేశంలో జయించిన ప్రాంతాల పరిపాలన చూసుకోడానికి అతడు కుతుబుద్దీన్ ఐబక్‌ను నియమించాడు. తరువాత క్రీ.శ. 1206లో

ముహమ్మద్ ఘోరీ మరణానంతరం ఐబక్ తన ఆధిపత్యం లోనున్న (అధికారం కిందనున్న) భారతదేశంలోని ప్రాంతాల పరిపాలన స్వతంత్రంగా చూసుకొనడం ప్రారంభించాడు. ఐబక్ వాస్తవంగా బానిస అయినాగాని ఢిల్లీకి రాజు అయ్యాడు. క్రీ.శ. 1210లో అతడు మరణించాడు.

**మీకు తెలుసా?**

కుతుబుద్దీన్ ఐబక్ తరువాత అల్తమశ్, రజియా, బల్బన్, అల్లాఉద్దీన్ ఖల్జీ, ముహమ్మద్ తుగ్లక్, ఫిరోజ్ తుగ్లక్, ఇబ్రహీం లోదీ మొదలగు సుల్తానులు భారతదేశాన్ని పరిపాలించారు.

ఇబ్రహీం లోదీ ఇతడు చివరి సుల్తాన్. అతని స్వభావ దోషం వలన అతనికి అనేక మంది శత్రువులు ఏర్పడ్డారు. పంజాబ్ సుభేదార్ దౌలత్‌ఖాన్ లోదీ కాబూల్‌లోనున్న మొఘల్ రాజు బాబర్‌ను ఇబ్రహీం లోదీకి వ్యతిరేకంగా యుద్ధానికి ఆహ్వానించాడు. ఈ యుద్ధంలో బాబర్ ఇబ్రహీంలోదీని ఓడించాడు. అంతటితో సుల్తాన్ శాహీ అంతమైనది.

## విజయనగర రాజ్యం

ఢిల్లీ సుల్తాన్ ముహమ్మద్ తుగ్లక్ పరిపాలనా కాలంలో ఢిల్లీ కేంద్రంగానున్న పరిపాలనపై దక్షిణ భారతదేశంలో తిరుగుబాటు జరిగింది. అందులో నుండే విజయనగరం మరియు బహమనీ అను రెండు బలీయమైన రాజ్యాలు ఉదయించాయి.

దక్షిణ భారతదేశంలో హరిహరరాయలు మరియు బుక్కరాయలు అను ఇద్దరు సోదరులు ఢిల్లీ సుల్తాన్ శాహీ సేవలో సర్దారులుగా ఉండేవారు. వారు ముహమ్మద్ తుగ్లక్ కాలంలో దక్షిణాన రాజకీయ అస్థిరతను వినియోగించుకొని క్రీ.శ. 1336లో దక్షిణంలో విజయనగర రాజ్యాన్ని స్థాపించారు. నేటి కర్నాటకలోని 'హంపి' ఆ రాజ్యానికి రాజధానిగా ఉండేది. హరిహరుడు విజయనగరానికి మొదటి రాజు.

హరిహరుని తరువాత అతని సోదరుడు బుక్కరాయలు రాజ్యానికి వచ్చాడు. బుక్కరాయలు రామేశ్వరం వరకు గల ప్రాంతాన్ని తన ఆధిపత్యం కిందకు తెచ్చాడు.

**కృష్ణదేవరాయలు :** కృష్ణదేవరాయలు క్రీ.శ. 1509లో విజయనగర సింహాసనం అధిష్ఠించాడు. అతడు విజయవాడ మరియు రాజమహేంద్రవరంలను జయించి తన రాజ్యంలో కలిపాడు. బహమనీ సుల్తాన్ మహమూద్ శాహ్ నేతృత్వంలో ఒకటిగా కలిసి వచ్చిన సుల్తానుల సైన్య సమూహాన్ని అతడు ఓడించాడు. కృష్ణదేవరాయల పరిపాలనలో విజయనగర రాజ్యం తూర్పున కటక్ నుండి పశ్చిమాన గోవా వరకు మరియు ఉత్తరాన రాయచూర్ దోఆబా నుండి దక్షిణాన హిందూ మహాసముద్రం వరకు వ్యాపించియుండెను. క్రీ.శ. 1530లో అతడు మరణించాడు.



కృష్ణదేవరాయలు

కృష్ణదేవరాయలు గొప్ప విద్వాంసుడు. అతడు తెలుగు భాషలో 'ఆముక్త మాల్యద' అను రాజనీతికి సంబంధించిన గ్రంథాన్ని రాశాడు. అతని పరిపాలనలో విజయనగరంలో వేయి రామాలయాలు, విఠలాలయాలు కట్టబడినవి.

కృష్ణదేవరాయల తరువాత విజయనగర రాజ్యానికి క్షీణదశ వచ్చింది. నేటి కర్నాటక రాష్ట్రంలోని తళ్ళికోట వద్ద ఒకవైపు ఆదిల్‌శాహి (ఆదిల్‌శాహ్ రాజ్యం), నిజాంశాహి (నిజాంశాహ్ రాజ్యం), కుతుబ్‌శాహి (కుతుబ్‌శాహ్ రాజ్యం), బరీద్‌శాహి (బరీద్‌శాహ్ రాజ్యం) మరియు మరొకవైపు విజయనగరం యొక్క రాజు రామరాయలు. వీరి మధ్య క్రీ.శ. 1565లో యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో విజయనగరం యొక్క రాజు రామరాయలు పరాజయం పొందాడు. ఆ తరువాత విజయనగర రాజ్యం అంతమైనది.

## బహమనీ రాజ్యం

ముహమ్మద్ తుగ్లక్ అధికారాన్ని త్రోసివేయుటకు దక్షిణంలో సర్దారులు తిరుగుబాటు చేశారు. ఈ సర్దారుల నాయకుడైన హసన్ గంగు ఢిల్లీ సుల్తాన్ సైన్యాన్ని ఓడించాడు. క్రీ.శ. 1347లో నూతన రాజ్యం అస్తిత్వంలోనికి వచ్చింది. దీనిని బహమని రాజ్యం అని అంటారు. హసన్ గంగు బహమని రాజ్యానికి మొదటి సుల్తాన్ అయ్యాడు. అతడు కర్నాటక రాజ్యంలోని 'గుల్బర్గా' వద్ద తన రాజధానిని స్థాపించాడు.

**మహమూద్ గావాన్:** ఇతడు బహమని రాజ్యం యొక్క ప్రధానమంత్రి (ముఖ్య ప్రధాని) మరియు ఉత్తమ పరిపాలకుడు. అతడు బహమనీ రాజ్యానికి ఆర్థిక సామర్థ్యాన్ని కలగజేశాడు. సైనికులకు జాగీరులను ఇవ్వకుండా వేతనాలు ఇవ్వడం ప్రారంభించాడు. సైన్యంలో క్రమశిక్షణ తీసుకు వచ్చాడు. భూమిశిస్తు వ్యవస్థలో సంస్కరణలు చేశాడు. బీదర్ వద్ద అరబీ మరియు ఫారసీ విద్యలను అభ్యసించుటకు మదర్సాలను స్థాపించాడు.

మహమూద్ గావాన్ తరువాత బహమనీ సర్దారులలో ముఠాతత్వం పెరిగిపోయింది. విజయనగరం మరియు బహమనీ రాజ్యాల మధ్య పోరాటాలతో బహమనీ రాజ్యంపై ప్రతికూల పరిణామం జరిగింది. వివిధ ప్రాంతాలలోని అధికారులు అధిక స్వతంత్రంతో మెలగసాగారు. బహమని రాజ్యం ముక్కలయింది. అందున ుండి వర్హాడ్ ఇమాద్‌శాహీ, బీదర్ బరీద్‌శాహీ, బీజాపూర్ ఆదిల్‌శాహీ, అహ్మద్‌నగర్ నిజాంశాహీ మరియు గోల్కొండ కుతుబ్ శాహీ ఇలా బహమనీ రాజ్యం ఐదు ముక్కలైంది.

## మొఘల్ అధికారం

క్రీ.శ. 1526లో ఢిల్లీలోని సుల్తాన్‌శాహీ అంతరించింది. అక్కడ మొఘల్ అధికారం స్థాపించబడింది.

**బాబర్ :** బాబర్ మొఘలుల రాజ్య సంస్థాపకుడు. అతడు మధ్య ఆశియాలోని నేటి ఉజ్బెకిస్తాన్‌లో ఉన్న ఫరఘానా రాజ్యానికి రాజు. అతడు భారత దేశంలోని సంపదకు సంబంధించిన వర్ణనలు విని భారతదేశంపై దండెత్తటానికి నిర్ణయించుకొన్నాడు.

ఆ కాలంలో ఇబ్రహీం లోదీ అను సుల్తాన్ ఢిల్లీలో రాజ్యపరిపాలన చేస్తుండేవాడు. సుల్తాన్ శాహీలోని పంజాబ్ ప్రాంతంలో దౌలత్‌ఖాన్ లోదీ అను ప్రముఖ అధికారి ఉండెను. ఇబ్రహీం లోది మరియు దౌలత్ ఖాన్ లోదీల మధ్యగల సంబంధంలో సంఘర్షణ ఏర్పడింది. దౌలత్ ఖాన్ భారతదేశంపై దండయాత్ర చేయుటకు బాబర్‌ను ఆహ్వానించాడు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని బాబర్ భారతదేశంపై దండయాత్ర చేశాడు. బాబర్ యొక్క ఆక్రమణను ఎదుర్కొనుటకు ఇబ్రహీం లోదీ సైన్యంతో బయలుదేరాడు. 21 ఏప్రిల్ 1526 రోజున 'పానిపత్' వద్ద అతనికి బాబర్‌తో యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో బాబర్ భారతదేశంలో మొట్టమొదటిసారి ఫిరంగులను ప్రభావవంతంగా ఉపయోగించాడు. అతడు ఇబ్రహీం లోదీ సైన్యాన్ని ఓడించాడు. ఇదే 'మొదటి పానిపత్ యుద్ధం'.

ఈ యుద్ధం తరువాత మేవాడ్ యొక్క రాణాసంగ్ రాజపుత్ర రాజులను ఒక చోటికి తెచ్చాడు. బాబర్ మరియు రాణాసంగ్‌ల మధ్య ఖానువా వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో బాబర్ యొక్క ఫిరంగులు మరియు అతని అదనపు సైన్యం సమర్థవంతంగా పని చేసాయి. రాణాసంగ్ యొక్క సైన్యం ఓడిపోయింది. క్రీ.శ. 1530లో బాబర్ మరణించాడు.



**మీకు తెలుసా ?**

బాబర్ తరువాత హుమాయూన్ (క్రీ.శ. 1530 నుండి క్రీ.శ. 1539 మరియు క్రీ.శ. 1555 నుండి క్రీ.శ. 1556) సింహాసనాన్ని అధిష్టించాడు. హుమాయూన్ పరిపాలనా కాలంలో శేర్షాహ్ అతనిని ఓడించి ఢిల్లీ సింహాసనంపై సూర్ వంశ స్థాపన చేశాడు. హుమాయూన్ తరువాత అక్బర్ (క్రీ.శ. 1556 నుండి క్రీ.శ. 1605) సింహాసనం అధిష్టించాడు. అక్బర్ మరియు హేమూల మధ్య క్రీ.శ. 1556లో పానిపత్ వద్ద యుద్ధం జరిగింది. ఇదే రెండవ పానిపత్ యుద్ధం. అక్బరుకు భారత దేశమంతటిని తన ఏకఛత్రాధిపత్యంలోనికి తీసుకు రావాలనే అభిలాష ఉండెను. అక్బర్ తరువాత జహంగీర్ (క్రీ.శ. 1605 నుండి క్రీ.శ. 1628) చక్రవర్తి అయ్యాడు. అతని పరిపాలన కాలంలో అతని భార్య నూర్జహాన్ సమర్థవంతంగా కార్యనిర్వహణ చేసింది. జహంగీర్ తరువాత శాహజహాన్ (క్రీ.శ. 1628 నుండి క్రీ.శ. 1658) చక్రవర్తి అయ్యాడు. శాహజహాన్ తరువాత ఔరంగజేబు (క్రీ.శ. 1658 నుండి క్రీ.శ. 1707) దీర్ఘకాలం చక్రవర్తిగా కొనసాగాడు. అతని మరణానంతరం మొఘలు సామ్రాజ్యం శిథిలమైనది.

అక్బర్ మొఘలు వంశంలోని వారందరిలోకెల్ల సమర్థ వంతుడైన రాజు. అక్బర్ స్వయంగా భారతదేశాన్ని ఏకఛత్రాధిపత్యం కిందకు తీసుకు వచ్చే ప్రయత్నం చేశాడు. అప్పుడు అతనికి వ్యతిరేకత ఎదురైనది. మహారాణా ప్రతాప్, చాంద్ బీబి, రాణి దుర్గావతి అనువారు అక్బరుకు వ్యతిరేకంగా చేసిన పోరాటం చెప్పుకోదగినది.



రాణా ప్రతాప్

**మహారాణా ప్రతాప్:** ఉదయసింహుని మరణానంతరం మహారాణా ప్రతాప్ మేవాడ్ సింహాసనాన్ని అధిష్ఠించారు. మేవాడ్ అస్తిత్వం కొరకు ఆయన పోరాటాన్ని కొనసాగించారు. మహారాణా ప్రతాప్ చివరి వరకు తమ స్వాతంత్ర్యాన్ని నిలుపుకొనుటకై అక్బర్‌తో పోరాటం చేశారు. పరాక్రమం, ధైర్యం, ఆత్మాభిమానం, త్యాగం మొదలగు గుణాలవలన ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

**చాంద్ బీబి :** క్రీ.శ. 1595లో మొఘలులు నిజాంశాహీ రాజధాని అహ్మద్ నగర్‌పై దాడి చేశారు. మొఘలుల సైన్యం అహ్మద్‌నగర్ యొక్క కోటను ముట్టడించారు. అహ్మద్ నగర్ యొక్క హుసేన్ నిజాంశాహీ యొక్క పరాక్రమవంతురాలైన కూతురు చాంద్‌బీబి ఎనలేని ధైర్యంతో కోటకై పోరాడింది. ఆ సమయంలో నిజాంశాహీలోని సర్దారుల మధ్య చీలికలు (మనస్పర్ధలు) ఏర్పడినవి. ఈ మనస్పర్ధల వలన చాంద్‌బీబి హత్యగావింపబడింది. తరువాత మొఘలులు అహ్మద్‌నగర్ కోటను జయించారు. కాని నిజాం శాహీ యొక్క మొత్తం రాజ్యం మొఘలుల స్వాధీనంలోనికి రాలేదు.



చాంద్ బీబి

**రాణి దుర్గావతి :** విదర్భ యొక్క తూర్పు ప్రాంతం, దానికి ఉత్తరాన మధ్యప్రదేశ్ ప్రాంతం, నేటి ఛత్తీస్‌గడ్ యొక్క పశ్చిమ ప్రాంతం, ఆంధ్రప్రదేశ్ యొక్క ఉత్తర ప్రాంతం మరియు ఒడిశా యొక్క పశ్చిమ ప్రాంతం ఇంచుమించు ఈ ప్రాంతాలన్ని కలిసి గోండ్‌వన్ విస్తరణం. చందేల్ రాజపుత్రుల వంశంలో జన్మించిన దుర్గావతి వివాహం తర్వాత గోండ్‌వన్‌కు రాణి అయింది. ఆమె ఉత్తమ రీతిలో రాజ్యపాలన చేసింది.



రాణి దుర్గావతి

మధ్యయుగ చరిత్రలో గోండ్‌వన్ రాణి దుర్గావతి మొఘలులకు వ్యతిరేకంగా చేసిన పోరాటం గణనీయమైనది. దుర్గావతి తన భర్త మరణానంతరం అక్బర్‌కు వ్యతిరేకంగా పోరాడుతూ ప్రాణత్యాగం చేసింది కాని లొంగిపోలేదు.

అక్బర్ ఒక తెలివైన మరియు జాగరూకత గల పరిపాలకుడు. అతని మత ధోరణి ఉదారమైనది మరియు సహనశీలమైనది. అతడు అన్ని మతాల ప్రజలతో సమానంగా వ్యవహరించేవాడు. అన్ని మతాలలోని ఉదాత్త తత్వాలను సమన్వయం చేసి అక్బర్ 'దీన్-ఇ-ఇలాహి' అను మతాన్ని స్థాపించాడు. కానీ అతడు 'దీన్-ఇ-ఇలాహి'ని స్వీకరించమని ఎవరిపై నిర్బంధం చేయలేదు.

**ఔరంగజేబు :** షాజహాన్ చక్రవర్తి పుత్రులలోని ఔరంగజేబు అధికార పోరులో విజయం సాధించి తండ్రిని నిర్బంధించి క్రీ.శ. 1658లో చక్రవర్తి అయ్యాడు. షాజహాన్ పెద్ద కుమారుడు దారాశుకో మతసహనం విషయంలో ప్రసిద్ధుడు. అతడు యాభైకంటే అధికంగా సంస్కృత ఉపనిషత్తులను ఫారసీ భాషలో అనువాదం చేశాడు. ఔరంగజేబు చక్రవర్తి అయ్యాడు. ఆ సమయంలో మొఘలు సామ్రాజ్యం ఉత్తరాన కాశ్మీరు నుండి దక్షిణాన అహ్మద్‌నగర్ వరకు మరియు పశ్చిమాన కాబూల్ నుండి తూర్పున బెంగాలు వరకు వ్యాపించి యుండెను. ఔరంగజేబు తన పరిపాలనా కాలంలో తూర్పు వైపున ఉన్న అస్సాం, దక్షిణంలోని బీజాపూర్ యొక్క ఆదిల్‌శాహీ మరియు గోల్కొండ యొక్క కుతుబ్‌శాహీని అంతమొందించి వారి ప్రాంతాలను తన సామ్రాజ్యంలో కలుపుకొన్నాడు.



ఔరంగజేబ్

**ఆహోములతో పోరాటం :** క్రీ.శ. పదమూడవ శతాబ్దం లో 'శాన్' అను తెగకు చెందిన ప్రజలు బ్రహ్మపుత్ర నదీ లోయలో స్థిరపడ్డారు. అక్కడ వారు తమ రాజ్యాన్ని స్థాపించారు. వారిని స్థానిక ప్రజలు 'ఆహోమ్'లు అని అనేవారు.

ఔరంగజేబు కాలంలో ఆహోములకు మొఘలులతో దీర్ఘకాల పోరాటం జరిగింది. మొఘలులు ఆహోముల ప్రాంతాలపై దండయాత్ర చేశారు. గదాధర్‌సింగ్ నేతృత్వంలో ఆహోములు సంఘటితమయ్యారు. లాచ్చిత్ బడ్‌ఫూకన్ అను సైన్యాధిపతి మొఘలులకు వ్యతిరేకంగా తీవ్ర పోరాటం చేశాడు. ఆహోములు మొఘలులకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో

గెరిల్లా యుద్ధవ్యూహాన్ని అవలంబించారు. మొఘలులకు అస్సాంలో తమ అధికారాన్ని బలపరుచుకోవడం సాధ్యం కాలేదు.



గురుగోవిందసింగ్

**సిక్కులతో పోరాటం:** సిక్కుల తొమ్మిదో గురువు గురుతేఘ్‌బహద్దర్ ఔరంగజేబు యొక్క అసహిష్ణుత మత ధోరణికి వ్యతిరేకంగా తీవ్ర అసంతృప్తిని ప్రదర్శించాడు. ఔరంగజేబు అతనిని బంధీచేసి 1675లో అతని శిరస్సును ఖండించాడు. ఆ తరువాత గురుగోవిందసింగ్ సిక్కుల గురువు అయ్యాడు.

గురుగోవిందసింగ్ తన అనుచరులను సంఘటిత పరచి వారిలోని పోరాట పటిమను ప్రోత్సహించాడు. పోరాట పటిమ గల సిక్కు యువకుల దళాన్ని ఒకదానిని ఏర్పాటు చేశాడు. దానినే **'ఖాల్సాదళ్'** అని అంటారు. ఆనందపూర్ వారి ముఖ్య కేంద్రం. ఔరంగజేబ్ సిక్కులకు వ్యతిరేకంగా సైన్యాన్ని పంపించాడు. అతని సైన్యాలు ఆనందపూర్‌పై దాడి చేశాయి. ఆ సమయంలో సిక్కులు తీవ్ర పోరాటం చేశారు. కాని వారికి విజయం చేకూరలేదు. ఆ తరువాత గురుగోవిందసింగ్ దక్షిణం వైపు వచ్చాడు. క్రీ.శ. 1708లో నాందేడ్‌లో ఉండగా అతనిపై దాడి జరిగింది. ఆ తరువాత అక్కడే అతడు మరణించాడు.

**రాజపుత్రులతో పోరాటం :** అక్బర్ తన సామరస్యపూర్వక ధోరణితో రాజపుత్రుల సహాయాన్ని పొందాడు. కాని ఔరంగజేబు రాజపుత్రుల సహకారం తీసుకోలేక పోయాడు. మార్వాడ్ యొక్క రాణా జస్వంతసింగ్ మరణానంతరం అతని రాజ్యాన్ని ఔరంగజేబు మొఘలు సామ్రాజ్యంలో కలుపుకొన్నాడు. దుర్గాదాస్ రాథోడ్ వయసులో చిన్నవాడైన జస్వంతసింగ్ కుమారుడు అజిత్‌సింగ్‌ను మార్వాడ్ సింహాసనంపై కూర్చోబెట్టాడు. దుర్గాదాస్ రాథోడ్ మొఘలులకు వ్యతిరేకంగా గొప్ప పోరాటం చేశాడు. దుర్గాదాస్ ప్రతీకారాన్ని అణచి వేయుటకు ఔరంగజేబు యువరాజు అక్బర్‌ను మార్వాడ్‌కు పంపించాడు. యువరాజు అక్బర్ స్వయంగా రాజపుత్రులను కలిశాడు. అతడు ఔరంగజేబునకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రకటించాడు. ఈ తిరుగుబాటులో మహారాష్ట్రలోని మరాఠా వారి సహాయం కూడా తీసుకొనే ప్రయత్నం జరిగింది. దుర్గాదాస్ రాథోడ్ మార్వాడ్ అస్తిత్వం కోసం మొఘలులతో ఈ పోరాటాన్ని కొనసాగించాడు.

**మరాఠీయులతో పోరాటం:** మహారాష్ట్రంలో శివాజీ మహారాజు నేతృత్వంలో స్వరాజ్య స్థాపన జరిగింది. అతనికి స్వరాజ్య స్థాపన చేసే ప్రయత్నంలో ఇతర శత్రువులతో బాటు మొఘలులతో కూడా పోరాటం చేయవలసి వచ్చింది. అతని మరణానంతరం దక్షిణ భారతదేశమంతా జయించవలెననే నెపంతో ఔరంగజేబు దక్కన్‌కు వచ్చాడు. కాని మరాఠా వారు ఔరంగజేబుతో తీవ్రంగా పోరాడారు. తమ స్వాతంత్ర్యాన్ని రక్షించుకొన్నారు. ఈ పోరాటాల గురించి మనం ముందు తెలుసుకోబోతున్నాం.

## అభ్యాసం

1. **పేర్లు చెప్పండి.**
   (1) గోండ్‌వన్ యొక్క రాణి -
   (2) ఉదయసింగ్ యొక్క పుత్రుడు -
   (3) మొఘలుల అధికార సంస్థాపకుడు -
   (4) బహమనీరాజ్య మొదటి సుల్తాన్ -
   (5) గురుగోవిందసింగ్ స్థాపించిన దళం -

2. **సమూహంలో ఇమడని పర్యాయాన్ని ఎన్నుకోండి.**
   (1) సుల్తాన్ ముహమ్మద్, కుతుబుద్దీన్ ఐబక్, ముహమ్మద్ ఘోరీ, బాబర్
   (2) ఆదిల్‌శాహీ, నిజాంశాహీ, సుల్తాన్ శాహీ, బరిద్ శాహీ
   (3) అక్బర్, హుమాయూన్, శేర్షాహ్, ఔరంగజేబ్

3. **సంక్షిప్తంగా జవాబులు రాయండి.**
   (1) విజయనగరం మరియు బహమని అను రెండు రాజ్యాలు ఎందుకు ఉదయించాయి?
   (2) మహమూద్ గావాన్ ఏ సంస్కరణలు చేశాడు?
   (3) మొఘలులకు అస్సాంలో తమ అధికారాన్ని బలపరచుకోవడం ఎందుకు సాధ్యం కాలేదు?

4. **మీ మాటలలో సంక్షిప్తంగా వివరాలు రాయండి.**
   (1) కృష్ణదేవరాయలు
   (2) చాంద్‌బీబి
   (3) రాణి దుర్గావతి

5. **కారణాలు రాయండి.**
   (1) బహమని రాజ్యం ఐదు ముక్కలైనది.
   (2) రాణాసంగ్ సైన్యం ఓటమి చెందినది.
   (3) రాణా ప్రతాప్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు.
   (4) ఔరంగజేబు గురుతేఘ్‌బహద్దర్‌ను బంధించాడు.
   (5) రాజపుత్రులు మొఘలులకు వ్యతిరేకంగా పోరాడారు.

6. **కాలరేఖను పూరించండి.**

| క్రీ.శ. 1336 | క్రీ.శ. .......... | క్రీ.శ. 1509 | క్రీ.శ. .......... |
|---|---|---|---|
| విజయనగర రాజ్యస్థాపన | బహమనీ రాజ్యస్థాపన | ................. | మొఘలుల అధికార స్థాపన |

7. ఇంటర్‌నెట్ (అంతర్జాలం) సహాయంతో మీకు నచ్చిన ఏదేని ఒక వ్యక్తి వివరాలు సేకరించి కింది గడిలో రాయండి.

ఇది నాకు తెలుసు

____________________

____________________

____________________

____________________

**ఉపక్రమం:**

పాఠంలో వచ్చిన వ్యక్తులకు సంబంధించిన అధిక వివరాలను సందర్భ గ్రంథాలు, అంతర్జాలం (ఇంటర్‌నెట్), వార్తా పత్రికలు మొదలగు వాటి నుండి సేకరించండి. చిత్రాలు, వివరాలను కళాత్మకంగా అమర్చి కోలాజ్ తయారు చేసి చరిత్ర విభాగంలో ప్రదర్శించండి.



దేవగిరి కోట

MF2AKH

# 3. మత సామరస్యం

భాష మరియు మతాల వైవిధ్యం భారతదేశ సమాజం యొక్క ముఖ్యమైన విశిష్టత. ఈ విశిష్టతను పరిగణనలోకి తీసుకొని భారతీయ సంవిధానం సర్వధర్మసమభావన అను సిద్ధాంతాన్ని స్వీకరించింది. మధ్యయుగ భారతదేశం లోని సమాజిక జీవనంలో కూడా ఈ సిద్ధాంతం ఆధారంగా మత సామరస్య ప్రయత్నం జరిగింది. ఈ ప్రయత్నాలలో భక్తి ఉద్యమం, సిక్కుమతం మరియు సుఫీ పంథ్‌ల స్థానం మన సమాజంలో విశిష్టమైంది. భారత దేశం యొక్క వివిధ ప్రాంతాలలో ఇలా వివిధ రకాల ఆలోచనా సరళి నిర్మాణమైనది. వారు దైవభక్తితో బాటు మత మరియు సంప్రదాయక సామరస్యంపై శ్రద్ధ చూపారు. దీని గురించి మనం ఈ పాఠంలో తెలుసుకోబోతున్నాం.

భారతదేశ మత జీవనపు ఆరంభంలో కర్మకాండలు మరియు ఆధ్యాత్మిక జ్ఞానాలపై ప్రత్యేక శ్రద్ధ ఉండేది. మధ్య యుగంలో ఈ రెండు మార్గాలు మరుగున పడిపోయి భక్తి మార్గానికి ప్రాముఖ్యత వచ్చింది. ఈ మార్గంలో అధికార భేదభావానికి అధిక ప్రాముఖ్యత లేకపోవడం వలన మత సామరస్యతకు మరింత ప్రోత్సాహం లభించింది. భారత దేశంలోని వేర్వేరు ప్రాంతాలలో స్థానిక పరిస్థితినిబట్టి భక్తి సాంప్రదాయాల్లో వేర్వేరు ఆవిష్కారాలు కనిపిస్తాయి. ఈ సంప్రదాయం సంస్కృత భాషకు బదులుగా సామాన్య మానవులు ఉపయోగించే భాషలను అనుసరించింది. అందువలన ప్రాంతీయ భాషల వికాసం కొరకు ఈ భక్తి ఉద్యమం దోహదకారి అయింది.

**భక్తి ఉద్యమం :** భక్తి ఉద్యమం యొక్క పుట్టుక దక్షిణ భారత దేశంలో జరిగిందని భావింపబడింది. ఈ ప్రాంతంలో నాయనార్ మరియు ఆళ్వార్‌ల భక్తి ఉద్యమం ఉదయించింది. నాయనార్లు అనగా శివభక్తులు మరియు ఆళ్వార్లు అనగా విష్ణు భక్తులు. శివుడు మరియు విష్ణువు ఒక్కరే అని భావించి వారి మధ్య సామరస్యత తీసుకువచ్చే ప్రయత్నం కూడా జరిగింది. సగభాగం విష్ణువు మరియు సగభాగం శివునిగా గల 'హరిహరు'ల స్వరూపంలోఉన్న విగ్రహాలు అధిక సంఖ్యలో తయారు చేయబడినవి. ఈ భక్తి ఉద్యమంలో సమాజం యొక్క అన్ని స్థాయిలలోని ప్రజలు భాగస్వాములయ్యారు. దైవప్రేమ, మానవత్వం, భూతదయ, కరుణ మొదలగు విలువలను వారు బోధించారు. దక్షిణ భారతదేశంలో రామానుజుడు మరియు ఇతర ఆచార్యులు భక్తి ఉద్యమ పునాదిని పటిష్టం చేశారు. దేవుడు అందరికొరకు ఉన్నాడు, దేవుడు భేదభావం చూపించడని వారు చెప్పారు. ఉత్తర భారతదేశంలో కూడా రామానుజుని బోధనలు చాలా ప్రభావం చూపించాయి.

ఉత్తర భారతదేశంలో సంత్ రామానంద్ భక్తి యొక్క ప్రాశస్త్యాన్ని చెప్పాడు. సంత్ కబీర్ భక్తి ఉద్యమంలో ఒక ప్రఖ్యాత సాధువు. అతడు పుణ్యక్షేత్రాలు, వ్రతాలు, విగ్రహారాధనలకు ప్రాముఖ్యత నివ్వలేదు. సత్యమునే దైవంగా భావించాడు. మానవులంతా ఒక్కటే అనే బోధన చేశాడు. జాతిభేదం, సంప్రదాయ భేదం, మతభేదాలను నమ్మలేదు. అతనికి హిందూ, ముస్లింల మధ్య ఐకమత్యాన్ని సాధించాలని ఉండేది. అతడు హిందూ మరియు ముస్లిం మతాలలోని మత ఛాందసులను కఠిన పదాలతో నిరసించాడు.



సంత్ కబీర్

బెంగాలులో చైతన్య మహాప్రభు అనునతడు కృష్ణభక్తి ప్రాశస్త్యాన్ని బోధించాడు. అతని ఉపదేశాల వలన ప్రజలు జాతి మరియు సంప్రదాయ నిబంధనలను దాటి భక్తి ఉద్యమంలో భాగస్వాములయ్యారు. చైతన్య మహాప్రభు యొక్క ప్రభావంతో శంకరదేవ్ అనునతడు అస్సాంలో కృష్ణభక్తిని ప్రచారం చేశాడు. గుజరాత్‌లో సంత్ నర్సీ మెహతా అనునతడు పేరుగాంచిన వైష్ణవ భక్తుడు. అతడు అపారమైన కృష్ణభక్తుడు. అతడు సమానత్వ సందేశాన్ని ఇచ్చాడు. అతనిని గుజరాతి భాష యొక్క ఆదికవి అని భావిస్తారు.

సంత్ మీరాబాయి కృష్ణభక్తి యొక్క మహిమను చెప్పింది. ఆమె మేవాడ్ యొక్క రాజవంశమునకు చెందినది. రాజవంశంలోని సుఖాలను పరిత్యజించి ఆమె కృష్ణభక్తిలో లీనమైనది. రాజస్థానీ మరియు గుజరాతీ భాషల్లో ఆమె భక్తి రచనలు చేసింది. ఆమె భక్తిగీతాలు భక్తి, సహనశీలత మరియు మానవత్వపు సందేశాన్ని ఇచ్చేవిగా ఉన్నాయి. సంత్ రోహిదాస్ ఒక గొప్ప సాధువు.

అతడు సమత మరియు మానవత్వపు సందేశాన్ని ఉపదేశించాడు. సంత్ సేనా ప్రభావశీలి యగు ఒక సాధువు. హిందీ సాహిత్యంలోని మహాకవి సూరదాస్ 'సూర్‌సాగర్' అను కావ్యాన్ని రాశాడు. కృష్ణభక్తి అతని కావ్య ఇతివృత్తం, ముస్లిం సంత్ రస్‌ఖాన్ రాసిన కృష్ణభక్తి గీతాలు రసవత్తరమైనవి. సంత్ తులసీదాస్ యొక్క **'రామచరితమానస్'** అను గ్రంథంలో రామభక్తి యొక్క సుందర ఆవిష్కరణ జరిగినట్లు కనిపిస్తుంది.

మహాత్మా బసవేశ్వర్ కర్నాటకలో లింగాయత్ విచారధారను ప్రచారం చేశాడు. అతడు జాతి భేదాన్ని వ్యతిరేకించాడు. శ్రమప్రతిష్ఠ యొక్క ప్రాముఖ్యతను చెప్పాడు. అతని యొక్క 'కాయకవే కైలాస' అనునది పేరుగాంచిన వచనం. 'శ్రమయే కైలాసం' అని దాని అర్థం. తన భక్తి ఉద్యమంలో సీలను కూడా భాగస్వాములుగా చేసుకొన్నాడు.


మహాత్మా బసవేశ్వర్

'అనుభవ మంటప' అను సభాగృహంలో జరిగే మత చర్చల్లో అన్ని జాతుల స్త్రీ-పురుషులు భాగస్వాములు కాసాగారు. అతడు ప్రజల భాష అయిన కన్నడ భాషలో వచన సాహిత్య మాధ్యమం ద్వారా తన బోధనలు గావించాడు. అతని పనులు సమాజంపై గొప్ప పరిణామాన్ని కలిగించాయి. మహాత్మా బసవేశ్వర్ యొక్క అనుచరులు మరాఠీ భాషలో కూడా రచనలు చేశారు. అందులో మన్మథస్వామి రచించిన 'పరమరహస్యం' అను గ్రంథం పేరుగాంచింది. కర్నాటకలో పంప, పురందర్‌దాస్ మొదలగు గొప్ప సాధువులు ఉండిరి. వారు కన్నడ భాషలో అనేక భక్తి కావ్యాలు రాశారు.

**మహానుభావ సంప్రదాయం :** పదమూడవ శతాబ్దంలో చక్రధరస్వామి మహారాష్ట్రలో 'మహానుభావ' సంప్రదాయం ప్రారంభించాడు. ఇది కృష్ణభక్తిని బోధించే సంప్రదాయం. శ్రీ గోవిందప్రభు అనునతడు చక్రధరస్వామి యొక్క గురువు. అన్ని జాతుల-తెగలలోని స్త్రీ-పురుషులు చక్రధరస్వామి శిష్యులుగా ఉండిరి. అతడు సమత యొక్క సమర్థకుడు. అతడు మహారాష్ట్ర మంతట తిరుగుతూ మరాఠీ భాషలో బోధనలు చేశాడు. సంస్కృతానికి బదులుగా చక్రధరస్వామి మరాఠీ భాషకు ప్రాధాన్యతను ఇచ్చాడు. అందువలన


చక్రధరస్వామి

మరాఠీ భాష అభివృద్ధి చెందినది. మరాఠీ భాషలో విపులంగా గ్రంథాలు రాయబడినవి.

ఈ సంప్రదాయం యొక్క ప్రచారం మహారాష్ట్రలో ప్రధానంగా విదర్భ మరియు మరాఠ్వాడా ప్రాంతాలలో జరిగింది. విదర్భలోని ఋద్ధిపూర్ ఈ సంప్రదాయం యొక్క ముఖ్య స్థానం. అదే విధంగా ఈ సంప్రదాయం పంజాబ్, అఫ్ఘనిస్తాన్ వంటి దూర ప్రాంతాల వరకు చేరింది.

**మీకు తెలుసా ?**

మహానుభావ సంప్రదాయం యొక్క అనుచరులు చేసిన కొన్ని ముఖ్య రచనలు ఈ విధంగా నున్నవి: మ్హాయింభట్ రచించిన చక్రధరుని లీలలు వర్ణించే **'లీలా చరిత్ర'** అను గ్రంథం, మొదటి మరాఠీ కవయిత్రి మహదంబా యొక్క **'ధవళే'** కేశోబాస్ కూర్చిన **'సూత్రపాఠ్'** మరియు **'దృష్టాంతపాఠ్'** దామోధర్ పండిత్ యొక్క **'వచ్ఛాహరణ్'**, భాస్కరభట్టు బోరికర్ యొక్క **'శిశుపాలవధ'** నరేంద్రుడు రచించిన **'రుక్మిణీ స్వయంవరం'**.

**మీకు తెలుసా ?**

మహారాష్ట్రలో సంత్ ఏకనాథ్ రాసిన హిందూ మరియు ముసల్‌మాన్‌ల మధ్య జరిగిన సంభాషణ, మత సామరస్యం దృష్ట్యా ముఖ్యమైనది. సంత్ శేఖ్ మహమ్మద్ యొక్క 'शेख महंमद अविंध । त्याचे हृदयी गोविंद ॥' అను ప్రసిద్ధి చెందిన వచనం ఈ సామరస్యతకు ఒక ఉదాహరణ.

**గురునానక్ :** గురునానక్ సిక్కు మత సంస్థాపకుడు మరియు మొదటి గురువు. అతని కార్యాలను మత సామరస్యానికి ఒక గొప్ప ప్రయత్నం అని పేర్కొన వలసి

ఉంటుంది. అతడు హిందూ ముస్లిం మతాల పుణ్యక్షేత్రాలను సందర్శించాడు. అతడు మక్కాకు కూడా వెళ్ళాడు. భక్తి భావన అంతటా ఒకే విధంగా ఉందనే విషయం అతని దృష్టికి వచ్చింది. అందరితో ఒకే విధంగా నడుచుకోవాలనేది అతని బోధన. హిందు మరియు ముస్లిం ల ఐక్యత సాధించాలని అతడు ఉపదేశించాడు. పవిత్రమైన ఆచరణకు ప్రాధాన్యత ఇచ్చాడు.


గురునానక్

గురునానక్ యొక్క ఉపదేశంతో అనేక మంది ప్రభావితమైనారు. అతని శిష్యుల సంఖ్య దినదినం పెరుగుతూపోయింది. గురునానక్ అనుచరులను శిష్యులు అనగా **'సిక్కులు'** అని అంటారు. **'గురు గ్రంథసాహిబ్'** సిక్కుల పవిత్ర గ్రంథం. ఈ గ్రంథంలో స్వయంగా గురునానక్, సంత్ నామ్‌దేవ్, సంత్ కబీర్ మొదలగు సాధువుల రచనలు అందులో చేర్చబడి ఉన్నవి.

గురునానక్ తరువాత సిక్కులకు తొమ్మిది మంది గురువులు అయ్యారు. గురుగోవింద సింగ్ సిక్కుల పదవ గురువు. అతని తరువాత సిక్కులందరు గురుగోవింద సింగ్ ఆజ్ఞ ప్రకారం **'గురు గ్రంథ సాహిబ్'** మతగ్రంథాన్ని గురువుగా భావింప సాగారు.

**సూఫీ సంప్రదాయం :** సూఫీ అనునది ఇస్లాంలోని ఒక సంప్రదాయం. పరమేశ్వరుడు ప్రేమమయుడు. ప్రేమ మరియు భక్తి మార్గంతోనే పరమేశ్వరుని దగ్గరకు చేరవచ్చును అనునది సూఫీ సాధువుల నమ్మకం. సకల ప్రాణులపై ప్రేమ చూపించాలి, పరమేశ్వరుని చింతన చేయాలి, నిరాడంబరంగా ఉండాలనేవి వారి బోధనలు. ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ, శేఖ్ నిజాముద్దీన్ అవలియా గొప్ప సూఫీ సంత్‌లు. సూఫీ సాధువుల ఉపదేశాలవలన హిందు-ముసల్మాన్ సమాజంలో ఐక్యత ఏర్పడింది. భారతీయ సంగీతంలో సూఫీ సంగీత సంప్రదాయం గొప్ప స్థానాన్ని వహించింది.

సాధువులు చెప్పిన భక్తి మార్గం సామాన్యులు కూడా ఆచరించే విధంగా సులువుగా ఉండెను. స్త్రీ-పురుషులం దరికి భక్తి ఉద్యమంలో ప్రవేశం ఉండెను. సాధువులు తమ బోధనలను ప్రజల భాషలో చెప్పారు కావున సామాన్య ప్రజలకు అవి చాలా సన్నిహితంగా అనిపించాయి. భారతీయ సంస్కృతి యొక్క పరిణామంలో భక్తి మార్గానికి పేర్కొనదగిన గొప్ప భాగస్వామ్యం ఉంది.

## అభ్యాసం

**1. పరస్పర సంబంధం వెదకి రాయండి.**

(1) మహాత్మా బసవేశ్వర్ : కర్నాటక, సంత్ మీరాబాయి: .............

(2) రామానంద్ : ఉత్తర భారతదేశం, చైతన్య మహాప్రభు: ................

(3) చక్రధర్ : ..............., శంకరదేవ్ :.

**2. కింది పట్టికను పూరించండి.**

| | ప్రచారకుడు | గ్రంథం |
|---|---|---|
| (1) భక్తి ఉద్యమం | .............. | .............. |
| (2) మహానుభావ సంప్రదాయం | .............. | .............. |
| (3) సిక్కు మతం | .............. | .............. |

**3. రాయండి**

(1) సంత్ కబీర్ భక్తి ఉద్యమంలో ప్రసిద్ధిగాంచిన సాధువుగా అవతరించాడు.

(2) మహాత్మా బసవేశ్వర్ యొక్క పనులతో సమాజంపై కలిగిన పరిణామం.

**4. కింది చతుర్భుజంలోని గడులలో దాగిన సాధువుల పేర్లు వెదకండి.**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| గు | రు | గో | విం | ద | సిం | గ్ | స్ | స్ |
| రు | రా | మా | నం | న | సూ | ర | దా | స్ |
| నా | సె | త | సం | ర | ల | ర్ | హీ | పం |
| న | చ | స | సా | త | ద | బీ | రో | ప |
| క్ | మ | గ | మ | రం | అ | క | స | ఆ |
| బ | ర్ | స | పు | అ | ప్ర | ధ | మ్ | రూ |
| మ | న్మ | ధ | స్వా | మీ | రా | బా | యి | స్ |

**ఉపక్రమం**

సూఫీ సంగీత సంప్రదాయంలోని ఏదేని భజనను సేకరించి సాంస్కృతిక కార్యక్రమంలో ప్రదర్శించండి.

# 4. శివాజీకి పూర్వం మహారాష్ట్ర

పదిహేడవ శతాబ్దం ప్రారంభంలో మహారాష్ట్రలో అధిక ప్రాంతం అహ్మద్‌నగర్ నిజాంశాహ మరియు బీజాపూర్ ఆదిల్‌శాహల స్వాధీనంలో ఉండెను. ఖాందేశ్‌లో మొఘలులు చొరబడియుండిరి. దక్షిణ భారతదేశంలో తమ సామ్రాజ్యాన్ని విస్తరింపజేయడమే వారి ఉద్దేశం. కొంకణ తీరప్రాంతంపై ఆఫ్రికా నుండి వచ్చిన సిద్దీ ప్రజల నివాసాలు ఉండెను. అదే కాలంలో యూరప్ నుండి వచ్చిన పోర్చుగీస్, ఇంగ్లీష్, ఫ్రెంచ్ మరియు డచ్ మొదలగు అధికారాల మధ్య సముద్రపోటీ మరియు పోరాటం తీవ్రమౌతూ ఉండెను. వారిలో వ్యాపారం కోసం వర్తక కేంద్రాలను స్వాధీనపరచుకొనే పోటీ ఉండెను. పశ్చిమ తీరప్రాంతంలోని గోవా మరియు వసయిలో పోర్చుగీసువారు ముందుగానే రాజ్యస్థాపన గావించారు. కాని ఆంగ్లేయులు, డచ్‌వారు, ఫ్రెంచ్‌వారు వ్యాపార సంస్థల (Company) మాధ్యమం ద్వారా గిడ్డంగిదారుల స్వరూపంలో కాలుమోపారు. ఈ అధికారాలన్నీ ఒకదానినొకటి గమనిస్తూ తమను తాము సురక్షితంగా ఉండేలా చూసుకొనేవి. అదే విధంగా సాధ్యమైనంతవరకు ఆధిక్యతను ప్రదర్శించే యోచనలో ఉండెను. ఈ పోరాటం వలన మహారాష్ట్రలో అస్థిరత మరియు అసురక్షితత ఏర్పడింది. యూరప్‌లోని ఈ వేరువేరు ప్రజలను వారి శిరస్త్రాణాలను బట్టి 'టోపీదార్లు' అని అనేవారు.

శివాజీకి పూర్వం గల ప్రజల నివాసాలు, ప్రజలు మరియు రాజులు వీరి మధ్య వారధిగా పనిచేసే అధికారులు, వర్తక కేంద్రాలు, చేతివృత్తులు మొదలగు వాని స్వరూపం తెలుసుకొనుటకు గ్రామం (మౌజా), కస్బా మరియు పరగణా అను భౌగోళిక స్థానాల పరిచయం అవసరం. అనేక గ్రామాలు కలసి ఒక పరగణా అవుతుంది. సాధారణంగా పరగణా యొక్క ముఖ్య కేంద్రాన్ని కస్బా అనేవారు. కస్బా కంటే చిన్నగా ఉన్న గ్రామాన్ని మౌజా అనేవారు. మనం ఇప్పుడు గ్రామం, కస్బా మరియు పరగణాలను క్రమంగా సంక్షిప్త పరిచయం చేసుకొందాం.

**గ్రామం (మౌజా):** చాలా మంది ప్రజలు గ్రామాలలోనే ఉండేవారు. గ్రామాన్ని మౌజా అని కూడా అనేవారు. పాటిల్ అనునతడు గ్రామానికి ప్రముఖునిగా ఉండేవాడు. ప్రజలు గ్రామంలో వీలైనంత ఎక్కువ భూమిని వ్యవసాయం కిందకు తీసుకురావాలని అతడు ప్రయత్నం చేసేవాడు. గ్రామంలో కలహాలు జరుగుతుండేవి. అప్పుడు శాంతిని నెలకొల్పే పనిని పాటిల్ చేసేవాడు. అతని పనికి కులకర్ణి సహాయం చేసేవాడు. వసూలైన భూమిశిస్తును నమోదు చేసే పని కులకర్ణి చేసేవాడు. గ్రామంలో రకరకాల చేతిపనివారు ఉండేవారు. వారికి వృత్తి సంబంధమైన హక్కులు వంశ పారంపర్యంగా వస్తుండేవి. గ్రామంలో చేతిపనుల వాళ్ళు చేసిన సేవకు ప్రతి ఫలంగా రైతుల ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల్లోని కొంత భాగం లభించేది. దానిని బలుతం లేదా భత్యం అనేవారు.

**కస్బా :** కస్బా అనగా ఒక పెద్ద పల్లెటూరు. సాధారణంగా అది పరగణా యొక్క ముఖ్య కేంద్రమై ఉండేది. ఉదా: ఇందాపూర్ పరగణా యొక్క ముఖ్య కేంద్రం ఇందాపూర్ కస్బా, వాయి పరగణా యొక్క ముఖ్య కేంద్రం వాయి కస్బా. గ్రామం మాదిరిగానే కస్బాలో వ్యవసాయమే ముఖ్యవృత్తి. అక్కడ వడ్రంగి, కమ్మరి మొదలగు నేర్పరులైన చేతిపనివారు కూడా ఉండేవారు. కస్బాలను అంటుకొని వ్యాపార కేంద్రాలు ఉండేవి. శేటే మరియు మహాజన్ అనువారు వ్యాపార కేంద్రాల యొక్క అధికారిక సంరక్షకులుగా ఉండేవారు. ప్రతి గ్రామంలో వ్యాపార కేంద్రం ఉండాలనేదేమి లేదు. కాని గ్రామంలో వ్యాపార కేంద్రం ఏర్పాటు చేసే పని శేటే-మహాజన్‌లదిగా ఉండేది. అందుకోసం వారికి ప్రభుత్వం నుండి భూమి మరియు గ్రామస్థుల నుండి కొన్ని హక్కులు లభించేవి. వ్యాపార కేంద్రం యొక్క లెక్కలు రాసే పని మహాజన్ చూసేవాడు.



**మీకు తెలుసా?**

వీరమాత జీజాబాయి ఆదేశానుసారం పుణె దగ్గర గల పాషాణ్ వద్ద ఒక వ్యాపార కేంద్రం ఏర్పాటు చేయబడింది. దానిని 'జిజాపూర్' అని అంటారు. మాల్‌పురా, ఖేల్‌పురా, పరస్‌పురా, విఠాపురాలు కూడా మాలోజీ, ఖేలోజీ, పరసోజీ మరియు విఠోజీల పేర్లతో ఔరంగబాద్ వద్ద ఏర్పాటు చేసిన నూతన వ్యాపార కేంద్రాలు. 'ఖేడ్'ను అంటియున్న 'శివాపూర్' శివాజీ మహారాజు పేరున నెలకొల్పిన వ్యాపార కేంద్రం.



**దీనిని తెలుసుకొందాం.**

రెండు గ్రామాలు స్వతంత్రమైనవని చూపుటకు 'బుద్రుక్' మరియు 'ఖుర్ద్' అను పేర్లను ఉపయోగిస్తారు. మూల గ్రామం 'బుద్రుక్' మరియు కొత్త గ్రామం 'ఖుర్ద్'. ఉదా: వడ్‌గావ్ బుద్రుక్ మరియు వడ్‌గావ్ ఖుర్ద్.

**పరగణా:** అనేక గ్రామాలు కలిసి పరగణా అయినప్పటికి పరగణాలన్నింటిలో గ్రామాల సంఖ్య సమానంగా ఉండదు. ఉదా: పుణె పరగణా, ఇది పెద్ద పరగణా. అందులో 290 గ్రామాలు ఉండెను. చాకణ్ పరగణాలో 64 గ్రామాలు ఉండెను. శిరవళ్ పరగణా చిన్నదిగా ఉండెను. అందులో 40 గ్రామాలు ఉండెను. దేశ్‌ముఖ్ మరియు దేశ్‌పాండేలు పరగణా యొక్క వతన్‌దారీ అధికారులుగా ఉండేవారు. దేశ్‌ముఖ్ పరగణాలోని పాటీల్ అను అధికారులకు ముఖ్యుడుగా ఉండేవాడు. గ్రామ ప్రాతిపదికన పాటీల్ చేసే పనిని పరగణా ప్రాతిపదికపై దేశ్‌ముఖ్ చేస్తుండేవాడు. అదేవిధంగా పరగణాలోని కులకర్ణి అను అధికారులందరికి ముఖ్యుడు దేశ్‌పాండే. గ్రామ ప్రాతిపదికపై కులకర్ణి చేసే పనిని పరగణా ప్రాతిపదికపై దేశ్‌పాండే చేసేవాడు. ఈ అనువంశిక అధికారులు ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండిరి.

పరగణాలోని గ్రామాలపై విదేశీదాడులు, లేక కరవు వంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు, ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలిపేపనిని ఈ వతన్‌దార్ అధికారులు చేసేవారు. కొన్ని సమయాలలో ఈ అధికారులు తమ అధికారాన్ని దురుపయోగం చేసేవారు. వారు ఒక్కోసారి ప్రజల నుండి అధిక రొక్కం వసూలు చేసేవారు. మరోసారి ప్రజల నుండి సేకరించిన రొక్కాన్ని ప్రభుత్వానికి చేరవేయడంలో ఆలస్యం చేసేవారు. అటువంటి సమయాలలో ప్రజలు ఇబ్బందులు పడేవారు.



**మీకు తెలుసా?**

వతన్ అనునది అరబిక్ పదం. ఇది మహారాష్ట్రలో వంశపారంపర్యంగా మరియు శాశ్వతంగా అనుభవించు పన్ను మినహాయింపు గల భూమి అను అర్థంలో వాడబడుతుంది.

**కరవు ఇబ్బందులు:** వ్యవసాయం వర్షపు నీటిపై ఆధారపడి ఉండేది. వర్షం కురవకపోతే పొలంలో పంట వచ్చేదికాదు. ఫలితంగా ఆహారధాన్యాల ధరలు పెరిగేవి. ప్రజలకు ఆహార ధాన్యాలు లభించడం కఠినమయ్యేది. పశువులకు గ్రాసం లభించేది కాదు. నీటి కొరత తీవ్రంగా ఉండేది. ప్రజలకు గ్రామంలో ఉండడం కఠినం అయ్యేది. ప్రజలు గ్రామాన్ని విడిచిపెట్టేవారు. ప్రజలకు వలస వెళ్ళాల్సిన అగత్యం వచ్చేది. కరవు అనేది ప్రజలకు అన్నింటికంటె పెద్ద కష్టం అనిపించేది.

మహారాష్ట్రలో అటువంటి కరవు క్రీ.శ. 1630లో వచ్చింది. ఈ కరవు వలన ప్రజలు భయాందోళనకు గురి అయ్యారు. తీవ్రమైన ధాన్యపు కొరత ఏర్పడింది. ''రొట్టెముక్క కోసం ప్రజలు తమను తాము అమ్ముకొనేందుకు సిద్ధమయినా కొనేవారు ఎవరూ లేరు'' అనే నానుడి వాడుకలోకి వచ్చింది. కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయి. పశువులు చచ్చిపోయాయి. వ్యవసాయం కుంటుపడింది. వ్యాపార పరిశ్రమలు అంతరించాయి. ఆర్థిక వ్యవహారం ఆగిపోయింది. ప్రజలు దేశాలు పట్టుక పోసాగారు. ఇలా ధ్వంసమైన ప్రజా జీవనాన్ని బాగుపరచడం ఒక గొప్ప సవాలుగా మారింది.

**వార్కరీ సంప్రదాయం యొక్క పనులు :** మూఢనమ్మకం మరియు కర్మకాండల యొక్క ప్రభావం సమాజంపై చాలా అధికంగా ఉండేది. ప్రజలు అదృష్టాన్ని నమ్ముకొన్నారు. వారి ప్రయత్నశీలత మందగించింది. ప్రజల పరిస్థితి చాలా దయనీయంగా ఉండెను. అటువంటి పరిస్థితిలో సమాజంలో చైతన్యం కలిగించే ప్రయత్నం మహారాష్ట్రలోని వార్కరీ సంప్రదాయం చేసింది.

మహారాష్ట్రలో సంత్ నామదేవ్, సంత్ జ్ఞానేశ్వర్‌ల నుండి ప్రారంభమైన సంత్ (భక్త) పరంపర. సమాజంలోని వివిధ వర్గాల నుండి వచ్చిన భక్తులు ముందుకు నడిపారు. ఈ సంత్ పరంపరలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఉండిరి. ఉదా: సంత్ చోఖామేళా, సంత్ గోరోబా, సంత్ సావతా, సంత్ నరహరి, సంత్ సేనా, సంత్ శేఖ్ మహమ్మద్ మొదలగువారు. అదే విధంగా భక్త బృందంలో సంత్ చోఖోబా భార్య సంత్ సోయరాబాయి మరియు సోదరి సంత్ నిర్మలాబాయి, సంత్ ముక్తాబాయి, సంత్ జనాబాయి, సంత్ కాన్హోపాత్రా, సంత్ బహిణాబాయి సివూర్కర్ వంటి స్త్రీలు కూడా ఉండిరి. ఈ భక్తి ఉద్యమానికి పండర్‌పూర్ కేంద్రంగా ఉండెను. విఠలుడు వారి దైవం. పండర్‌పూర్‌లో చంద్రభాగ నదీ తీరంలో ఈ భక్త బృందాలన్ని మరియు వార్కరులు భక్తి సాగరంలో మునిగిపోయేవారు. ఇక్కడ భజనలు, కీర్తనలు

మరియు సహపంక్తి భోజనాలు మొదలగు వాటి ద్వారా సమానత్వపు ప్రచారం జరిగేది.



సంత్ నామదేవ్

**సంత్ నామదేవ్ :** ఇతడు వార్కరీ సంప్రదాయంలోని ఒక గొప్ప భక్తుడు. అతడు ప్రజలను సంఘటిత పరచడంలో నిపుణుడు. అతడు ఉత్తమ కీర్తనకారుడు. కీర్తనల ద్వారా అతడు అన్ని జాతి-తెగలలోని స్త్రీ పురుషులను ఒకటి చేసి వారిలో సమానత్వ భావనను మేల్కొలిపాడు. **'नाचू कीर्तनाचे रंगी । ज्ञानदीप लावू जगी ।।'** (కీర్తనల నాదం లోనర్తించెదము, జ్ఞానదీపాన్ని జగతిలో వెలిగించెదము) అనునది ఆయన ప్రతిజ్ఞ. అతని అభంగ రచన ప్రసిద్ధి గాంచినది. అనేక భక్తులు మరియు సామాన్య ప్రజలపై అతని బోధనల ప్రభావం పడింది. అతడు తన బోధనలను ప్రచారం చేస్తూ పంజాబ్ వరకు వెళ్ళాడు. అతడు రాసిన పదాలు (గేయాలు) సిక్కుల 'గురుగ్రంథసాహిబ్' గ్రంథంలో చేర్చబడి ఉన్నవి. అతడు వైష్ణవ మత సందేశాన్ని గ్రామ గ్రామానికి చేరవేసే పని చేశాడు. అతడు పంఢర్‌పూర్ వద్ద విఠలుని మహాద్వారం ముందు సంత్ చోఖామేళా యొక్క సమాధిని నిర్మించాడు. ఇది అతడు చేసిన అవిస్మరణీయమైన పని.



సంత్ జ్ఞానేశ్వర్

**సంత్ జ్ఞానేశ్వర్ :** ఇతడు వార్కరీ సంప్రదాయంలో ఒక పేరు గాంచిన భక్తుడు. అతడు 'భగవద్గీత' అను సంస్కృత గ్రంథం యొక్క అర్థం మరాఠీలో స్పష్టపరచు నట్టి 'భావార్థదీపిక' అనగా 'జ్ఞానేశ్వరి' అను గ్రంథాన్ని రచించాడు. అదే విధంగా అతడు 'అమృతానుభవ్' అను గ్రంథాన్ని రాశాడు. అతడు తన గ్రంథాల ద్వారా మరియు అభంగాల ద్వారా భక్తి మార్గం యొక్క మహత్తును చెప్పాడు. సామాన్యులు ఆచరించ గలిగే ఆచరణ ధర్మాలను చెప్పాడు. వార్కరి సంప్రదాయానికి ధర్మప్రతిష్ఠను కలిగించాడు. అత్యంత ప్రతికూల పరిస్థితులలో జీవితం గడప వలసి వచ్చినప్పటికి అతడు తన ఆత్మ సమతుల్యతను జార విడువ లేదు మరియు అసంతృప్తి చెందలేదు. జ్ఞానేశ్వరిలోని 'పసాయదాన్' గొప్ప సంస్కారాన్ని కలిగించే విధంగా ఉంది. జ్ఞానేశ్వరుని సోదరుడు సంత్ నివృత్తినాథ్ మరియు సంత్ సోపాన్‌దేవ్ మరియు సోదరి ముక్తాబాయిల కావ్య రచనలు కూడా ప్రసిద్ధి చెందినవి.



సంత్ ఏకనాథ్

**సంత్ ఏకనాథ్ :** ఇతడు మహారాష్ట్రలోని భక్తి ఉద్యమంలో ఒక గొప్ప భక్తుడు. అతని సాహిత్యం విపులమైనది మరియు వివిధ రకాలైనది. అందులో అభంగాలు, గౌళణీలు, భారూడ్లు (జానపద గేయాలు) మొదలగునవి ఉన్నాయి. అతడు వైష్ణవమత వర్ణన సరళంగా మరియు సవిస్తారంగా చేశాడు. భావార్థ రామాయణంలో రాముని గాథ కారణంగా ప్రజా జీవన దృశ్యాన్ని చిత్రీకరించాడు. అతడు భాగవతం అను సంస్కృత గ్రంథం లోని భక్తికి సంబంధించిన విభాగం యొక్క అర్థాన్ని మరాఠీలో విశదపరిచాడు. అతని అభంగాలలో మాధుర్యం ఉన్నది. మోక్ష ప్రాప్తి కోసం సంసారాన్ని విడనాడ వలసిన అవసరం లేదని అతడు స్వయంగా ఆచరించి చూపాడు. నిజం చెప్పాలంటే అతను ఒక ప్రజా గురువు. మన మరాఠీ భాష ఏ భాషకన్నా తక్కువ కాదని ఆయన భావించేవాడు. **'संस्कृत वाणी देवे केली । तरी प्राकृत काय चोरापासुनि झाली ?'** (సంస్కృత వాక్కు దేవుడు చేశాడు మరి ప్రాకృత భాష దొంగల ద్వారా ఏర్పడిందా?) అని అతడు సంస్కృత పండితులను గట్టిగా ప్రశ్నించాడు. అతడు ఇతర మతాలను ద్వేషించే వారిని తీవ్రంగా విమర్శించాడు.



సంత్ తుకారాం

**సంత్ తుకారాం :** ఇతడు పుణె దగ్గర గల దేహు గ్రామానికి చెందినవాడు. అతని అభంగ రచనలు మృదు మధురమైనవి. అతని అభంగాలకు శ్రేష్ఠమైన కవిత్వంగా ఔన్నత్యం లభించింది. సంత్ తుకారాం యొక్క 'గాథా' అను గ్రంథం మరాఠీ భాష యొక్క అమూల్యమైన భాండాగారం. అతడు పీడిత తాడితులలో

దైవత్వాన్ని చూడమంటూ ఇలా అంటాడు **'जे का रंजले गांजले । त्यांसी म्हणे जो आपुले । तोचि साधु ओळखावा । देव तेथेचि जाणावा ॥'** (పీడితులను, తాడితులను తన వారిగా ఎవరు భావిస్తారో అతనే సాధువు అని గుర్తించు. అతనిలోనే దైవం ఉంటాడని గ్రహించు) అతడు తనలోని ఈ భావనతో తాను ప్రజలకు ఇచ్చిన ఋణానికి సంబంధించిన అప్పు పత్రాలను ఇంద్రాయణి నదిలో ముంచి వేసి ఎన్నో కుటుంబాలను ఋణ ముక్తులను చేశాడు. అతడు సమాజంలోని మోసంపై మరియు మూఢనమ్మకాలను చాలా తీవ్ర పదజాలంతో నిరసించాడు. భక్తికి నీతిని జోడించడానికి అతడు ప్రాధాన్యతనిచ్చాడు. **'जोडोनिया धन उत्तम व्यवहारे । उदास विचारे वेच करी ॥'** (ఉత్తమ మార్గంలో ధనమార్జించు। నిరాశా నిస్పృహలను తొలగించు॥) అనువిధంగా అతని బోధనల సారాన్ని చెప్పవచ్చు. సమాజంలోని కొందరు ఛాందసులు అతడు చేసే జనజాగృతిని వ్యతిరేకించారు. అతనికి ఏ మాత్రం అభంగాలను రచించే అధికారం లేదని వాదించి వారు అతని పుస్తకాలను ఇంద్రాయణి నదిలో ముంచివేశారు. అతడు ఈ వ్యతిరేకతనంతా ధైర్యంగా ఎదుర్కొన్నాడు.

సంత్ తుకారాం యొక్క శిష్యులు మరియు సహచరులు వివిధ జాతులు - వర్గాలకు చెందినవారు. వారు నావజీ మాళీ, గవనర్‌శేట్ వాణి, సంతాజీ జగనాడే, శివబా కాసార్, బహిణాబాయి సివూర్కర్, మహాద్‌జీపంత్ కులకర్ణి మొదలగువారు. గంగారామ్ పంత్ మవాళ్ మరియు సంతాజీ జగనాడేలు సంత్ తుకారాం యొక్క అభంగాలను రాసి పెట్టడం అనునది వారు చేసిన మహత్తరమైన కార్యము.

**భక్తుల కార్యం యొక్క పరిణామాలు :** భక్తులు ప్రజలకు సమానత్వపు సందేశాన్నిచ్చారు. మానవత్వం మరియు మానవతా ధర్మాన్ని బోధించారు. ఒకరినొకరు ప్రేమించాలి, ఒకటిగా చేరాలి, ఐకమత్యంగా ఉండాలి అనునవి అతని బోధనలు. అతని పనుల వలన ప్రజలు జాగృతమయ్యారు. పరాయి ఆక్రమణలు, కరువు వలన ఏర్పడిన పరిస్థితులు లేక వివిధ రకాలైన ఇతర ప్రకృతి వైపరీత్యాలు వస్తే వాటిని లెక్క చేయక ఎలా జీవించాలనే విషయంపై అతడు చేసిన ఉపదేశం ప్రజలకు పెద్ద దిక్కుగా నిలిచింది. అతని ఈ పని వలన మహారాష్ట్రలోని ప్రజలలో ఆత్మవిశ్వాసం ఏర్పడింది.

సమాజంలో మతం క్షీణించింది. అటువంటి సమయంలో భక్తులు ముందుకు వచ్చి సమాజాన్ని రక్షించారు. వారు మతానికి నిజమైన అర్థం చెప్పసాగారు. ప్రజలలో ఉంటూ వారి సుఖ దుఃఖాలను అర్థంచేసుకొని భక్తి మార్గాన్ని అభివృద్ధిపరచసాగారు. ఆ సమయంలో సమాజంలోని కొందరు మత ఛాందసులు వారిని వ్యతిరేకించసాగారు. ఈ వ్యతిరేకతను సహించడం మన కర్తవ్యంలోని ఒక భాగం అని భక్తులు భావించేవారు. **'तुका म्हणे तोचि संत । सोशी जगाचे आघात ॥'** (ప్రాపంచిక బాధల నోర్చేవాడే భక్తుడని చెప్పెను తుకారాముడే) ఈ పదాలతో సంత్ తుకారాం నిజమైన భక్తుని లక్షణాలను చెప్పాడు.

పండితుల - విద్వాంసుల కఠిన భాషలోని మతాన్ని భక్తులు సామాన్యుల భాషలోకి తీసుకువచ్చారు. దైనందిన వ్యవహారిక భాషలో వారు భగవంతున్ని స్తుతించారు. భగవంతుని ముందు అందరు సమానము అనే భావనను స్వీకరించారు. కులము మరియు జాతి అహంకారాన్ని ప్రక్కన పెట్టి మనం ఒకరినొకరం 'భగవంతుని పిల్లలం' అను భావనతో చూడవలెనని సమాజానికి బోధించారు. ఈ భక్తు(సంత్)లందరి విశిష్టత ఏమనగా వారు భక్తిలో మునిగినప్పటికి తమ తమ బాధ్యతలను విడచిపెట్టలేదు. వారు తమతమ పనులలో భగవంతుడ్ని చూశారు. **'कांदा मुळा भाजी । अवघी विठाई माझी ॥'** (ఉల్లిపాయ, ముల్లంగి, కూరలన్నింట నా విఠలమయం) అని సంత్ సావతా మహారాజ్ అన్నాడు. అతని ఈ వాక్యం వ్యవసాయపు పని సందర్భంలోనిదే ఐనా భక్తుల యొక్క నిత్య జీవితంలోని ఇతర పనులకు కూడా వర్తించును. భక్తులు తమతమ వృత్తులను నిర్వహిస్తూ భక్తి గలిగియుండుట, ఉపదేశాలనిచ్చుట, కవిత్వాన్ని వ్రాయుట చేయుచుండిరి. వారు సమాజం యొక్క నైతిక జాగరూకతను వికసింప జేశారు.



**చర్చిద్దాం రండి!**

పండర్‌పూర్ తీర్థయాత్ర (వారీ) గురించి అధిక వివరాలు సేకరించి కింది విషయాల గురించి చర్చించండి.

- వార్కరీలు వారీ తీర్థయాత్రకు ఏ నెలలో వెళ్తారు?
- తీర్థయాత్ర ప్రణాళిక ఎలా ఉంటుంది?

**రామదాస స్వామి :** రామదాస స్వామి మరాఠ్వాడలోని జాంబ్ గ్రామానికి చెందిన వాడు. అతడు బలోపాసన యొక్క ప్రాముఖ్యతను వివరించాడు. **'मराठा तितुका मेळवावा । महाराष्ट्र धर्म वाढवावा ।'** (మరాఠీయులు ఎంతవరకు విస్తరిస్తారో మహారాష్ట్ర ధర్మం అంతవరకు విస్తరించాలి) అను అతని సందేశం సుప్రసిద్ధమైనది. అతడు దాసబోధ్, కరుణాష్టకే, మనాచే శ్లోక్ అను రచనల ద్వారా ప్రజలకు వ్యవహారిక విద్య యొక్క పాఠాలను నేర్పాడు. ప్రజా ఉద్యమం మరియు ప్రజా సంఘం యొక్క మహాత్మ్యాన్ని చెప్పాడు. సమర్థ సంప్రదాయాన్ని స్థాపించాడు. ఈ సంప్రదాయానికి చాఫల్ కేంద్రంగా ఉండెను. శ్రీరాముని మరియు హనుమంతుని ఉపాసనను ప్రచారం చేశాడు. తన ఆలోచనల ప్రచారం కొరకు అతడు చాలా ప్రయాణం చేశాడు.


రామదాస స్వామి

**పారతంత్ర్యంలో స్వాతంత్ర్య ప్రేరణ :** శివాజీకి పూర్వం మహారాష్ట్రలో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక మొదలగు రకాల పరిస్థితులు సుమారు ఈ విధంగా ఉన్నాయి. ఈ కాలంలో మహారాష్ట్ర ఆదిల్‌శాహీ మొదలగు అధికారాల నియంత్రణలో ఉన్నది. అందువలన అది స్వతంత్రంగా లేదు. అలా ఉన్నప్పటికి కొందరు వ్యక్తులు మరియు వారి ఆలోచనా సరళి స్వాతంత్ర్యం యొక్క కలలు కనేవి. అటువంటి వారిలో స్వరాజ్య సంకల్పకునిగా భావింపబడే శహాజీ రాజు అగ్రగణ్యుడు.

## అభ్యాసం

**1. కింది పట్టికను పూరించండి.**

| | గ్రామం/మౌజా | కస్బా | పరగణా |
|---|---|---|---|
| దేనినంటారు | ............. | ............. | ............. |
| అధికారి | ............. | ............. | ............. |
| ఉదాహరణ | ............. | ............. | ............. |

**2. అంటే ఏమిటి?**

(1) బుద్రుక్

(2) బలుతం/భత్యం

(3) వతన్

**3. వెదకి రాయండి.**

(1) ఆఫ్రికా నుండి కొంకణ సముద్ర తీరానికి వచ్చిన ప్రజలు -

(2) అమృతానుభవ్ గ్రంథ రచయిత -

(3) సంత్ తుకారాం యొక్క గ్రామం -

(4) భారుడులను రచించిన కవి -

(5) బలోపాసన ప్రాముఖ్యతను చెప్పిన వారు -

(6) స్త్రీ భక్తుల (సంత్‌ల) పేర్లు -

**4. మీ మాటలలో వివరాలు మరియు పనులను రాయండి.**

(1) సంత్ నామదేవ్ (2) సంత్ జ్ఞానేశ్వర్


(3) సంత్ ఏకనాథ్ (4) సంత్ తుకారామ్

**5. కరవు ప్రజలకు అన్నింటికంటే పెద్ద కష్టంగా ఎందుకు అనిపించింది?**

**ఉపక్రమం**

(1) వార్కరి దిండీకి మీరు ఏ విధంగా సహాయ పడతారో దాని ప్రణాళికను రాయండి.

(2) వివిధ భక్తుల వేషధారణ చేసి వారి కావ్యాలను ప్రదర్శించండి.





# 5. స్వరాజ్యస్థాపన

పదిహేడవ శతాబ్ద ప్రథమార్థంలో మహారాష్ట్రలో యుగకర్త వ్యక్తిత్వం కలిగిన ఛత్రపతి శివాజీ మహారాజు ఉదయించాడు. అతడు అక్కడి అన్యాయపూరిత రాజ్యాధికారాలకు సవాళ్ళు విసరి స్వరాజ్య స్థాపన చేశాడు. అతడు శాలివాహన శకం. 1551, ఫాల్గుణ కృష్ణపక్ష తదియ అనగా 1630 ఫిబ్రవరి 19వ తేది పుణె జిల్లాలోని జున్నర్ సమీపంలోని శివనేరి కోటలో జన్మించాడు. అతడు చేసిన స్వరాజ్య స్థాపన యొక్క వివరాలు మనం ఈ పాఠంలో తెలుసుకోబోతున్నాం.



శహాజీరాజు

**శహాజీరాజు :** శివాజీ మహారాజు యొక్క తండ్రి శహాజీరాజు దక్షిణం లోని ఒక గొప్ప సర్దారు. మొఘలులు నిజాం శాహిని జయించుటకు దండయాత్ర చేపట్టారు. ఈ దండయాత్రలో బీజాపుర్ యొక్క ఆదిల్‌శాహ మొఘలులకు సహాయం అందించాడు. మొఘలులు దక్షిణంలోనికి ప్రవేశించ కూడదనునది శహాజీరాజు అభిప్రాయం. కావున అతడు మొఘలులను తీవ్రంగా వ్యతిరేకించి నిజాంశాహీని కాపాడే ప్రయత్నం చేశాడు. కాని అతడు మొఘలులు మరియు ఆదిల్‌శాహీల సామర్థ్యం ముందు నిలబడలేక పోయాడు. క్రీ.శ. 1636లో నిజాంశాహీ ఓడిపోయి అంతరించింది.

నిజాంశాహీ అస్తిత్వం నశించిన తరువాత శహాజీరాజు బీజాపూర్ ఆదిల్‌శాహీ యొక్క సర్దారు అయ్యాడు. శహాజీ రాజు వద్దనున్న భీమ మరియు నీర నదుల మధ్యగల పుణె, సుపె, ఇందాపూర్ మరియు చాకణ్ అను అతని స్వంత పరగణాలను ఆదిల్‌శాహ అతని వద్దనే ఉంచాడు. ఆదిల్‌శాహ నుండి శహాజీరాజుకు కర్ణాటకలోని బంగళూరు మరియు దాని చుట్టు ప్రక్కల ప్రాంతం జాగీరుగా లభించాయి.



**మీకు తెలుసా ?**

జాగీరు - జాగీరు అనగా ఏదేని ఒక ప్రాంతపు శిస్తును అనుభవించే హక్కు. పాలకుల యొక్క సేవలో ఎవరైతే సర్దారుగా నియమితులౌతారో వారికి నగదు (రొక్కము) స్వరూపంలో వేతనం ఇవ్వకుండా వేతన రొక్కమునకు సమానముగా ఆదాయం భూమి శిస్తు రూపంలో లభించునంత ప్రాంతం కేటాయించి ఇవ్వబడేది. దానినే 'జాగీరు' అంటారు.

శహాజీరాజు పరాక్రమవంతుడు, ధైర్యశాలి మరియు గొప్ప రాజనీతిజ్ఞుడు. అతడు ఉత్తమ విలుకాడు. అదే విధంగా ఖడ్గం, పట్టా మరియు బల్లెం ఉపయోగించడంలో నిపుణుడు. ప్రజలపై చాలా ప్రేమ చూపేవాడు. మహారాష్ట్ర, కర్ణాటక మరియు తమిళనాడులోని అనేక ప్రాంతాలను అతడు జయించాడు. దక్షిణ భారత దేశంలో అతనికి గొప్ప ప్రఖ్యాతి ఉండేది. శివాజీ మరియు జిజాబాయి బంగళూరు వద్ద ఉన్నపుడు అతడు శివాజీని రాజుగా చేయుటకు తగిన ఉత్తమ శిక్షణ అందించే చక్కని ఏర్పాట్లు చేశాడు. అతనికి పరాయి ప్రజల అధికారం కూలద్రోసి స్వరాజ్య స్థాపన చేయవలెననే తీవ్రమైన ఆకాంక్ష ఉండెను. కావున అతనిని స్వరాజ్య సంకల్పకుడు అని అంటారు. అతడు శివాజీ మరియు జిజాబాయిని నమ్మకస్తులైన మరియు కర్తవ్యపరాయణులైన సహచరులతో బంగళూరు నుండి పుణెకు పంపాడు.

**వీరమాత జిజాబాయి :** జిజాబాయి బుల్డాణా జిల్లాలోని సింధ్‌ఖేడ్ వద్ద గల గొప్ప సర్దారు లఖుజీరాజే జాధవ్ యొక్క కూతురు. ఆమెకు చిన్నతనంలోనే వివిధ విద్యలతోబాటు సైనికశిక్షణ కూడా లభించింది. శహాజీ మహారాజు యొక్క స్వరాజ్య స్థాపన అను కల నెరవేరాలని ఆమె అతనిని ప్రోత్సహిస్తూ సహాయం చేస్తుండేది. ఆమె కార్యదీక్షాపరురాలు, మరియు దూరదృష్టి గల రాజనీతిజ్ఞురాలు. స్వరాజ్య స్థాపన కార్యంలో ఆమె నిరంతరం శివాజీకి మార్గదర్శనం చేసింది. బాధల్లో ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించుటకు ఆమె న్యాయమైన తీర్పులు కూడా చెప్పేది. ఆమె శివాజీకి



వీరమాత జిజాబాయి

ఉత్తమశిక్షణ నిచ్చు విషయంలో సతతం అప్రమత్తంగా ఉండెను. ఆమె అతనికి సౌశీల్యం, సత్యప్రియత్వం, వాక్చాతుర్యం, దక్షత, ధైర్యం, నిర్భయత్వం, శస్త్రవిద్య, విజయకాంక్ష, స్వరాజ్య స్వప్నం మొదలగు సద్గుణాలతో కూడిన సంస్కారాన్ని అందించింది.

**శివాజీ అనుచరులు:** శివాజీ మహారాజు స్వరాజ్య స్థాపన కార్యాన్ని మావళ్ ప్రాంతంలో ప్రారంభించాడు. మావళ్ అనగా నేటి పుణె జిల్లాకు పశ్చిమ మరియు నైఋతి దిశల్లోగల ప్రాంతం. మావళ్ ప్రాంతం కొండలు, లోయలు మరియు దుర్గమమైన ప్రాంతం. మావళ్ యొక్క ఈ భౌగోళిక పరిస్థితిని శివాజీ మహారాజు స్వరాజ్య స్థాపనలో గొప్ప కౌశల్యంతో ఉపయోగించుకొన్నాడు. అతడు ప్రజల హృదయాల్లో విశ్వాసం మరియు ఆత్మీయతాభావాన్ని నెలకొల్పాడు. స్వరాజ్య స్థాపన కార్యంలో అతనికి మంచి మిత్రులు మరియు అనుచరులు లభించారు. వారు యెసాజీ కంక్, బాజీ పాసల్కర్, బాపూజీ ముద్గల్, నర్సేకర్ దేశ్‌పాండే సోదరులు, కావజీ కొంఢాళ్కర్, జివా మహాలా, తానాజీ మాలుసరే, కాన్హోజీ జేధే, బాజీప్రభు దేశ్‌పాండే, దాదాజీ నరస్‌ప్రభు దేశ్‌పాండే అనువారు, ఈ అనుచరుల బలంతో అతడు స్వరాజ్య స్థాపన కార్యాన్ని చేపట్టాడు.



**గుర్తుంచుకోండి.**

పన్నెండు మావళ్ లోయలు: (1) పవణ్ మావళ్ (2) హిరడస్ మావళ్ (3) గుంజన్ మావళ్ (4) పౌడ్ ఖోరే (5) ముఠే ఖోరే (6) ముసే ఖోరే (7) కానద్ ఖోరే (8) వెళ్‌వండ్ ఖోరే (9) రోహిడ్ ఖోరే (10) అందర్ మావళ్ (11) నాణె మావళ్ (12) కోర్‌బారసే మావళ్ శివాజీ మహారాజు యొక్క పుణె జాగీరులోని సహ్యాద్రి మధ్య భాగంలో ఉన్న ప్రాంతమే మావళ్ లోయలు. వీటిని 'బారా మావళ్' ('పన్నెండు మావళ్ ప్రాంతాలు') అని కూడా అంటారు.



**చేసి చూడండి.**

శివాజీకి అనుచరులైన జివా మహాలా, తానాజీ మాలుసరే, బాజీప్రభు దేశ్‌పాండేల గురించి అధిక వివరాలు సేకరించండి.



రాజముద్ర

**రాజముద్ర:** స్వరాజ్య స్థాపన వెనుక గల శివాజీ మహారాజు యొక్క ఉద్దేశం అతని రాజముద్ర ద్వారా స్పష్టమవుతుంది. ఈ రాజముద్రపై కింది సంస్కృత పంక్తులు చెక్కబడి ఉన్నాయి.

*प्रतिपच्चंद्रलेखेव वर्धिष्णुर्विश्ववंदिता ।।*

*शाहसूनोः शिवस्यैषा मुद्रा भद्राय राजते ।।*

**అర్థం:** ''శహాజీ పుత్రుడైన శివాజీ (శుక్ల పక్షంలోని) పాడ్యమి చంద్రవంక మాదిరిగా పెరుగుతూపోయే అతనికి విశ్వమంతా వందనం చేసింది - ఇలా ఈ ముద్ర (ప్రజల) కళ్యాణం కొరకు సార్వభౌమత్వాన్ని ప్రకటించనైనది. (శోభాయమానమై కనిపిస్తుంది)

ముద్రపై గల ఈ మాటల అర్థం అనేక దృష్టికోణాల్లో ప్రాముఖ్యత కలిగియున్నది. మహారాజు ఈ మాటల ద్వారా తండ్రి విషయంలో కూడా కృతజ్ఞత, స్వరాజ్యం అఖండితంగా విస్తరిస్తూ పోతుందనే విశ్వాసం, రాజముద్రకు అనగా వైకల్పికంగా

స్వరాజ్యానికి అందరి ఆదరణ అందుతుందనే అనుభూతి ప్రజలకు సంక్షేమాన్ని అందించే కట్టుబాటు మరియు తమ భూమిని స్వతంత్రంగా పరిపాలించే నమ్మకం, ఇన్ని విషయాలు వ్యక్తపరచడం జరిగింది. ఈ చిన్న శ్లోకంలో స్వరాజ్యం యొక్క సంకల్పనకు సంబంధించిన సమగ్ర సారం ఇమిడి ఉన్నది.

**తెలుసుకొందాం.**

- మనదేశ రాజముద్రను పరిశీలించండి.
- అందులో ఏయే అంశాలు కనిపిస్తాయి?
- రాజముద్రను ఎక్కడెక్కడ ఉపయోగించినట్లు కనిపిస్తుంది?

**స్వరాజ్య స్థాపన కార్యకలాపాలు:** శివాజీ మహారాజు జాగీరులోని కోటలు తన స్వాధీనంలో లేకుండెను. అవి ఆదిల్‌శాహ స్వాధీనతలో ఉండెను. ఆ కాలంలో కోటలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉండెను. కోటలు స్వాధీనంలో ఉన్నాయంటే చుట్టు ప్రక్కల ప్రాంతాలను అదుపులో పెట్టుకోవటం సాధ్యపడేది. **'కోట ఎవరిదో రాజ్యం వారిదే'** అను పరిస్థితి ఉండేది. తన జాగీరులోని కోటలు తన స్వాధీనంలోనికి తీసుకోవలెనని మహారాజు నిశ్చయించుకొనెను. కోటలు స్వాధీన పరచుకొనే ప్రయత్నం అనగా ఆదిల్‌శాహీ అధికారానికి సవాలు చేయడం వంటిదే. అతడు తోరణా, మురుంబదేవ్, కొండాణా, పురంధర్ కోటలను స్వాధీన పరచుకొని స్వరాజ్యానికి శంఖుస్థాపన చేశాడు. మురుంబదేవ్ కోటను పునర్నిర్మించి దానికి **'రాజగడ్'** అని పేరు పెట్టాడు. రాజగడ్ స్వరాజ్యం యొక్క మొదటి రాజధానిగా ఉండెను.ఆదిల్‌శాహీలో



రాజగడ్ కోట/ పాలీ దర్వాజా

జావళీ యొక్క మోరే, ముదోళ్ యొక్క గోర్పడే మరియు సావంత్‌వాడీ యొక్క సావంత్ మొదలగు సర్దారులు ఉండిరి. స్వరాజ్యస్థాపనను వారు వ్యతిరేకించారు. ఈ సర్దారులను కట్టడిచేయడం స్వరాజ్య స్థాపన కొరకు అవసరమయినది.

**జావళీ స్వాధీనం:** సాతారా జిల్లాలోని జావళీ వద్ద చంద్రరావు మోరే ఆదిల్‌శాహీలోని గొప్ప సర్దారు. స్వరాజ్య స్థాపన కార్యానికి అతడు వ్యతిరేకత చూపాడు. అప్పుడు క్రీ.శ. 1656లో శివాజీ మహారాజు జావళీపై దండెత్తి ఆ ప్రాంతాన్ని జయించాడు. అక్కడ తన స్థావరాన్ని నెలకొల్పాడు. తరువాత రాయగడ్‌ను కూడా జయించాడు. జావళీ యొక్క అపార సంపద అతని చేతిలో పడింది. ఈ విజయం తరువాత కొంకణంలో అతని కార్యకలాపాలు పెరిగాయి. అతడు జావళీ యొక్క లోయలో ప్రతాపగడ్ కోటను నిర్మించాడు. ఈ విజయంతో అతని సామర్థ్యం అన్ని రకాలుగా పెరిగింది.

ఆ తరువాత శివాజీ మహారాజు కళ్యాణ్ మరియు భివండీ ప్రాంతాలను జయించాడు. అందువలన పశ్చిమ తీర ప్రాంతంలో గల సిద్ధీ, పోర్చుగీసు మరియు ఆంగ్లేయుల అధికారాలతో అతనికి సంబంధం ఏర్పడింది. ఈ అధికారాలతో పోరాటం చేయాలంటే ప్రబలమైన నౌకాదళాన్ని ఏర్పరచుకోవాలనునది అతని దృష్టికి వచ్చింది. అందువలన అతడు నౌకాదళాన్ని ఏర్పాటు చేయుటపై శ్రద్ధ వహించాడు.

**అఫ్జల్‌ఖాన్‌ను దండించుట:** శివాజీ మహారాజు తన జాగీరులోని మరియు చుట్టు ప్రక్కల గల ఆదిల్‌శాహీ ప్రాంతంలోని కోటలను తీసుకొన నారంభించాడు. జావళీ యొక్క మోరేల వ్యతిరేకతను అణచివేశాడు. కొంకణ సముద్ర తీరంలో స్వరాజ్యస్థాపన కార్యానికి వేగం లభించింది. ఈ అంశాలన్ని ఆదిల్‌శాహీకి సవాళ్ళుగా మారాయి. ఆ సమయంలో ఆదిల్‌శాహీ పరిపాలన పెద్దరాణి చూస్తుండేది. శివాజీ మహారాజును కట్టడిచేయాలని ఆమెకు అనిపించింది. అందువలన ఆమె ఆదిల్‌శాహీలోని అఫ్జల్‌ఖాన్ అను బలాఢ్యుడు మరియు అనుభవజ్ఞుడైన సర్దారును శివాజీ మహారాజుపై దండెత్తమని చెప్పింది.

అఫ్జల్‌ఖాన్ బీజాపూర్ నుండి వాయికి చేరుకొన్నాడు. అతనికి వాయి ప్రాంతం గురించి బాగుగా తెలిసి యుండెను. వాయి సమీపంలోని ప్రతాపగడ్ కోట అడుగు భాగాన శివాజీ మహారాజు మరియు అఫ్జల్‌ఖాన్‌ల సమావేశం

1659 నవంబరు 10న జరిగింది. ఈ సమావేశంలో అఫ్జల్‌ఖాన్, మహారాజును దొంగదెబ్బ తీయాలనే ప్రయత్నం చేశాడు. అందువలన మహారాజు అతనిని హతమార్చి ఆదిల్‌శాహి సైన్యాన్ని శిక్షించాడు.

అఫ్జల్‌ఖాన్‌ను వధించిన తరువాత మహారాజు యుద్ధం లో గాయపడిన సైనికులకు నష్టపరిహారం అందించాడు. ఈ యుద్ధంలో మంచి కార్యకుశలత చూపిన వారికి బహుమానాలు ఇచ్చాడు. అఫ్జల్‌ఖాన్ యొక్క సైనికులు మరియు అధికారులు తన సైన్యం చేతికి చిక్కినను వారితో అతడు మంచిగా ప్రవర్తించాడు.

**సిద్దీ జౌహర్ యొక్క దండయాత్ర:** అఫ్జల్ ఖానును శిక్షించిన తరువాత మహారాజు ఆదిల్‌శాహీలోని వసంతగడ్, పన్హాళా మరియు ఖేళనా కోటలను జయించాడు. ఖేళణా కోటకు అతడు 'విశాలగడ్' అని పేరు పెట్టాడు.

మహారాజును కట్టడి చేయుట కొరకు ఆదిల్‌శాహ క్రీ.శ. 1660లో సిద్ది జౌహర్ అను కర్నూలు ప్రాంత సర్దారును మహారాజుపై దండెత్తమని చెప్పెను. అతనికి 'సలాబత్‌ఖాన్' అనే బిరుదును ఇచ్చాడు. సిద్ది జౌహర్‌కు రుస్తుం-ఇ-జమాన్, బాజీ ఘోర్పడె మరియు అఫ్జల్‌ఖాన్ కుమారుడు ఫాజల్‌ఖాన్ కూడా సహాయం చేశారు. ఈ పరిస్థితిలో శివాజీ మహారాజు పన్హాళా కోటపై ఆశ్రయాన్ని పొందాడు. సుమారు ఐదు నెలలపాటు సిద్దీ యొక్క సైనికులు పన్హాళాను ముట్టడించారు. ముట్టడి నుండి బయటపడుట మహారాజుకు కఠినంగా మారింది. నేతోజీ పాల్కర్ బయటి నుండి సిద్దీ యొక్క సైన్యంపై దాడి చేసి ముట్టడిని పారద్రోలే ప్రయత్నం చేశాడు. కాని అతని సైన్యం కొద్దిగా ఉండడం వలన ప్రయత్నం ఫలించలేదు. సిద్దీ ముట్టడిని పారద్రోలే చిహ్నాలు కనిపించలేదు. అందువలన మహారాజు సిద్దీతో మంతనాలు ప్రారంభించాడు. అందువలన సిద్దీ చేసిన పన్హాళగడ్ ముట్టడిలో సడలింపు ఏర్పడింది. ఈ సడలింపును మహారాజుగారు వినియోగించుకొన్నాడు.

ఆ సమయంలో కోటపైగల శివాకాశిద్ అను అత్యంత శూరుడైన యువకుడు ముందుకు వచ్చాడు. అతడు అగుపించుటకు శివాజీ మహారాజు వలెనేయుండెను. అతడు శివాజీ మహారాజు యొక్క వేషధారణచేసి పల్లకిలో కూర్చుండెను. పల్లకి రాజమార్గంలోని ద్వారం గుండా బయటపడింది. సిద్దీ సైన్యం ఆ పల్లకీని పట్టుకొన్నది. ఆ సమయం ప్రమాదకరమైనదిగా ఉండెను. శివాకాశిద్ ఆ సందర్భంలో స్వరాజ్యం కొరకు బలి అయ్యాడు. ఇంతలో శివాజీ మహారాజు వేరే కఠిన మార్గంగుండా కోట నుండి బయట పడ్డాడు. అతని వెంట బాజీప్రభు దేశ్‌పాండే మరియు బాందల్ దేశ్‌ముఖ్‌లతో బాటు ముఖ్యమైన సైనికులు ఉండిరి.

శివాజీ మహారాజు పన్హాళగడ్ ముట్టడి నుండి బయటపడి విశాలగడ్ వైపు బయలుదేరాడు. ఈ వార్త సిద్దీకి తెలిసింది. అతని సైన్యం శివాజీని వెంబడించింది. శివాజీ సిద్దీ సైన్యాన్ని విశాలగడ్ అడుగుభాగం దగ్గర అడ్డుకొనే బాధ్యతను బాజీప్రభు దేశ్‌పాండెకు అప్పగించాడు. బాజీప్రభు గజాపూర్ దగ్గరి ఘోడ్‌ఖిండ్‌లో ఆ సైన్యాన్ని అడ్డగించాడు. బాజీప్రభు పరాక్రమాన్నంతా ఉపయోగించి ప్రయత్నించాడు. కాని ఈ పోరాటంలో అతడు వీరమరణం పొందాడు. అతని సైన్యం సిద్దీ సైన్యాన్ని అడ్డగించి నిలుపడం వలన మహారాజు విశాలగడ్ వైపు వెళ్ళడం సాధ్యమైనది. విశాలగడ్ వైపు వెళుతున్నపుడు అతడు పాలవన్ యొక్క దళ్వీ మరియు శృంగార్‌పూర్ యొక్క సుర్వే ఈ ఆదిల్‌శాహీ సర్దారుల వ్యతిరేకతను కూడా అణచివేశాడు. ఆ తరువాత శివాజీ మహారాజు విశాలగడ్‌ను సురక్షితంగా చేరుకొన్నాడు.

మహారాజు పన్హాళాగడ్ ముట్టడిలో చిక్కుకొన్నపుడు ఢిల్లీ సింహాసనం అధిష్టించిన ఔరంగజేబు చక్రవర్తి మొఘలు సర్దారైన శాయిస్తాఖాన్‌ను దక్షిణానికి పంపెను. అతడు పుణె ప్రాంతంపై దండయాత్ర చేశాడు. ఆ సమయంలో శివాజీ మహారాజుకు ఆదిల్‌శాహీతో కూడా పోరాటం జరుగుచుండెను. అటువంటి పరిస్థితిలో ఇద్దరు శత్రువులతో ఏకకాలంలో పోరాటం జరపడం శ్రేయస్కరం కాదని శివాజీ మహారాజు గ్రహించాడు. అందువలన విశాలగడ్‌కు సురక్షితంగా చేరిన తరువాత అతడు ఆదిల్‌శాహాతో ఒడంబడిక చేసుకొన్నాడు. ఈ ఒడంబడిక ప్రకారం అతనికి పన్హాళా కోటను తిరిగి ఇవ్వవలసి వచ్చింది. అక్కడితో శివాజీ మహారాజు యొక్క స్వరాజ్య స్థాపన యొక్క ఒక దశ పూర్తయింది.

## అభ్యాసం

**1. సమూహానికి సరిపడని పదాన్ని వెదకండి.**

(1) పుణె, సుపె, చాకణ్, బంగళూరు

(2) ఫల్టణ్ యొక్క జాధవ్, జావళీ యొక్క మోరె, ముధోళ్ యొక్క ఘోర్పడె, సావంత్‌వాడీ యొక్క సావంత్

(3) తోరణా, మురుంబదేవ్, సింహగడ్, సింధుదుర్గ్

**2. రాద్దాం పద!**

(1) శివాజీ మహారాజుకు వీరమాత జిజాబాయి అందించిన వివిధ సద్గుణాలతో కూడిన సంస్కారాలను రాయండి.

(2) శివాజీ మహారాజు స్వరాజ్య స్థాపన మావళ్ ప్రాంతం నుండి ప్రారంభించాడు.

**3. శివాజీ మహారాజు యొక్క మిత్రులు మరియు అనుచరుల పట్టిక తయారు చేయండి.**

**4. వెదకండి - రాయండి.**

(1) శహాజీరాజును స్వరాజ్య సంకల్పకుడు అని ఎందుకు అంటారు?

(2) శివాజీరాజు నౌకాదళాన్ని ఏర్పాటు చేయుటపై ఎందుకు శ్రద్ధ వహించాడు?

(3) శివాజీ ఆదిల్‌శాహాతో ఎందుకు ఒడంబడిక చేసుకొన్నాడు?

(4) శివాజీ మహారాజు పన్హాళాగడ్ నుండి ఎలా తప్పించుకొన్నాడు?

**ఉపక్రమం**

(1) నీవు చూచిన ఏదేని కోటను వర్ణించు. చారిత్రక కట్టడాలను సంరక్షించు అంశం గురించి నీవు ఏ ఉపాయాలను సూచిస్తావో చెప్పుము.

(2) పొలం యొక్క 'సాత్/బారా' ఉతారా (7/12 సంగ్రహం)ను సేకరించి పొలంలోని పదాలకు గల సంబంధాన్ని అర్థం చేసుకోండి.



పన్హాల కోట - మూడు ద్వారాలు



# 6. మొఘలులతో పోరాటం

ఇప్పటి వరకు శివాజీ మహారాజు ఆదిల్‌శాహీతో సఫలీకృత పోరాటం చేసి యుండెను. కాని స్వరాజ్యాన్ని విస్తరించుటకు మొఘలులతో కూడా పోరాటం తప్పనిసరి అయింది. స్వరాజ్య విస్తరణ జరుగుతుండగానే స్వరాజ్యంపై మొఘలుల విపత్తు వచ్చి పడింది. మహారాజు ఈ విపత్తును కూడా అధిగమించాడు. మొఘలుల నుండి తన కోటలను మరియు ప్రాంతాలను తిరిగి పొందాడు. స్వయంగా పట్టాభిషేకం చేయించుకొన్నాడు. దక్షిణంవైపు దండయాత్ర చేపట్టాడు. ఈ సంఘటనలన్నింటి గురించి వివరంగా మనం ఈ పాఠంలో తెలుసుకోబోతున్నాం.

**శాయిస్తాఖాన్ దండయాత్ర:** ఫిబ్రవరి 1660లో శాయిస్తాఖాన్ అహ్మద్‌నగర్ నుండి బయలుదేరి పుణె ప్రాంతానికి చేరాడు. అతడు సమీప ప్రాంతాలలో చిన్న చిన్న సైన్య దళాలను పంపి స్వరాజ్యంలోని ప్రాంతాలకు చాలా నష్టం కలిగించాడు. చాకణ్‌కోటను ముట్టడించాడు. చాకణ్‌కోట కిల్లేదారు ఫిరంగోజీ నరసాళ అతని సైన్యాన్ని తీవ్రంగా ప్రతిఘటించాడు. కాని చివరకి శాయిస్తాఖాన్ చాకణ్ కోటను గెలుచుకొన్నాడు.

శివాజీ మహారాజు యొక్క బాల్యం గడచిన పుణెలోని లాల్ మహాల్‌లో శాయిస్తా ఖాన్ తిష్ట వేసి కూర్చున్నాడు. అక్కడి నుండి చుట్టుప్రక్కల ప్రాంతాలను దోచుకోవడం కొనసాగిస్తూనే ఉన్నాడు. రెండు సంవత్సరాలు అయినను అతడు పుణెలోని విడిదిని విడిచే ఆలోచన చేయకుండెను. దాని ప్రభావం ప్రజల నైతిక ధైర్యంపై పడుట సహజమే. అటువంటి పరిస్థితిలో మహారాజు ఒక సాహసోపేతమైన ఉపాయాన్ని పన్నాడు.

శివాజీ మహారాజు స్వీయ నాయకత్వంలో లాల్ మహాల్‌పై రహస్యంగా దాడి చేయుటకు సాహసోపేత పన్నాగం పన్నాడు. దాని ప్రకారం 1663 ఏప్రిల్ 5వ తేదీన మహారాజు రాత్రి సమయంలో ముఖ్యమైన సైనికులతో బాటు లాల్ మహాల్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో శాయిస్తాఖాన్ యొక్క చేతి వ్రేళ్ళు తెగిపోయాయి. అతని పరువు పోయింది. అతడు పుణెను విడిచిపెట్టాడు. తన నివాసాన్ని ఔరంగాబాద్‌కు మార్చుకొన్నాడు. ఈ సంఘటన వలన అతడు ఔరంగజేబు యొక్క కోపాన్ని కొనితెచ్చుకొన్నాడు. ఔరంగజేబు అతనిని బంగాలు సుభకు పంపించాడు. శాయిస్తా ఖాన్‌పై జరిగిన విజయవంతమైన దాడి యొక్క ప్రభావం ప్రజలపై పడింది. శివాజీ మహారాజు నాయకత్వంపై ప్రజలకు విశ్వాసం చాలా పెరిగిపోయింది.



**చెప్పుకోండి చూద్దాం!**

సూరత్ పట్టణాన్ని సందర్శించ వలసి ఉన్నది. అయితే మీరు ఎలా వెళతారో మానచిత్రపటం సహాయంతో చూపండి.

- శివాజీ మహారాజు సూరత్‌కు ఎలా చేరి ఉండ వచ్చునో ఊహించండి.

**సూరత్‌పై దండయాత్ర:** శాయిస్తాఖాన్ మూడు సంవత్సరాల కాలంలో స్వరాజ్యంలోని చాలా ప్రాంతాలను నాశనం చేశాడు. దానికి నష్టపరిహారం చేయడం అవసరమైనది. అందుకోసం మహారాజు మొఘలులకు గుణపాఠం నేర్పుటకు ఒక ఉపాయం పన్నాడు. మొఘలుల స్వాధీనంలోని సూరత్ ఒక పెద్ద వ్యాపార కేంద్రం మరియు ఓడరేవుగల పట్టణం. అక్కడ ఆంగ్లేయులు మరియు డచ్ వారి గిడ్డంగులు ఉండెను. ఈ పట్టణం చక్రవర్తికి అన్నింటి కంటె ఎక్కువగా భూమిశిస్తును ఇస్తుండెను. అటులనే అది ఆర్థికంగా సంపన్నమైనది అనే భావనతో అతడు సూరత్‌పై దండయాత్ర చేశాడు. సూరత్ యొక్క సుభేదారు ఇనాయత్‌ఖాన్ మహారాజు యొక్క దండయాత్రను ప్రతిఘటించలేక పోయాడు. సామాన్య ప్రజలకు కష్టం కలిగించకుండా అతడు సూరత్ నుండి అపారమైన సంపదను పొందాడు. అతని ఈ దండయాత్ర విజయవంతమైనది. దీని వలన ఔరంగజేబు చక్రవర్తి యొక్క ప్రతిష్ఠ దెబ్బతిన్నది.

**జయసింగ్ యొక్క దండయాత్ర:** శివాజీ మహారాజు యొక్క అధికమవుతున్న కార్యకలాపాలను అరికట్టుటకు ఔరంగజేబు తన యొక్క ఒక అనుభవజ్ఞుడైన మరియు ముఖ్యుడైన రాజపుత్ర సర్దారు మిర్జారాజా జయసింగ్‌ను పంపాడు. అతడు పుణెకు వచ్చాడు. అతడు మహారాజుకు వ్యతిరేకంగా అన్ని శక్తులను సంఘటితం చేయుట కొరకు తన ప్రయత్నాలు మొదలు పెట్టాడు. గోవా మరియు

వసయిలోని పోర్చుగీసు, వెంగుర్లాలోని డచ్‌వారు, సూరత్‌లోని ఆంగ్లేయులు, జంజిరాలోని సిద్దీలను మహారాజుకు వ్యతిరేకంగా నౌకాదళ దాడి చేయవలెనని జయసింగ్ వారికి సూచించాడు.

శివాజీ మహారాజు వద్దగల కోటలను జయించుటకు పథకం పన్నాడు. స్వరాజ్యంలోని వివిధ ప్రాంతాలకు సైనికుల దళాలను పంపించాడు. ఆ సైన్యం స్వరాజ్యంలోని భూ ప్రదేశాలకు గొప్ప నష్టం కలిగించింది. మహారాజు మొఘలులను ప్రతిఘటించుటకు ప్రయత్నించాడు. మిర్జారాజు జయసింగ్ మరియు దిలేర్‌ఖాన్‌లు పురందర్ కోటను ముట్టడించారు. పురందర్ కోట ముట్టడి సమయంలో మురార్‌బాజి దేశ్‌పాండే తన పరాక్రమాన్ని పణంగా పెట్టాడు. కాని వీరమరణం పొందాడు. పరిస్థితి యొక్క గాంభీర్యతను దృష్టిలో ఉంచుకొని మహారాజు జయసింగ్‌తో మంతనాలు జరుపుటకు నిశ్చయించుకొన్నాడు. అతడు జయసింగ్‌ను కలిశాడు. జయసింగ్ మరియు మహారాజుల మధ్య జూన్ 1665లో ఒడంబడిక జరిగింది. ఈ ఒడంబడిక '**పురంధర సంధి**'గా గుర్తింపబడుతుంది. ఈ సంధి ప్రకారం మహారాజు మొఘలులకు ఇరవైమూడు కోటలు మరియు వాని చుట్టు ప్రక్కల నాలుగు లక్షల హోనుల ఆదాయాన్నిచ్చే ప్రాంతాలను ఇచ్చాడు. ఆదిల్‌శాహీకి వ్యతిరేకంగా మొఘలులకు సహాయం చేసెదనని మాట కూడా ఇచ్చాడు. ఈ ఒడంబడికను ఔరంగజేబు అంగీకరించాడు.



**సమాచారం తెలుసుకోండి.**

శివాజీ మహారాజు ఆగ్రాలోని ఔరంగజేబు యొక్క గృహ నిర్భందం నుండి ఎలా తప్పించుకున్నాడో తెలుసుకోండి.

**ఆగ్రా సందర్శనం మరియు విడుదల:** పురందరసంధి తరువాత జయసింగ్ ఆదిల్‌శాహీకి వ్యతిరేకంగా దండయాత్ర చేపట్టాడు. మహారాజు జయసింగ్‌కు సహాయం చేశాడు. కానీ ఈ దండయాత్ర విజయవంతం కాలేదు. ఆ సమయంలో మహారాజును కనీసం కొంతకాలం అయినా దక్షిణ భారతదేశ రాజకీయాలకు దూరంగా ఉంచాలని జయసింగ్ మరియు ఔరంగజేబు చక్రవర్తి ఆలోచించారు. ఈ ఆలోచన ప్రకారం జయసింగ్ శివాజీ మహారాజుకు చక్రవర్తి ఔరంగజేబును సందర్శించుటకు వెళ్ళవలసినదిగా ప్రతిపాదించాడు. అతని భద్రత విషయంలో హామీ కూడా ఇచ్చాడు. దాని ననుసరించి శివాజీ మహారాజు ఆగ్రాకు బయలుదేరాడు. తోడుగా యువరాజు శంభాజీ ఉండెను. అదే విధంగా విశ్వాసపాత్రులు మరియు ప్రాణానికి ప్రాణం ఇచ్చే ముఖ్యమైన అనుచరులు వెంట ఉండిరి.

మహారాజు ఆగ్రాను చేరుకొనెను. అయినప్పటికి ఔరంగజేబు దర్బారులో అతనికి సరియైన గౌరవాన్ని ఇవ్వలేదు. అందువలన అతడు అసంతృప్తిని వ్యక్తపరచాడు. ఆ తరువాత చక్రవర్తి శివాజీని గృహ నిర్బంధంలో ఉంచాడు. చక్రవర్తి యొక్క ఈ చర్యకు ఆందోళన చెందకుండ మహారాజు గృహనిర్బంధం నుండి తాను తప్పించుకొనుటకు పథకం ఆలోచించాడు. అతడు ఆగ్రా నుండి తెలివిగా తప్పించుకొని కొన్ని రోజులకు మహారాష్ట్రకు సురక్షితంగా చేరుకొనెను. ఆగ్రా నుండి వచ్చునపుడు శంభాజీ రాజును అతడు మథురలో ఉంచాడు. తరువాత అతనిని సురక్షితంగా రాజగడ్‌కు తీసుకురావడం జరిగింది. మహారాజు స్వరాజ్యానికి దూరంగా ఉన్నపుడు స్వరాజ్య కార్యకలాపాలను వీరమాత జిజాబాయి మరియు మహారాజు యొక్క అనుచరులు చూసుకొన్నారు.

**మొఘలులకు వ్యతిరేకంగా ఆక్రమణ పథకం :** మహారాజు మొఘలులతో వెంటనే పోరాటం వద్దు అని అనుకున్నప్పటికి పురందరసంధిలో ఇచ్చిన కోటలు మరియు ప్రాంతాలు తిరిగి పొందాలనే ఉద్దేశం మహారాజుకు ఉండెను. అందుకోసం అతడు ఒక గొప్ప మరియు సాహసోపేత పథకం తయారు చేశాడు. ఒకవైపు నుండి వేరు వేరు కోటలపై పరిపూర్ణ తయారితో సైన్యాన్ని పంపి ఆ కోటలను వశపరచుకొనుట, మరోవైపు నుండి దక్కన్‌లో మొఘలుల అధికారం కింద ఉన్న ప్రాంతాలపై దాడి చేసి వారిని అస్థిరంగా ఉంచాలనే యోజనచేసెను. దీని ప్రకారం అతడు మొఘలుల యొక్క అహ్మద్‌నగర్ మరియు జున్నర్ ప్రాంతాలపై దాడి చేశాడు. తరువాత ఒకదాని తరువాత ఒకటిగా సింహగడ్, పురందర్, లోహగడ్, మాహులి, కర్నాళా మరియు రోహిడా కోటలను గెలుచుకొన్నాడు.

ఆ తరువాత శివాజీ మహారాజు రెండవసారి సూరత్‌పై దండయాత్ర చేశాడు. అక్కడి నుండి తిరిగి వచ్చునపుడు నాశిక్ జిల్లాలోని వణి-దిండోరి వద్ద అతనికి మొఘలులతో గొప్ప పోరాటం జరిగింది. ఈ పోరాటంలో అతడు దావూద్ ఖాన్ అను మొఘలు సర్దారును ఓడించారు. ఆ తరువాత మోరోపంత్ పింగళె నాశిక్ దగ్గరి త్ర్యంబక్‌గడ్‌ను జయించాడు.

ఈ విధంగా మొఘలులకు వ్యతిరేకంగా చేసిన మహారాజు యొక్క యుద్ధ వైఖరికి విజయం చేకూరింది. ఈ దండయాత్రలలో తానాజీ మాలుసరె, మోరోపంత్ పింగళె, ప్రతాపరావు గుజర్ మొదలగు సర్దారులు అమూల్యమైన పని చేశారు. ఈ దండయాత్రను కృష్ణాజీ అనంత సభాసద్ అను చరిత్ర కారుడు ఈ విధంగా వర్ణించాడు ''चह्र महिन्यात सत्तावीस गड घेतले. मोठी ख्याती केली.''(నాలుగు నెలలలో ఇరవై ఏడు కోటలు వశపరచుకొన్నాడు. గొప్ప ఖ్యాతిగడించాడు.) పండిత గాగాభట్టు చేతుల మీదుగా తన పట్టాభిషేకాన్ని రాయగడ్‌లో జరిపించుకొన్నాడు..

ఈ రాజ్యాభిషేకం ద్వారా మహారాజు ఇప్పుడు స్వరాజ్యం యొక్క ఛత్రపతి అయ్యాడు. సార్వభౌమత్వానికి ప్రతీకగా అతడు **'పట్టాభిషేకశకం'** అను కొత్త కాల గణనను ప్రారంభించాడు. అతడు ఇప్పుడు శకకర్త అయ్యాడు. పట్టాభిషేక సమయంలో అతడు బంగారపు 'హోన్' మరియు రాగితో చేసిన 'శివరాయి' అను ప్రత్యేకమైన నాణేలు ముద్రించాడు.



ఛత్రపతి శివాజీ మహారాజు

**పట్టాభిషేకం:** ముప్పది సంవత్సరాలు నిరంతర అవిరామ పరిశ్రమ ద్వారా మరాఠీయుల స్వరాజ్యం సాధించబడింది. కానీ స్వరాజ్యం యొక్క గుర్తింపు స్వతంత్రమైనది మరియు సార్వభౌమత్వం కలది అని స్పష్టం చేయుట కొరకు స్వరాజ్యానికి ప్రామాణికత మరియు అందరి ఆమోదం లభించడం అవసరమని మహారాజు గ్రహించాడు. అందుకోసం శాస్త్రోక్తంగా పట్టాభిషేకం జరగడం అవసరమైనది. అందువలన అతడు 1674 జూన్ 6 రోజున విద్వాంసుడైన

ఈ నాణేలపై **'శ్రీ రాజా శివ ఛత్రపతి'** అను అక్షరాలు చెక్కబడినవి. ఆనాటి నుండి రాజపత్రాలపై **'క్షత్రియ కులావతంస్ శ్రీ రాజా శివ ఛత్రపతి'** అని పేర్కొనడం ఆరంభమైనది. పట్టాభిషేకం తరువాత అతడు పారసీ పదాలకు పర్యాయంగా సంస్కృత పదాలు గల ఒక పదకోశంను తయారు చేయించుకొన్నాడు. దీనినే **'రాజ్య వ్యవహార కోశ్'** అని అంటారు.



రాయగడ్ కోట

**గుర్తు తెచ్చుకోండి.**

నూతన కాల గణనను ఏ భారతీయ రాజు ప్రారంభించాడు?

**గుర్తుంచుకోండి.**

రాజ్య వ్యవహార కోశంలోని కొన్ని సమానార్థక పదాలు పేర్కొన దగినవి -

ఉదా: ఖితాబ్ - పదవి, ఫర్మాన్ - రాజపత్ర్
జామీన్ - ప్రతిభూతి, హాలీ - సాంప్రత్,
మాజీ - పూర్వ్, ఫిల్‌హాల్ - తత్కాళ్,
వాహవా - ఉత్తమ్
వకూబ్ - ప్రజ్ఞా , బెవకూఫ్ - మూఢ్,
దస్తపోశీ - హస్తస్పర్శ్,
ములాఖత్ - దర్శన్, కదమ్‌పోశీ - పాదస్పర్శ్,
ఝూట్ - మిథ్యా, కౌల్‌నామా - అభయ్,
ఫతేహ్ - విజయ్, ఫిర్యాద్ - అన్యాయవార్తా,
శిలేదార్ - స్వతూరగీ

మధ్యయుగ భారతదేశ చరిత్రలో శివాజీ మహారాజు యొక్క పట్టాభిషేకం ఒక విప్లవాత్మక సంఘటన. ఈ సంఘటన యొక్క ప్రాముఖ్యతను తెలుపుతూ సభాసద్ అంటాడు "मऱ्हाटा पातशाह येव्हढा छत्रपती जाला ही गोष्ट काही सामान्य झाली नाही." ("మరాఠా రాజు ఇంత గొప్ప ఛత్రపతి అయ్యాడంటే ఈ విషయం సామాన్యమైనది కాదు.")

ఆ తరువాత మహారాజు స్వల్పకాలంలోనే 1674 సెప్టెంబరు 24 రోజున నిశ్చల్‌పురి గోసావి మార్గదర్శనంలో సాంకేతిక పద్ధతిలో పట్టాభిషేకం చేయించుకొన్నాడు. భారత దేశంలో వైదిక్ మరియు తాంత్రిక అను రెండు ధార్మిక పద్ధతులు అస్తిత్వంలో ఉండేవి. వాటిని ఆదరించి మహారాజు ఈ రెండు పద్ధతుల ప్రకారం పట్టాభిషేకం చేయించుకొన్నాడు.

**మీకు తెలుసా?**

శివాజీ మహారాజు పట్టాభిషేక సమయానికి యువరాజు సంభాజీ రాజే వయస్సు 17 సంవత్సరాలు. అతడు 'బుధ భూషణం' అను గ్రంథంలో పట్టాభిషేక ఉత్సవాన్ని వర్ణించాడు. తన స్వీయ అనుభవం ఆధారంగా.

'ఛత్రపతి శివాజీ మహారాజు పట్టాభిషేక మహోత్సవ సమయంలో వివిధ ప్రాంతాల నుండి గొప్ప గొప్ప విద్వాంసులు వచ్చియుండిరి. వారికి బరువు కొలతలను చేయకనే విపులంగా ధనం ఇచ్చి అదే విధంగా వస్త్రాలు, ఏనుగులు, గుర్రాలను కూడా దానం చేసి వారిని సంతృప్తి పరచాడు.

ఈ విధంగా ఛత్రపతి శివాజీ మహారాజు తన కీర్తిని వేరువేరు దిశలకు విస్తరింపజేసాడు.

**మీకు తెలుసా?**

శివాజీ మహారాజు యొక్క పట్టాభిషేకం కొరకు అత్యంత విలువైన మరియు భవ్య సింహాసనం తయారు చేయబడినది. సింహాసనం యొక్క ఎనిమిది దిక్కులకు రత్నాలు పొదగబడిన స్తంభాలు ఉండెను. ముప్పైరెండు మణుగుల బంగారు సింహాసనం విలువైన రత్నాలతో పొదగబడి యుండెను.

- మణుగు అను ప్రమాణాన్ని గణిత ఉపాధ్యాయుని ద్వారా తెలుసుకోండి.


**దక్షిణ దండయాత్ర:** పట్టాభిషేకం తరువాత సుమారు మూడు సంవత్సరాలకు 1677 అక్టోబరులో మహారాజు దక్షిణ దేశ దండయాత్ర చేపట్టాడు. గోవళ్‌కొండ (గొల్కొండ)కు వెళ్ళి అతడు కుతుబ్‌శాహను కలుసుకొన్నాడు. అతనితో స్నేహ

ఒడంబడిక చేసుకొన్నాడు. తరువాత మహారాజు కర్నాటకలోని బంగళూరు, హోస్‌కోటె, అదే విధంగా ప్రస్తుత తమిళనాడులోని జింజి, వెల్లోర్ మొదలగు కోటలు మరియు ఆదిల్‌శాహీ యొక్క కొన్ని ఇతర ప్రాంతాలు జయించాడు. అతని సైన్యం అక్కడి ప్రజలకు ఎటువంటి బాధ కలిగించలేదు. జయించిన ప్రాంతాల పరిపాలన చూచుకొనుటకు ముఖ్య పరిపాలకునిగా రఘునాథ్ నారాయణ్ హనుమంతెను నియమించాడు.

శివాజీ మహారాజు యొక్క సవతి సోదరుడు వెంకోజీ ప్రస్తుత తమిళనాడులో ఉన్న తంజావూర్ వద్ద రాజ్యమేలు చుండెను. అతనిని కూడా తన స్వరాజ్యకార్యంలో భాగస్వామిగా చేసుకోవలెనని మహారాజు ప్రయత్నం చేశాడు. వెంకోజీ రాజు తర్వాత తంజావూర్ రాజులు 'విద్య మరియు కళ'లపై శ్రద్ధ వహించిరి. అక్కడి 'సరస్వతీ మహల్' గ్రంథాలయం ప్రపంచ ప్రఖ్యాతిపొందింది.

దక్షిణదేశ దండయాత్రలో తమిళనాడులోని జింజి కోటను జయించి దానిని స్వరాజ్యంలో కలుపుకొన్న శివాజీ మహారాజు గొప్పతనానికి తరువాత కాలంలో తిరుగులేని ప్రాముఖ్యత లభించింది. మొఘలు చక్రవర్తి ఔరంగజేబు స్వరాజ్యాన్ని నాశనం చేయడానికి మహారాష్ట్రలో తిష్ట వేయడం వలన అప్పటి ఛత్రపతి రాజారాం మహారాజునకు రక్షణ కొరకు మహారాష్ట్రను వదలవలసి వచ్చింది. ఆకాలంలో అతడు దక్షిణంలోని జింజీ కోటపై తలదాచుకొని అక్కడి నుండి స్వరాజ్యం యొక్క పరిపాలన నడిపించాడు.

శివాజీ మహారాజు యొక్క దక్షిణ దిగ్విజయం తరువాత కొంతకాలానికే 1680 ఎప్రిల్ 3 రోజున రాయగడ్‌లో మరణించాడు. అతడు యాభై సంవత్సరాల వయస్సులోనే మరణించడంతో స్వరాజ్యానికి అపరిమిత హాని కలిగింది. ఒక మహా యుగం అస్తమించింది.



శివాజీ మహారాజు యొక్క సమాధి - రాయగడ్

NG3TSH

## అభ్యాసం

**1. కింది సంఘటనలను కాలక్రమానుసారంగా రాయండి.**

(1) శివాజీ మహారాజు యొక్క దక్షిణ దండయాత్ర
(2) లాల్ మహల్‌పై దాడి
(3) ఆగ్రా నుండి తప్పించుకొనుట
(4) పట్టాభిషేకం
(5) పురందర సంధి
(6) శాయిస్తాఖాన్ దండయాత్ర

**2. వెదకితే దొరుకుతుంది.**

(1) సంస్కృత పదాలు ఉండే పదకోశం -
(2) త్ర్యంబక్‌గడ్ జయించిన వాడు -
(3) వణి - దిండోరి వద్ద ఓడిపోయిన సర్దారు -
(4) ఆంగ్లేయులు, డచ్, ఫ్రెంచ్ వారి గిడ్డంగులు గల ప్రాంతం -

**3. మీ మాటలలో రాయండి.**

(1) శివాజీ మహారాజు పట్టాభిషేకం
(2) ఆగ్రా నుండి తప్పించుకొనుట
(3) శివాజీ మహారాజు యొక్క దక్షిణదేశ దండయాత్ర
(4) శివాజీ పట్టాభిషేకం కొరకు చేసిన ఏర్పాట్లు

**4. కారణాలు రాయండి.**

(1) శివాజీ పురందరసంధి చేశాడు.
(2) శివాజీ మహారాజు మొఘలులకు వ్యతిరేకంగా ఆక్రమణ ధోరణిని అవలంబించాడు.

**ఉపక్రమం**

(1) పాఠశాలలో జరుపుకొనబడు స్వాతంత్ర్య దినోత్సవం/ గణతంత్ర దినోత్సవ కార్యక్రమానికి నీవు ఏమేమి తయారు చేస్తావు? ఉపాధ్యాయుల సహాయంతో పట్టిక తయారు చేయండి.
(2) మీ పరిసరాలలోని చారిత్రక స్థలాన్ని సందర్శించి నివేదిక రాయండి.

# 7. స్వరాజ్య పరిపాలన

శివాజీ మహారాజు స్వరాజ్య స్థాపన చేశాడు. తనకు పట్టాభిషేకం చేయించుకొన్నాడు. పట్టాభిషేకం తరువాత అతడు దక్షిణాన్ని జయించాడు. స్వరాజ్యం విస్తరించింది. ఈ స్వరాజ్యం లో మహారాష్ట్రలోని నాశిక్, పుణె, సాతారా, సాంగ్లీ, కొల్హాపుర్, సింధుదుర్గ్, రత్నగిరి, రాయగడ్ మరియు ఠాణె జిల్లాలోని చాలా ప్రాంతం అంతర్భాగంగా ఉండెను. అదే విధంగా కర్నాటక, ఆంధ్రప్రదేశ్ మరియు తమిళనాడు రాష్ట్రాలలోని కొంత భాగం స్వరాజ్యంలో విలీనమై ఉన్నది. ఈ విధంగా విస్తరిస్తూ పోయిన స్వరాజ్య పరిపాలన నిరాటంకంగా జరగాలని, అందులో ప్రజల సంక్షేమం సాధింపబడాలని మహారాజు స్వరాజ్యం యొక్క నియమాలను తయారు చేశాడు. ఈ విషయం గురించి మనం తెలుసుకోబోతున్నాం.

**అష్ట ప్రధానుల మండలి:**మహారాజు పట్టాభిషేక సమయంలో అష్ట ప్రధానుల మండలిని ఏర్పాటు చేశాడు. రాజ్య పరిపాలన సౌకర్యం కోసం దానిని ఎనిమిది శాఖలుగా విభజించాడు. ప్రతి ఒక శాఖ కోసం ఒక ప్రముఖుణ్ణి నియమించాడు. ఎనిమిది శాఖల్లోని ఎనిమిది మంది ప్రముఖులు కలసి 'అష్టప్రధాన్ మండల్' తయారైనది. ఈ ప్రముఖులను నియమించడం లేక వారిని వారి పదవుల నుండి తప్పించడం ఈ అధికారం మహారాజు చేతిలో ఉండెను. తమ తమ శాఖల యొక్క కార్యాచరణ విషయంలో మహారాజుకు జవాబుదారిగా ఉండటం ఆయా ప్రముఖుల కర్తవ్యం.

శివాజీ మహారాజు యోగ్యత మరియు సామర్థ్యాల ప్రాతిపదికపై అష్ట ప్రధాన మండలిని ఎన్నుకొన్నాడు. వారికి ఇనాములు, వతన్‌లు లేక జాగీరులు ఇవ్వలేదు; నగదు వేతనం మాత్రం దండిగా ఇచ్చాడు.

**వ్యవసాయ సంబంధ ఫథకం :** వ్యవసాయం గ్రామాలలోని ముఖ్యవృత్తి. మహారాజు వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను గ్రహించాడు. అందువలన అతడు రైతుల బాగుకై శ్రద్ధ చూపాడు. అతడు కార్యదీక్షాపరుడు మరియు అనుభవజ్ఞుడైన అధికారి అణ్ణాజీ దత్తోకు భూమిశిస్తు విధించే వ్యవస్థ బాధ్యతను అప్పగించాడు. నిర్ధారించిన రొక్కము కంటె అధిక శిస్తు సేకరించరాదని అధికారులను అతడు హెచ్చరించాడు. బీడు భూములను వ్యవసాయం క్రిందికి తీసుక రావడానికి ప్రోత్సహించాడు. అతివృష్టి మరియు అనావృష్టి వలన పంట చేతికి రానప్పుడు లేక శత్రుసైన్యం గ్రామ ప్రాంతాలను విధ్వంసం చేసినప్పుడు, ఇలాంటి అన్ని సందర్భాలలో గ్రామస్థులకు భూమిశిస్తు మరియు ఇతర పన్నులలో తగ్గింపు (మినహాయింపు) ఇవ్వవలెనని అతడు ఆదేశించాడు. అదేవిధంగా ఇటువంటి సమయాలలో రైతులకు ఎద్దుల జత, నాగలి మరియు విత్తుటకు మంచి విత్తనాలు సరఫరా చేయాలని అతడు అధికారులను ఆజ్ఞాపించాడు.

**శివాజీ మహారాజు యొక్క అష్టప్రధానుల మండలి**

| | ప్రధాని పేరు | పదవి | పనులు |
|---|---|---|---|
| 1. | మోరో త్రింబక్ పింగళే | ప్రధాని | రాజ్యపరిపాలన నిర్వహించుట మరియు జయించిన ప్రాంతాల వ్యవస్థను చూసుకొనుట. |
| 2. | రామచంద్ర నీలకంఠ ముజుమ్‌దార్ | అమాత్యుడు | రాజ్యం యొక్క ఆదాయవ్యయాలు చూసుకొనుట. |
| 3. | అణ్ణాజీ దత్తో | సచివ్(కార్యదర్శి) | ప్రభుత్వ ఆజ్ఞా పత్రాలను తయారు చేయుట. |
| 4. | దత్తాజీ త్రింబక్ వాకనీస్ | మంత్రి | ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్వహించుట. |
| 5. | హంబీర్‌రావు మొహితే | సేనాపతి | సైన్య వ్యవస్థను చూసుకొనుట మరియు రాజ్య సంరక్షణ చేయుట. |
| 6. | రామచంద్ర త్రింబక్ డబీర్ | సుమంతుడు | విదేశ సంబంధాలు నిర్వహించుట. |
| 7. | నిరాజీ రావుజీ | న్యాయాధీశుడు | న్యాయాన్ని అందించుట. |
| 8. | మోరేశ్వర్ పండిత్‌రావు | పండితరావు | మత వ్యవహారాలు చూసుకొనుట. |

**ఆనాటి గ్రామాల ఆర్థిక వ్యవస్థ :** వ్యవసాయం గ్రామాల్లోని ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. గ్రామాలలో వ్యవసాయానికి అనుబంధంగా పూరక వృత్తులు జరిగేవి. గ్రామంలోని చేతివృత్తుల వారు వస్తువులను ఉత్పత్తి చేసేవారు. వారు స్థానిక ప్రజల అవసరాలను తీర్చేవారు. ఈ విధంగా గ్రామాలు స్వయంసమృద్ధి కలిగి యుండేవి. రైతులు తమ ధాన్య ఉత్పత్తుల నుండి అవసరమైన వాటాను చేతివృత్తుల వారికి ఇచ్చేవారు. ఈ వాటాను (బలుతం లేదా భత్యం) కట్టడి అని అంటారు.

**వ్యాపారం మరియు పరిశ్రమలు :** వ్యాపారాభివృద్ధి లేకుండా రాజ్యం సుసంపన్నం కాదని మహారాజు గుర్తించాడు. వ్యాపారాల వలన కొత్త కొత్త మరియు అవసరమైన వస్తువులు రాజ్యంలోనికి వస్తాయి. వస్తువుల నిలువ పెరుగుతుంది. వ్యాపారం పెరుగుతుంది. సంపద కలిసివస్తుంది. 'సాహుకారు అనగా రాజ్యం యొక్క మరియు రాజవైభవం యొక్క శోభ' అను ఆజ్ఞాపత్రంలోని వర్ణన మహారాజుకు వ్యాపారంపై గల దృష్టికోణాన్ని స్పష్టం చేసేదిగా ఉన్నది. 'సాహుకారు' అను పదానికి 'వ్యాపారి' అని అర్థం.

స్వరాజ్యంలోని పరిశ్రమలకు రక్షణ కల్పించాలనునది మహారాజు యొక్క యోజన. దానికి ఉత్తమ ఉదాహరణ ఉప్పు పరిశ్రమ. అతడు కొంకణంలోని ఉప్పు పరిశ్రమకు రక్షణ కల్పించాడు. ఆ సమయంలో పోర్చుగీసు వారి స్వాధీనంలో ఉన్న ప్రాంతాల నుండి స్వరాజ్యంలోనికి అధిక ప్రమాణంలో ఉప్పు దిగుమతి అవుతుండేది. అందువలన కొంకణంలోని స్థానికంగా తయారైన ఉప్పు అమ్మకంపై ప్రతికూల పరిణామం ఉండెను. దానిని దృష్టిలో ఉంచుకొని మహారాజు పోర్చుగీసు ప్రాంతం నుండి వచ్చే ఉప్పుపై అధిక దిగుమతి సుంకం విధించాడు. పోర్చుగీసు వారి నుండి వచ్చే ఉప్పు ధర హెచ్చి దాని దిగుమతి పడిపోవాలని మరియు స్థానికంగా తయారైన ఉప్పు అమ్మకం పెరగాలనేది దీని వెనుక గల ఉద్దేశం.

**సైనిక వ్యవస్థ :** మహారాజు యొక్క సైన్యం రెండు భాగాలుగా విభజింప బడినది. ఒకటి కాల్బలం, రెండవది అశ్వదళం. కాల్బలంలో **హవాల్దార్, జమలేదార్** అను అధికారులు ఉండేవారు. కాల్బలం యొక్క ప్రముఖుడిని **'సర్నోబత్'** అనేవారు. అతడు కాల్బలంలోని అత్యున్నత అధికారి.

అశ్వదళంలో రెండు రకాల అశ్వారోహకులు ఉండిరి. ఒకరు **శిలేదారు** మరియు మరొకరు **బార్గీరు.** శిలేదారు వద్ద సొంత గుర్రాలు మరియు ఆయుధాలు ఉండేవి, బార్గీరుకు ప్రభుత్వం ద్వారా గుర్రాలు మరియు ఆయుధాలు ఇవ్వబడేవి. అశ్వదళంలో బార్గీరుల సంఖ్య అధికంగా ఉండెను. అశ్వదళంలో కూడా అధికారుల శ్రేణి కాల్బలంలోని శ్రేణి మాదిరిగా ఉండేది. 'సర్నోబత్' అశ్వదళంలోని అత్యున్నత అధికారి. నేతోజీ పాల్కర్, ప్రతాపరావు గుజర్, హంబీర్‌రావు మొహితే వంటి కొందరు మహారాజు యొక్క అశ్వదళంలోని సర్నోబత్ అధికారులు ప్రసిద్ధిగాంచారు.



**తెలుసుకొందాం పద!**

భారతదేశ సైనిక దళాల వివరాలు సేకరించండి.

- మూడు సైనిక దళాల పేర్లు చెప్పండి.
- ప్రతి ఒక్క సైనిక దళ ప్రముఖుణ్ణి ఏమంటారు?
- మూడు సైనిక దళాల ప్రముఖుడు ఎవరై ఉంటారు?

**గూఢచారి వ్యవస్థ :** శత్రువుల నుండి స్వరాజ్యాన్ని రక్షించడం అవసరమయింది. అందుకోసం శత్రువుల కదలికల గురించి సరియైన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవలసి వచ్చేది. ఈ సమాచారాన్ని సేకరించి దానిని మహారాజుకు అందించటం అతని గూఢాచారి విభాగం యొక్క పని. అతని గూఢాచారి వ్యవస్థ అత్యంత సమర్థవంతమైనది. బహిర్జీ నాయిక్ గూఢాచారి వ్యవస్థకు ప్రముఖుడు. అతడు వివిధ ప్రాంతాల సమాచారం తీసుకొని రావడంలో నిపుణుడు. అతడు సూరత్ దండయాత్రకు ముందు అక్కడి అణువణువు యొక్క సమాచారం తీసుకువచ్చాడు.

**కోటలు :** మధ్యయుగంలో కోటల ప్రాముఖ్యత అసాధారణమైనది. కోట స్వాధీనంలో ఉంటే చుట్టు ప్రక్కల ప్రాంతాలపై నిఘా మరియు నియంత్రణ కలిగి యుండ వచ్చును. పరాయి ఆక్రమణలు జరిగినప్పుడు కోటలో తలదాచుకొని ప్రజల సంరక్షణ చేయవచ్చును. కోటపై ఆహారధాన్యాలు, యుద్ధానికి ఉపయోగపడే వస్తువులు, మందుగుండు సామాగ్రి నిలువ చేసుకోవచ్చును. స్వరాజ్య స్థాపన కార్యంలో కోటల యొక్క ప్రాముఖ్యత ఆజ్ఞాపత్రంలో చెప్పబడింది. అది ఇలా ఉంది, 'ఈ రాజ్యాన్ని అత్యంత పవిత్ర మూర్తులైన స్వర్గవాసులు గొప్ప స్వామివార్లు కోటపై నుండియే నిర్మించారు'.

స్వరాజ్యంలో సుమారు 300 కోటలు ఉండెను. ఈ కోటల నిర్మాణం మరియు మరమ్మత్తులకు మహారాజు చాలా ఖర్చు చేశాడు. రాజగడ్, ప్రతాపగడ్, పావనగడ్ వంటి పర్వతకోటలను నిర్మించాడు. కోటపై కిల్లేదారు, సబనీస్ మరియు కార్ఖానీస్ అను అధికారులు ఉండేవారు. అక్కడి ధాన్యాగారాలను మరియు యుద్ధసామాగ్రి యొక్క వ్యవస్థను చూసుకొనుటకు కార్ఖానీస్ అను అధికారి ఉండేవాడు.


పద్మదుర్గం (కోట)

**మీకు తెలుసా?**

శివాజీ మహారాజు యొక్క కోటల నిర్మాణం గురించి ఛత్రపతి సంభాజీ మహారాజు 'బుధ భూషణం' అను గ్రంథంలో చేసిన వర్ణన పేర్కొనదగినది. అది ఇలా ఉంది:

'కర్నాటక దేశం నుండి బాగలాణ్ దేశం వరకు శత్రువులకు అభేద్యమైన దుర్గములే, అటువంటి అనేక కోటలను ఛత్రపతి శివాజీ మహారాజు సహ్యాద్రి పర్వత ఉత్తుంగ శిఖర పీఠభూముల శ్రేణులపై పలుచోట్ల నిర్మించాడు. ఈ పృథ్విని రక్షించడం అనునది దాని వెనుక దాగిన ఉద్దేశం. అతని విజయవంతమైన నాయకత్వంతో కృష్ణానదీ తీరం నుండి సముద్రం నలువైపుల అతడు కోటలను కట్టాడు. రాయరీ కోటలో, అతడు విజయుడై మరియు రాజులందరిలో అగ్రేసరుడైన రాజా ఛత్రపతి శ్రీశివాజీ మహారాజుగా విలసిల్లాడు.

**సముద్ర కోటలు :** మహారాజు సముద్ర కోటల ప్రాముఖ్యతను కూడా గుర్తించాడు. అతడు నిర్మించిన జలదుర్గములలో మాలవణ్ యొక్క సింధు దుర్గం ఉత్కృష్ట సముద్రపు కోట. ఈ కోట నిర్మాణంలో దృఢత్వం రావాలని అతడు కోట పునాదికి వంద మణుగుల సీసం పోయించే ఏర్పాటు చేశాడు. అతడు సిద్దిని అడ్డుకొనుటకు రాజాపురి ఎదురుగా పద్మదుర్గం పేరున సముద్ర కోటను నిర్మించాడు. తాను రాసిన ఒక లేఖలో ఈ కోట గురించి ఇలా అంటాడు, 'పద్మదుర్గాన్ని నిర్మించి రాజపురిపై మరొక రాజపురిని ఏర్పరచాడు.

**నౌకాదళం :** భారతదేశ పశ్చిమ సముద్ర తీరంపై గోవా పోర్చుగీసులు, జంజీరా సిద్దీలు అదే విధంగా సూరత్ మరియు రాజాపూర్ వద్ద గల ఆంగ్లేయ గిడ్డంగి దారులు వీరు శత్రువులై స్వరాజ్య విస్తరణ కార్యంలో అడ్డంకులు కలుగ జేసేవారు. ఈ అండ్డంకులను అరికట్టుటకు మరియు పశ్చిమ సముద్రతీర ప్రాంతాన్ని రక్షించడం అవసరమయినది. అందుకోసం మహారాజు నౌకాదళాన్ని ఏర్పాటు చేశాడు. 'ఎవరివద్ద నౌకాదళం ఉందో వారిదే సముద్రం' అని అతడు గుర్తించెను. మహారాజు దూరదృష్టి కలవాడు.

మహారాజు యొక్క నౌకాదళంలో వివిధ రకాలైన నాలుగు వందల ఓడలు ఉండెను. అందులో గురాబ్, గలబత్ మరియు పాల్ ఇవి యుద్ధ నౌకలు. కళ్యాణ్-భివండీ పాయ, విజయదుర్గ్ మరియు మాలవణ్ వద్ద ఓడలు నిర్మింపబడేవి. మాయనాక్ బండారీ మరియు దౌలత్‌ఖాన్‌లు అతని నౌకాదళ ప్రముఖ అధికారులు.


గురాబ్


గలబత్

**చేసి చూడండి.**

భారతీయ నౌకాదళంలోని యుద్ధ నౌకల వివరాలు, నౌకల చిత్రాలను సేకరించండి.

**ప్రజా శ్రేయస్సుపై శ్రద్ధ :** ఇతర రాజుల మాదిరిగా శత్రువుల ఆధీనంలోని ప్రాంతాలను జయించి అక్కడ తన అధికారాన్ని ఏర్పాటు చేయాలనే పరిమిత ఆశయంతో మహారాజు పనులు చేయలేదు. ప్రజలను స్వతంత్రులను చేయుట అతని ముఖ్య ఉద్దేశం. ప్రజలు నిజమైన స్వాతంత్ర్యానందం పొందాలంటే, రాజ్య పరిపాలన క్రమశిక్షణతో ఉండవలెను. ప్రజల శ్రేయస్సు కొరకు సమగ్రమైన జాగ్రత్తలు తీసుకోవలెను మరియు జయించిన ప్రాంతాలను రక్షించవలెను అనే అవగాహన అతనికి ఉన్నది. మహారాజు కేవలం రాజ్యాధిపతియే కాదు ప్రజాహిత దక్షత కలిగిన రాజు. ఇది అతని రాజ్య పరిపాలన ద్వారా స్పష్టమవుతుంది.



## అభ్యాసం

**1. గుర్తించండి చూద్దాం.**

(1) ఎనిమిది శాఖల మండలి -

(2) బహిర్జీ నాయిక్ ఈ వ్యవస్థకు ప్రముఖుడు -

(3) మహారాజు మాలవణ్ సమీపంలో నిర్మించిన జలదుర్గం -

(4) కోటపై యుద్ధ సామాగ్రి వ్యవస్థను చూచువాడు -

**2. మీ మాటలలో రాయండి.**

(1) శివాజీ మహారాజు యొక్క వ్యవసాయ సంబంధ ధోరణి.


(2) శివాజీ మహారాజు ఒక ప్రజాహిత దక్షతగల రాజు.

**3. ఎందుకో చెప్పండి.**

(1) శివాజీ మహారాజు అష్ట ప్రధానుల మండలి స్థాపించాడు.

(2) శివాజీ మహారాజు నౌకాదళాన్ని ఏర్పాటు చేశాడు.

**4. ప్రవాహ పట్టికను పూర్తి చేయండి.**




**ఉపక్రమం**

(1) మీ పరిసరాలలో ఉన్న భారతీయ సైనికదళంలో పని చేసిన వ్యక్తితో ముఖాముఖి సంభాషణ చేయండి.

(2) మీ గ్రామంలోని వ్యాపారం కేంద్రాన్ని సందర్శించి పరిసరాలలో తయారయ్యే వస్తువులు మరియు విదేశాల నుండి అమ్మకానికి వచ్చిన వస్తువుల పట్టిక తయారు చేయండి.



సింధుదుర్గ్ కోట

# 8. ఆదర్శ పరిపాలకుడు

స్వరాజ్య స్థాపనకు పూర్వం మహారాష్ట్రపై ఆదిల్‌శాహీ, సిద్దీ, పోర్చుగీసు మరియు మొఘలుల అధికారం ఉండేది. ఈ రాజ్యాలకు వ్యతిరేకంగా శివాజీ మహారాజు పోరాటం చేశాడు. అతడు అన్ని రకాల ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నాడు. అతడు స్వతంత్ర మరియు సార్వభౌమ స్వరాజ్యాన్ని స్థాపించాడు. ఈ స్వరాజ్యం యొక్క పరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేశాడు. స్వరాజాన్ని సురాజ్యం చేశాడు. మహారాజు తన సామర్థ్యంతో నూతన సృష్టినే నిర్మించాడు. స్వరాజ్య స్థాపనకోసం పోరాటం చేస్తున్నప్పుడు మహారాజు స్వయంగా అనేక పెద్ద ఆపదలను ఎదుర్కొన్నాడు. అఫ్జల్‌ఖాన్‌ను కలుసుకొనే సంఘటన, పన్హాళా ముట్టడి, శాయిస్తాఖాన్‌పై దాడి, ఆగ్రా నుండి తప్పించుకొనుట ఈ సంఘటనలన్ని చాలా బాధ్యతాయుతమైనవి. అతడు ఈ సంఘటనలన్నింటిని విజయవంతంగా ఎదుర్కొన్నాడు. వాటన్నింటి నుండి సురక్షితంగా బయటపడ్డాడు.



**ఆలోచించండి.**

ప్రాణానికి ప్రాణం ఇచ్చే అనుచరులు ఉండడం వలన శివాజీ మహారాజు స్వరాజ్య స్థాపన చేయగలిగాడు.

మిత్రత్వపు ప్రాముఖ్యతను తెలిపే వివిధ భాషలలోని సామెతలు, జాతీయాలను వెదకండి. ఉదా: A friend in need is a friend indeed.

**సంఘటిత చాతుర్యం:** స్వరాజ్యకార్యం కొరకు మహారాజు తన చుట్టుప్రక్కల ఉన్న ప్రజలను ప్రోత్సహించాడు. అతని వద్ద విలక్షణమైన సంఘటితపరచే చాతుర్యం ఉండెను. ఆ చాతుర్య బలం ఆధారంగా అతడు తన చుట్టు శూరులు మరియు ప్రాణానికి ప్రాణమిచ్చే ప్రజలను సేకరించాడు. స్వరాజ్య కార్యంలో అతని ఈ అనుచరులందరు తమ ప్రాణాలను లెక్కించక తమ కర్తవ్యాన్ని నిర్వహించారు. అఫ్జల్‌ఖాన్‌ను కలుసుకొనే సంఘటనలో అతి ప్రమాదకర క్షణంలో బడా సయ్యద్‌ను సంహరించిన జివామహాలా, పన్హాళాగడ్ ముట్టడి నుండి బయట పడుతున్నపుడు శివాజీ మహారాజు యొక్క పాత్ర పోషించిన శివా కాశిద్, మహారాజ విశాలగడ్ వైపు వెళుతున్న సమయంలోఅతనిని వెంబడించిన శత్రువుల మార్గాన్ని నిలిపి వేసిన బాజీ ప్రభు దేశ్‌పాండే, పురందర్ కోట పోరాటాన్ని సాగించిన మురార్‌బాజీ దేశ్‌పాండే, సింహగడ్‌ను జయించుటకు వీరస్వర్గం పొందిన తానాజీ మాలుసరే, ఆగ్రా నుండి మహారాజు తప్పించుకొను సమయంలో గొప్ప ప్రమాదాన్ని నెత్తిన వేసుకొన్న హిరోజీ ఫర్జంద్ మరియు మదారీ మెహెతర్ ఇలా అనేక ఉదాహరణలు స్వరాజ్య నిర్మాణ కార్యంలో కనిపిస్తాయి. మహారాజు తన అనుచరుల పట్ల శ్రద్ధ తీసుకొనేవాడు. ఉదాహరణకు: స్వరాజ్య స్థాపన కార్యంలో కాన్హోజీ జేధే అతని వెంట ప్రారంభం నుండి ఉండెను. తగ్గుతున్న వయసులో అతడు అనారోగ్యం పాలయ్యాడు. ఆ సమయంలో అతనికి '(చికిత్సకై) ఔషధోపచారానికై ఎటువంటి అజాగ్రత్త చేయకూడదు' అని మహారాజు తెలిపాడు.

**ప్రజలపై శ్రద్ధ :** స్వరాజ్య స్థాపన కార్యంలో మహారాజు శత్రువులతో పోరాటం కొనసాగిస్తున్నాడు. శత్రువుల దండయాత్రల వలన ప్రజలు బాధలు అనుభవించు చుండేవారు. ఆ సమయంలో ప్రజలపై అత్యధిక శ్రద్ధ తీసుకొనే ప్రయత్నం మహారాజు చేస్తుండేవాడు. శాయిస్తాఖాన్ దండయాత్ర సమయంలో మహారాజు రోహిడ్ లోయకు చెందిన దేశ్‌ముఖ్‌కు ప్రజలకు సంబంధించిన తన కర్తవ్యాన్ని నెరవేర్చమని హెచ్చరించాడు. అతడు ఆ దేశ్‌ముఖ్‌ను గ్రామగ్రామం తిరిగి కనుమ కింద సురక్షిత ప్రాంతం ఉన్న చోటుకు ప్రజలను తోడ్కొని వెళ్ళమని చెప్పాడు. ఈ పనికై 'ఒక క్షణం కూడా ఆలస్యం చేయకూడదు' అని అతనికి తెలిపాడు. తరువాత మహారాజు అతనికి కింది విధంగా కఠోర హెచ్చరిక చేశాడు. 'ఒకవేళ ప్రజలపై ఇలా శ్రద్ధ తీసుకోనట్లయితే మొఘలు సైన్యం వస్తుంది, ప్రజలను బంధిస్తుంది. ఆ పాపం నీకు చుట్టుకుంటుంది.' తన సైనికుల ద్వారా ప్రజలకు బాధ కలుగ కూడదని మహారాజు ఇటువంటి శ్రద్ధ తీసుకొనేవాడు.

**సైనిక ధోరణి :** మహారాజు యొక్క సైనిక క్రమశిక్షణ కఠినంగా ఉండెను. సైనికులకు ఎప్పటికప్పుడు వేతనం ఇవ్వబడాలి అను అంశంపై దృష్టి ఉండెను. అతడు సైనికులకు వేతనం నగదు రూపంలో అందించే ఏర్పాటు

చేశాడు. మధ్యయుగ భారతదేశంలో అక్కడక్కడి రాజ్యాలలో మరియు ఇతరత్రా సైనికులకు నగదు వేతనం కాకుండా జాగీరు ఇచ్చే పద్ధతి ఉండెను. మహారాజు ఈ పద్ధతిని రద్దు చేశాడు. అతని సైన్యం శత్రు ప్రాంతంలో దాడి చేసినపుడు సైనికులకు ఏది లభించినను అది అంతా ప్రభుత్వమునకు అప్పగించవలెనని సైన్యంను హెచ్చరించాడు. దాడిలో పరాక్రమం చూపిన సైనికులకు సన్మానం చేయబడేది. పోరాటంలో మరణించిన సైనికుల కుటుంబ సభ్యుల ఉదర నిర్వాహము గురించి శ్రద్ధ తీసుకొనేవాడు. గాయపడిన సైనికుల గురించి కూడా శ్రద్ధ తీసుకొనేవాడు. యుద్ధంలో శరణాగతి పొందిన లేక బంధింపబడిన శత్రు సైనికులతో మంచిగా ప్రవర్తించేవాడు.



**మీకు తెలుసా?**

విత్తనాలు విత్తుట - నీటి సరఫరా - పంట పండు కాలంలో యుద్ధం ప్రారంభమైనచో రైతుల దుఃఖానికి హద్దులుండవు. సైన్యం యొక్క కదలికలు విత్తనాలను విత్తు పనికి అడ్డం వచ్చుటయేగాక పండిన పంటను కూడా సైనికులు కొన్నిసార్లు కోసుకొని వెళ్లారు లేక నష్ట పరుస్తారు. రైతుల ఇండ్లను దోచుకొంటారు. తమ సైనికులను అటువంటి పనులకు విముఖంగా ఉంచాలనే ఆదేశం మహారాజు అధికారులకు ఇచ్చాడు. ఈ సందర్భంలో క్రీ.శ. 1674లో ఛత్రపతి శివాజీ మహారాజు తన సైనిక అధికారులను ఉద్దేశించి రాసిన పత్రం (లేఖ) చాల విలువైనది. మహారాజు సైన్యం యొక్క క్రమశిక్షణ గురించి ఎంత సూక్ష్మంగా ఆలోచించేవాడో దీని ద్వారా ఊహించ వచ్చును.

''विलातीस तसवीस देऊ लागाल; ऐशास, लोका जाती, कोण्ही कुणब्याचे दाने आणील, कोण्ही भाकर, कोण्ही गवत, कोण्ही फाटे, कोण्ही भाजी, कोण्ही पाले. ऐसें करू लागलेत म्हणजे जी कुणबी घर धरून जीव मात्र घेऊन राहिले आहेत तेही जाऊ लागतील. कितेक उपाशी मराया लागतील. म्हणजे त्याला ऐसे होईल की, मोगल मुलकांत आले त्याहूनही अधिक तुम्ही ! ऐसा तळतळाट होईल.''

**సహనశీల ప్రవర్తన :** మహారాజు పోరాడవలసి వచ్చిన రాజ్యాలలో ఆదిల్‌శాహీ, మొఘల్ మరియు సిద్దీ ఈ రాజ్యాలు ఇస్లాం మతానికి చెందినవి. అయినను వారితో పోరాటం చేస్తున్నప్పుడు మహారాజు స్వరాజ్యంలోని ముస్లింలను తన ప్రజలుగానే భావించాడు. అఫ్జల్‌ఖాన్‌ను కలుసుకొనే సమయంలో మహారాజు యొక్క సైన్యంలో సిద్దీ ఇబ్రహీం అనునతడు విశ్వాసపాత్రుడైన సేవకుడుగా ఉండెను. సిద్దీ హిలాల్ అనువాడు మహారాజు యొక్క సైన్యంలోని సర్దారుగా ఉండెను. స్వరాజ్యం యొక్క నౌకాదళంలో దౌలత్‌ఖాన్ అనునతడు ముఖ్యమైన అధికారిగా ఉండెను.

మహారాజు యొక్క మతధోరణి సహనశీలత కలది. శత్రువుల నుండి ఏదేని ప్రాంతాన్ని జయించినప్పుడు అక్కడి ముస్లిం ధార్మిక స్థలాలకు మొదటి నుండి అందుతున్న సౌకర్యాలు అతడు యథాతథంగా కొనసాగించాడు. అతని సహనశీల మతధోరణి గురించి సమకాలీన చరిత్రకారుడు ఖాఫిఖాన్ ఇలా రాశాడు, 'శివాజీ తన సైనికుల కొరకు ఎంతటి కఠోర నియమాలు విధించాడంటే దండయాత్ర జరుపుతున్న సమయంలో మసీదులను ముట్టకూడదు. కురాన్ యొక్క ఏదేని పుస్తకం చేతబడిన దాని యెడల పూజ్యభావం చూపించి దానిని ముసల్మాన్ వ్యక్తికి స్వాధీనం చేయాలి.

**స్వాతంత్ర్యం యొక్క ప్రేరణ :** శివాజీ మహారాజు యొక్క స్వరాజ్య స్థాపన ప్రయత్నాలకు ఒక ప్రత్యేక విలువ ఉన్నది. ఆ విలువ స్వాతంత్ర్యమునకు సంబంధించినది. ఇతర ఏ రాజ్యాధికారాన్ని ఒప్పుకోక తమ స్వతంత్ర మరియు సార్వభౌమ అస్తిత్వాన్ని నిలిపియుంచడం దీని ఉద్దేశం. పరాయి మరియు అన్యాయ రాజ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నపుడు మహారాజు ఇతరులకు కూడ స్వాతంత్ర్య ప్రేరణ ఇచ్చాడు. మొఘలుల సేవలో ఉన్న ఛత్రసాల్ మహారాజును కలిసినప్పుడు అతడు అతనికి బుందేల్‌ఖండ్‌లో స్వతంత్ర రాజ్యం ఏర్పాటు చేయుటకు ప్రేరణనిచ్చాడు.

**మహారాజు కార్యాల గొప్పతనం:** మహారాజు అనేక శత్రువులతో పోరాడుతూ స్వరాజ్య స్థాపన చేశాడు. ఈ కృత్యమే అతని శక కర్తృత్వాన్ని నిరూపిస్తుంది. అయినను ఆ కృత్యం కాకుండా అతని వ్యక్తిత్వంలో అనేక ఇతర సద్గుణాల సముచ్ఛయం కనిపిస్తుంది.

మహారాజు చాలా తెలివైనవాడు. అతడు అనేక విద్యలను నేర్చుకొన్నాడు. అతనికి అనేక భాషలు మరియు లిపులు తెలిసియుండెను. తల్లిదండ్రులు చేసిన స్వరాజ్య స్థాపన మరియు నైతికతకు సంబంధించిన సద్గుణాలు అతని అంతరంగంలో లోతుగా నాటుకు పోయాయి. అతని వ్యక్తిత్వంలో స్వభావం మరియు సామర్థ్యం, శీలం మరియు పరాక్రమం వీటి సమన్వయం జరిగియుండెను. అతనిలో నేతృత్వ, వ్యవస్థాపన, దూరదర్శిత్వము, రాజకీయ వ్యవహారజ్ఞానం (రాజనీతిజ్ఞత), రాజ్య మరియు సైనిక పరిపాలనకు సంబంధించిన ప్రభావవంతమైన ధోరణి, సత్యం మరియు న్యాయం వీటిపై నిష్ఠ, అందరిని సమానంగా చూచుకొనే ప్రవృత్తి, భవిష్యత్కార్యాచరణకు సంబంధించిన ప్రణాళిక సిద్ధంగా ఉంచుకొనే ఏర్పాటు, యోచించిన ప్రణాళికను నెరవేర్చే కౌశల్యం, ఆపద సమయంలో క్రుంగిపోకుండా తేరుకొనే మనోనిబ్బరం, ఎల్లప్పుడు జాగరూకతతో ఉండే సావధాన స్థితి మొదలగు రకాల అసంఖ్యాక గుణాలు ఉండెను.

స్త్రీల విషయంలో అనుచితంగా ప్రవర్తించిన వారిని కఠినంగా శిక్షించేవాడు. ప్రజలలోని రైతులు, చేతివృత్తుల వారు, సైనికులు, వ్యాపారులు ఇలా అన్ని వర్గాల వారిపై శ్రద్ధ చూపేవాడు. స్వంత మతంలోని వ్యక్తుల మాదిరిగా పరమతంలోని వ్యక్తుల విషయంలో భేదభావం చూపకుండా ఆదరించేవాడు. పరాయి మతంలో చేరిన వ్యక్తులను తిరిగి సొంతమతంలోనికి తీసుకోవడంలో ఆనాడు వ్యతిరేకత ఉండెను. ఆ కాలంలో అతడు అటువంటి వ్యక్తులను తిరిగి సొంత మతంలోనికి చేర్చుకొన్నాడు. సందర్భం వచ్చినపుడు వారితో బంధుత్వం కలుపుకొన్నాడు. సముద్ర ప్రయాణానికి మత కారణాల వలన వ్యతిరేకత ఉండెను. ఆ కాలంలో అతడు సింధుదుర్గ్ వంటి జల దుర్గాలను నిర్మించి, నౌకాదళాన్ని ఏర్పాటు చేశాడు. సముద్రం పై నుండి జరిగే బయటి వారి ఆక్రమణలలో జోక్యం చేసుకొని దానిపై తగిన తరుణోపాయాన్ని తయారుగా ఉంచుకొన్నాడని దాని యొక్క భావం. అతడు పట్టాభిషేకం ద్వారా స్వరాజ్యం యొక్క అధికారిక రాజు అయ్యాడు. అతడు ఒక పట్టాభిషేకం తరువాత మతం దృష్ట్యా మరోరకంగా రెండవ పట్టాభిషేకం చేసుకొన్నాడు. అతని ఈ పనులన్ని ధార్మిక క్షేత్రంలో విప్లవాత్మకతను చూపేవిగా ఉన్నాయి.

స్వరాజ్యంపై ప్రాణాంతక ఇబ్బందులు వచ్చినప్పుడు అనుచరులకు బదులుగా లేక వారితో బాటు అతడు స్వయంగా ఆ సంకటాలకు ఎదురు నిలిచాడు. అందువలన ఆయన సహచరులు స్వరాజ్యం కోసం ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉండేవారు. అంటే కేవలం ఇలాంటి పెద్ద ఇబ్బందులకు ధైర్యంగా, నిర్భయంగా ఎదురేగడం మాత్రమే అతని గొప్పతనం కాదు. అతనికి తన స్వరాజ్యానికి నైతికత మరియు శ్రేష్ఠత యొక్క ఆధారాన్ని ఇవ్వవలసి ఉండెను. అందువలననే ముఖ్యమైన విషయాల మాదిరిగా చిన్న చిన్న విషయాల గురించి కూడా అతడు దానికి సంబంధించిన వారికి సరియైన ఆదేశాలను ఇచ్చాడని తెలుస్తుంది. సైనికులు రైతుల పొలాల నుండి కూరగాయలను కూడా బలవంతంగా తీసుకోకూడదనే అర్థం వచ్చే ఆదేశం ఆ దృష్టికోణంలో ఆదర్శవంతమైనది. అతడు చెట్లను నరికి వేయుటపై విధించిన ఆంక్షలు కూడ ముఖ్యమైనవి.



**ఆలోచించండి.**

వృక్ష సంవర్ధనం చేయడం ఎందుకు అవసరం?

కోటలపై గల చెత్తను ఇక్కడ, అక్కడ, ఎక్కడ కూడా పడవేయక పెరట్లో కాల్చి దాని బూడిదతో కాయగూరలు పండించవలెనని ఆయన ఆదేశం ఇచ్చాడు. అతడు స్వరాజ్యాన్ని నిర్మిస్తున్నపుడు చిన్న చిన్న అంశాలపై ఎంత శ్రద్ధ చూపేవాడో దీనిని బట్టి స్పష్టమౌతుంది. అతడు యోధుడే కాదు అతడు ఒక నూతన, స్వతంత్ర, నీతి వంతమైన మరియు సుసంస్కృతి కలిగిన సమాజాన్ని నిర్మించిన శిల్పకారుడు. అతని గొప్పతనం సర్వతోముఖమైనది.



**చెప్పుకోండి చూద్దాం**

- మీ పరిసరాలలోని చెత్త యొక్క నిర్వహణ ఏ విధంగా జరుగుతుంది?
- చెత్త యొక్క నిర్వహణ చేయు యంత్రాంగం పేర్లను చెప్పండి.

మన జాతీయ ఉద్యమంలో మహారాజు ఒక గొప్ప స్ఫూర్తిప్రదాత అయ్యాడు. మహాత్మా జ్యోతిరావు ఫులె సమానత్వ సంఘర్షణలో పొవాడాల (జానపదగేయ గాథల) ద్వారా మహారాజు గురించి వివరించాడు.

### మీకు తెలుసా?

మహాత్మా జ్యోతిరావు ఫులే గారు ఛత్రపతి శివాజీ మహారాజుపై 1869 సంవత్సరంలో ఒక పోవాడా (జానపద గేయ గాథ) రచించాడు. దానిలోని కొంత భాగం ఇక్కడ ఇవ్వబడింది.

।। शिवाचा गजर जयनामाचा झेंडा रोविला ।।
।। क्षेत्र्याचा मेळा मावळ्याचा शिकार खेळला ।।
माते पायीं ठेवी डोई गर्व नाहीं काडीचा ।
आशिर्वाद घेई आईचा ।।
आलाबला घेई आवडता होतो जिजीचा ।
पवाडा गातो शिवाजीचा ।।
कुळवाडी – भूषण पवाडा गातो भोसल्याचा ।
छत्रपती शिवाजीचा ।।३।।

లోకమాన్య తిలక్ శివజయంతి ఉత్సవ మాధ్యమం ద్వారా జాతీయ జాగృతి సాధించాడు. శివాజీ చరిత్ర మహత్త్వము తెలిపే పుస్తకాన్ని లాలా లజపతిరాయ్ రాశాడు. తమిళ కావ్యపితా మహుడు సుబ్రహ్మణ్యమ్ భారతి శివాజీ మహారాజు తన సహచరులను ఉద్దేశించి మాట్లాడుతున్నట్లుగా ఒక సంఘటనను ఊహించి కావ్యాన్ని రచించాడు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగోర్ మహారాజుపై ఒక దీర్ఘ కవిత రాశాడు. మహారాజు యొక్క రాజ్యసాధన ప్రయత్నాలను అతడు 'గొప్ప ధ్యేయ సాధనా ప్రయత్నం' అని చూస్తాడు. సర్ జదునాథ్ సర్కార్ 'శివాజీ అండ్ హిస్ టైమ్స్' అను గ్రంథంలో ఛత్రపతి శివాజీ మహారాజు యొక్క కార్యాన్ని గౌరవించాడు. పండిత జవహర్‌లాల్ నెహ్రూ మహారాజు గురించి ఇలా అన్నాడు 'మహారాజు కేవలం మహారాష్ట్రవాడే కాదు, అతడు మనదేశం మొత్తానికి చెందిన వాడు... అతనికి మనదేశంపై చాలా ప్రేమ ఉండెను. మానవ సద్గుణాలకు అతడు ప్రత్యక్ష ప్రతీక.' (నిలువెత్తు సాక్ష్యం) భారత దేశంలోని అన్ని భాషలలో మహారాజు యొక్క ప్రేరణ మరియు ఆదర్శాలను తెలిపే సాహిత్యం తయారైనది.

శివాజీ మహారాజు యొక్క ఈ స్వరాజ్య కార్యం మరియు స్వరాజ్యాన్ని సురాజ్యంగా రూపాంతరం చెందింపజేసిన ప్రేరణ భావితరాలకు కూడా ఆదర్శంగా ఉంటుంది. శివాజీ మహారాజు ఒక గొప్ప జాతి పురుషుడు.

HGLKVS

## అభ్యాసం

**1. పాఠంలో వెదకి రాయండి.**

(1) శివాజీ మహారాజు జీవితంలోని అతి ప్రమాదకర సంఘటనలు ఏవి?

(2) శివాజీ మహారాజు ఆగ్రా నుండి తప్పించుకొనే సమయంలో ప్రాణాలకు తెగించిన వారు ఎవరు?

(3) రోహిడ్ లోయలోని దేశ్‌ముఖ్‌ను శివాజీ మహారాజు ఏమని హెచ్చరించాడు?

(4) శివాజీ మహారాజు యొక్క ఏ ప్రేరణ భావితరాలకు ఆదర్శంగా ఉంటుంది?

**2. రాయండి.**

(1) ప్రజలకు నష్టం కలుగకూడదని శివాజీ మహారాజు సైనికులకు ఏమని హెచ్చరిక చేశాడు?

(2) శివాజీ మహారాజు మతధోరణి సహన శీలమైనదని ఏ అంశం ద్వారా కనిపిస్తుంది?

(3) శివాజీ మహారాజు యొక్క సైన్య సంబంధ ధోరణిని స్పష్టం చేయండి.

**3. ఒకే పదంలో రాయండి.**

(1) స్వరాజ్యం యొక్క నౌకాదళంలోని ముఖ్యమైన అధికారి -

(2) శివాజీ మహారాజుపై కావ్యం రచించిన తమిళ కవి -

(3) బుందేల్ ఖండ్‌లో స్వతంత్ర రాజ్యం నిర్మించిన వాడు -

(4) పోవాడాల ద్వారా శివాజీ మహారాజు యొక్క గొప్పతనాన్ని చెప్పినవాడు.

**ఉపక్రమం:**

(1) ఆపద సమయంలో మిత్రునికి చేసిన సహాయాన్ని తరగతిలో కథనం చేయండి.

(2) వ్యక్తి పేరున ఉన్న గ్రామాలు, పట్టణాల పట్టిక తయారు చేయండి.

# 9. మరాఠీయుల స్వాతంత్ర్య పోరాటం

ఛత్రపతి శివాజీ మహారాజు మరణానంతరం మరాఠీయులు ఛత్రపతి సంబాజీ మహారాజు, ఛత్రపతి రాజారాం మహారాజు మరియు మహారాణి తారాబాయిల నాయకత్వంలో స్వరాజ్య సంరక్షణ కొరకు మొఘలులతో తీవ్ర పోరాటం సలిపారు. ఈ ఇరవైఏడు సంవత్సరాల సుదీర్ఘ పోరాటాన్ని 'మరాఠీయుల స్వాతంత్ర్య పోరాటం' అంటారు. క్రీ.శ. 1682లో స్వయంగా ఔరంగజేబు చక్రవర్తియే దక్షిణానికి వచ్చి చేరాడు. అయినను మొఘలులతో జరిగిన ఈ పోరాటంలో చాల సమస్యలను అధిగమించి మరాఠీయులు విజయాన్ని పొందారు. ఈ స్వాతంత్ర్య పోరాటం అనగా భారతదేశ చరిత్రలోని ఒక రోమాంచిత మరియు తేజోవంతమైన కాలఖండం. మనం ఈ పాఠంలో ఈ స్వాతంత్ర్య పోరాటం యొక్క అధ్యయనం చేయబోవుచున్నాం.

ఇక్కడ 'మరాఠా' అను పదం 'మరాఠీ భాష మాట్లాడేవారు' లేక 'మహారాష్ట్రీయ ప్రజలు' అని అర్థం.



**చేసి చూడండి**

నేను సంభాజీరాజును మాట్లాడుతున్నాను.........
భూమికను అభినయించండి



సంభాజీ మహారాజు

**ఛత్రపతి సంభాజీ మహారాజు :** సంభాజీ మహారాజు ఛత్రపతి శివాజీ మహారాజు యొక్క జ్యేష్ఠ పుత్రుడు. అతని జననం 1657 మే 14 రోజున పురందర్ కోటలో జరిగింది. శివాజీ మహారాజు తరువాత అతడు ఛత్రపతి అయ్యాడు. ఆ సమయంలో మరాఠీయుల పోరాటం మొఘలులతో కొనసాగుతుండెను. అటువంటి పరిస్థితిలో ఔరంగజేబు చక్రవర్తి కుమారుడు శాహజాదా అక్బర్ తండ్రికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడు. ఈ తిరుగుబాటును చక్రవర్తి అణచి వేశాడు. అప్పుడు అక్బర్ దక్షిణంలోని సంభాజీ మహారాజు వద్ద శరణు జొచ్చాడు. అతనిని శిక్షించడానికి చక్రవర్తి స్వయంగా క్రీ.శ. 1682లో దక్షిణానికి వచ్చాడు. అతనితోబాటు అపార సైన్యం మరియు ప్రభావవంతమైన ఫిరంగులు ఉండెను. అతడు జంజిరా యొక్క సిద్దీని మరాఠీయులకు వ్యతిరేకంగా దండయాత్రను చేపట్టమని చెప్పాడు. పోర్చుగీసు వారిని కూడా తనవైపు తిప్పుకొన్నాడు. అందువలన సంభాజీ మహారాజుకు ఒకే సమయంలో అనేక శత్రువులను ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది.

సంభాజీ మహారాజు పరిపాలనా కాలం శివాజీ మహారాజు తరువాత జరిగిన మరాఠీయుల స్వాతంత్ర్య పోరాటం యొక్క మొదటి పర్వం అవుతుంది. మహారాజు తన పరిపాలనా కాలంలోనే అతనికి రాజ్య పరిపాలన మరియు సైనిక ఆక్రమణలకు సంబంధించిన ఉత్తమ శిక్షణ నందించాడు. పదునాలుగు సంవత్సరాల ప్రాయం నుండి అతడు రాజ్య పరిపాలన మరియు సైన్యం యొక్క ఆధిపత్యం నందు శ్రద్ధ చూపించ సాగాడు. యువరాజుగా ఉన్నప్పుడే అతడు మొఘలుల మరియు ఆదిల్‌శాహ్ యొక్క అనేక ప్రాంతాలపై దండయాత్రలు చేశాడు. అతని యుద్ధ కౌశల్యం గురించి వర్ణిస్తూ ఆనాటి ఫ్రెంచ్ యాత్రికుడు అబే కరే ఇలా అంటాడు, ''ఈ యువరాజు చిన్నవాడైనను ధైర్యశాలి మరియు తన తండ్రి కీర్తికి తగినటువంటి శూర వీరుడు...''

సంభాజీ మహారాజు ఛత్రపతి అయిన తరువాత మొఘలులతో మరాఠీయుల పోరాటం చాలా తీవ్రమైనది. కాబూల్ నుండి కన్యాకుమారి వరకు మొఘలుల ఏకఛత్రాధిపత్యాన్ని అమలు పరచడం ఔరంగజేబు యొక్క ఉద్దేశం. తన ప్రచండమైన సైన్యం మరియు ఆర్థిక బలంతో

మరాఠీయుల రాజ్యాన్ని ముంచివేయాలని అతని కల. కాని సంభాజీ మహారాజు తన పరాక్రమంతో మరియు యుద్ధ కౌశల్యంతో అతని కలను మట్టిలో కలిపాడు. అతని సైన్య సమూహాలు అనేక మొఘలు ప్రాంతాలలో దాడులు చేస్తుండేవి. నాసిక్ దగ్గరి మరాఠీయుల రామ్‌సేజ్ కోటను చక్రవర్తి యొక్క సేనానులు దీర్ఘకాలం ప్రయత్నించి కూడా స్వాధీన పరచుకోలేక పోయారు. ఈ విధంగా సంభాజీ మహారాజు యొక్క పరాక్రమంతో ఔరంగజేబు అలసిపోయాడు. అందువలన ఒకసారి అత్యధిక కోపంతో అతడు తన తలపై ఉన్న పాగాను నేలపై కొట్టి ఇలా ప్రతిజ్ఞ చేశాడు ''ఈ సంభాజీని ఓడించేవరకు తలపాగా ధరించను.'' సంభాజీ మహారాజు ఔరంగజేబును అంతగా బలహీన పరిచాడు.



**మీకు తెలుసా ?**

మరాఠీయుల కోటలను జయిస్తే వారి రాజ్యం అంతమవుతుంది అనే ఆలోచనతో ప్రారంభంలో ఔరంగజేబు నాశిక్ సమీపంలోని రామ్‌సేజ్ కోటను ముట్టడించాడు. ఔరంగజేబు సైన్యం సంఖ్య అధికంగా ఉండెను. మరాఠీయుల సైన్యం సంఖ్య చాలా తక్కువగా ఉండెను. కాని వారు తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ ముట్టడి ఐదు సంవత్సరాలు కొనసాగింది. గుప్పెట నిండుగా లేని మరాఠా సైనికులు చూపిన ఈ పరాక్రమం అద్వితీయమైనది. మరాఠీయుల తీవ్ర ప్రతిఘటన వలన మరాఠీయులతో పోరాడడం కఠిన తరమైనదని ఔరంగజేబు తెలుసుకొన్నాడు.

**సిద్దీకి వ్యతిరేకంగా దండయాత్ర:** జంజిరా యొక్క సిద్ది మరాఠా రాజ్యానికి విపత్తు కలిగిస్తుండేవాడు. మరాఠా రాజ్యంపై దాడిచేసి అతడు ఆస్తులకు నిప్పంటించడం, దోపిడి మరియు దౌర్జన్యం చేసేవాడు. 'ఇంట్లో ఎలుక ఎలాగో, రాజ్యంలో సిద్ది అలాగ' అని అతని సభాసద్ వర్ణించాడు. సంభాజీ మహారాజు క్రీ.శ. 1682లో అతనికి వ్యతిరేకంగా దండయాత్ర ప్రారంభించాడు. అతని సైన్యం సిద్దీ స్వాధీనంలో ఉన్న దండారాజపురీ కోటను ముట్టడించింది మరియు జంజీరాపై కూడా ఫిరంగుల వర్షం కురిపించింది. కాని అదే సమయంలో మొఘలుల సైన్యం స్వరాజ్యంపై దండెత్తి వచ్చింది. అందువలన జంజీరా దండయాత్ర అర్థాంతరంగా వదలిపెట్టి సంభాజీ మహారాజు వెనుదిరగవలసి వచ్చింది.

**పోర్చుగీసు వారికి వ్యతిరేకంగా దండయాత్ర:** గోవాలోని పోర్చుగీసు వారు సంభాజీ మహారాజుకు వ్యతిరేకంగా మొఘలు చక్రవర్తితో చేతులు కలిపారు. అందువలన అతడు పోర్చుగీసు వారికి గుణపాఠం చెప్పాలని నిర్ణయించు కొన్నాడు. అతడు క్రీ.శ. 1683 లో పోర్చుగీసుల యొక్క రేవ్‌దండా ఓడరేవుపై దాడి చేశాడు. ప్రతిఫలంగా పోర్చుగీసువారు గోవా సరిహద్దులపై గల మరాఠీయుల ఫోండా కోటను ముట్టడించారు. మరాఠీయులు ముట్టడిని అణచివేచి గోవాపై దండయాత్ర చేశారు. ఈ యుద్ధంలో యెసాజీ కంక్ వీరోచితంగా పోరాడెను. అందులో పోర్చుగీసు గవర్నర్ గాయపడ్డాడు. కావున అతడు వెనుదిరగవలసి వచ్చింది. సంభాజీ మహారాజు అతనిని వెంబడించాడు. పోర్చుగీసు వారు పెద్ద సంకటంలో పడ్డారు. అదే సమయంలో మొఘలులు దక్షిణ కొంకణంపై దండయాత్ర చేశారనే వార్త సంభాజీ మహారాజుకు లభించింది. అందువలన చేతిలోపడ్డ గోవా విజయాన్ని వదలి మొఘలులను ప్రతిఘటించుటకు వెనుదిరగవలసి వచ్చింది.

**ఆదిల్‌శాహీ మరియు కుతుబ్‌శాహీ అంతం:** ఔరంగజేబుకు మరాఠీయులకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో విజయం కలగటం లేదు. అందువలన అతడు ఆ దండయాత్రను నిలిపి వేశాడు. ఆ తరువాత అతడు తన దండయాత్రను ఆదిల్‌శాహీ మరియు కుతుబ్‌శాహీల వైపు తిప్పాడు. ఔరంగజేబు ఆ రాజ్యాలను జయించాడు.

ఈ రెండు రాజ్యాల సంపద మరియు సైన్యం మొఘలుల చేతిలో పడడం వలన ఔరంగజేబు పరిస్థితి బలోపేతమైనది. ఆ తరువాత మరాఠీయులను ఓడించుటకు తన సర్వ శక్తులను కేంద్రీకరించాడు. వారి ప్రాంతంపై నాలుగు వైపుల నుండి దాడులు చేశాడు. మొఘలు సైన్యాన్ని ప్రతిఘటిస్తున్నపుడు మరాఠీయుల సేనాధిపతి హంబీర్‌రావు మొహితే చంపబడెను. అందువలన సంభాజీ మహారాజు వైపు సైన్యం బలహీనపడింది.

**సంభాజీ మహారాజు రాజ్య పరిపాలన :** సంభాజీ మహారాజు యుద్ధ హడావిడిలో తన రాజ్య పరిపాలనను నిర్లక్ష్యం చేయలేదు. అతడు శివాజీ కాలంలోని సమర్థవంతమైన

న్యాయ మరియు భూమిశిస్తు వ్యవస్థను కొనసాగించాడు. స్వరాజ్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన వారికి మరియు సామాన్య ప్రజలకు కష్టం కలిగించిన వతన్‌దార్లకు సంబంధించి కఠోర శాసనాలు చేశాడు. మహారాణి యేసుబాయికి రాజ్య పరిపాలన అధికారాన్ని ఇచ్చాడు. అతని యొక్క స్వంత రాజముద్రను చేయించి ఇచ్చాడు. శివాజీ యొక్క ప్రజాహిత ధోరణిని అతడు తన పరిపాలనా కాలంలో కొనసాగించాడు.

సంభాజీ మహారాజుకు సంస్కృత భాషతో బాటు అనేక భాషలు తెలుసు. అతడు గ్రంథరచన కూడా చేశాడు. రాజనీతికి సంబంధించిన ప్రాచీన భారతీయ గ్రంథాలను అవగతం చేసుకొని వాటి సారాన్ని 'బుధ భూషణ్' గ్రంథంలో రాశాడు.

**మీకు తెలుసా ?**

సంభాజీ మహారాజు 'బుధ భూషణం' అను గ్రంథాన్ని సంస్కృత భాషలో రాశాడు. అందులోని రెండవ అధ్యాయంలో రాజనీతి గురించి చర్చ చేయబడింది. అందులో రాజు యొక్క లక్షణాలు, ప్రధాని, రాజకుమారులు వారి విద్య మరియు పనులు, రాజు యొక్క సలహాదారు, కోట మరియు కోటపై సామాగ్రి, సైన్యం, రాజు యొక్క కర్తవ్యాలు, గూఢచార వ్యవస్థ మొదలగు విషయాల గురించి వివరింపబడింది.

**సంభాజీ మహారాజు మరణం :** ఔరంగజేబు సంభాజీ మహారాజును లొంగదిసుకొనుటకై శక్తివంచన లేకుండా ప్రయత్నించాడు. అతడు ముకర్రబ్‌ఖాన్‌ను కొల్హాపూర్ ప్రాంతలో నియమించాడు. మహారాజు కొంకణంలో సంగమేశ్వర్ వద్ద ఉన్నాడను వార్త ముకర్రబ్‌ఖాన్‌కు తెలిసింది. అప్పుడు అతడు దాడిచేసి సంభాజీ మహారాజును పట్టుకొన్నాడు. చక్రవర్తి ఎదుటికి తీసుకొని వచ్చిన పిదప అతని ఎదుట సంభాజీరాజు గంభీరంగా ప్రవర్తించాడు. తరువాత చక్రవర్తి ఆదేశంతో 1689 మార్చ్ 11 రోజున అత్యంత అమానుషంగా అతనిని చంపివేశారు. మరాఠీయులు ఈ ఛత్రపతి స్వాభిమానాన్ని విడవకుండా అత్యంత ధీరోదాత్తంగా మృత్యువుకు ఎదురేగాడు. అతని బలిదానం నుండి ప్రేరణ పొంది మరాఠీయులు మొఘలులకు వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేశారు.



ఛత్రపతి రాజారాం మహారాజు

**ఛత్రపతి రాజారాం మహారాజు :** ఛత్రపతి శివాజీ మహారాజు యొక్క రెండవ కుమారుడు రాజారాం మాహారాజు. అతడు 1670 ఫబ్రవరి 24 రోజున రాయగడ్‌లో జన్మించాడు. సంభాజీ మహారాజు మరణించిన తరువాత అతడు ఛత్రపతి అయ్యాడు. ఇప్పుడు మరాఠీయుల రాజ్యాన్ని జయించే స్వప్నం నెరవేరనుందని ఔరంగజేబుకు అనిపించ సాగింది. అందువలన అతడు రాయగడ్‌ను ముట్టడించుట కోసం ఝుల్ఫికార్‌ఖాన్‌ను పంపించాడు. ఆ సమయంలో రాజారాం మహారాజు మరియు అతని భార్య మహారాణి తారాబాయి, సంభాజీ మహారాజు యొక్క భార్య యేసుబాయి మరియు కుమారుడు శాహూ వీరందరు రాయగడ్‌లోనే ఉండిరి. వీరందరు ఒకే చోట ఉండటం ప్రమాదకరం. ఆ సమయంలో యేసుబాయి ఈ అభూతపూర్వ సంకటాన్ని ధైర్యంగా ఎదుర్కొన్నది. ఎట్టి పరిస్థితులలోనూ మొఘలులకు లొంగిపోకూడదని నిశ్చయించుకొని ఆమె రాయగడ్‌లో ముఖ్యమైన రాజకీయ నిర్ణయం తీసుకొన్నది. దాని ప్రకారం, రాజారాం మహారాజు రాయగడ్ ముట్టడి నుండి బయట పడవలెను మరియు అవసరమైతే దూరంగా ఉన్న జింజీకి వెళ్ళవలెనని నిర్ణయం జరిగింది. అటులనే మహారాణి యేసుబాయి తన నేతృత్వంలో రాయగడ్‌కై పోరాటం చేయవలెననే నిర్ణయం కూడా తీసుకోబడినది. యేసుబాయి తన కుమారుణ్ణి ఛత్రపతి పదవిపై కూర్చోబెట్టక రాజారాం మహారాజును ఛత్రపతిని చేయవలెనను నిర్ణయం తీసుకొన్నది. ఆమె యొక్క ఈ నిర్ణయం స్వరాజ్య ప్రేమ మరియు ఎనలేని నిస్వార్థతకు ఉదాహరణ. ఆమె తన యొక్క మరియు తన కుమారుని ప్రాణాలను లెక్క చేయక మరాఠీయుల ఛత్రాధిపత్యాన్ని సురక్షితంగా ఉంచింది.

**వెదకుదాం.**

భారతదేశ మానచిత్రపటంలో జింజీ చోటును వెదకండి.

**రాజారాం మహారాజు జింజీకి పయనం:** 1689 ఏప్రిల్ 5 రోజున రాజారాం మహారాజు కొంత మంది తన సహచరులతో రాయగడ్ ముట్టడి నుండి తప్పించుకొనెను. అతడు దక్షిణంలోని జింజీకి వెళ్ళుటకు నిర్ణయించుకొన్నాడు. జింజీ కోట అభేద్యమైనది. ఈ కోటను జయించడం మొఘలులకు సులభం కాదు. ప్రల్హాద్ నిరాజీ, ఖండో బల్లాళ్, రూపాజీ భోస్లే మొదలగు విశ్వాస పాత్రులను వెంట తీసుకొని రాజారాం మహారాజు జింజీని చేరుకొనెను.

**మరాఠీయుల కార్యకలాపాలు :** మొఘలుల సామర్థ్యం ముందు రాయగడ్ రక్షణకై సుదీర్ఘపోరాటం చేయడం కఠినమైనది. మొఘలులు 1689 నవంబరులో రాయగడ్‌ను స్వాధీనం చేసుకొన్నారు. మహారాణి యేసుబాయి మరియు శాహూలను బంధీ చేశారు. జింజీకి వెళుతున్నపుడు రాజారాం మహారాజు మొఘలులకు వ్యతిరేకంగా పోరాడే బాధ్యతను రామచంద్ర పంత్ అమాత్య, శంకరాజీ నారాయణ్ సచివ్, సంతాజీ ఘోర్పడే మరియు ధనాజీ జాధవ్‌లకు అప్పగించాడు.

మరాఠీయుల దృష్టికోణంలో పరిస్థితి క్లిష్టంగా ఉండెను. ఔరంగజేబు మరాఠా సర్దారులకు వతన్లు మరియు జాగీర్లు ఇచ్చి తన వైపుకు తిప్పుకొన్నాడు. అతనిని అడ్డగించుటకు రాజారాం మహారాజు అదే తంత్రాన్ని ఉపయోగించాడు. మొఘలు ప్రాంతం జయించినచో ఆ ప్రాంతం యొక్క జాగీరు ఆ ప్రాంతాన్ని జయించిన సర్దారుకు ఇవ్వబడుననే వాగ్దానం ఇవ్వబడింది. ఛత్రపతి యొక్క ఈ వాగ్దానం తరువాత అనేక మంది పరాక్రమవంతులైన సర్దారులు ముందుకు వచ్చారు. వారు మొఘల్ ప్రాంతంపై వెంటనే ఆక్రమణ మొదలు పెట్టారు. మొఘలు సేనానులను ఓడించారు. ఈ ప్రయత్నంలో సంతాజీ మరియు ధనాజీ ముందుండిరి. వారు అకస్మాత్తుగా జరిపిన దాడులు మరియు గొరిల్లా యుద్ధ నీతి వలన మొఘలులకు తమ ప్రచండమైన వనరులను మరియు బరువైన ఫిరంగులను ఉపయోగించడం కఠినమైనది. చాలా కోటలు, ప్రాంతాలు మరియు ఖజానాలు స్వాధీనంలో లేనప్పటికి మరాఠీయులు వారిని ముప్పు తిప్పలు బెట్టారు. ఒకసారి సంతాజీ ఘోర్పడే మరియు విఠోజీ చవ్హాన్‌లు చక్రవర్తి సైనిక స్థావరంపై ఆకస్మిక దాడి జరిపి అతని గుడారంపై గల బంగారు కొప్పరము కోసుకొని వచ్చారు.



**మీకు తెలుసా?**

ధనాజీ అంటె మొఘలుల సైనికులకు ఎంత భయమంటే, గుర్రం నీరు త్రాగడం ఆపితే దానిని ఇలా అనేవారు. ఏరా నీకు నీటిలో ధనాజీ కనిపిస్తున్నాడా?

**జింజీ ముట్టడి:** రాయగడ్‌ను స్వాధీన పరచుకొన్న తర్వాత చక్రవర్తి ఝుల్ఫికార్‌ఖాన్‌ను దక్షిణంలోని జింజీ ఆక్రమణకు పంపించాడు. అతడు జింజీని ముట్టడించాడు. మరాఠీయులు జింజీ కోట రక్షించుకొనుటకు సుమారు ఎనిమిది సంవత్సరాలు భీకరంగా పోరాడారు. సంతాజీ మరియు ధనాజీ ముట్టడించిన మొఘలు సైనికులపై బయటినుండి భీషణ దాడులు చేశారు. చివరికి రాజారాం మహారాజు ముట్టడి నుండి బయటపడి మహారాష్ట్రకు తిరిగి వచ్చాడు. ఆ తరువాత ఝుల్ఫికార్‌ఖాన్ జింజీ కోటను జయించాడు.

రాజారాం మహారాజు తిరిగి రావడం వలన మరాఠీయుల బలం గొప్పగా పెరిగిపోయింది. అతడు మొఘలుల స్వాధీనంలోని ఖాన్‌దేశ్, వర్హాడ్, బాగ్‌లాన్ ప్రాంతాలపై దాడులు చేశాడు. రాజారాం మహారాజు తన విచక్షణా జ్ఞానం మరియు రాజనీతిజ్ఞతతో సంతాజీ మరియు ధనాజీ వంటి వందల మరాఠా వీరులను తయారుచేసెను. వారిలో స్వరాజ్య సంరక్షణకు ప్రేరణ కలుగజేసి విలువైన కార్యాలను నెరవేర్చాడు. కాని ఇవన్నీ జరుగుతుండగా 1700 మార్చ్ 2 తేదీన రాజారాం మహారాజు అనారోగ్యం వలన సింహగడ్‌పై మరణించాడు.

రాజారాం మహారాజు ఆలోచనాపరుడు మరియు (కలుపుగోలుతనం) సౌహార్దము కలవాడు. మరాఠా రాజ్యంలోని కర్తవ్యపరాయణులైన మనుషులందరిని అతడు ఒకచోటికి తెచ్చాడు. వారిని ఐక్యపరచాడు మరియు వారిలో చైతన్యాన్ని కలుగజేశాడు. సంభాజీ మహారాజు మరణానంతరం 11 సంవత్సరాలు ఔరంగజేబును గొప్ప ధైర్యసాహసాలతో మరియు పట్టుదలతో ఎదుర్కొన్నాడు. అత్యంత కఠిన సమయంలో కూడా స్వరాజ్య సంరక్షణ రాజారాం మహారాజు యొక్క గొప్ప కార్యం.

రియాసత్‌కారుడు గో.స. సర్‌దేసాయి ఛత్రపతి రాజారాం యొక్క వర్ణన చేస్తున్నపుడు 'స్థిరబుద్ధి' అను విశేషణాన్ని

ఉపయోగించాడు. అతడు పేర్కొన్న విషయం పూర్తిగా యథార్థం అని అనిపిస్తుంది.

**చేసి చూడండి**

మీ పరిసరాలలోని వివిధ రంగాలలో పేర్కొనదగిన కార్యం చేసిన మహిళల ముఖాముఖి తీసుకోండి.

**మహారాణి తారాబాయి :** ఛత్రపతి రాజారాం మహారాజు మరణానంతరం ఔరంగజేబు మనం పోరాటంలో విజయం సాధించామని భావించాడు. పరిస్థితి మాత్రం విరుద్ధంగా ఉండెను. ఔరంగజేబ్ పోరు తరువాత పోరు జయించుచుండెను. కాని అతనికి యుద్ధం మాత్రం గెలువ శక్యం కాలేదు. అత్యంత ప్రతికూల పరిస్థితులలో స్వరాజ్యానికి నేతృత్వం వహించడానికి రాజారాం మహారాజు యొక్క సమర్థవంతురాలైన భార్య మహారాణి తారాబాయి ముందుకు వచ్చింది.



మహారాణి తారాబాయి

మొఘలు చరిత్రకారుడు ఖాఫీఖాన్ మహారాణి తారాబాయిని వర్ణిస్తూ ఇలా అన్నాడు, "ఆమె (తారాబాయి) బుద్ధిమంతురాలు మరియు తెలివైనది. సైన్య వ్యవస్థ మరియు రాజ్య పరిపాలన విషయంలో భర్త జీవించియున్నపుడే ఆమె పేరుగాంచింది."

ఛత్రపతి రాజారాం మహారాజు మరణానంతరం మహారాణి తారాబాయి తన సర్దారుల సహాయంతో అతి ప్రతికూల పరిస్థితులలో స్వరాజ్య పోరాటాన్ని ప్రయత్నపూర్వకంగా కొనసాగించింది. ఔరంగజేబు సాతారా, పన్హాళా ఈ మరాఠీయుల కోటలను జయించాడు. అయితే మరాఠీయులు మొఘలుల యొక్క మధ్యప్రదేశ్, గుజరాత్ ప్రాంతాలలో వారిని దెబ్బతీశారు. తారాబాయి యుద్ధపరిధిని విస్తరింప చేసింది. కృష్ణాజీ సావంత్, ఖండేరావు దాభాడే, ధనాజీ జాధవ్, నేమాజీ శిందే అను సర్దారులు మహారాష్ట్ర బయట మొఘలులకు వ్యతిరేకంగా పోరాటం చేయసాగారు. యుద్ధం తారుమారు అవుతున్నదనడానికి ఇది సంకేతం అయింది.

మహారాణి తారాబాయి ఏడు సంవత్సరాలు పోరాటం చేసింది. రాజ్యాన్ని కాపాడింది. అన్ని కార్యాలు తానొక్కచేత పట్టుకొని సర్దారులను స్వరాజ్య కార్యానికి కలిపింది. సిరోంజ్, మందసౌర్, మాళ్వా వరకు మరాఠా సర్దారులు మొఘలులకు వ్యతిరేకంగా పోరాటం చేయసాగారు. ఖాఫీఖాన్ ఇలా రాస్తాడు "రాజారాం భార్య తారాబాయి విలక్షణమైన హడావిడి చేసింది. అందులోనే ఆమె సైన్యం యొక్క నేతృత్వం మరియు దండయాత్రల నిర్వహణా గుణం గొప్పగా

**మీకు తెలుసా ?**

మహారాణి తారాబాయి గొరిల్లా యుద్ధ నీతిని (తంత్రాన్ని) చాలా పరిణతితో ఉపయోగించింది. ఔరంగజేబు సైన్యం ముందు మరాఠీయుల బలం తక్కువగా ఉండెను. ఔరంగజేబు కోటలను జయించుటకు కోటలను ముట్టడించేవాడు. సాధ్యమైనంత వరకు కోట రక్షణకై మరాఠీయులు పోరాడేవారు. వర్షాకాలం సమీపించగానే, మరాఠా కిల్లేదారులు రాజద్రోహం చేస్తున్నారని చూపుతూ ఔరంగజేబు నుండి లంచం తీసుకొని కోటను అతనికి ఇచ్చేవారు. కిల్లేదారులు లంచం తీసుకొన్న రొక్కంను మరాఠా ఖజానాలో జమ చేసేవారు. ఔరంగజేబు కోటలపై ధనధాన్యాలు, మందుగుండు సామాగ్రి నింపిపెట్టగానే తారాబాయి ఆ కోటను తిరిగి జయించేది. తారాబాయి యొక్క ఈ యుద్ధ తంత్రం యొక్క వర్ణన 'సేఫ్ డిపాజిట్ లాకర్ సిస్టమ్' అని చేయబడుతుంది.

చూపబడ్డాయి. అందువలన మరాఠీయుల ఆక్రమణలు మరియు వారి హడావిడి రోజురోజుకు పెరుగుతూ పోయింది.''

**మీకు తెలుసా?**

తారాబాయి కార్యముల వర్ణన చేస్తూ 'శివభారత్'కారుడు పరమానందుని కుమారుడు కవి దేవదత్త ఇలా అన్నాడు.

*ताराबाई रामराणी । भद्रकाली कोपली ।*
*दिल्ली झाली दीनवाणी । दिल्लीशाचे गेले पाणी ।*
*रामराणी भद्रकाली । रणरंगी क्रुद्ध झाली ।*
*प्रयत्नाची वेळ आली । मुगल हो सांभाळा ।।*

ఈ విధంగా ఛత్రపతి శివాజీ మహారాజు యొక్క పరాక్రమం యొక్క వారసత్వం మహారాణి తారాబాయి ముందుకు కొనసాగించింది.

మరాఠీయుల ఈ తీవ్రమైన దాడుల వలన ఔరంగజేబు నిరాశచెందాడు. నిరంతరం ఇరవైఐదు సంవత్సరాలు మొఘల్ - మరాఠీయుల పోరాటం కొనసాగింది. మరాఠీయులను ఓడించడం మొఘలులకు సాధ్యం కాలేదు. అటువంటి పరిస్థితులలో ఔరంగజేబు చక్రవర్తి క్రీ.శ. 1707లో అహ్మద్‌నగర్ వద్ద మరణించాడు. అతని మరణంతో బాటే మరాఠీయుల స్వాతంత్ర్య పోరాటం సమాప్తమైనది.

మరాఠీయుల ఈ స్వాతంత్ర్య సమరం అనగా మొఘలు రాజులు తలపెట్టిన సామ్రాజ్య విస్తరణ యొక్క దురాశ మరియు మరాఠీయుల అంతరంగంలోని స్వాతంత్ర్యపు ఆకాంక్ష ఈ రెండింటి మధ్య పోరాటం. అందులో మరాఠీయులు విజయం సాధించారు. ఇంతే కాకుండా తరువాత కాలంలో ఔరంగజేబు మరణం వలన నిర్మితమైన రాజకీయ శూన్యాన్ని నింపడంలో మరాఠీయులు అగ్రేసరులు. ఢిల్లీ సింహాసనాన్ని నియంత్రిస్తూ వారు సుమారుగా హిందుస్థాన్ అంతటా పరిపాలన చేశారు మరియు సంరక్షించారు. అందువలన పద్దెనిమిదవ శతాబ్దాన్ని మరాఠీయుల శతాబ్దంగా భావిస్తారు. ఈ శతాబ్దంలోని మరాఠీయుల కార్యకలాపాల చరిత్రను మనం రాబోవు పాఠాలలో చూద్దాం.

**భోస్లే వంశం యొక్క వంశావళి**

మాలోజీ రాజు
↓
శహాజీ రాజు (క్రీ.శ. 1594 నుండి 1664)
↓
- సంభాజీ
- ఛత్రపతి శివాజీ మహారాజు (క్రీ.శ. 1630 నుండి 1680)
  - ఛత్రపతి సంభాజీ మహారాజు (క్రీ.శ. 1657 నుండి 1689)
    ↓ ఛత్రపతి శాహూ మహారాజు (క్రీ.శ. 1682 నుండి 1749)
    ↓ ఛత్రపతి రామ్‌రాజా (దత్తత క్రీ.శ. 1750 నుండి 1777)
  - ఛత్రపతి రాజారాం మహారాజు (క్రీ.శ. 1670 నుండి 1700)
    - ఛత్రపతి శివాజీ (తారాబాయి కుమారుడు)
      ↓ రామ్‌రాజా (సాతారా సింహాసనానికై దత్తత)
    - ఛత్రపతి సంభాజీ (రాజసబాయి కుమారుడు)
- వెంకోజీ

## అభ్యాసము

**1. సరియైన పర్యాయమును ఎన్నుకోండి.**

(1) ఔరంగజేబు ఇతని పరాక్రమంతో అలసిపోయాడు.

(అ) శాహజాదా అక్బర్ (ఆ) ఛత్రపతి సంభాజీ మహారాజు (ఇ) ఛత్రపతి రాజారాం మహారాజు

(2) చక్రవర్తి యొక్క గుడారంపై గల బంగారు కొప్పురాన్ని కోసినవాడు.

(అ) సంతాజీ మరియు ధనాజీ (ఆ) సంతాజీ ఘోర్పడే మరియు విఠోజీ చవ్హాన్ (ఇ) ఖండోబల్లాల్ మరియు రూపాజీ భోస్లే

(3) గోవా పోరాటంలో పరాక్రమవంతంగా పోరాడినది.

(అ) యెసాజీ కంక్ (ఆ) నెమాజీ శిందే

(ఇ) ప్రహ్లద్ నిళాజీ

**2. పాఠంలో వెదకి రాయండి.**

(1) సంభాజీ మహారాజు జంజీరా దండయాత్రను అర్ధాంతరంగా ఎందుకు విడిచి వెనుదిరగవలసి వచ్చింది?

(2) సంభాజీ మహారాజు పోర్చుగీసులకు గుణపాఠం చెప్పాలని ఎందుకు నిర్ణయించుకొన్నాడు?

(3) రాజారాం మహారాజు జింజీకి వెళుతున్నపుడు స్వరాజ్యం యొక్క రక్షణ బాధ్యతను ఎవరికి అప్పగించాడు?

( 4) మహారాణి తారాబాయి పరాక్రమాన్ని దేవదత్త అనుకవి ఏ పదాలతో వర్ణించాడు?

**3. ఎందుకో చెప్పండి.**


(1) ఔరంగజేబు తన దండయాత్రను ఆదిల్‌శాహీ మరియు కుతుబ్‌శాహీ రాజ్యాల వైపు తిప్పాడు.

(2) సంభాజీ మహారాజు తరువాత మొఘలులతో తీవ్రంగా పోరాడుటకు మరాఠీయులు సిద్ధమయ్యారు.

(3) మహారాణి యేసుబాయి నేతృత్వంలో రాయగడ్ రక్షణ పోరాటం చేయవలెనని నిర్ణయం తీసుకోబడింది.

**ఉపక్రమం**

భారతదేశ మానచిత్ర పటంలో గోవా, బీజాపూర్, గోవళ్‌కొండ, జింజీ, అహ్మద్‌నగర్, అహ్మదాబాద్ ఈ ప్రాంతాలను చూపండి.




జింజీ కోట - చిత్రం

# 10. మరాఠీయుల రాజ్యవిస్తరణ

మరాఠీయులు చేసిన స్వాతంత్ర్య సమర ప్రారంభంలో మొఘలులు ఆధిపత్యం ఆక్రమణలు చేయునదిగా ఉంటే మరాఠీయుల ధోరణి ఆత్మరక్షణ చేసుకొనునదిగా ఉండెను. ఈ స్వాతంత్ర్య సమరం చివరిలో మాత్రం పరిస్థితి తారుమారైనది. మరాఠీయులు దండెత్తుట మరియు మొఘలులు ఆత్మరక్షణ ధోరణి స్వీకరించిరి. పద్దెనిమిదవ శతాబ్దం ఉత్తరార్థంలో మరాఠీయులు మొఘలు అధికారాన్ని లొంగదీసుకొని సుమారుగా భారతదేశమంతట తమ అధికార విస్తరణ చేశారు. దాని అధ్యయనం మనం ఈ పాఠంలో చేయబోతున్నాం.

**శాహూ మహారాజు విడుదల:** ఔరంగజేబు చక్రవర్తి మరణానంతరం అతని కుమారుల మధ్య ఢిల్లీ సింహాసనం కొరకు పోరాటం మొదలైనది. శాహజాదా (యువరాజు) ఆఝంశాహ్ దక్షిణంలో ఉండెను. చక్రవర్తి సింహాసనం హస్తగతం చేసుకొనుటకు అతడు వెంటనే ఢిల్లీకి బయలుదేరాడు. రాజకుమారుడు శాహూ అతని స్వాధీనంలో ఉండెను. శాహు మహారాజును ఖైదు నుండి విడుదల చేసినట్లయితే మహారాణి తారాబాయి మరియు శాహూ మహారాజుల మధ్య ఛత్రపతి సింహాసనం కొరకు కలహం జరిగి మరాఠీయుల సామర్థ్యం తగ్గిపోతుందని ఆఝంశాహ్ భావించాడు. అందువలన అతడు శాహూ మహారాజును విడుదల చేశాడు.

**శాహూ మహారాజు పట్టాభిషేకం :** చెఱసాల నుండి విడుదల అయిన పిదప శాహూ మహారాజు మహారాష్ట్రకు పయనమయ్యాడు. అతనిని మరాఠీ సర్దారులు కొందరు వచ్చి కలిశారు. కాని మహారాణి తారాబాయి శాహు మహారాజు యొక్క ఛత్రపతి సింహాసనపు హక్కును సమ్మతించలేదు. పుణె జిల్లాలోని భీమానది తీరాన గల ఖేడ్ వద్ద శాహూ మహారాజు మరియు మహారాణి తారాబాయి సైన్యాల మధ్య యుద్ధం జరిగింది.



శాహూ మహారాజు

ఆ యుద్ధంలో శాహూ మహారాజు విజయం సాధించాడు. అతడు సాతారాను జయించాడు. స్వయంగా అతడు రాజ్యాభిషేకం చేయించుకొన్నాడు. సాతారా మరాఠీయుల రాజధాని అయింది.

కొంతకాలం శాహూ మహారాజు మరియు మహారాణి తారాబాయిల మధ్య విరోధం కొనసాగింది. క్రీ.శ. 1710లో మహారాణి తారాబాయి పన్హాళాగడ్‌పై పిన్న వయస్కుడైన తన కుమారుడు శివాజీ(రెండవ)ని ఛత్రపతిగా ప్రకటించింది. అప్పటి నుండి మరాఠీ రాజ్యంలో సాతారా రాజ్యంతో బాటు కొల్హాపుర్ స్వతంత్ర రాజ్యంగా అవతరించింది.

గతంలో శాహూ మహారాజు మొఘలుల స్వాధీనంలో గడవడం వలన అతనికి మొఘలుల రాజకీయం దగ్గరి నుండి చూచే అవకాశం లభించింది. మొఘలుల మరియు ముఖ్యంగా ఉత్తర భారత రాజకీయంలోని సూక్ష్మాతి సూక్ష్మ మర్మం అంతా తెలిసియుండెను. మొఘలు అధికారం యొక్క బలాలు మరియు బలహీనతల గురించి అతనికి బాగుగా తెలిసియుండెను. అంతే కాకుండా మొఘలు దర్బారులోని ప్రభావశాలురతో అతనికి పరిచయం కలిగియుండెను. ఈ అంశాలు అతనికి మారుతున్న పరిస్థితులలో మరాఠీయుల రాజకీయ దిశను నిర్ణయించడానికి ఉపయోగపడెను.

మరాఠీయుల రాజ్యాన్ని నాశనం చేయాలనే ఔరంగజేబు యొక్క పూర్వపు ధోరణిని అతని వారసులు ఇప్పుడు విడిచి పెట్టారు. అందువలన ఇప్పుడు మొఘలు అధికారంతో పోరాటం చేయకుండా దాని రక్షణకై ముందుకు వచ్చి ఆదే భూమిక నుండి తమ అధికారాన్ని విస్తరింపజేయ వలెననే నూతన రాజకీయ ధోరణి మరాఠీయులు చేపట్టారు. నూతన దేవాలయాలు నిర్మిస్తే ఏ పుణ్యం లభిస్తుందో అదే పుణ్యం పురాతన దేవాలయాల పునరుద్ధరణ చేస్తే లభిస్తుంది అనునది ఈ ధోరణి యొక్క సూత్రం.

మొఘలు రాజ్యానికి ఏ విధంగా వాయవ్యం నుండి ఇరాణీ, అఫ్గానీ ఆక్రమణల భయం ఉండేదో అదే విధంగా చుట్టుప్రక్కల గల పఠాణ్, రాజ్‌పూత్, జాట్, రోహిల్లుల వంటి స్థానిక రాజుల ప్రమాదం కూడ ఉండేది. అంతేకాకుండ దర్బారులో జరిగే పోటీ మరియు పోరాటాల వలన కూడ మొఘలు అధికారం లోపల డొల్లగా మారింది. అందువలన ఢిల్లీ దర్బారుకు మరాఠీయుల సహాయం అవసరమైనది.

**బాలాజీ విశ్వనాథ్ :** శాహూ మహారాజు మొఘలుల చెఱ నుండి విడుదల అయిన తరువాత అతడు బాలాజీ విశ్వనాథ్ భట్‌ను పేశ్వా చేశాడు. బాలాజీ కొంకణంలోని శ్రీవర్ధన్ గ్రామానికి చెందినవాడు. అతడు కార్యదీక్షాపరుడు మరియు అనుభవజ్ఞుడు. శాహూ మహారాజుయే మరాఠీయుల నిజమైన వారసుడని ఒప్పించి అనేక సర్దారులను అతడు శాహూ మహారాజు వైపునకు తిప్పాడు.

కాన్హోజీ ఆంగ్రే మరాఠీయుల నౌకాదళానికి ప్రముఖుడు. అతడు మహారాణి తారాబాయి పక్షం వహించాడు. అతడు శాహూ మహారాజు ప్రాంతంపై దాడులు చేశాడు. అందువలన అతనికి కఠిన పరిస్థితి ఎదురైనది. ఈ పరిస్థితులలో అతడు బాలాజీని కాన్హోజీ ఆంగ్రేకు వ్యతిరేకంగా పంపాడు. బాలాజీ యుద్ధం తప్పించి రాజనీతిజ్ఞతతో కాన్హోజీని శాహూ మహారాజు వైపు తిప్పాడు.

**చౌథాయి - సర్‌దేశ్‌ముఖీ అధికారం:** శాహూ మహారాజు యొక్క సింహాసనాన్ని మహారాష్ట్రలో బలోపేతం చేసిన తరువాత బాలాజీ తన లక్ష్యాన్ని ఉత్తరం దిక్కు రాజకీయాల వైపు మళ్ళించాడు. ఔరంగజేబు చక్రవర్తి మరణానంతరం ఢిల్లీ దర్బారులో చీలికలు మరియు గందరగోళం ఏర్పడింది. అక్కడ సయ్యిద్ సోదరులు అబ్దుల్లా (హసన్) మరియు హుసైన్ అలీల ఆధిపత్యం ఏర్పడింది. వారి సహాయంతో బాలాజీ క్రీ.శ. 1719లో మొఘలు చక్రవర్తి నుండి దక్కన్‌లోని మొఘలు ప్రాంతం నుండి కొన్ని చోట్ల చౌథాయి మరికొన్ని చోట్ల సర్‌దేశ్‌ముఖి వసూలు చేయు అధికారం సంపాదించాడు. చౌథాయి అనగా భూమి ఆదాయంలో నాలుగోవంతు, సర్‌దేశ్‌ముఖి అనగా పదోవంతు.


మొదటి బాజీరావు

**మొదటి బాజీరావు:** శాహూ మహారాజు బాలాజీ విశ్వనాథ్ మరణానంతరం అతని కుమారుడు బాజీరావు (మొదటి)ను క్రీ.శ. 1720లో పేశ్వా పదవిలో నియమించాడు. పేశ్వా పదవి చేపట్టిన ఇరువది సంవత్సరాల కాల వ్యవధిలో అతడు మరాఠీయుల రాజ్య విస్తరణ కావించాడు.

**పాల్‌ఖేడ్ వద్ద నిజాం యొక్క పరాభవం:** మొఘల్ చక్రవర్తి ఫర్రుఖ్సియర్, నిజాం-ఉల్-ముల్క్‌ను దక్కన్ సుభేదారుగా నియమించాడు. క్రీ.శ. 1713లో నిజాం హైదరాబాదు వద్ద తన స్వతంత్ర అస్తిత్వాన్ని నిర్మించుకొనే ప్రయత్నం చేశాడు. చక్రవర్తి మరాఠీయులకు దక్షిణంలో మొఘలులు పాలించు ప్రాంతాల సుభాల నుండి చౌథాయి - సర్‌దేశ్‌ముఖి పన్ను వసూలు చేయు అధికారం ఇచ్చి యుండెను. దానికి నిజాం యొక్క వ్యతిరేకత ఉండెను. అతడు పుణె పరగణాలోని కొంత భాగాన్ని జయించాడు. బాజీరావు నిజాంకు ఎదురొడ్డ వలెనని నిర్ణయించాడు. అతడు నిజాంను ఔరంగాబాదు దగ్గరి పాల్‌ఖేడ్ వద్ద ఓడించాడు. అప్పుడు అతడు మరాఠీయుల చౌథాయి - సర్‌దేశ్‌ముఖిల పన్నును వసూలు చేయు హక్కును సమ్మతించాడు.

మొఘలు అధికారం బలహీన పడడం వలన ఉత్తరంలో రాజ్యవిస్తరణ చేయుటకు ఎక్కువ అవకాశం కలదని బాజీరావు గుర్తించాడు. శాహూ మహారాజు అతని ధోరణికి మద్దతునిచ్చాడు.

**మాళ్వా:** నేటి మధ్యప్రదేశ్‌లోని మాళ్వా ప్రాంతం మొఘలుల స్వాధీనంలో ఉండెను. బాజీరావు తన సోదరుడు చిమాజీ అప్పా నేతృత్వంలో మల్హార్ రావు హోల్కర్, రాణోజీ శిందే, మరియు ఉదాజీ పవార్‌లను మాళ్వాకు పంపించాడు. అక్కడ అతడు తన స్థావరాన్ని బలోపేతం చేశాడు.

**బుందేల్‌ఖండ్:** బుందేల్‌ఖండ్ అనగా నేటి మధ్యప్రదేశ్ మరియు ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ, పన్నా, సాగర్ మొదలగు పట్టణాల పరిసరాలలోని ప్రాంతం.

బుందేల్‌ఖండ్‌లో ఛత్రసాల్ రాజు తన స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. అలహాబాదు యొక్క మొఘల్ సుభేదారు మహమ్మద్‌ఖాన్ బంగశ్ అనువాడు బుందేల్ ఖండ్‌పై దాడి చేశాడు. అతడు ఛత్రసాల్‌ను ఓడించాడు. అప్పుడు ఛత్రసాల్ బాజీరావును సహాయం అర్థించాడు.

బాజీరావు పెద్ద సైన్యాన్ని తీసుకొని బుందేల్‌ఖండ్‌కు వెళ్ళాడు. అతడు బంగశ్‌ను ఓడించాడు. ఛత్రసాల్ బాజీరావును గొప్పగా సత్కరించాడు. ఈ విధంగా మాళ్వా మరియు బుందేల్‌ఖండ్ వద్ద మరాఠీయుల అధికారం ప్రస్థాపితమైనది.

**మీకు తెలుసా?**

ఛత్రసాల్ సహాయం కోసం బాజీరావుకు లేఖ రాశాడు. అందులో అతడు రాశాడు, 'जो गत आह गजेंद्रकी वह गत आयी है आज. बाजी जान बुंदेलकी, बाजी राखो लाज.' (మొసలి తన కాలును పట్టుకున్న ఏనుగు మాదిరిగా అయినది నా పరిస్థితి. నేను ఇప్పుడు పెద్ద కష్టంలో ఉన్నాను. ఇప్పుడు నా గౌరవం కాపాడే వాడివి నీవే ఉన్నావు.)

బాజీరావు చక్రవర్తిని మాళ్వా సుభేదారిత్వాన్ని కోరాడు. అతడు ఈ కోరికను తిరస్కరించాడు. అందువలన బాజీరావు 1737 మార్చిలో ఢిల్లీపై దండయాత్ర చేసే ఉద్దేశంతో ఢిల్లీ సరిహద్దులకు వెళ్ళి తలపడ్డాడు.

**భోపాల్ పోరాటం :** బాజీరావు దండయాత్ర వలన చక్రవర్తి ఆందోళన చెందాడు. అతడు నిజాంను ఢిల్లీ సంరక్షణకై పిలిపించాడు. గొప్ప సైన్యంతో నిజాం బాజీరావుకు వ్యతిరేకంగా పోరాడటానికి వెళ్ళాడు. బాజీరావు భోపాల్ వద్ద అతనిని ఓడించాడు. నిజాం మరాఠీయులకు మాళ్వా సుభేదారిత్వ అధికారాన్ని చక్రవర్తి నుండి ఇప్పించడానికి ఒప్పుకొన్నాడు.

**పోర్చుగీసుల పరాభవం :** కొంకణ సముద్ర తీరప్రాంతం పై వసయి మరియు ఠాణె అను ప్రాంతాలు పోర్చుగీసు వారి స్వాధీనంలో ఉండెను. పోర్చుగీసు అధికారులు ప్రజలపై దౌర్జన్యం చేసేవారు. బాజీరావు తన సోదరుడు చిమాజీ అప్పాను వారిని దండించుటకు పంపించాడు. అతడు ఠాణె మరియు సమీప ప్రాంతాలను జయించాడు. ఆ తరువాత క్రీ.శ. 1739లో అతడు వసయి కోటను ముట్టడించాడు. ఆ కోట చాలా బలమైనది. పోర్చుగీసు వారి దగ్గర ప్రభావవంతమైన ఫిరంగులు ఉండెను. అయినను చిమాజీ అప్పా పట్టుదలతో ముట్టడి చేసి పోర్చుగీసు వారిని శరణు జొచ్చునట్లు చేశాడు. అందువలన వసయి కోట మరియు పోర్చుగీసువారి చాలా ప్రాంతం మరాఠీయుల స్వాధీనంలోనికి వచ్చింది.

**బాజీరావు మరణం:** ఇరాణ్ చక్రవర్తి నాదిర్‌శాహ్ భారతదేశంపై దండయాత్ర చేశాడు. అప్పుడు బాజీరావు శాహూ మహారాజు యొక్క ఆజ్ఞతో గొప్ప సైన్యం తీసుకొని ఉత్తర భారతదేశానికి వెళ్ళాడు. అతడు బర్హాణ్‌పూర్‌కు చేరుకొన్నాడు. ఆలోపు నాదిర్‌శాహ ఢిల్లీ నుండి చాలా సంపదను దోచుకొని తన మాతృదేశానికి వెళ్ళిపోయాడు. ఏప్రిల్ 1740లో నర్మదానది తీరంలో రావేర్‌ఖేడీ వద్ద బాజీరావు మరణించాడు.

బాజీరావు ఒక ఉత్తమ సేనాని. తన పరాక్రమంతో అతడు ఉత్తర భారతదేశంలో మరాఠీయుల అధిపత్యాన్ని నెలకొల్పాడు. అతడు మరాఠీయుల రాజ్యాధికారాన్ని అఖిల భారతీయ ప్రాతిపదికన ఒక బలమైన రాజ్యాధికార స్థానాన్ని సంపాదించిపెట్టాడు. అతని కాలంలో శిందే, హోళ్కర్, పవార్, గాయక్‌వాడ్ ఈ వంశాలు ముందుకు వచ్చాయి.

## అభ్యాసం

NH5CZ3

**1. అనగా నేమి?**

(1) చౌథాయి -

(2) సర్‌దేశ్‌ముఖీ -

**2. ఒకే పదంతో రాయండి.**

(1) బాలాజీ కొంకణంలోని ఈ గ్రామానికి చెందినవాడు .......

(2) బుందేల్‌ఖండ్‌లో ఇతని రాజ్యం ఉండెను ............

(3) బాజీరావు మరణించిన చోటు ..............

(4) పోర్చుగీసులను ఓడించిన వాడు ............

**3. రాయండి.**

1) కాన్హోజీ ఆంగ్రే (2) పాల్‌ఖేడ్ యొక్క పోరాటం

(3) బాలాజీ విశ్వనాథ్ (4) మొదటి బాజీరావు

**4. కారణాలు రాయండి.**

(1) మరాఠీ రాజ్యంలో స్వతంత్రమైన రెండు రాజ్యాలు ఏర్పడినవి.

(2) ఔరంగజేబు చేసిన పొరపాటు వలన ముగల్ సామ్రాజ్యానికి చాలా నష్టం జరిగింది.

(3) ఢిల్లీ దర్బారుకు మరాఠీయుల సహాయం అవసరమయినది.

**ఉపక్రమం**

మహారాణి తారాబాయి చరిత్రను సేకరించి ఆమె జీవనంలోని నీకు నచ్చిన సంఘటనలను, భూమికను తరగతిలో అభినయించండి.

# 11. దేశ రక్షకులు మరాఠీయులు

శాహూ మహారాజు బాజీరావు తరువాత అతని కుమారుడు బాలాజీ బాజీరావు ఉర్ఫ్ నానాసాహెబ్‌కు పేశ్వాగా అధికారాన్ని ఇచ్చాడు. నాదిర్‌శాహ ఆక్రమణ తరువాత ఢిల్లీలో అస్థిరత్వం ఏర్పడింది. అటువంటి పరిస్థితిలో ఉత్తరంలో మరాఠీయుల అధికారం స్థిరపరచడానికి అతడు ప్రయత్నించాడు. ఈ కాలంలో అహ్మద్‌శాహ అబ్దాలీ పానిపత్‌పై మరాఠీయులకు సవాలు చేశాడు. ఈ సంఘటనల గురించి మనం ఈ పాఠంలో తెలుసుకోబోతున్నాం.

**ఉత్తరంలోని పరిస్థితి:** అయోధ్య ప్రాంతం యొక్క వాయవ్యదిశను అంటియున్న హిమాలయాల అడుగు భాగాన ఉన్న ప్రాంతం పద్దెనిమిదవ శతాబ్దంలో రోహిల్ ఖండ్ అని పిలువబడేది. అఫ్ఘనిస్తాన్ నుండి వచ్చిన పఠాన్లు ఈ ప్రాంతంలో స్థిరపడియుండిరి. ఈ పఠానులను రోహిలులు అంటారు. గంగా-యమున నదుల దోఆబ్ ప్రాంతంలో వారు గందరగోళం చేసేవారు. వారిని కట్టడి చేయుటకు అయోధ్య నవాబు మరాఠీయులను ఆహ్వానించాడు. మరాఠాలు వారిని కట్టడి చేశారు.

**అఫ్ఘానులతో పోరాటం:** అఫ్ఘానిస్తాన్ యొక్క చక్రవర్తి అహ్మద్‌శాహ అబ్దాలి భారతదేశంలోని సంపదకు ఆకర్శితుడయ్యాడు. క్రీ.శ. 1751లో అతడు పంజాబ్‌పై దండెత్తాడు. ఆ కాలంలో మొఘలు ప్రాంతంలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అందువలన మొఘలులకు అబ్దాలీ యొక్క ఆక్రమణ భీతి పట్టుకొన్నది. ఆ పరిస్థితిలో తమ సంరక్షణకోసం మరాఠీయుల సహాయం తీసుకోవడం అవసరమనిపించింది. చక్రవర్తికి మరాఠీయుల సామర్థ్యం మరియు విశ్వసనీయతపై నమ్మకం కుదిరింది. ఢిల్లీ రక్షణకై మరాఠీయులంత సామర్థ్యం కలిగిన రాజ్యం లేకుండెను. అందువలన చక్రవర్తి క్రీ.శ. 1752 ఎప్రిల్ నెలలో మరాఠీయులతో ఒక ఒప్పందం చేసుకొన్నాడు. మరాఠీయులు ఆ ఒప్పందం ప్రకారం రోహిలులు, జాట్‌లు, రాజపుత్రులు, అఫ్ఘాన్‌లు మొదలగు శత్రువుల నుండి మొఘలు సామ్రాజ్యాన్ని రక్షిస్తామని అంగీకరించారు.

దానికి ప్రతిఫలంగా వారికి నగదు లభించేది. అంతే కాకుండా పంజాబ్, ముల్తాన్, రాజపుతానా, సింధు, రోహిల్ ఖండ్ ఈ ప్రాంతాల నుండి చౌథాయి వసూలు చేసే హక్కు వారికి లభించింది. అదే విధంగా అజ్మేర్ మరియు ఆగ్రా ప్రాంతాల సుభేదారిత్వం ఇవ్వబడింది.

ఈ ఒప్పందం ప్రకారం ఛత్రపతి తరపున పేశ్వా శిందే-హోళ్కర్‌ల సైన్యాలను ఢిల్లీ సంరక్షణ కొరకు పంపెను. మరాఠీయులు ఢిల్లీవైపు బయలుదేరిరి. ఈ వార్త తెలియగానే అబ్దాలి మాతృదేశానికి తిరిగి వెళ్ళిపోయాడు. మరాఠీయులు మజిలీలు దాటుతూ ఢిల్లీని చేరుకొన్నారు. మరాఠీయుల వలననే అబ్దాలీ సంకటం దూరమైనది. అందువలన చక్రవర్తి మొఘలుల సుభాలలోని చౌథాయి హక్కును వారికి ఇచ్చాడు. ఈ సుభాలలో కాబూల్, కాందహార్ మరియు పెశావర్‌లు కూడా ఉన్నవి. ఈ సుభాలు పూర్వం మొఘలు సామ్రాజ్యం లోని ప్రాంతాలుగా ఉండెను. ఇప్పుడు అవి అబ్దాలీ యొక్క అఫ్ఘానిస్తాన్‌లో ఉన్నవి. ఒప్పందం ప్రకారం ఈ సుభాలను అబ్దాలీ నుండి గెలుచుకొని తిరిగి మొఘలుల రాజ్యంలో కలపడం మరాఠీయుల కర్తవ్యంగా ఉండెను. దానికి వ్యతిరేకంగా కనీసం పంజాబ్ వరకు గల ప్రాంతం అఫ్ఘాన్ పాలన క్రిందకు తీసుకొని రావలెనని అబ్దాలి కోరిక. అందువలన నేడో రేపో మరాఠీయులకు మరియు అబ్దాలీకి మధ్య పోరాటం తప్పనిసరి యైనది.



పేశ్వా నానాసాహెబు

నానాసాహెబ్ పేశ్వా సోదరుడు రఘునాథరావు జయప్ప శిందే మరియు మల్హార్‌రావు హోళ్కర్‌లను వెంట తీసుకొని ఉత్తర భారతదేశంలో అబ్దాలీతో పోరాటం చేయుట కోసం దండయాత్రకు వెళ్ళాడు.

ఉత్తరంలోని స్థానిక రాజుల దృష్టికోణంలో దక్షిణంలోని మరాఠీయులు వారికి పోటీదారులయ్యారు. మరాఠీయుల విశాల దృష్టికోణం అర్థం చేసుకోకుండ మరాఠీ వారికి సహాయం చేయకుండా వారు

తటస్థంగా ఉండిరి. మరాఠీయులకు ఢిల్లీ దర్బారులో ఉన్న ఆధిపత్యం మరియు జోక్యం వారికి రుచించలేదు. కానీ సూరజ్‌మల్ జాట్ మరియు రాణీ కిశోరిలు పానిపత్ యుద్ధంలో గాయపడిన మరాఠీయులకు సహాయం చేశారు.

అదేవిధంగా ఉత్తర భారతదేశంలోని కొందరు ఛాందసులు మరాఠీయులను అన్యమతస్థులుగా చూస్తుండేవారు. వారు కూడా మరాఠీయుల విశాల దృక్పథాన్ని అర్థం చేసుకోకుండా మరాఠీయుల ఆధిపత్యం నశించిపోవాలని అబ్దాలీని హిందుస్థాన్‌పై ఆక్రమణ చేయవలసిందిగా కోరారు. అబ్దాలీ మరాఠీయులను ఓడించి మరాఠీయులను దక్షిణంలో నర్మదానది ఆవలకు పారద్రోలుతాడని వారి ఆకాంక్ష.

**అటక్‌పై మరాఠీయుల జెండా ఎగురుట :** నజీబ్‌ఖాన్ రోహీలుల యొక్క సర్దారు. ఉత్తర భారతదేశంలోని మరాఠీయుల ఆధిపత్యం అతడు సహించలేక పోయాడు. నజీబ్‌ఖాన్ కోరడంతో అబ్దాలీ భారతదేశంపై మరల దండయాత్ర చేశాడు. అది భారతదేశంపై అతని ఐదవ దండయాత్ర. అతడు ఢిల్లీని జయించాడు. పెద్దయెత్తున దోచుకొని అతడు అఫ్ఘనిస్తాన్‌కు తిరిగి వెళ్ళాడు. రఘునాథరావు మరియు మల్హార్‌రావు హోళ్కర్‌లు మరల ఉత్తర భారతదేశానికి వెళ్ళారు. వారు ఢిల్లీని హస్తగతం చేసుకొన్నారు. ఆ తరువాత అబ్దాలీ యొక్క అధికారులను తరిమికొట్టి పంజాబును గెలుచుకొనిరి. అబ్దాలీ యొక్క సైనికులను వెంబడిస్తూ మరాఠీయులు క్రీ.శ. 1758లో అటక్ వరకు వెళ్ళారు. అటక్‌పై మరాఠీయుల జెండాను ఎగురవేశారు. అటక్ ప్రాంతం ఇప్పుడు పాకిస్తాన్‌లో ఉన్నది. మరాఠీయులు అటక్‌ను దాటి పెశావర్ వరకు దండయాత్ర సాగించారు. కాని వారు తమ అధికారం కిందకు తెచ్చుకొన్న ఆ ప్రాంత పరిపాలనా వ్యవస్థను సరిగా ఏర్పాటు చేయలేదు.

**దత్తాజీ పరాక్రమం :** పంజాబ్‌పై పట్టును దృఢతరం చేయడానికి మరియు నజీబ్‌ఖాన్‌ను దండించడానికి పేశ్వా దత్తాజీ శిందే మరియు జనకోజీ శిందేలను ఉత్తరానికి పంపాడు. దత్తాజీ ఉత్తరానికి వెళ్ళాడు. నజీబ్‌ఖాన్ దత్తాజీని రాయబార వ్యవహారంలో ఇరికించి అబ్దాలీని సహాయం కోసం అర్థించాడు. ఈ సందేశం అందగానే అబ్దాలీ మళ్ళీ భారతదేశంపై దండయాత్ర చేశాడు. దత్తాజీ మరియు అబ్దాలీలు యమునా నదీ తీరంలో బురాడీఘాట్ వద్ద ఎదురుపడ్డారు. ఘోరమైన పోరాటం జరిగింది. దత్తాజీ అసమాన్య శౌర్యం ప్రదర్శించాడు. కాని ఈ యుద్ధంలో దత్తాజీ వీర మరణం పొందాడు.




**మీకు తెలుసా ?**

దత్తాజీ గొప్ప శౌర్యంతో పోరాడెను. కాని చివరికి అతడు యుద్ధ భూమిలో గాయపడి పడిపోయెను. నజీబ్‌ఖాన్ రోహిల్లుల సలహాదారు కుతుబ్‌శాహ ఏనుగు మీద నుండి దిగి గాయపడిన దత్తాజీ దగ్గరకు వచ్చాడు. అతడు దత్తాజీతో ఇలా అన్నాడు. ''ఏం పటేల్‌గారు మాతో నీవు ఇంకా పోరాడుతావా?'' దత్తాజీ గాయపడిన అవస్థలో పడియున్నాడు. కాని కుతుబ్‌శాహ మాటలు వినగానే సగర్వంగా జవాబు ఇచ్చాడు. ''అవును, ప్రాణాలతో ఉంటే ఇంకా పోరాడుతాను!'

**సదాశివరావు భావు :** అబ్దాలీని దండించుటకు నానాసాహెబ్ తన దాయాది సోదరుడైన సదాశివరావు భావు మరియు పెద్ద కుమారుడు విశ్వాసరావులను ఉత్తరానికి పంపాడు. సదాశివరావు భావు చిమాజీ అప్పా యొక్క పుత్రుడు. అతనితో బాటు గొప్ప సైన్యం మరియు ప్రభావవంతమైన ఫిరంగులు ఉండెను. ఇబ్రహీంఖాన్ గారదీ అతని ఫిరంగి దళానికి ప్రముఖుడు. ఈ ఫిరంగుల బలంతో అతడు క్రీ.శ. 1760లో లాతూర్ జిల్లాలోని ఉద్గీర్ యుద్ధంలో నిజాంను ఓడించాడు.



సదాశివరావు భావు




**పానిపత్ యుద్ధం :** ఉత్తర భారతదేశ దండయాత్రలో సదాశివరావు భావు ఢిల్లీని జయించాడు. ఆ తరువాత మరాఠీయుల సైన్యం మరియు అబ్దాలీ యొక్క సైన్యం పానిపత్ వద్ద తలపడ్డాయి. 1761 జనవరి 14 రోజున మరాఠీయులు అబ్దాలీపై దండయాత్ర చేసి యుద్ధం ప్రారంభించారు. అది మూడవ పానిపత్ యుద్ధం. యుద్ధంలో విశ్వాసరావుకు తూటా తగిలి అతడు మరణించాడు. అది సదాశివరావు భావుకు తెలియగానే అతడు కోపోద్రిక్తుడై శత్రువులపై విరుచుకు పడ్డాడు. యుద్ధ రంగంలోని గందరగోళంలో అతడు కనిపించకుండా పోయాడు. తమ నాయకుడు కనిపించక పోవడంతో మరాఠీ సైనికుల ధైర్యం సన్నగిల్లింది. అదే సమయంలో అబ్దాలీ యొక్క అదనపు సైన్యం నూతనోత్సాహంతో మరాఠీయులపై విరుచుక పడ్డారు. మరాఠీయులు ఓడిపోయారు. మహారాష్ట్రలోని ఒక సంపూర్ణ యువతరం నాశనం అయింది. చాలా మంది పరాక్రమవంతులు వీర మరణం పొందారు.

### మీకు తెలుసా?

పానిపత్ యుద్ధంలో సుమారు ఒక లక్ష యాభైవేల మంది చనిపోయారు. ఒక పత్రంలోని సాంకేతిక వర్ణన ఈ విధంగా ఉంది.

''రెండు ముత్యాలు రాలిపోయాయి. ఇరవై ఏడు బంగారు నాణాలు పోయాయి! రూపాయలు, చిల్లర పైసలు ఎన్ని పోయాయో లెక్కలేదు.''

విదేశీయుడైన అబ్దాలీకి ఇక్కడ రాజ్యమేలే నైతిక హక్కు లేదు అను విశాల భూమికతో మరాఠీయులు అబ్దాలీతో పోరాడారు. మనం అందరం ఒకే దేశానికి చెందినవారం కాబట్టి అబ్దాలీ పరాయి శత్రువు అనే విషయాన్ని తెలుపుతూ లేఖరాసి సదాశివరావుభావు ఉత్తర భారతదేశంలోని రాజులందరికి మరాఠీయుల విశాలమైన మరియు సర్వసమావేశకమైన భూమికను తెలిపాడు. కాని అతనికి అనుకూల స్పందన ఇవ్వకుండా ఆ రాజులు తటస్థంగా ఉన్నారు. సహజంగా భారతదేశ రక్షణభారం కేవలం మరాఠీయులపైననే పడింది. భారతదేశం ఒక దేశం అని మరియు అందరి రాజు ఏమతస్థుడైనను అందరు అతనికి మద్దతు నివ్వాలనే విజ్ఞతను చరిత్రలో మొదటి సారిగా మరాఠీయులు చూపించారని చెప్పవచ్చును.

**పేశ్వా మాధవరావు :** నానాసాహెబ్ పేశ్వా మరణానంతరం అతని కుమారుడు పేశ్వా అయ్యాడు. మాధవరావు తన పరిపాలన కాలంలోని నిజాం మరియు హైదర్ అలిలను అదుపులో పెట్టాడు. అతడు ఉత్తర భారతదేశంలో మరాఠీయుల అధికారాన్ని మళ్ళీ ప్రతిష్ఠించాడు.



పేశ్వా మాధవరావు

పానిపత్ యుద్ధంలో మరాఠీయులు పరాభవం చెందారు. అదిచూసి నిజాం వారికి వ్యతిరేకంగా తిరిగి కార్యకలాపాలను ప్రారంభించాడు. అతడు వారిదేశంపై ఆక్రమణ చేశాడు. కాని మాధవరావు పైఠన్ సమీపంలోని రాక్షసభువన్ వద్ద అతనిని ఓడించాడు.

హైదర్అలి మైసూర్ సుల్తానుగా ఉండెను. పానిపత్‌లో మరాఠీయుల పరాభవాన్ని అనుకూలంగా చేసుకొని అతడు కర్ణాటకలోని మరాఠీయుల ప్రాంతంపై దాడులు చేశాడు. కాని మరాఠీయులు శ్రీరంగపట్టణం సమీపంలోని మోతితలావ్ వద్ద జరిగిన యుద్ధంలో అతనిని ఓడించారు. అప్పుడతడు తుంగభద్రానదికి ఉత్తరాన ఉన్న ప్రాంతం మరాఠీయులకు ఇచ్చుటకు ఒప్పుకొన్నాడు.

మాధవరావు పేశ్వా మరణం క్రీ.శ. 1772లో జరిగింది. మరాఠీయుల చరిత్రలో ఒక ప్రామాణిక, శ్రమశీల, పట్టుదల కలిగిన మరియు లోకహిత దక్షుడైన పరిపాలకుడిగా పేర్కొనబడతాడు. ఈ సమర్థవంతుడైన పేశ్వా మరణం వలన మరాఠీయుల రాజ్యానికి చాలా నష్టం జరిగింది.

### మీకు తెలుసా?

పేశ్వా మాధవరావు రైతుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపించాడు. బావులు త్రవ్వించి పుణెలో నీటి సరఫరాను పెంచాడు. నానా ఫడ్నవీస్ వంటి పరిపాలకుడు మరియు రామశాస్త్రి ప్రభుణె వంటి గొప్ప న్యాయమూర్తి అతని కాలంలో తయారైనారు. ప్రజలకు న్యాయం జరగాలని న్యాయశాఖలో సంస్కరణలు చేశాడు. ఫిరంగులు మరియు మందుగుండు సామాగ్రి తయారు చేసే కర్మాగారాలను ప్రారంభించాడు. నాణాలను ముద్రించడానికి ముద్రణాలయ వ్యవస్థను ఏర్పాటు చేశాడు.


పేశ్వా మాధవరావు మరణానంతరం సింహాసనంపైకి వచ్చిన నారాయణరావు మరియు సవాయి మాధవరావు ఈ ఇద్దరు పేశ్వాలు అల్పాయుష్కులైనారు. అంతేకాకుండా వారి కాలంలో పేశ్వా పదవికై గృహకలహాలు అధికమయ్యాయి. అదే సమయంలో అటక్ ఆవలి వరకు జెండాను ఎగురవేసిన రఘునాథరావు అధికారకాంక్షతో ఆంగ్లేయుల నాశ్రయించాడు. అందువల్ల మరాఠీయులకు మరియు ఆంగ్లేయులకు యుద్ధం జరిగింది.

హైదర్ అలీ మరణం క్రీ.శ. 1782లో జరిగింది. తరువాత అతని కుమారుడు టిప్పు మైసూరు సుల్తాను అయ్యాడు. అతడు నిష్ణాతుడైన యోధుడే కాక విద్వాంసుడు మరియు కవి. అతని సామర్థ్యంతో అతడు రాజ్యం యొక్క ప్రభావాన్ని పెంచాడు. అతడు ఫ్రెంచివారితో మంతనాలు జరిపి ఆంగ్లేయుల అధికారాన్ని భయాందోళనకు గురిచేయడం మొదలుపెట్టాడు. క్రీ.శ. 1799లో ఆంగ్లేయులతో జరిగిన ఒక యుద్ధంలో అతడు మరణించాడు.

**మరాఠీ అధికారాన్ని మళ్ళీ స్థాపించుట :** పానిపత్ ఓటమి వలన ఉత్తర భారతదేశంలో మరాఠీయుల యొక్క ప్రతిష్ఠకు పెద్ద దెబ్బ తగిలింది. ఉత్తర భారతదేశంలో మళ్ళీ తమ అధికారాన్ని స్థాపించుటకు మాధవరావు మహాద్‌జీ శిందే, తుకోజీ హోళ్కర్, రామచంద్ర కానడే మరియు విసాజీపంత్ బినీవాలే అను సర్దారులను అక్కడకు పంపించాడు. మరాఠీయుల సైన్యాలు జాట్, రోహిల్లులు మరియు రాజపుత్రులను ఓడించారు. చక్రవర్తి శాహఆలంను తమ ఆధీనంలోని ఢిల్లీ సింహాసనంపై కూర్చుండ బెట్టారు. ఉత్తర భారతదేశంలో మరాఠీయుల అధికారం మళ్ళీ స్థాపించబడింది.

పానిపత్ యుద్ధంలో మరాఠీయులకు పెద్ద నష్టం జరిగింది. అబ్దాలీ సైన్యం కూడా చాలా నష్టపోయింది. పానిపత్ విజయం తరువాత ఆర్థిక లాభం అనుకున్నంతగా జరగకపోవడంతో అతడుగాని, అతని వారసులుగాని మళ్ళీ భారత దేశంపై ఆక్రమణ చేయడానికి సాహసించలేదు. ఉత్తరంలోని అరాజకత్వాన్ని నియంత్రించే సామర్థ్యం మరాఠీయులలోనే ఉందని గ్రహించి అతడు ఆ సామ్రాజ్యాన్ని చూసుకొన వలసిందిగా తన కోరికను వెలిబుచ్చాడు. మైత్రి చేయుటకు పుణె ఆస్థానానికి దూతను కూడా పంపించాడు. పానిపత్ యొక్క పెద్ద పరాభవాన్ని జీర్ణించుకొని ఉత్తర భారతదేశ రాజకీయాలలో మళ్ళీ నిలదొక్కుకొనుటలో విజయం సాధించారు. ఇది చాలా ముఖ్యమైన సంఘటన. ఇందులో మల్హార్‌రావు హోళ్కర్, అహిల్యాబాయి హోళ్కర్ మరియు మహాద్‌జీ శిందేల భాగస్వామ్యం చాలా గొప్పది.

**పేశ్వా వంశం యొక్క వంశావళి**



## అభ్యాసం

**1. ఎవరు?**

(1) అఫ్ఘనిస్తాన్ నుండి వచ్చినవాడు ......................

(2) హిమాలయాల అడుగు భాగాన స్థానికులుగా స్థిరపడిన వారు ......................

(3) నానాసాహెబ్ పేశ్వా యొక్క సోదరుడు ..................

(4) మథుర జాట్ల ప్రముఖుడు ...................

(5) పైఠన్ సమీపంలో రాక్షసభువన్ వద్ద నిజాంను ఓడించినవాడు ....................

**2. సంక్షిప్తంగా రాయండి.**

(1) అటక్‌పై మరాఠీయుల జెండా ఎగిరింది.

(2) అఫ్ఘానులతో పోరాటం

(3) పానిపత్ యుద్ధ పరిణామం

**3. సంఘటనలను క్రమంగా రాయండి.**

(1) రాక్షసభువన్ యుద్ధం

(2) టిప్పు సుల్తాన్ మరణం

(3) మాధవరావు పేశ్వా మరణం

(4) పానిపత్ ఘాట్ యుద్ధం

(5) బురాడీ ఘాట్ యుద్ధం

MHE910

**4. కింది గడులలో పాఠంలో వచ్చిన వ్యక్తుల పేర్లను వెదకండి.**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| మ | స | హ | నా | జా | న | కొ | జీ |
| హో | జ | ద | రా | నా | ఫ | మ్ | త్తా |
| ద్ | యా | చ | య | ప | సా | థ | ద |
| జీ | ప్పు | ల్ | ణ | ఆ | రూ | హె | ప్ర |
| బా | లా | జీ | వి | శ్వ | నా | థ్ | బ్ |
| అ | వ | లా | మా | ధ | వ | రా | వు |
| దే | స | దా | శి | వ | రా | వు | భా |
| మ | ల్హా | ర్ | రా | వు | క | చి | వు |

**ఉపక్రమం**

అంతర్జాలం (ఇంటర్నెట్) సహాయంతో పానిపత్ యుద్ధ వివరాలు తెలుసుకొని తరగతిలో ప్రదర్శించండి.



సవాయి మాధవరావు పేశ్వా ఆస్థానం

# 12. సామ్రాజ్య ప్రస్థానం

ఇప్పటి వరకు మనం మరాఠి రాజ్యస్థాపన మరియు విస్తరణను చూసాం. స్వరాజ్య స్థాపన నుండి సామ్రాజ్య స్థాపన వరకు ప్రస్థానం ఎలా కొనసాగిందో మనం అభ్యసించాం. మరాఠీయుల ఉత్తర భారతదేశంలో ఏ సామ్రాజ్య విస్తరణ జరిగిందో దానికోసం ఏ సర్దారుల వంశాలు మహత్తరమైన సహకారం అందించాయో వాటి గురించి సంక్షిప్తంగా ఈ పాఠంలో తెలుసుకొందాం.

**ఇందోర్ హోళ్కర్లు :** మల్హార్‌రావు ఇందోర్ హోళ్కర్ల రాజ్య సంస్థాపకుడు. అతడు దీర్ఘకాలం మరాఠీ రాజ్యానికి సేవ చేశాడు. గొరిల్లా యుద్ధ పద్ధతిలో అతడు ప్రావీణ్యుడు. మొదటి బాజీరావు మరియు నానాసాహెబ్ పేశ్వాల కాలంలో అతడు ఉత్తరంలో పరాక్రమాన్ని ప్రదర్శించాడు. మాళ్వాలో మరియు రాజపుత్రుల ప్రాంతంలో మరాఠీయుల అధికారం స్థాపించుటలో అతనిది గొప్ప భాగస్వామ్యం ఉండెను. పానిపత్ తరువాత ఉత్తర ప్రాంతంలోని మరాఠీయుల ప్రతిష్ఠ పునఃప్రాప్తికై మాధవరావు పేశ్వాకు వారి సహాయం చాలా లభించింది.



మల్హార్ రావు హోళ్కర్

పుణ్యశ్లోక్ అహిల్యాబాయి మల్హార్ రావు కుమారుడైన ఖండేరావు భార్య. ఖండేరావు కుంభేరీ యుద్ధంలో మరణించాడు. కొంతకాలం తరువాత మల్హార్ రావు కూడా మరణించాడు. ఆ తరువాత ఇందోర్ పరిపాలనా పగ్గాలు అహిల్యాబాయి చేతికి వచ్చాయి. ఆమె తెలివిగలది, రాజనీతిజ్ఞురాలు మరియు ఉత్తమ పరిపాలకురాలు. ఆమె కొత్త శాసనాలు చేసి భూమిశిస్తు, పన్ను వసూళ్ల వంటి అంశాలను సరిచేసింది. బంజరు భూములను పంట పొలాలుగా మార్చుట, రైతుల కొరకు బావులు త్రవ్వి ఇచ్చుట, వ్యాపార పరిశ్రమలను ప్రోత్సహించుట, చెరువులు - తటాకాలు నిర్మించుట కోసం ఆమె పాటుపడింది. భారతదేశంలో నాలుగు దిక్కులలో ఉన్న ముఖ్యమైన పుణ్యక్షేత్రాలలో ఆమె దేవాలయాలు, ఘాట్లు, మఠాలు, ధర్మశాలలు, చలివేంద్రాలను నెలకొల్పింది. దేశంలోని సాంస్కృతిక ఐక్యత గురించి చేసిన ఆమె ప్రయత్నం విలువైనది. ఆమె స్వయంగా న్యాయతీర్పులు చెప్పేది. ఆమె దానగుణం కలది మరియు గ్రంథములను ప్రేమించేది. ఆమె సుమారు ఇరువది ఎనిమిది సంవత్సరములు సమర్థవంతంగా రాజ్య పరిపాలన చేసి ఉత్తర భారతదేశంలో మరాఠీయుల రాజ్య గౌరవాన్ని పెంచింది. రాజ్యంలో శాంతి మరియు సువ్యవస్థ నిర్మాణం చేసి ప్రజలను సంతోషంగా ఉంచింది. మరాఠీ రాజ్యం క్షీణదశకాలంలో యశ్వంతరావు హోళ్కర్ రాజ్యాన్ని కాపాడే ప్రయత్నం చేశాడు.



అహిల్యాబాయి హోళ్కర్

**నాగపూర్ భోస్లేలు :** నాగపూర్ వాస్తవ్యులైన భోస్లే వంశంలోని పరసోజీ భోస్లేకు శాహూ మహారాజు కాలంలో వర్హాడ్ మరియు గోండ్‌వన్ ప్రాంతాలకు అధికార పత్రం రాసి ఇచ్చాడు. నాగపూర్ భోస్లేలలోకెల్ల రఘూజీ గొప్ప సామర్థ్యం కలవాడు మరియు పరాక్రమవంతుడు. అతడు దక్షిణంలోని తిరుచిరాపల్లి మరియు ఆర్కాట్‌ల చుట్టుప్రక్కల ప్రాంతాలను మరాఠీయుల అధికారంలోనికి తెచ్చాడు. బంగాలు, బిహార్ మరియు ఒరిస్సా ప్రాంతాల చౌథాయి అను పన్ను వసూలు చేయు అధికారాన్ని శాహూ మహారాజు అతనికి ఇచ్చియుండెను. అతడు ఆ ప్రాంతాన్ని మరాఠీయుల



రఘూజీ భోస్లే

ఆధిపత్యంలోకి తెచ్చాడు. క్రీ.శ. 1751లో ఒరిస్సా సుభాను అలీవర్దీఖాన్ నుండి నాగపూర్ భోస్లేలు జయించారు. తరువాత క్రీ.శ. 1803 వరకు మరాఠీయుల అధికారం ఒరిస్సాపై కొనసాగెను.

**మీకు తెలుసా?**

**మరాఠా డిచ్ :** కోల్‌కతాలోని బ్రిటిష్‌వారు నాగపూర్ భోస్లేల భయానికి గురి అయ్యారు. మరాఠీయులు చేయనున్న ఆక్రమణల నుండి కోల్‌కతా పట్టణంను సంరక్షించుటకై వారు పట్టణం చుట్టూ ఒక కందకాన్ని త్రవ్వారు. అది మరాఠా డిచ్ అను పేరుతో ప్రసిద్ధి చెందినది.

**గ్వాలియర్ శిందేలు :** మొదటి బాజీరావు రాణోజీ శిందే సామర్థ్యాన్ని కనుగొని అతన్ని ఉత్తర ప్రాంతంలో సర్దారుగా నియమించాడు. రాణోజీ మరణానంతరం అతని కుమారులు జయప్ప, దత్తాజీ మరియు మహాద్‌జీ వీరు కూడా తమ పరాక్రమాన్ని ప్రదర్శించి ఉత్తర భారతదేశంలో మరాఠీయుల అధికారాన్ని బలోపేతం చేశారు.



గ్వాలియర్ శిందేలు

మాధవరావు పేశ్వా శిందే వంశంలోని సర్దారు పదవిని మహాద్‌జీకి అప్పగించాడు. అతడు పరాక్రమవంతుడు మరియు రాజనీతిజ్ఞుడు. పానిపత్ ఓటమి తరువాత ఉత్తర భారతదేశంలో మరాఠీయుల ఆధిక్యతను మరియు ప్రతిష్ఠను నిర్మించే పనిని అతడు చేపట్టాడు. ఉత్తర భారతదేశం యొక్క చదును నేలలపై మరాఠీయుల గొరిల్లా యుద్ధ పద్ధతి సఫలీకృతం కాదని తెలుసుకొన్నాడు. అతడు డిబాయిన్ అను ఫ్రెంచ్ సైన్యతజ్ఞుని మార్గదర్శనంలో తన సైన్యానికి తర్ఫీదు ఇప్పించి ఫిరంగులను సన్నద్ధం చేశాడు. ఈ కవాతు సైన్యం బలంతో అతడు రోహిలులు, జాట్లు, రాజపుత్రులు, బుందేలులు మొదలగు వారిని లొంగదీశాడు.

పానిపత్ యుద్ధం వలన మరాఠీయుల శక్తి క్షీణించడం చూసి ఆంగ్లేయులు ఢిల్లీ రాజకీయాలలో తలదూర్చడం మొదలు పెట్టారు. వారు బెంగాలు సుభా దివాన్ అధికారాన్ని తమ స్వాధీనం చేసుకొన్నారు. వారు ఢిల్లీ చక్రవర్తిని తమ స్వాధీనం లోనికి తీసుకోవాలని ఆశపడ్డారు. అటువంటి విపరీత పరిస్థితులలో మహాద్‌జీ శిందే ఆంగ్లేయులపై విజయం సాధించి చక్రవర్తిని మళ్ళీ సింహాసనంపై కూర్చుండ బెట్టాడు. అతని ఈ కార్యం వలన ప్రసన్నుడై చక్రవర్తి అతనికి 'వకీల్-ఇ-ముత్లక్' అను బిరుదునిచ్చాడు. అతనికి దివాణీ మరియు సైన్య అధికారాలను రాసి ఇచ్చాడని అర్థం. అతడు ఈ పదవిని బాల పేశ్వా సవాయీ మాధవరావు తరపున స్వీకరించాడు. ఈ పదవి వలన ఢిల్లీ సామ్రాజ్యం పూర్తిగా మరాఠీయుల స్వాధీనం లోనికి వచ్చింది. కూలిపోయే చక్రవర్తిత్వాన్ని నిలపడం సులభమైన పనికాదు. మహాద్‌జీ అతి ప్రతికూల పరిస్థితిని అధిగమించి చాల పట్టుదలతో క్రీ.శ. 1784 నుండి 1794 వరకు ఢిల్లీ పరిపాలనను చూశాడు.

పానిపత్ యుద్ధానికి బాధ్యుడైన నజీబ్‌ఖాన్ యొక్క వారసుడు ఇంకను రోహిల్‌ఖండ్‌లో కుట్రలు పన్నుతూనే ఉండెను. నజీబ్‌ఖాన్ మనుమడు గులామ్ కాదిర్ లాల్ ఖిల్లాను స్వాధీనపరచుకొని డబ్బు కొరకు చక్రవర్తిని మరియు రాణులను హింసించెను. చక్రవర్తి యొక్క కండ్లుపీకి ధనాగారాన్ని దోచుకొన్నాడు. మహాద్‌జీ అటువంటి పరిస్థితిలో కాదిర్‌ను ఓడించాడు. అతడు దోచుకొన్న సంపదను స్వాధీనం చేసుకొని చక్రవర్తికి తిరిగి అందించాడు. చక్రవర్తిని ఢిల్లీ సింహాసనంపై మళ్ళీ కూర్చుండబెట్టాడు. ఈ విధంగా మహాద్‌జీ పానిపత్ యుద్ధం తరువాత మరాఠీయుల కీర్తిని తిరిగి సంపాదించాడు. ఢిల్లీ చక్రవర్తిని మరాఠీయుల ఆధీనంలో ఉంచి భారతదేశ రాజకీయాలను నడిపించారు.

పేశ్వాల గృహకలహాల పరిణామంగా రఘునాథరావు ఆంగ్లేయులను ఆశ్రయించాడు. ఆంగ్లేయుల సహాయంతో పేశ్వా పదవిని చేపట్టాలని అతని ఉద్దేశం. మరాఠీ రాజనీతిజ్ఞులకు ఇది నచ్చలేదు. అందువలన మరాఠీయుల మరియు ఆంగ్లేయుల మధ్య పోరాటం తప్పనిసరియైనది. కాని దీని వలన ఒకటి మాత్రం స్పష్టమైనది. హిందూస్థాన్‌పై ఎవరు రాజ్యమేలాలనే తుది నిర్ణయం మరాఠా మరియు ఆంగ్లేయులనబడే ఈ రెండు గొప్ప బలాల పోరాటం నుండే జరుగనుండెను.

ముంబయి నుండి ఆంగ్లేయులు బోర్‌ఘాట్ మార్గం గుండా మరాఠీయులపై దాడికి వచ్చారు. మహాద్‌జీ శిందే నేతృత్వంలో మరాఠీ సైన్యం ఐక్యమైంది. గొరిల్లా యుద్ధ పద్ధతినుపయోగించి మరాఠీయులు ఆంగ్లేయులకు ధాన్య సామాగ్రి అందకుండా చేశారు. ఇరుసైన్యాలు వడగావ్ (ప్రస్తుత పుణె-ముంబయి మార్గంపై) వద్ద ఎదురుపడ్డాయి. ఈ యుద్ధంలో ఆంగ్లేయులు ఓడిపోయారు. అందువలన ఆంగ్లేయులు రఘునాథరావును మరాఠీయులకు అప్పగించ వలసి వచ్చింది.

ఢిల్లీపై క్రీ.శ. 1803 వరకు మరాఠీయుల నియంత్రణ ఉండెను. ఆంగ్లేయులు భారతదేశాన్ని గెలిచారంటే, అది మరాఠీయులతో యుద్ధం చేసియే అనునది గమనించి నట్లయితే మహాద్‌జీ యొక్క కార్యకుశలత యొక్క విలువ తెలుస్తుంది. ఢిల్లీ యొక్క పరిపాలనా వ్యవస్థను ఏర్పాటుచేసి అతడు పుణెకు వచ్చాడు. పుణె సమీపంలోని వాన్‌వడి వద్ద అతడు మరణించాడు. అక్కడ వారి జ్ఞాపకార్థము ఛత్రాన్ని నెలకొల్పారు.



శిందే ఛత్రీ, వాన్‌వడీ - పుణె

శిందేలు, హోళ్కర్లు మరియు భోస్లేల మాదిరిగా ఇతర కొంతమంది ప్రముఖులైన సర్దారులు కూడా మరాఠీయుల రాజ్యంలో పేర్కొనదగిన సేవలు చేశారు.

శివాజీ మహారాజు నెలకొల్పిన నౌకాదళాన్ని కాన్హోజీ మరియు తుళాజీ ఆంగ్రే అను తండ్రీ కొడుకులు బలోపేతం చేశారు. ఈ బలోపేతమైన నౌకాదళ సామర్థ్యంతో వారు నౌకాదళ రాజ్యాలైన పోర్చుగీస్, ఆంగ్లేయ మరియు సిద్దీల రాజ్యాలను అదుపుచేసి మరాఠీయుల రాజ్య తీరప్రాంతాలను సంరక్షించారు.

సేనాపతి ఖండేరావు దాభాడే మరియు అతని కుమారుడు త్రింబక్ రావులు గుజరాత్‌లో మరాఠీ అధికారానికి పునాది వేశారు. ఖండేరావు మరణానంతరం అతని భార్య ఉమాబాయి అహ్మదాబాద్ మొఘలు సర్దారును దండించింది. అక్కడి కోటను జయించింది. తరువాత గాయక్వాడ్‌లు గుజరాత్‌లోని వడోదరాను తమ రాజ్యానికి కేంద్రంగా చేసుకొన్నారు. మధ్యప్రదేశ్‌లోని ధార్ మరియు దేవాస్‌లకు చెందిన పవార్లు, శిందే మరియు హోళ్కర్లకు ఉత్తర భారతదేశంలో మరాఠీ రాజ్య విస్తరణలో అమూల్యమైన సహాయం చేశారు.

మాధవరావు పేశ్వా మరణానంతరం మరాఠీయుల రాజ్యం అస్తవ్యస్తమైనది. దానిని నానా ఫడ్నవీస్ మరియు మహాద్‌జీ శిందేలు సరిచేశారు. మహాద్‌జీ ఉత్తర భారతదేశంలో మరాఠీయుల అధికారాన్ని స్థాపించుటలో నిమగ్నమై యుండగా నానా ఫడ్నవీస్ దక్షిణంవైపు రాజకీయాలను చూసుకొన్నాడు. ఈ కార్యంలో పట్‌వర్ధన్, హరిపంత్ ఫడకే, రాస్తే మొదలగు సర్దారులు అతనికి తోడ్పడ్డారు. అందువలన మరాఠీయుల ఆధిపత్యం దక్షిణంలో స్థాపించబడింది. ఇందోర్ హోళ్కర్లు, నాగపూర్ భోస్లేలు, గ్వాలియర్ శిందేలు, వడోదరా గాయక్వాడ్‌లు పరాక్రమం, నేతృత్వం, సామర్థ్యం మొదలగు గుణగణాల ద్వారా మరాఠీయుల రాజ్యానికి వైభవాన్ని తీసుకువచ్చారు. వారు మరాఠీయుల రాజ్యాధికారానికి చివరి దశలో ఆధారస్తంభాలుగా ఉండిరి.



నానా ఫడ్నవీస్

ఉత్తర మరియు దక్షిణ భారతదేశంలో మరాఠీయుల ఆధిపత్యం ఏర్పాటు చేయడంలో మరాఠీ సర్దారులు సఫలులైరి. మహాద్‌జీ శిందే మరియు నానా ఫడ్నవీస్ మరణానంతరం మాత్రం ఈ రాజ్యానికి క్షీణదశ కలిగింది. ఈ కాలంలో రఘునాథరావు కుమారుడు రెండవ బాజీరావు పేశ్వాగా ఉండెను. అతని వద్ద నేతృత్వ లక్షణాలు లేవు. అంతే కాకుండా అనేక లోపాలు కూడా ఉండెను. అతడు

మరాఠీ సర్దారులలో ఐకమత్యాన్ని నిర్మించలేకపోయాడు. మరాఠీ సర్దారులలోని చీలికల వలన అంతర్గతంగా బలహీనపడింది. ఇటువంటి అనేక కారణాల వలన రెండవ బాజీరావు కాలంలో ఉత్తరంలోను మరియు దక్షిణంలోనూ మరాఠీయుల ప్రభావం తగ్గుతూ పోయింది. మరాఠీయుల స్థానాన్ని ఆంగ్లేయులు తీసుకున్నారు.

ఆంగ్లేయులు క్రీ.శ. 1817లో పుణెను స్వాధీనపరచుకొని అక్కడ తమ పతాకం 'యూనియన్ జాక్'ను ఎగరవేశారు. క్రీ.శ. 1818లో సోలాపూర్ జిల్లాలోని ఆష్టీ యుద్ధంలో ఆంగ్లేయులు మరాఠీయులను ఓడించడంతో మరాఠీయుల రాజ్యం అంతమొందింది. ఈ సంఘటన భారతదేశ చరిత్రలో ఒక గొప్ప మార్పును తీసుకువచ్చేదిగా అయింది. ఈ సంఘటన తరువాత ఆంగ్లేయులు భారతదేశంలోని అధికభాగాన్ని తమ ఆధిపత్యం కిందకు తెచ్చుకొన్నారు. భారతదేశానికి పాశ్చాత్య ప్రపంచంతో సంబంధాలు పెరిగినవి. దానితో బాటు భారతీయ సమాజ వ్యవస్థలో చాలా మార్పులు జరిగాయి. అనేక పాత విషయాలు నిస్తేజమై పక్కన పెట్టబడినవి. ఒక పెద్ద మార్పు సంభవించింది. భారతదేశ చరిత్రలోని మధ్యయుగం సమాప్తమైనది. ఆధునిక కాలఖండం ప్రారంభమైనది.

## అభ్యాసం

**1. ఒకే పదంలో రాయండి.**

(1) ఇందోర్ రాజ్యపరిపాలన పగ్గాలను చూచుకొనినది –

(2) నాగపూర్ భోస్లే వంశంలోని అత్యంత సమర్థుడు మరియు పరాక్రమవంతుడు –

(3) ఢిల్లీ సింహాసనంపై చక్రవర్తిని తిరిగి కూర్చుండ బెట్టినవాడు –

(4) దక్షిణంలోని రాజకీయాలను చూచుకొనినవాడు –

**2. సంఘటనలను క్రమంగా రాయండి.**

(1) ఆష్టీ యుద్ధం (2) ఒరిస్సాపై మరాఠీయుల అధికారం (3) ఆంగ్లేయులు పుణెలో యూనియన్ జాక్‌ను ఎగురవేశారు.

**3. రాయండి.**

(1) అహిల్యాబాయి హోల్కర్ చేసిన పనులు.

(2) మహాద్‌జీ శిందే పరాక్రమం.

(3) గుజరాత్‌లోని మరాఠీయుల అధికారం.

**4.** మరాఠీ అధికారం అంతమవడానికి గల కారణాలను చర్చించండి.

**ఉపక్రమం**

మరాఠీ అధికార విస్తరణ కొరకు తోడ్పాటు నందించిన వంశాల వివరాలు చిత్రాలతో సహితంగా సంగ్రహించి పాఠశాలలో ప్రదర్శించండి.



శనివార్ వాడ, పుణె

# 13. మహారాష్ట్రలోని సామాజిక జీవనం

ఛత్రపతి శివాజీ మహారాజు స్థాపించిన హైందవ స్వరాజ్యం ప్రజల రాజ్యం. ప్రజల సంక్షేమం జరగాలని, ప్రజలపై దౌర్జన్యం జరగకూడదని, మహారాష్ట్ర ధర్మరక్షణ జరగాలనునది అతని ఉత్తమమైన ఆలోచన. శివాజీ మహారాజు తరువాత కాలంలో కూడా మరాఠీ రాజ్యం యొక్క విస్తరణ భారతదేశమంతట జరిగింది. మరాఠీయుల రాజ్యం సుమారు 150 సంవత్సరాలు నిలిచియున్నది.

మరాఠీ రాజ్యం యొక్క పరిపాలన విషయం గురించి మనం గత పాఠాలలో అభ్యసించాం. ఈ పాఠంలో మనం ఆ కాలం నాటి సామాజిక పరిస్థితులు మరియు ప్రజల జీవనం గురించి తెలుసుకోబోతున్నాం.

**సామాజిక పరిస్థితులు :** వ్యవసాయం మరియు వ్యవసాయంపై ఆధారపడిన పరిశ్రమలు ఉత్పత్తికి సంబంధించిన గ్రామ ప్రాతిపదికపై గల ప్రముఖ వనరులు. గ్రామం యొక్క పాటిల్‌కు గ్రామ సంరక్షణ, కులకర్ణికి భూమిశిస్తును చూసుకొనే బాధ్యతలు ఉండేవి. పాటిల్ పదవిని నిర్వహించుటకు పాటిల్‌కు భూములు ఇనాముగా ఇవ్వబడేవి. అతనికి ఈ పనికోసం భూమిశిస్తులోని కొంతవాటా లభిస్తుండేది. చేతివృత్తుల వారికి గ్రామం కొరకు చేసిన పనులకు ప్రతిఫలం వస్తురూపంలో లభించేది. పల్లెలలోని వృత్తులలో నలుపు (శ్రమతో కూడిన) తెలుపు (తెలివితో కూడిన) అను రెండు ముఖ్యభాగాలు ఉండేవి. నలుపు వృత్తిలో పని చేసే వారు రైతులు మరియు తెలుపు వృత్తిలో పని చేసే వారు ఇతరులు. గ్రామాలలోని అన్ని వ్యవహారాలు పరస్పర అవగాహనతో జరిగేటట్లు శ్రద్ధ తీసుకోబడేది. సమిష్టి కుటుంబ పద్ధతికి ప్రాధాన్యత ఉండెను.



**మీకు తెలుసా?**

గ్రామంలో కమ్మరి, వడ్రంగి, కుమ్మరి, కంసాలి మొదలగు పన్నెండు చేతి వృత్తులవారు ఉండేవారు. ఈ చేతి వృత్తుల వారు గ్రామంలోని వారి పనులు చేసేవారు.

**ఆచారవ్యవహారాలు :** ఈ కాలంలో బాల్య వివాహ పద్ధతి వాడుకలో ఉండెను. బహుభార్యత్వ ఆచారం ఉండెను. వితంతువులు పునర్వివాహం చేసుకొన్న ఉదాహరణలు ఉన్నాయి. మానవ దేహాల అంతిమ సంస్కార పద్ధతులలో దహనం చేయడం, పాతిపెట్టడం, విసర్జించడం ఉండెను. చిన్న చిన్న విషయాల కొరకు లేక యుద్ధం కొరకు ముహూర్తం మొదట చూడడం జరిగేది. స్వప్నం, శకునాలపై ప్రజలకు విశ్వాసం ఉండేది. దేవుళ్ళు లేక గ్రహాలు ఆగ్రహం చెందకుండా ఉండుట కొరకు పూజలు నిర్వహింపబడేవి. అందుకోసం దానధర్మాలు చేయబడేవి. జ్యోతిష్యంపై ప్రజలకు విశ్వాసం ఉండేది. శాస్త్రీయదృష్టి అభావం మరియు వైద్యం కంటె మొక్కులకు ప్రాధాన్యత ఉండెను.

**జీవనశైలి :** అధిక సంఖ్యలో ప్రజలు పల్లెలలో నివసించేవారు. పల్లెలు స్వయంసమృద్ధిగా ఉండేవి. కేవలం ఉప్పు మాత్రమే వారికి ఇతర ప్రాంతాల నుండి దిగుమతి చేసుకోవలసి వచ్చేది. రైతుల అవసరాలు పరిమితంగా ఉండేవి. రైతులు జొన్నలు, సజ్జలు, గోధుమలు, రాగులు, మొక్కజొన్న, బియ్యం మొదలగు ధాన్యాలను పండించేవారు. దైనందిన ఆహారంలో రొట్టెలు, ఉల్లిపాయలు, పచ్చడి మరియు పలుచని కూరలు సమావేశితమై ఉండేవి. తమలోని వ్యవహారాలను వస్తుమార్పిడి పద్ధతి ద్వారా చేసుకొనేవారు. గ్రామంలోని ఇండ్లు సాధారణమైనవిగా, మట్టిఇటుకలతో నిర్మించబడినవిగా ఉండేవి. పట్టణాలలో ఒక అంతస్తు మరియు రెండు అంతస్తుల మిద్దెలు ఉండేవి. శ్రీమంతుల భోజనంలో అన్నం, పప్పు, రొట్టెలు, కూరలు, సలాడ్, పాలుపెరుగు పదార్థాలు ఉండేవి. ధోవతీ, కుర్తా, కంచుకము, తలపాగా ఇలా పురుషుల వస్త్రధారణ ఉంటే, చీర, రవికలు ఇలా స్త్రీల వస్త్రధారణ ఉండేది.

**పండుగలు-ఉత్సవాలు :** ఉగాది (గుడిపాడవా), నాగపంచమి, ఎద్దుల పండుగ (బైల్‌పోళా), దసరా, దీపావళి, మకర సంక్రాంతి, హోళీ, ఈద్ మొదలగు పండుగలు-ఉత్సవాలు ప్రజలు జరుపుకొనేవారు. పేశ్వాల కాలంలో గణేశోత్సవం ఘనంగా జరుపబడేది. అది కౌటుంబిక స్వరూపంలో జరుపబడేది. పేశ్వాలు స్వయంగా గణేశుని భక్తులు అగుటవలన ఆ పండుగకు ప్రాముఖ్యత వచ్చింది. ప్రతి సంవత్సరం భాద్రపద చతుర్థీ నుండి అనంత చతుర్దశీ వరకు ఈ ఉత్సవం జరిగేది.

దసరా మూడున్నర ముహూర్తాలలో ఒకటి అగుటవలన ఆ రోజు నుండి శుభకార్యాలను ప్రజలు ప్రారంభించెడివారు.

ఆ రోజు శస్త్రాస్త్రాల పూజ చేసేవారు. సీమోల్లంఘున చేసేవారు. ఒకరికొకరు శమీవృక్ష ఆకులను ఇచ్చిపుచ్చుకొనేవారు. దసరా తరువాత మరాఠీయులు యుద్ధానికి బయలుదేరేవారు. దీపావళిలో బలిప్రతిపద మరియు భావుబీజ్ (భగినీ హస్త భోజనం) ప్రత్యేకించి జరుపుకొనెడివారు. పల్లెటూర్లలో జాతరలు నిర్వహించేవారు. జాతర సమయంలో కుస్తీ పోటీలు ఏర్పాటు చేసేవారు. ఉగాది రోజున గుడి అను ధ్వజాన్ని ఎగురవేసి పండుగ జరుపుకొనేవారు. ఉత్సవ సమయంలో నృత్యగానములు, డప్పుపాటలు, నాటకాలు మొదలగు మనోరంజక కార్యక్రమాలు జరిగేవి. నాటకాలు మనోరంజకాలుగా ప్రసిద్ధి చెందాయి.




ఎడ్ల పందెం

**విద్య :** ఆ కాలంలోని విద్యావిధానంలో పాఠశాలలు మరియు మదర్సాలు ఉండెను. లేఖనం, పఠనం, గణిత (లెక్కలు) విద్య ఇంటి నుండి లభించేది. మోడి లిపి వ్యవహారంలో ఉపయోగింపబడేది.

**రవాణా-ప్రయాణం :** కొండ (ఘాట్) మార్గాలు, రోడ్లు, నదులపై వంతెన మార్గాల ద్వారా వాహనాలు నడిచేవి. ధాన్యం, బట్టలు, కిరాణా వస్తువుల రవాణా ఎడ్ల ద్వారా జరిగేది. నది నుండి పోవడానికి పడవలను ఉపయోగించేవారు. లేఖలు తీసుకొని పోవడం - తీసుకొనిరావడం దూతలు మరియు సందేశవాహకులు చేసేవారు.

**ఆటలు :** ఈ కాలంలో వివిధ ఆటలు ఆడబడేవి. ఆటలు ఉల్లాసము మరియు మనోరంజక సాధనాలుగా ఉండేవి. కుస్తీ, యుద్ధ కళలు ఈ ఆటలు జనప్రియమైనవి. మల్లస్తంభం, దండ, కుస్తీ, కర్రసాము, దండపట్టా, బోథాటీ అను ఆటలు ఆడబడేవి. కబడ్డీ, (హుతుతూ), ఖోఖో, ఆట్యాపాట్యా అను మైదాన ఆటలు పాచికలు, పేకాట, చదరంగం ఆటలు అను ఈ కూర్చొని ఆడే ఆటలు ప్రజలకు ఇష్టమైన ఆటలు.



మల్లస్తంభం (మల్లఖాంబ్)

**మతం మరియు ఆచార వ్యవహారాలు :** హిందు మరియు ముస్లిం అను రెండు ముఖ్యమైన మతాలు ఈ కాలంలో కనిపిస్తాయి. ఛత్రపతి శివాజీ మహారాజు మతధోరణి ఉదారమైనది. ప్రతి ఒక్కరు తమతమ మతం ప్రకారం నడుచుకోవాలి, ఇతరులపై తమ మతాన్ని రుద్దకూడదు అను ఆలోచనా సరళి ఈ కాలంలో ఉండెను. పాఠశాలలు, దేవాలయాలు, మదర్సాలు మరియు మసీదులకు ప్రభుత్వం నుండి విరాళాలు ఇవ్వబడేవి. రెండు మతాలను అనుసరించేవారు ఒండొరుల పండుగలలో భాగస్వాములయ్యేవారు. వార్కర్లు, కృష్ణభక్తి, దత్తభక్తి, నాథ్‌భక్తి, రామదాసభక్తి అను సంప్రదాయాలు వాడుకలో ఉండెను.

**స్త్రీల జీవనం :** ఈ కాలంలో స్త్రీల జీవనం కష్టతరంగా ఉండెను. పుట్టినిల్లు మరియు మెట్టినిల్లు మాత్రమే స్త్రీకి ప్రపంచంగా ఉండేది. స్త్రీ విద్యకై ఎవరును శ్రద్ధ చూపేవారు కాదు. మినహాయింపు పొందిన స్త్రీలు అక్షరాస్యత, పరిపాలన మరియు యుద్ధ కౌశల్యాలలో ప్రగతిని సాధించారు. అందులో వీరమాత జిజాబాయి, యేసూబాయి, మహారాణి తారాబాయి, ఉమాబాయి దాభాడే, గోపికాబాయి, పుణ్యశ్లోక్ అహిల్యాబాయి సమావేశితమై ఉన్నారు. బాల్యవివాహం, విషమ వివాహం, వైధవ్య జీవనం, శిరోముండనం, సతీసహగమనం, బహు భార్యత్వం అను సంప్రదాయాలతో స్త్రీల జీవనాన్ని కట్టి పడవేయడం జరిగింది. మొత్తం మీద వారి జీవనం అత్యంత ప్రతికూలంగా ఉండేది.

క్రీ.శ. 1630 నుండి 1810 ఈ నూట ముప్పాతిక సంవత్సరాల కాల వ్యవధిని సాధారణంగా మరాఠేశాహీ (మరాఠీ పాలన) అంటారు. ఈ కాల వ్యవధిలోని కళలు-కట్టడాల గురించి సంక్షిప్తంగా చూద్దాం.

**శిల్పకళ :** శివాజీ కాలంలో కసబా గణపతి దేవాలయం పునరుద్ధరణ, లాల్ మహాల్ నిర్మాణం, రాజగడ్ మరియు రాయగడ్‌లపై కట్టడాలు, జలదుర్గముల నిర్మాణం ఈ రకమైన కట్టడాలు పేర్కొనదగినవి. హిరోజీ ఇందుల్కర్ ఆ కాలంలో ప్రసిద్ధి పొందిన వాస్తువిశారదుడు.

గ్రామాలను ఏర్పాటు చేస్తున్నపుడు సాధ్యమైనంత వరకు లంబకోణపు రోడ్లు, అంచులలో రాతి నిర్మాణం, నదీతలం అంచులలో ఘాట్లు నిర్మాణం చేసేవారు. పేశ్వాల కాలంలో అహ్మద్‌నగర్, బీజాపూర్ వంటి త్రాగు నీటి వ్యవస్థను పుణె నగరంలో ఏర్పాటు చేయడం జరిగింది. పేశ్వాలు భూగర్భ కుళాయిలు, చిన్న చిన్న ఆనకట్టలు, ఉద్యాన వనాలు, జలాశయాలు, ఫౌంటేన్లు (కారాంజీలు) ఏర్పాటు చేశారు. పుణె పట్టణ సమీపంలోని హడప్‌సర్ ప్రాంతంలోని దివే ఘాట్‌లోని మస్తానీ చెరువు కట్టడాల దృష్ట్యా ముఖ్యమైనది.

పుణెలోని శనివార్‌వాడా, విశ్రామ్ బాగ్‌వాడా, నాసిక్‌లోని సర్కార్‌వాడా, కోపర్‌గావ్‌లోని రఘునాథ్ పేశ్వావాడా, సాతార్‌కర్, ఛత్రపతి వాడలు అంతేకాకుండా వాయి, మేణవలీ, టోకే, శ్రీగోందే, పండర్‌పూర్‌లోని పాత వాడలు మధ్యయుగ కాలంనాటి వాడల సంస్కృతికి చిహ్నాలు.

వాడల నిర్మాణంలో పచ్చి మరియు కాల్చిన ఇటుకలను ఉపయోగించేవారు. కర్ర స్తంభాలు, కర్ర దూలాలు, పీఠాలు, చెక్కిన రాళ్ళు, కమాన్లు (చాపములు), బాగుగా కలిపిన సున్నం, నాళపు పెంకుల కప్పు, బురదమట్టి, వెదురుబొంగులను కట్టడాలలో ఉపయోగించేవారు. వాడలను అలంకరించుట కొరకు చిత్రములు, రంగుపని, కర్రశిల్పాలు, అద్దాలను ఉపయోగించేవారు.

**దేవాలయాలు :** శివాజీ కాలంనాటి దేవాలయాలు యాదవకాలం నాటి హేమాడ్ సంప్రదాయ పద్ధతికి చెందినవి. కొల్హాపూర్ అంబాబాయి దేవాలయ శిఖరం, జోతిబా డోంగర్ (గుట్ట)పై గల ఆలయాలు, శిఖర శింగణాపూర్‌లోని శంభూ మహదేవ్, వేరూళ్‌లోని ఘృష్ణేశ్వర్ ఆలయం శిల్పకళకు ఉత్తమ ఉదాహరణలు. ప్రతాపగడ్‌పై భవానీదేవి మరియు గోవాలోని సప్తకోటేశ్వరుని ఆలయాలు శివాజీ మహారాజు నిర్మించాడు. పేశ్వాకాలంలో నాశిక్‌లో కాళారామ్ ఆలయం, త్ర్యంబకేశ్వరుని శివమందిరం, గోదావరి-ప్రవరా నదుల సంగమం వద్ద గల కాయగావ్ మరియు టోకే వద్ద గల శివాలయాలు, నెవాసే వద్ద మోహినీరాజ్ ఆలయం ఈ ఆలయాలు ఆ కాలంలో నిర్మించబడినవి.



ఘృష్ణేశ్వర్ మందిర్

**ఘాట్లు :** నదులు లేక నదీ సంగమ స్థానాలలో చెక్కిన రాళ్ళతో నిర్మించిన ఘాట్లు (స్నాన వాటికలు) మరాఠీయుల పరిపాలనలోని విశిష్టత. ఈ కాలంలోని అన్నింటిలోకెల్ల చూడదగిన ఘాట్ గోదావరి మరియు ప్రవరా నదుల సంగమ స్థానంలో ప్రవరా సంగమం టోకే వద్ద కలదు. పక్కాగా నిర్మించిన మెట్ల వరుసలో, నిర్దిష్ట అంతరంలో ఒక మెట్టు ముందుకు పెంచబడి ఉన్నది. అందువలన అన్ని ఘాట్ల స్వరూపం వివృతం (విడివడనట్లు) అయిపోతుంటుంది. నీటి ప్రవాహం వలన ఘాట్లు కొట్టుకుపోకుండా నిర్దిష్ట దూరంలో దృఢమైన బురుజులు నిర్మించబడేవి.

**చిత్రకళ :** పేశ్వాల కాలంలో శనివార్‌వాడ యొక్క గోడలపై గల చిత్రాలు చాలా ముఖ్యమైనవి. ఈ కాలంలో రాఘో, తానాజీ, అనుపరావు, శివరాం, మన్‌కోజీ మొదలగు ప్రముఖ చిత్రకారులు ఉండిరి. సవాయి మాధవరావు పేశ్వా కాలంలో గంగారాం తాంబట్ అను ప్రఖ్యాత చిత్రకారుడు ఉండెను. పేశ్వాలు చిత్రకళకు ప్రోత్సాహాన్ని ఇచ్చారు. పేశ్వాల

కాలంలో పుణె, సాతారా, మేణవళీ, నాశిక్, చాంద్వడ్ మరియు నిపాణి ప్రాంతాలలోని కోటలలోని గోడలపై చిత్రాలు ఉండెను. పాండేశ్వర్, మోర్గావ్, పాల్, బెన్వడీ, పుణె దగ్గర గల పాశాణ్ అను చోటగల మందిరాల గోడలపై చిత్రాలు ఉండెను. ఈ కాలంలోని చిత్రాలు దశావతారాలు, గణపతి, శివుడు, రామ పంచాయతనములు, విదర్భలోని జామోద్ వద్ద గల జైన మందిరంలోని జినచరిత్ర, పౌరాణిక కథలకు సంబంధించి ఉండెను. రామాయణం, మహాభారతం, పండుగలు, ఉత్సవాలపై ఆధారపడిన చిత్రాలు ఉండేవి. గ్రంథాలకు సంబంధించిన చిత్రాలు, లఘుచిత్రాలు, వ్యక్తి చిత్రాలు, ప్రాసంగిక చిత్రాలు ఉండేవి.

**శిల్పకళ :** శివాజీ కాలంలోని శివాజీ మహారాజు కర్నాటక దండయాత్ర సమయంలో మల్లమ్మ దేశాయిని కలుసుకొన్న శిల్పం, భులేశ్వర్ మందిరంపై గల శిల్పకళ, వ్యక్తుల శిల్పాలు, జంతువుల శిల్పాలు (ఉదా: ఏనుగులు, నెమళ్ళు, కోతులు) టోకే వద్దగల మందిరంలోని శిల్పాలు మరియు బాహ్యభాగంలోని శిల్పకళ, పుణెలోని త్రిశుండ గణపతి మందిరం, మధ్యప్రదేశ్‌లోని అహిల్యాబాయి హోళ్కర్ యొక్క ఛత్రం, నెవాసే వద్ద గల మోహినీరాజ్ మందిరంలోని శిల్పకళ ముఖ్యమైనది.

**లోహ విగ్రహాలు :** పేశ్వాలు పుణెలో పర్వతి వద్దగల మందిరంలో పార్వతి మరియు గణపతి విగ్రహాలు పూజకోసం తయారు చేయించుకొన్నారు. దానితోబాటు కర్ర శిల్పాలు కూడ తయరయ్యేవి.

**వాఙ్మయం :** భక్తి (సంత్) వాఙ్మయం, పౌరాణిక కథలు, టీకా వాఙ్మయం, ఓవీలు (నాలుగు పంక్తుల రచనలు), అభంగాలు, గ్రంథాలు, కథాకావ్యాలు, చారిత్రక కథలు, భక్తుల (సంత్) చరిత్రలు, ఖండ కావ్యరచనలు, దేవీదేవతల హారతి పాటలు, పోవాడాలు (జానపద గేయగాథలు), బఖరీలు, చారిత్రక పత్రాలు ఇవి వాఙ్మయం యొక్క ముఖ్యమైన భాగాలు.


**నాటక కళ :** దక్షిణంలో తంజావర్ వద్ద మరాఠీ నాటకాలు పదిహేడవ శతాబ్దం చివరి భాగం నుండి ప్రారంభమైనవి. సర్ఫోజీ రాజులు ఈ కళకు ప్రోత్సాహాన్ని ఇచ్చారు. ఈ నాటకంలో గానం మరియు నృత్యాలకు ప్రాధాన్యత ఉండేది.

ఇప్పటివరకు మనం మధ్య యుగంలోని కాలఖండం యొక్క అవగాహన చేసుకొన్నాం. మరాఠీయుల రాజ్యోదయం, మరియు విస్తరణను అభ్యసించాం. వచ్చే సంవత్సరం మనం ఆధునిక కాలఖండం గురించి అధ్యయనం చేద్దాం.



## అభ్యాసం

1. పట్టికను పూరించండి.




2. సమాజంలో ఏయే అనుచితమైన ఆచారవ్యవహారాలు కొనసాగుతుండెను? వాటిని నివారించుటకు ఉపాయాలను సూచించండి.

3. మీ పరిసరాలలో జరుపుకొనే పండుగలు మరియు ఉత్సవాల గురించి సవిస్తరంగా టిప్పణులు తయారు చేయండి.

4. కింది అంశాల ఆధారంగా శివాజీ కాలంలోని సమాజ జీవనం మరియు ప్రస్తుత సమాజ జీవనాలను పోల్చండి.

| క్ర. | అంశాలు | శివాజీ కాలం నాటి సమాజ జీవనం | ప్రస్తుత సమాజ జీవనం |
|---|---|---|---|
| 1. | వ్యవహారాలు | ........... | ............... |
| 2. | ఇండ్లు | ........... | సిమెంటు కాంక్రీటుతో పక్కాగా నిర్మించిన బహుళ అంతస్తు భవనాలు |
| 3. | రవాణా సౌకర్యాలు | ........... | బస్సు, రైల్వే, విమానం |
| 4. | మనోరంజనం | ........... | ........... |
| 5. | లిపి | ........... | ........... |

**ఉపక్రమం**

మన దేశంలోని సమర్థవంతులైన స్త్రీల గురించి వివరాలు సంగ్రహించండి. వానిని తరగతిలో చదవండి.


ఉదా: పి.వి. సింధు, సాక్షీ మలిక్.

# పౌరశాస్త్రం

## విషయ సూచిక

### మన సంవిధానం


| క్ర. స. | పాఠం పేరు | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | మన సంవిధానం యొక్క పరిచయం.................... | 63 |
| 2. | సంవిధానం యొక్క పీఠిక................................ | 68 |
| 3. | సంవిధానం యొక్క విశిష్టతలు .......................... | 72 |
| 4. | ప్రాథమిక హక్కులు - 1వ భాగం ......................... | 76 |
| 5. | ప్రాథమిక హక్కులు - 2వ భాగం ......................... | 80 |
| 6. | ఆదేశిక సూత్రాలు మరియు ప్రాథమిక విధులు......... | 83 |

| అధ్యయన – ఆధ్యాపన ప్రక్రియ | అధ్యయన ఫలితాలు | |
|---|---|---|
| **అధ్యయనార్థికి జతగా/సమూహంలో/వ్యక్తిగతంగా అధ్యయన అవకాశం కల్పించి, వారిని తర్వాతి అంశాలకై ప్రేరేపించుట.** | అధ్యయనార్థి – | |
| • ప్రజాసామ్యం, సమనాత్వం, రాజ్యపాలన, లింగ వివక్ష, మాధ్యమాలు, ప్రకటనలు మొదలగు భావనలపై చర్చలలో పాల్గొనుట. | 07.73H.13 | ప్రజాస్వామ్యంలో సమానత్వం ప్రాముఖ్యతను స్పష్టం చేస్తారు. |
| • సంవిధానం యొక్క ప్రాముఖ్యత, (ఉద్దేశిక/పీఠక) సమనత్వ అధికారం, సమానత్వ పోరాటం వీటిపై చిత్రాలు కత్తింపులు వీటి సహాయంతో గోడ పత్రికలు తయారు చేయుట. | 07.73H.14 | రాజకీయ సమానత్వం, ఆర్థిక సమానత్వం మరియు సామాజిక సమానత్వం వీటిలోని భేదాన్ని అర్థం చేసుకోగలుగుతారు. |
| • సంవిధానం యొక్క విశిష్టతల వివరాలను సేకరించుట. | 07.73H.15 | సమానత్వపు హక్కు విషయంలో తమ ప్రాంతంలోని సామాజిక, రాజకీయ మరియు ఆర్థిక సమస్యల యొక్క విశేషార్థాన్ని తెలుసుకొంటారు. |
| • ప్రాథమిక హక్కుల గురించి చర్చలు. | 07.73H.16 | స్థానిక ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం వీటిలోని భేదాన్ని అవగతం చేసుకొంటారు. |
| • ప్రజాస్వామ్యంలోని సమానత్వం, బాలికల పట్ల చూపే భేదభావాన్ని ఎదుర్కొనుట మొదలగు అంశాలపై పాటలు, కవితలదో బాటు భూమిమికను ప్రదర్శించుట. | 07.73H.17 | ప్రజాస్వామ్య ప్రభుత్వ వ్యవస్థ యొక్క విశిష్టతలను స్పష్టం చేస్తారు. |
| • ఆదేశిక సూత్రాలు మరియు ప్రాథమిక కర్తవ్యాలు, సామ్యభేదాల గురించి చర్చించుట. | 07.73H.18 | సంవిధానంలో నమోదు చేసిన హక్కులకు న్యాయాలయం యొక్క విశేష సంరక్షణ ఉంటుందని తెలుసుకొంటారు. |
| | 07.73H.19 | చట్టం ముందు అందరు వ్యక్తులు సమానం అని అర్థం చేసుకొంటారు. |
| | 07.73H.20 | ఆదేశిక సూత్రాలకు న్యాయాలయ సంరక్షణ లేదు కాని వాటికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని తెలుసుకొంటారు. |
| | 07.73H.21 | ప్రాథమిక హక్కులు మరియు ప్రాథమిక విధులను సరియైన ఉదాహరణలతో చెబుతారా. |
| | 07.73H.22 | ప్రాథమిక హక్కులకు సంబంధించిన జ్ఞానాన్ని ప్రత్యక్షంగా ఉపయోగించి ఏదేని సందర్భంలో హక్కులు భంగం, హక్కుల సంరక్షణ మరియు హక్కుల పరిపోషణ ఎలా చేయవచ్చునో తెలుసుకొంటారు. |

# 1. మన సంవిధానం యొక్క పరిచయం

**పద! కొంత పునశ్చరణ చేద్దాం!**

గత తరగతుల పౌరశాస్త్ర పాఠ్యపుస్తకాలలో మనం నియమ నిబంధనల ఆవశ్యకతకు సంబంధించి చాలా అంశాలు అవగతం చేసుకున్నాం. కుటుంబం, పాఠశాల, మన గ్రామం లేక పట్టణాల కార్యకలాపాలు నిరాటంకంగా సాగవలెనని మనం పద్ధతులను మరియు నియమాలను పాటిస్తాం. కుటుంబంలో నియమాలు ఉండవు. కాని ప్రతి కుటుంబంలోని సభ్యులు ఎలా నడుచుకోవాలనే విషయం గురించి కొన్ని పద్ధతులు ఉంటాయి. పాఠశాలలో ప్రవేశానికి సంబంధించి, బడిదుస్తులు (యునిఫాం) మరియు చదువు గురించిన నియమాలు ఉంటాయి. వివిధ పోటీలకు సంబంధించిన నియమాలు కూడా ఉంటాయి. మన గ్రామం మరియు పట్టణం యొక్క పరిపాలన కూడా నియమాలను అనుసరించి సాగుతుంది. అదే విధంగా మన దేశం యొక్క పరిపాలన కూడా నియమాలను అనుసరించే నడుస్తుంది. కుటుంబం, పాఠశాల, గ్రామం మరియు పట్టణాలకు సంబంధించిన నియమాలు పరిమితంగా ఉంటాయి. కాని దేశం యొక్క పరిపాలనకు సంబంధించిన నియమాలు లేక నిబంధనలు మాత్రం విపులంగా ఉంటాయి.

> సమీర్ మరియు వందనలకు కలిగిన సందేహాలను మీకు ప్రశ్నించాలని అనిపిస్తుందా?
>
> - దేశం యొక్క పరిపాలన ఏ నియమాలు లేక నిబంధనలతో సాగుతుందో ఆ నియమాలు ఎక్కడ ఉంటాయి?
> - ఆ నియమాలను ఎవరు తయారు చేస్తారు? వాటిని పాటించుటకు కట్టుబడి ఉండవలయునా?

కింది పరిచ్ఛేదంలో మీకు వాటికి జవాబులు దొరుకుతాయేమో చూడండి.

**సంవిధానం: అర్థం**

దేశం యొక్క పరిపాలనకు సంబంధించిన నిబంధనలను సంకలనం చేసి మరియు క్రమబద్ధంగా నమోదు చేయబడిన గ్రంథాన్ని **'సంవిధానం'** లేదా **'రాజ్యాంగం'** అని అంటారు. దాని అర్థమే సంవిధానం. అనగా దేశం యొక్క పరిపాలనకు సంబంధించిన నిబంధనల లిఖిత పూర్వక దస్తావేజు. ప్రజల చేత ఎన్నుకోబడి వచ్చిన ప్రతినిధులతో ప్రభుత్వం లేక సర్కారు స్థాపించబడుతుంది. సంవిధానంలోని నిబంధనల ననుసరించి దేశ పరిపాలన కార్యకలాపాలు జరపడాన్ని ప్రభుత్వం పాటించవలసి వస్తుంది. సంవిధానంలోని నిబంధనలు లేక అందులో నమోదు చేసిన చట్టం మౌలికమైనదిగా ఉంటుంది. ప్రభుత్వం సంవిధానానికి విరుద్ధంగా ఉండే చట్టాలను చేయుటకు వీలు లేదు. ఆ విధంగా చేసినట్లయితే ఆ చట్టాలను న్యాయవ్యవస్థ రద్దు చేయవచ్చును.

**సంవిధానంలోని నిబంధనలు :**

సంవిధానంలోని నిబంధనలు అనేక విధములైన అంశాల గురించి ఉంటాయి. ఉదా: పౌరసత్వం, పౌరుల హక్కులు, పౌరుల మరియు ప్రభుత్వ సంస్థల మధ్య సంబంధం, ప్రభుత్వం చేయవలసిన చట్టాల గురించి, ఎన్నికలు, ప్రభుత్వంపై పరిమితులు మరియు దేశం యొక్క అధికార క్షేత్రాలు మొదలగునవి.

సంవిధానం ప్రకారం రాజ్యపరిపాలన చేయవలెనను సూత్రాన్ని చాలా వరకు అన్ని దేశాలు స్వీకరించాయి. అలా ఉన్నప్పటికి ప్రతి దేశానికి సంవిధానం యొక్క స్వరూపం వేరువేరుగా ఉంటుంది. చరిత్ర, సామాజిక రచన, సంస్కృతి, సంప్రదాయాలు మొదలగు వాని విషయంలో వివిధ దేశాలలో భిన్నత్వం ఉంటుంది లేక వైవిధ్యం ఉంటుంది. అదే విధంగా దేశాల యొక్క అవసరాలు మరియు ఉద్దేశ్యాలు కూడా భిన్నంగా ఉండవచ్చును. వాటికి అనుగుణంగా అటువంటి సంవిధానాలను ఏర్పాటు చేసుకొనే ప్రయత్నం ఆయా దేశాలు చేస్తాయి.



**మీకు తెలుసా?**

అమెరికా, ఇంగ్లండ్ దేశాల పరిపాలన సంవిధానాన్ని అనుసరించి నడుస్తుంది. కాని రెండు సంవిధానాల మధ్య భేదం ఉన్నది. ఉదా: అమెరికా యొక్క సంవిధానం క్రీ.శ. 1789లో అమలులోకి వచ్చింది. అది లిఖితపూర్వకంగా ఉండి అందులో కేవలం 7 అధ్యాయముల (ప్రకరణాల)తో కూడి ఉన్నది. కాని 225 సంవత్సరాల కంటె అధిక కాలం గడచినప్పటికిని అదే సంవిధానానుసారంగా నేటికీ అమెరికా రాజ్యపరిపాలన జరపబడుచున్నది.

ఇంగ్లాండు దేశానికి ఎన్నో శతాబ్దాల చరిత్ర ఉంది. దేశ పరిపాలనకు సంబంధించిన నియమాలు ఈ దేశంలో పద్ధతులు, ఆచారాలు, సంప్రదాయాల రూపంలో కనిపిస్తాయి. అయినను వాటిని తు.చ. తప్పకుండా పాటించడం జరుగుతుంది. 1215 సంవత్సరంలో జరిగిన మ్యాగ్నాకార్టా ఒప్పందం నుండి ఇంగ్లండ్ యొక్క సంవిధానం వికసిస్తూపోయింది. కొన్ని లిఖితపూర్వక నియమాలు సమావేశమై ఉన్నప్పటికి ఇంగ్లండ్ యొక్క సంవిధానం ప్రముఖంగా అలిఖితపూర్వకమైనది.



**వెదకుదాం పద!**

నీకు నచ్చిన ఏదేని ఒక దేశం యొక్క సంవిధానం గురించి కింద ఇవ్వబడిన అంశాల ఆధారంగా సంక్షిప్తంగా వివరాలు సేకరించండి:

దేశం పేరు, సంవిధానాన్ని నిర్మించిన సంవత్సరం, సంవిధానం యొక్క రెండు విశిష్టతలు.

**సంవిధానం యొక్క ఆవశ్యకత :** సంవిధానంలో నమోదు చేసిన నిబంధనలు లేక నియమాల ప్రకారం దేశ పరిపాలన కొనసాగించడం వలన అనేక లాభాలు ఉంటాయి.

- ప్రభుత్వానికి నియమాలకు లోబడి దేశ పరిపాలన చేయవలసి వస్తుంది. అందువలన వారికి లభించిన అధికారం లేక హోదా యొక్క దురుపయోగం జరిగే అవకాశం తక్కువగా ఉంటుంది.
- సంవిధానంలో పౌరుల హక్కులు మరియు వారి యొక్క స్వేచ్ఛ గురించి పేర్కొనబడి ఉంటుంది. ప్రభుత్వానికి ఆ హక్కులను హరించే అవకాశంలేదు. కాబట్టి పౌరుల హక్కులు మరియు స్వేచ్ఛ సురక్షితంగా ఉండును.
- సంవిధానంలోని నిబంధనల ననుసరించి దేశ పరిపాలన చేయడం అనగా చట్టబద్ధమైన దేశాన్ని స్థాపించడం వంటిదని చెప్పవచ్చు. ఎందుకనగా దీని ద్వారా అధికారం యొక్క దుర్వినియోగం లేక యదేచ్ఛ పరిపాలనకు తావుండదు.
- సంవిధానం ప్రకారం దేశ పరిపాలన జరగడం చూసి సామాన్య ప్రజలకు ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుంది. అందువలన వారు భాగస్వాములగుటకు ప్రోత్సాహితులవుతారు. సామాన్య ప్రజలకు భాగస్వామ్యం పెరగడం వలన ప్రజాస్వామ్యం అధికంగా దృఢపడుతుంది.
- సంవిధానం ఆయా దేశాల ముందు కొన్ని రాజకీయ ఆదర్శాలను ఉంచుతుంది. ఆ దిశగా సాగాలనే నిబంధన (కట్టడి) కూడా ఆ దేశంపై ఉంటుంది. దాన్నుండి ప్రపంచ శాంతి మరియు సంరక్షణ, మానవ హక్కుల వికాసం జరుగుటకు పరిపుష్టమైన వాతావరణం తయారవుతుంది.
- పౌరుల విధులు గురించి సంవిధానంలో పేర్కొనబడటం వలన పౌరుల యొక్క బాధ్యతలు కూడా నిర్ణయింపబడతాయి.

### దేశ పరిపాలన అనగా నేమి?

దేశం యొక్క ప్రభుత్వ పరిపాలనలో ఏ అంశాలు చేరి ఉంటాయి?


దేశం యొక్క సరిహద్దు రేఖలను సంరక్షించుట, పరాయి దురాక్రమణల నుండి ప్రజలను కాపాడుట మొదలుకొని పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, విద్య మరియు ఆరోగ్య సేవలు, పరిశ్రమలకు ప్రోత్సాహం, బలహీన వర్గాల సంరక్షణ, స్త్రీ, శిశు మరియు ఆదివాసుల ప్రగతి కొరకు పథకాలు (ప్రణాళికలు) మొదలగు అనేక విషయాల గురించి ప్రభుత్వానికి చట్టాలను చేయవలసి వస్తుంది. చట్టాలను అమలు చేయడం ద్వారా సమాజంలో ఆశించిన మార్పును తీసుకురావలసి వస్తుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే ఆధునిక కాలంలోని ప్రభుత్వానికి అంతరిక్ష పరిశోధన నుండి సార్వజనిక (ప్రజా) పరిశుభ్రత వరకు అన్ని అంశాలపై నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. దీనినే ప్రభుత్వ పరిపాలన అని చెప్పవచ్చును.

సంవిధానం యొక్క అర్థం మరియు దాని ఆవశ్యకతను అవగతం చేసుకొన్న తరువాత మనం ఇప్పుడు భారతదేశ సంవిధానం యొక్క నిర్మాణం ఎలా జరిగిందో తెలుసు కొందాం.

**సంవిధాన నిర్మాణం యొక్క నేపథ్యం :** భారతదేశ సంవిధానం యొక్క నిర్మాణం క్రీ.శ. 1946 నుండే ప్రారంభమైంది. స్వతంత్ర భారత ప్రభుత్వ పరిపాలన బ్రిటిష్‌వారు తయారు చేసిన చట్టం ప్రకారం కాకుండా అవి భారతీయులు స్వయంగా తయారు చేసిన చట్టం ప్రకారం నడవాలి అనేది స్వాతంత్ర్య ఉద్యమంలోని నాయకుల కోరిక. దీనిననుసరించి భారతదేశ సంవిధానం తయారు చేయుటకు

ఒక సమితి స్థాపించబడింది. ఆ సమితిని **'సంవిధాన సభ'** అని అంటారు.

**సంవిధాన సభ :** మన దేశం 15 ఆగస్టు 1947 రోజున స్వాతంత్ర్యం పొందింది. అంతకు పూర్వం భారతదేశంలో ఆంగ్లేయుల అధికారం ఉండేది. ఆంగ్ల ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం ముంబయి ప్రాంతం, బెంగాలు ప్రాంతం మరియు మద్రాసు ప్రాంతం వంటి భాగాలుగా విభజించింది. ఈ ప్రాంతాలలోని పరిపాలన అక్కడి ప్రజాప్రతినిధుల ద్వారా కొనసాగింపబడేది. అదేవిధంగా దేశం లోని కొన్ని ప్రాంతాల పరిపాలన అక్కడి స్థానిక రాజులు చూచుకొనేవారు. అటువంటి ప్రాంతాలు **సంస్థానాలు** అని పిలువబడేవి. ఆ సంస్థానాల ప్రముఖులు సంస్థానాధీశులుగా గుర్తింపబడేవారు. సంవిధాన సభలో ప్రాంతాలు మరియు సంస్థానాల ప్రతినిధులు చేర్చబడియుండిరి.



డా. రాజేంద్రప్రసాద్

సంవిధాన సభలో మొత్తం 299 మంది సభ్యులు ఉండిరి. డా. రాజేంద్రప్రసాద్ సంవిధాన సభకు అధ్యక్షులుగా ఉండిరి.

**డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ యొక్క తోడ్పాటు :**

డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ ముసాయిదా సమితికి అధ్యక్షులుగా ఉండిరి. అతనికి వివిధ దేశాల సంవిధానాల గురించి సమగ్రమైన అధ్యయన జ్ఞానం ఉండెను. అతడు రాత్రింబవళ్ళు అధ్యయనం మరియు విచారణ చేసి సంవిధానం యొక్క ముసాయిదాను తయారు చేశాడు.



డా. బాబాసాహెబ్ అంబేడ్కర్

డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ తయారు చేసిన సంవిధాన ముసాయిదాను సంవిధాన సభ ముందు పెట్టబడింది. దానిపై ప్రకరణల వారిగా చర్చ జరిగింది. అనేక సవరణలు సూచింపబడ్డాయి. సంవిధానం యొక్క ముసాయిదా సంవిధాన సభ ముందు ప్రవేశ పెట్టడం, దానికి సంబంధించి అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇవ్వడం, అదే విధంగా సంవిధాన సభ యొక్క సూచనలననుసరించి మౌలిక ముసాయిదాలో సవరణ చేయడం, ప్రతి నిబంధనను దోషరహితంగా చేసే పని డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ గారు చేశారు. భారతదేశ సంవిధాన నిర్మాణంలోని ఈ తోడ్పాటు వలన అతనిని **'భారత సంవిధాన శిల్పకారుడు'** అని అంటారు.

సంవిధానాన్ని సంపూర్ణంగా వ్రాయడం జరిగిన తరవాత సంవిధానసభ దానిని ఆమోదించింది మరియు దానిని 26 నవంబరు 1949 రోజున స్వీకరించింది. కావున

**ఎంత గర్వించదగిన అంశము ఇది!**

- సంవిధాన సభలో చర్చలు మరియు విచార వినిమయం ఆధారంగా నిర్ణయం తీసుకోబడెను. వ్యతిరేక అభిప్రాయాల ఆదరణ మరియు వారి సరైన సూచనల స్వీకృతి అనునవి అక్కడి కార్యకలాపాల విశిష్టత.
- సంవిధానం వ్రాసి పూర్తి చేయుటకు 2 సంవత్సరాల, 11 నెలల మరియు 17 రోజుల కాలం పట్టింది.
- మౌళిక సంవిధానంలో 22 భాగాలు, 395 ప్రకరణలు మరియు 8 అనుబంధాలు యున్నవి.




**మీకు తెలుసా ?**

సంవిధాన సభలో డా. రాజేంద్రప్రసాద్, పండిత్ జవహర్ లాల్ నెహ్రూ, డా. బాబాసాహెబ్ అంబేడ్కర్, సర్దార్ వల్లభభాయి పటేల్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, సరోజినీ నాయుడు, జె.బి.కృపలానీ, రాజకుమారీ అమృత్ కౌర్, దుర్గాబాయి దేశ్‌ముఖ్, హంసాబెన్ మెహతా ఇలా చాలా మంది గౌరవనీయులు సభ్యులుగా ఉండిరి. బి.ఎన్. రావు అను న్యాయనిపుణుడు సంవిధాన సభ యొక్క న్యాయ విషయ సంబంధిత సలహాదారుగా నియమితుడయ్యాడు.

26 నవంబర్ రోజును 'సంవిధానదినం'గా జరుపుకొంటారు. 26 జనవరి 1950 నుండి సంవిధానంలోని నిబంధనల ననుసరించి దేశ పరిపాలన జరుగుట ప్రారంభమైంది. ఆ రోజు నుండి భారతదేశం యొక్క గణతంత్రరాజ్యం అస్థిత్వంలోనికి వచ్చింది. కాబట్టి 26 జనవరి రోజున మనం '**గణతంత్ర దినోత్సవం**'గా ఉత్సవం జరుపుకొంటాం.



పండిత జవహర్‌లాల్ నెహ్రూ



సర్దార్ వల్లభభాయి పటేల్



మౌలానా ఆజాద్



సరోజినీ నాయుడు



**చేసి చూడండి**

మీ తరగతి కార్యకలాపాలు నియమాల ననుసరించి జరగాలని మీకు అనిపిస్తుంది కదా? అందులో మీరు ఏ నియమాలను చేర్చుతారు? అయితే తరగతి కోసం ఒక నియమావళి తయారు చేయండి.



**మీకు తెలుసా?**

డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ జల వ్యవస్థాపన, విదేశీ సంబంధాలు, జాతీయ రక్షణ, పాత్రికేయత, ఆర్థిక, సామాజిక న్యాయం వంటి వివిధ రంగాలలో తోడ్పాటును అందించాడు.



భారత సంవిధానం యొక్క ముసాయిదా, సంవిధాన సభ యొక్క అధ్యక్షుడు డా. రాజేంద్రప్రసాద్ గారికి సమర్పిస్తూ డా. బాబాసాహెబ్ అంబేడ్కర్.

## అభ్యాసం

**1. కింది భావనలను వివరించండి.**

(1) సంవిధానంలోని నిబంధనలు

(2) సంవిధాన దినం

**2. చర్చించండి.**

(1) సంవిధాన సమితి స్థాపించబడింది.

(2) డా. బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను భారత సంవిధాన శిల్పకారుడు అని అంటారు.

(3) దేశం యొక్క ప్రభుత్వ పరిపాలనలో చేర్చబడిన అంశాలు.

**3. సరియైన పర్యాయమును ఎన్నుకోండి.**

(1) ఏ దేశం యొక్క సంవిధానం పూర్తిగా లిఖిత పూర్వకంగా లేదు?

(అ) అమెరికా (ఆ) భారతదేశం

(ఇ) ఇంగ్లండ్ (ఈ) ఇవేవి కావు

(2) సంవిధాన సభ యొక్క అధ్యక్షుడు ఎవరు?

(అ) డా. బాబాసాహెబ్ అంబేడ్కర్

(ఆ) డా. రాజేంద్రప్రసాద్

(ఇ) దుర్గాబాయి దేశ్‌ముఖ్

(ఈ) బి.ఎన్. రావు

(3) కింది వారిలో ఎవరు సంవిధాన సభ సభ్యులు కారు?

(అ) మహాత్మా గాంధీ

(ఆ) మౌలానా ఆజాద్

(ఇ) రాజకుమారీ అమృత్ కౌర్

(ఈ) హంసాబెన్ మెహతా

(4) ముసాయిదా సమితి అధ్యక్షుడు ఎవరు?

(అ) డా. రాజేంద్రప్రసాద్

(ఆ) సర్దార్ వల్లభభాయి పటేల్

(ఇ) డా. బాబాసాహెబ్ అంబేడ్కర్

(ఈ) జె.బి. కృపలాని

**4. మీ అభిప్రాయం రాయండి.**

(1) ప్రభుత్వానికి ఏయే విషయాలపై చట్టాలు చేయవలసి వస్తుంది?

(2) జనవరి 26ను మనం గణతంత్ర దినోత్సవంగా ఎందుకు జరుపుకొంటాం?

(3) సంవిధానంలోని నిబంధనలననుసరించి ప్రభుత్వ పరిపాలన చేయడం వలన లాభాలు.

**ఉపక్రమం:**

(1) సంవిధాన సభ కొరకు వివిధ సమితుల స్థాపన జరిగింది. వానికి సంబంధించిన వివరాలు సేకరించండి మరియు సమితుల పేర్ల పట్టికను తయారు చేయండి. అటులనే పేర్లతో గల చిత్రాలను సేకరించండి.

(2) 'సంవిధాన దినం' పాఠశాలలో ఏ విధంగా జరిగిందో ఒక నివేదిక తయారు చేయండి.

(3) సంవిధాన సభలోని సభ్యుల ఛాయాచిత్రాలను సేకరించండి.

# 2. సంవిధానం యొక్క ప్రస్తావన (పీఠిక)

**గత పాఠంలో మనం ఏం నేర్చుకొన్నాం!**

- సంవిధానం అనగా ప్రభుత్వ పరిపాలన యొక్క నియమాలను విశదపరచే ఒక ముఖ్యమైన దస్తావేజు.
- సంవిధాన సభ భారతదేశం యొక్క సంవిధానాన్ని రూపొందించింది.
- సంవిధానంవలన మన ప్రజాప్రతినిధులు చట్టాననుసరించి ప్రభుత్వ పరిపాలన చేయవలసి ఉంటుంది.

సంవిధానం మన దేశం యొక్క మౌలిక (ప్రాథమిక) మరియు అత్యున్నత చట్టం. ఏదేని చట్టం చేయుటకు కొన్ని నిర్దిష్ట ఉద్దేశ్యాలు లేక కారణాలు ఉంటాయి. ఆ ఉద్దేశ్యాలు లేక కారణాలు స్పష్టపరచిన తరువాత సమగ్రంగా చట్టంలోని ఇతర నిబంధనలు చేయబడతాయి. వాటిని ఒకచోట క్రోడీకరించి సంక్షిప్తంగా మరియు క్రమబద్ధంగా చేసిన ఏర్పాటు అనగా ప్రస్తావన. ఈ ప్రస్తావననే పీఠిక అంటారు. పీఠికనే భారత సంవిధాన **'ప్రస్తావిక'** లేక **'ప్రవేశిక'** అని కూడా అంటారు. పీఠిక మన సంవిధానం యొక్క ఉద్దేశ్యాలను స్పష్టం చేస్తుంది.



**చేసి చూడండి**

సంవిధానం యొక్క పీఠికను చదవండి. అందులోని పదాల యొక్క పట్టిక తయారు చేయండి. ఆ పదాలను మీరు ఇంకా ఎక్కడైనా చదివారా?

మన మందరం భారతదేశ పౌరులం. మన అందరకు ఒక దేశంగా ఏమి సాధించాలో పీఠిక చెపుతుంది. అందులోని విలువలు, ఆలోచనలు మరియు ఉద్దేశ్యాలు ఉదాత్తమైనవి. వాటిని ఎలా పొందాలనే విషయానికి సంబంధించిన నిబంధనలు సంపూర్ణ సంవిధానం ద్వారా వివరింపబడినవి.

సంవిధానం యొక్క ప్రస్తావన 'భారతదేశ ప్రజల మగు మేము' అనే పదాలతో ప్రారంభమగుతుంది. భారత దేశం ఒక 'సార్వభౌమ' సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్రదేశం'గా నిర్మాణం చేయాలనే భారతీయుల నిశ్చయం గురించి అందులో చెప్పబడింది. అందులోని ప్రతి విషయం యొక్క అర్థం మనం తెలుసుకొందాం.

**(1) సార్వభౌమ దేశం :** భారతదేశంపై చాలా కాలం బ్రిటిషువారి పరిపాలన ఉండెను. 15వ ఆగస్టు 1947 రోజున ఈ పరిపాలన అంతమొందెను. మన దేశం స్వతంత్ర దేశమయింది. భారత దేశానికి సార్వభౌమత్వం సిద్ధించింది. మనం మన దేశంలో యోగ్యమైన నిర్ణయాలు తీసుకొనుటకు స్వతంత్రులమయ్యాం. ఏదేని దేశం పరాయి దేశం నియంత్రణలో లేక పోవడం అని సార్వభౌమ అనే పదానికి అర్థం.

మన స్వాతంత్ర్యోద్యమం యొక్క అతి ముఖ్యమైన ఉద్దేశ్యం సార్వభౌమత్వాన్ని పొందడమే. సార్వభౌమత్వం అనగా ప్రభుత్వ పరిపాలన సాగించే అత్యున్నత అధికారం. ప్రజాస్వామ్యంలో సార్వభౌమత్వం ప్రజల చేతుల్లో ఉంటుంది. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకొని వారికి ప్రజల సార్వభౌమాధికారాన్ని ఉపయోగించుకొనేందుకు సమ్మతిస్తారు. మన దేశం యొక్క అంతర్గత విషయాలపై ఏ చట్టాలు చేయవలెనో నిర్ణయించు అధికారం ప్రజలకు మరియు ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వ సంస్థకు ఉంటుంది.

**(2) సామ్యవాద దేశం :** సామ్యవాద దేశం అనగా పేద-ధనిక వర్గాలలో గొప్ప అంతరం ఉండదు. దేశ సంపదపై అందరికి హక్కు ఉంటుంది. సంపద యొక్క కేంద్రీకరణ కొంతమంది చేతుల్లోనే ఉండకుండా జాగ్రత్త తీసుకోబడుతుంది.

**(3) లౌకిక దేశం :** పీఠికలో లౌకికత మన ఉద్దేశ్యమని తెలిపింది. లౌకిక రాజ్యంలో అన్ని మతాలు సమానంగా గౌరవింపబడతాయి.

ఏదేని ఒక మతం ఆ దేశం యొక్క మతంగా భావింపబడదు. పౌరులకు తమ తమ మతాలను అనుసరించే స్వేచ్ఛ ఉంటుంది. పౌరుల మధ్య మతం ఆధారంగా భేదభావం చూపరాదు.

**మీకు తెలుసా?**

లౌకిక మార్గంలో మనం మన సమాజం యొక్క బహుళమత తత్వాన్ని సంరక్షించే ప్రయత్నం చేశాము. మనకు సంవిధానం ఇచ్చిన అనేక హక్కులను హద్దులు మీరి, ఇష్టం వచ్చిన రీతిలో ఉపయోగించకూడదు. మత స్వాతంత్ర్యం కూడా అటులనే ఉంటుంది. మనం ఎప్పుడైతే పండుగలు, ఉత్సవాలు జరుపుకుంటామో అప్పుడు మనకు సార్వజనిక పరిశుభ్రత, ఆరోగ్యం మరియు పర్యావరణం గురించి ఆలోచించడం కూడా అవసరమవుతుంది.

**(4) ప్రజాస్వామ్య దేశం :** ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ పరిపాలన అధికారం ప్రజల చేతుల్లో ఉంటుంది. వారి అభిప్రాయానుసారంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంది మరియు విధానాలను చేస్తుంది. ప్రభుత్వానికి అందరి సంక్షేమంకొరకు ముఖ్యమైన ఆర్థిక, సామాజిక, నిర్ణయాలను తీసుకోవలసి వస్తుంది. అటువంటి నిర్ణయాలు ప్రతిరోజు ప్రజలందరు ఒకచోటకు వచ్చి తీసుకోవడం సాధ్యం కాదు. కాబట్టి నిర్ధారిత సమయం తరువాత ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో ఓటర్లు ఓటు వేసి తమ ప్రతినిధిని ఎన్నుకుంటారు. ఎన్నుకోబడిన ప్రతినిధులు సంవిధానం ఏర్పాటు చేసిన పార్లమెంటు (లోకసభ), కార్యనిర్వాహక మండలి వంటి సంస్థలలోనికి వెళ్తారు. సంవిధానం నమోదు చేసిన లేక చెప్పబడిన ప్రక్రియ ననుసరించి ప్రజలందరి కొరకు నిర్ణయాలు తీసుకొంటారు.

**(5) సమాఖ్య దేశం :** మన దేశంలో ప్రజాస్వామ్యంతో బాటు సమాఖ్య ప్రభుత్వ పద్ధతి ఉంది. సమాఖ్య పద్ధతిలో అన్ని సార్వజనిక పదవులు ప్రజలచేత ఎన్నుకోబడతాయి. ఏ సార్వజనిక పదవి అయినను వంశపారంపర్యంగా రాదు.

రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, గవర్నరు, ముఖ్యమంత్రి, మహాపౌర్ (మేయర్), సర్పంచ్ వంటి పదవులు సార్వజనికమైనవి. ఆ పదవులకై నిర్దిష్ట వయస్సు దాటిన ఏ భారతీయ పౌరుడైనను ఎన్నికల్లో పోటీ చేయవచ్చును. రాజవంశ పాలన పద్ధతిలో ఈ పదవులు వంశపారంపర్యంగా ఒకే కుటుంబంలోని వ్యక్తులకు లభిస్తాయి.

**చర్చించండి**

'నా కుటుంబం' ఈ అంశంపై దీప ఏం రాసిందో చదవండి.

ప్రజాస్వామ్యం అనగా కేవలం ఎన్నికలు కాదు. మా అమ్మానాన్నలు ఇంట్లోని సభ్యులందరు అన్ని పనులను కలిసికట్టుగా చేస్తారు. అందులో మా భాగస్వామ్యం కూడా ఉంటుంది. ఒకరితోనొకరు మాట్లాడుతున్నపుడు మేము సాధ్యమైనంతవరకు కలహించకుండా మాట్లాడుతాము. కలహించుకున్నప్పటికి వెంటనే దానిని రూపుమాపి ఒకరు చెప్పింది మరొకరం వింటాం. ఏదైనా మార్పు చేయవలసి వచ్చినప్పుడు బామ్మ-తాతయ్యలను విచారించడం జరుగుతుంది. అనుజకు వ్యవసాయ రంగం చదువులో పరిశోధన చేయాలని ఉంది. ఆమె నిర్ణయం అందరికి నచ్చింది.

దీప ఇంట్లో ప్రజాస్వామ్య పద్ధతి ఉందని మీకు అనిపిస్తుందా? ప్రజాస్వామ్యంలోని ఏ విశిష్టతలు ఈ పరిచ్ఛేదంలో కనిపిస్తాయి?

పీఠిక భారతీయ పౌరులందరికి న్యాయం, స్వాతంత్ర్యం మరియు సమానత్వం ఈ మూడు విలువలు, వాటిననుసరించి నడుచుకోవడంపై చట్టాలు చేసి ఆ విలువలను ప్రత్యక్ష వ్యవహారంలో తీసుకువచ్చే హామిని ఇచ్చింది. ఈ విలువల అర్థం మనం తెలుసుకొందాం.

**(1) న్యాయం:** అన్యాయాన్ని దూరం చేసి అందరికి అభివృద్ధి పొందే అవకాశాన్ని అందించడం అనగా న్యాయం. ప్రజలందరికి బాగు జరగాలి అనే దృష్టితో ప్రణాళికలు (పథకాలు) చేయడం అనగా న్యాయాన్ని నెలకొల్పడం. పీఠికలో న్యాయం యొక్క మూడు రకాలను తెలపడం జరిగింది. అవి కింది విధంగా ఉన్నాయి.

**(అ) సామాజిక న్యాయం :** వ్యక్తులలో కులం, మతం, వంశం, భాష, ప్రాంతం జన్మస్థలం మరియు లింగ ఆధారంగా ఎటువంటి భేదభావం చూపకూడదు. అందరి స్థాయి మనిషిగా సమానంగా ఉంటుంది.

**(ఆ) ఆర్థిక న్యాయం :** ఆకలి, పస్తులు, కుపోషణ ఈ అంశాలు పేదరికం లేక దారిద్ర్యం వలన నిర్మితమవుతాయి. పేదరికాన్ని నిర్మూలించవలెనన్న ప్రతి ఒక్కరికి తన మరియు తన కుటుంబ పాలనపోషణ చేయుటకు ఉపాధి వనరులను

పొందే హక్కు ఉంది. మన సంవిధానం ప్రతి పౌరునికి ఆ హక్కును ఎటువంటి భేదభావం లేకుండా ఇచ్చింది.

**(ఇ) రాజకీయ న్యాయం :** ప్రభుత్వ పరిపాలనలో భాగస్వాములగుటకు అందరికి సమాన హక్కు ఉండాలని మనం వయోజన ఓటింగు పద్ధతిని స్వీకరించాం. దాని ప్రకారం 18 సంవత్సరాలు పూర్తయిన పౌరులందరికి ఓటు వేయు హక్కు ఉంది.

**(2) స్వాతంత్ర్యం :** స్వాతంత్ర్యం అనగా మనకు బాధ కలిగించు, అయోగ్య నిర్భందం లేకుండుట, మనలోని సామర్థ్యాలు వికసించుటకు పరిపుష్ట వాతావరణం కలిగి యుండటం. ప్రజాస్వామ్యంలో పౌరులకు స్వాతంత్ర్యం ఉంటుంది. స్వాతంత్ర్యం ఉంటేనే ప్రజాస్వామ్యం పరిపక్వమవుతుంది.

ఆలోచన మరియు భావవ్యక్తీకరణ స్వాతంత్ర్యం అనునది వ్యక్తుల యొక్క మౌలిక స్వాతంత్ర్యం. ప్రతి వ్యక్తి తమ అభిప్రాయాలు మరియు ఆలోచనలు వ్యక్తం చేయవచ్చును. ఆలోచనలు ఇచ్చిపుచ్చుకోవటం మనలో సహకారం మరియు ఐకమత్యం అభివృద్ధి చెందుతుంది. దానితో బాటు ఒక సమస్య యొక్క అన్ని కోణాలు మనకు అర్థమవుతాయి.

భక్తి, అవగాహన మరియు ఆరాధనల స్వాతంత్ర్యం ద్వారా మత స్వాతంత్ర్యం వ్యక్తమవుతుంది. మన మతం లేక మనకు ఇష్టమైన మతబోధనల ననుసరించి నడచుకొనే స్వాతంత్ర్యం ప్రతి భారతీయ పౌరునికి ఉంది. మన పండుగలు-ఉత్సవాలు జరుపుకొనుట, పుణ్యక్షేత్రాలను సంరక్షించు కొనుట మరియు ఆరాధించే స్వాతంత్ర్యం ఇందులో ఉద్దేశింపబడినవి.

**(3) సమానత్వం :** పీఠికలో భారత పౌరులకు హోదా (గౌరవం) మరియు అవకాశాల విషయంలో సమానత్వపు హామి ఇచ్చింది.

కులం, మతం, వంశం, లింగ, జన్మస్థలం మొదలగు వాని ఆధారంగా భేదభావం చూపకుండా మానవులుగా అందరికి సమాన గౌరవం ఉండుట అని దాని అర్థం. ఉచ్చ-నీచ, శ్రేష్ఠ-కనిష్ఠ (చిన్న పెద్ద) అను బేధభావం చూపకుండుట అనగా సమాన గౌరవం యొక్క హామీ అవుతుంది. పీఠికలో 'సమాన అవకాశం' కల్పించడాన్ని ముఖ్యమైనదిగా భావించింది. అభివృద్ధికై అవకాశం అందరికి లభిస్తుంది. దానిని కల్పించునప్పుడు ఎలాంటి భేదభావం చూపబడదు.

> **చర్చించండి**
>
> స్వాతంత్ర్యం గురించి కొన్ని అభిప్రాయాలు కింద ఇవ్వబడినవి. వాటిపై చర్చించండి.
>
> - ☐ పండుగలు, ఉత్సవాలు సార్వజనికంగా జరుపు కుంటున్నప్పుడు కొన్ని నియమాలు పాటించవలసి వస్తుంది. అందువలన మన స్వాతంత్ర్యమునకు అడ్డంకి రాదు.
> - ☐ స్వాతంత్ర్యం అనగా మనం ఇష్టం వచ్చినట్లు నడచుకోవడం కాదు. బాధ్యతాయుతంగా నడచుకోవడం.

సంవిధానం యొక్క పీఠికలో ఒక ప్రత్యేకమైన ఆదర్శవంతమైన విషయం లేక తత్వం (సూత్రం) పేర్కొన బడింది. ఆ ఆదర్శం లేక తత్వం అనగా సోదరభావం నిర్మించే ఉద్దేశం మరియు వ్యక్తి యొక్క గౌరవం కాపాడుటకు హామినివ్వడం.

**సౌభ్రాతృత్వం :** సంవిధానకారులకు కేవలం న్యాయం, స్వాతంత్ర్యం మరియు సమానత్వపు హామీ నిచ్చినంతనే భారతదేశ సమాజంలో సమానత్వం ఏర్పడదని అనిపించింది. అందుకోసం ఎన్ని చట్టాలు చేసినను ఎప్పటి వరకైతే భారతీయుల్లో సౌభ్రాతృత్వం ఏర్పడదో అప్పటి వరకు ఈ చట్టాలు ఉపయోగపడవు. అందుకొరకే సౌభ్రాతృత్వ నిర్మాణం అను ఉద్దేశ్యాన్ని పీఠికలో చేర్చడం జరిగింది. సౌభ్రాతృత్వం కలిగియుండడం అనగా మన దేశంలోని పౌరులందరిపట్ల మరియు ఒకరికొకరిపట్ల ఆత్మీయత కలగియుండుట. సౌభ్రాతృత్వం పరస్పరం సహానుభూత భావనను కలిగిస్తుంది. పరస్పర సమస్యల పట్ల ప్రజలు సంవేదన శీలతతో ఆలోచిస్తారు.

సౌభ్రాతృత్వం మరియు వ్యక్తిగౌరవం దీనికి దగ్గరి సంబంధం ఉన్నది. వక్తి గౌరవం అనగా ప్రతి వ్యక్తికి మనిషిగా గౌరవం ఉంటుంది. అది కులం, మతం, వంశం, లింగం, భాష మొదలగు అంశాలతో నిర్ణయింపబడదు. మనతో ఇతరులు ఎంత ఆదరంగా మరియు మర్యాదగా ప్రవర్తించాలని అనుకుంటామో అంతే ఆదరంగా మరియు మర్యాదగా మనం ఇతరులతో ప్రవర్తించాలి.

ఎప్పుడైతే ప్రతి వ్యక్తి, మరో వ్యక్తిని ఆదరించి వారి స్వాతంత్ర్యాన్ని మరియు హక్కులను గౌరవిస్తాడో, అప్పుడు (స్వతసిద్ధంగా) తనంతట అదే వ్యక్తి గౌరవం నిర్మితమవుతుంది. అటువంటి వాతావరణంలో సౌభ్రాతృత్వం సహజంగా అభివృద్ధి చెందుతుంది. న్యాయం మరియు సమానత్వంపై ఆధారపడిన నూతన సమాజ నిర్మాణ కార్యం కూడా చాలా సులభం అవుతుంది. భారత సంవిధాన పీఠిక నుండి దానికి సంబంధించిన మార్గదర్శనం లభిస్తుంది.

భారతదేశ ప్రజలు ఈ సంవిధానాన్ని తమకు తాము సమర్పించుకున్నారు అనే వాక్యంతో పీఠిక సమాప్తమవుతుంది.



## అభ్యాసం

**1. వెతికి రాయండి.**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| పీ | లౌ | కి | క | దే | శం | దే |
| ప్ర | రి | వ | యో | జ | శ | ప్ర |
| వే | సౌ | భ్రా | తృ | త్వం | జా | ఉ |
| శి | మా | సా | మ్య | స్వా | మ | ద్దే |
| క | గౌ | ర | మ్యం | మ | ర | వ |

(1) దేశంలోని పౌరులందరిపట్ల మరియు ఒకరికొకరిపట్ల ఆత్మీయత కలిగి యుండుట.

(2) ప్రభుత్వ పరిపాలనా అధికారం ప్రజల చేతుల్లో ఉంటుంది.

(3) ప్రస్తావననే ఇలా అంటారు.

(4) అన్ని మతాలను సమానంగా గౌరవించుట.

**2. రాయండి.**

(1) లౌకిక రాజ్యంలో ఏ నిబంధనలు ఉంటాయి?

(2) వయోజన ఓటింగు పద్ధతి అనగానేమి?

(3) ఆర్థిక న్యాయం వలన పౌరులకు ఏ హక్కులు లభిస్తాయి?

(4) సమాజంలో వ్యక్తి గౌరవం ఎలా నిర్మితమవుతుంది?

**3.** మనకు లభించిన స్వాతంత్ర్యాన్ని మనం ఏ విధంగా ఉపయోగించుకోవలెను? మీ అభిప్రాయం రాయండి/చెప్పండి.

**4. భావనలను స్పష్టం చేయండి.**

(1) సామ్యవాద దేశం -

(2) సమానత్వం -

(3) సార్వభౌమ దేశం -

(4) అవకాశాలలో సమానత్వం -

**5.** భారత సంవిధానం యొక్క ప్రస్తావనలో ఏ యే ముఖ్యమైన అంశాలు పేర్కొనబడినవి?

**ఉపక్రమం:**

1) ఉపాధ్యాయుల సాయంతో బ్యాలట్ పేపర్ మరియు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (యంత్రం) (EVM) గురించి తెలుసుకొనుటకు తహసీలు కార్యాలయాన్ని సందర్శించండి.

(2) మీ పరిసరాలలోని వార్తా పత్రికల పేర్ల పట్టికను తయారు చేయండి.

▣ ▣ ▣

MIFS8B

# 3. సంవిధానం యొక్క విశిష్టతలు

క్రిందటి రెండు పాఠాలలో మనం భారతదేశం యొక్క సంవిధానం తయారైన విధము మరియు సంవిధాన పీఠిక గురించి నేర్చుకొన్నాం. సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్యం, సమాఖ్య ప్రభుత్వం గురించి తెలుసుకొన్నాం. పీఠికలో నమోదు చేసిన ఈ ఉద్దేశ్యములు మన సంవిధానం యొక్క విశిష్టతలు. ఇవే కాకుండా సంవిధానం యొక్క ఏ విశిష్టతలు ఉన్నాయో వాటి గురించి ఈ పాఠంలో తెలుసుకొందాం.

**సమాఖ్య ప్రభుత్వం :** సమాఖ్య ప్రభుత్వ వ్యవస్థ అనునది మన సంవిధానం యొక్క ఒక ముఖ్యమైన విశిష్టత. విశాల భూప్రదేశం మరియు అధిక జనాభా కలిగిన దేశాలలో పరిపాలన చేయుటకు సమాఖ్య ప్రభుత్వం ఒక పద్ధతి. విశాల భూప్రదేశం ఉన్నట్లయితే ఒకేచోట నుండి రాజ్యపాలన చేయడం కఠినం అవుతుంది, సుదూరంగా ఉన్న ప్రాంతాలు నిర్లక్ష్యం చేయబడతాయి. అక్కడి ప్రజలకు పరిపాలనలో భాగస్వాములగుటకు అవకాశం లభించదు. కాబట్టి సమాఖ్య ప్రభుత్వంలో రెండు స్థాయిల్లో ప్రభుత్వ సంస్థలు ఉంటాయి. సంపూర్ణ దేశం యొక్క సంరక్షణ, విదేశ వ్యవహారాల నిర్వహణ, శాంతి స్థాపన మొదలగు పనులు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. దానిని 'కేంద్ర ప్రభుత్వం' లేక 'సమాఖ్య ప్రభుత్వం' అని కూడా అంటారు. సమాఖ్య ప్రభుత్వం సంపూర్ణ దేశం యొక్క పరిపాలన చేస్తుంది.

మనం నివసించే ప్రదేశం యొక్క పరిపాలనను చూసుకొనే ప్రభుత్వాన్ని 'రాష్ట్రప్రభుత్వం' అంటారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక పరిమిత ప్రదేశం యొక్క పరిపాలన చూసుకొంటుంది. ఉదా: మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం.

రెండు స్థాయిల్లో వేరువేరు అంశాలపై చట్టాలు చేసి పరస్పర సహకారంతో పరిపాలన చేసే పద్ధతిని 'సమాఖ్య దేశం' అని అంటారు.

**అధికార వికేంద్రీకరణ :** కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంవిధానం అధికారాలను పంచి పెట్టింది. దానిననుసరించి ఏ అంశం యొక్క అధికారం ఎవరివద్ద ఉందో చూద్దాం. మన సంవిధానం మూడు జాబితాలను తయారు చేసింది. అందులో వివిధ అంశాలను నమోదు చేసింది.

మొదటి జాబితాను **'కేంద్ర జాబితా'** అంటారు. అందులో 97 అంశాలు ఉన్నాయి. ఆ అంశాలపై కేంద్ర ప్రభుత్వం చట్టాలను చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం కొరకు **'రాష్ట్ర జాబితా'** ఉన్నది. అందులో 66 అంశాలు ఉన్నాయి. ఆ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం చట్టాలను చేస్తుంది. ఈ రెండు జాబితాలు కాకుండ మూడవది **'ఉమ్మడి జాబితా'** ఉన్నది. అందులో 47 అంశాలు ఉన్నాయి. రెండు ప్రభుత్వాలకు ఈ జాబితాలోని అంశాలపై చట్టాలు చేయవచ్చును. ఈ మూడు జాబితాలలో అంశాలుగాక ఏదేని ఒక కొత్త అంశం పుట్టుకొచ్చినపుడు దానిపై చట్టాలు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. ఈ అధికారాన్ని **'ఉత్తరాధికారం'** అని అంటారు.



**మీకు తెలుసా ?**

భారత సమాఖ్య దేశంలోని అధికారాల పంపిణి లేక విభజన ప్రత్యేకమైనది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారం చేసుకొంటూ దేశాభివృద్ధి సాధించడం దీనివలన సాధ్యమౌతుంది. ప్రభుత్వ పరిపాలన కార్యకలాపాలలో ప్రజల భాగస్వామ్యానికి ప్రోత్సాహం లభిస్తుంది.

**ఏ అంశాలు ఎవరి వద్ద ఉన్నాయి-**

**(1) కేంద్ర ప్రభుత్వ వద్ద గల అంశాలు :** రక్షణ, విదేశీ వ్యవహారాలు, యుద్ధం మరియు శాంతి, ద్రవ్యవ్యవస్థ, అంతర్జాతీయ వ్యాపారం మొదలగునవి.

**(2) రాష్ట్ర ప్రభుత్వం వద్ద గల అంశాలు :** వ్యవసాయం, చట్టం మరియు సుపరిపాలన, స్థానిక ప్రభుత్వాలు, ఆరోగ్యం, కారాగార (జైలు) వ్యవస్థ మొదలగునవి.

**(3) రెండు ప్రభుత్వాల కొరకు ఉన్న అంశాలు :** ఉపాధి, పర్యావరణం, ఆర్థిక మరియు సామాజిక పథకాలు, వ్యక్తిగత చట్టాలు, విద్య మొదలగునవి.

**కేంద్ర పాలిత ప్రాంత్రాలు :** భారత దేశంలో ఒక కేంద్ర ప్రభుత్వం, 28 రాష్ట్ర ప్రభుత్వాలు మరియు 9 కేంద్రపాలిత

ప్రాంతాలు ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాలపై కేంద్రప్రభుత్వ నియంత్రణ ఉంటుంది. న్యూ ఢిల్లీ, దమన్ - దీవ్, పుదుచ్చేరి, చండీగడ్, దాద్రా - నగర్ హవేలీ, అండమాన్ - నికోబార్, లక్షద్వీపాలు, జమ్మూ మరియు కాశ్మీర్ మరియు లడాఖ్ ఇవి కేంద్ర పాలిత ప్రాంతాలు.

**చేసి చూడండి.**

ఈశాన్య భారతదేశంలోని రాష్ట్రాల పట్టిక తయారు చేయండి. అక్కడి రాష్ట్రాల రాజధానులు ఏవి?

**పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి :** భారతదేశ సంవిధానం పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి సంబంధ నిబంధన చేసింది. పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతి అంటే పార్లమెంటు అనగా శాసన (చట్ట) సభకు నిర్ణయాలు తీసుకొనే అత్యుత్తమ అధికారం ఉన్న ఒక ప్రభుత్వ పరిపాలనా పద్ధతి. భారతదేశ పార్లమెంటులో రాష్ట్రపతి, లోక సభ మరియు రాజ్యసభలు సమావేశితమై ఉన్నాయి. ప్రత్యక్ష ప్రభుత్వ పరిపాలన చేయు మంత్రి మండలి లోక సభ నుండి నిర్మితమవుతుంది. అది తన కార్యనిర్వహణకు సంబంధించి లోక సభకు బాధ్యత వహిస్తుంది. పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిలో పార్లమెంటులో జరిగే చర్చలు, విచార-వినిమయాలకు ప్రాముఖ్యత ఉంటుంది.

**మీకు తెలుసా?**




చలామణి నోట్లు

మీరు చలామణిలో ఉన్న నోట్లను చూసారు కదా? వానిపై **'కేంద్ర ప్రభుత్వం ద్వారా హామీ ఇవ్వబడినది'** అని లిఖించబడి ఉంటుంది. పోలీసుల భుజాలపై గల బిల్లను మీరు చూసినట్లయితే దానిమీద **'మహారాష్ట్ర పోలీస్'** అని రాయబడి ఉంటుంది.

**'భారతీయరేల్'** మరియు **'మహారాష్ట్ర రాజ్య పరివహన్ మండల్'** అని కూడ మీరు చదివే ఉంటారు.

దీని అర్థం మన దేశంలో రెండు స్థాయిల్లో ప్రభుత్వాలు ఉన్నాయి. ఒకటి భారత ప్రభుత్వం మరియు రెండవది రాష్ట్ర ప్రభుత్వం ఉదా: మహారాష్ట్ర ప్రభుత్వం, కర్ణాటక ప్రభుత్వం మొదలగునవి.

మహారాష్ట్ర పోలీస్ బోధ చిహ్నం

భారతీయ రేల్ బోధ చిహ్నం


మహారాష్ట్ర పరివహన మహామండలి బోధ చిహ్నం

**స్వతంత్ర న్యాయ వ్యవస్థ :** భారతదేశ సంవిధానం స్వతంత్ర న్యాయ వ్యవస్థను నిర్మించింది. వివాదాస్పద ప్రశ్నలను తమలో తాము పరిష్కరించుకోవడం సాధ్యం కాకపోతే అవి న్యాయస్థానానికి అప్పగించబడతాయి. న్యాయస్థానం రెండు పక్షాలు చెప్పింది విని, అందులో అన్యాయం జరిగినట్లయితే దానిని దూరంచేసి తీర్పునిస్తుంది. ఈ పని నిస్వార్థంగా జరుగుట అవసరం.

న్యాయస్థానంపై ఎటువంటి ఒత్తిడి రాకూడదని సంవిధానం న్యాయ వ్యవస్థను అత్యధికంగా స్వతంత్రంగా ఉంచుటకు అనేక నిబంధనలు చేసింది. ఉదా: నాయమూర్తుల నియామకం ప్రభుత్వం ద్వారా కాకుండా రాష్ట్రపతి ద్వారా జరుగుతుంది. న్యాయమూర్తులను సులభంగా పదవినుండి తొలగించలేము.

**ఏక పౌరసత్వం :** భారతదేశ సంవిధానం భారతదేశం లోని పౌరులందరికి ఒకే పౌరసత్వాన్ని ప్రధానం చేసింది. అనగా అది 'భారతీయ' పౌరసత్వం.

**సంవిధానంలోని మార్పునకు పద్ధతి :** సంవిధానంలో నమోదు చేసిన చట్టాలలో పరిస్థితిననుసరించి మార్పు లేక సవరణ చేయవలసి వస్తుంది. కాని సంవిధానంలో తరచుగా సవరణలు చేసినట్లయితే అస్థిరత్వం ఏర్పడ వచ్చును. కాబట్టి ఏదేని మార్పు చేయునప్పుడు అది పూర్తిగా చర్చించబడాలి. ఇందు కొరకై భారతదేశ సంవిధానమే సంవిధానంలోని



మార్పులకు సంబంధించిన సంపూర్ణ ప్రక్రియను స్పష్టం చేసింది. సంవిధానంలో ఎటువంటి మార్పు చేయవలసి వచ్చినప్పుడైనను దానిని ఇదే ప్రక్రియతో చేయవలసి వస్తుంది. సంవిధానంలోని మార్పుల ఈ ప్రక్రియ చాల విశిష్టమైనది. అది చాలా కఠినమైనది కాదు మరియు చాల సులభమైనది కాదు. ముఖ్యమైన సవరణ కొరకు విచార-వినిమయాలకు అందులో తగినంత అవకాశం ఇవ్వబడింది. సర్వసాధారణ సవరణలు సులభతరంగా జరుగునంత అనువుగా ఈ ప్రక్రియ ఉంటుంది.

**వెదకండి!**

ఇప్పటి వరకు భారతీయ సంవిధానంలో ఎన్నిసార్లు సవరణలు జరిగాయి?

**ఎన్నికల సంఘం :** ఎన్నికల సంఘం గురించిన విషయాన్ని మీరు వార్తా పత్రికలలో ఎప్పుడూ చదువుతు ఉండవచ్చు. భారతదేశం ప్రజాస్వామ్య ప్రభుత్వ వ్యవస్థ స్వీకరించడం వలన ప్రజలకు నిర్ధారిత గడువు తరువాత తమ ప్రతినిధులను మళ్ళీ నూతనంగా ఎన్నుకోవలసి యుంటుంది. అందుకోసం ఎన్నికలు జరగవలసి వస్తుంది. ఈ ఎన్నికలు పారదర్శకంగా మరియు సరియైన వాతావరణంలో జరగటం అవసరమవుతుంది. అప్పుడే పౌరులకు ఎటువంటి ఒత్తిడి లేకుండా తమకు యోగ్యుడనిపించిన అభ్యర్థిని ఎన్నుకుంటారు. ప్రభుత్వం ఎన్నికలు జరిపినట్లయితే ఇటువంటి పారదర్శక మరియు యోగ్యమైన వాతావరణం లభిస్తుందనే నమ్మకం ఉండదు. కాబట్టి మన సంవిధానం ఎన్నికలు నిర్వహించే బాధ్యత ఒక స్వతంత్రమైన యంత్రాంగానికి అప్పగించింది. ఆ యంత్రాంగం అనగా 'ఎన్నికల సంఘం'. భారతదేశంలోని అన్ని ముఖ్యమైన ఎన్నికలు నిర్వహించే బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంటుంది.

**చెప్పుకోండి. చూద్దాం.**

ప్రస్తుత ముఖ్య ఎన్నికల కమీషనర్ ఎవరు? ఎన్నికల ప్రవర్తన నియమావళి అనగానేమి? నియోజక వర్గం అనగానేమి?

భారతీయ సంవిధానానికి అనేక విశిష్టతలు ఉన్నాయి. ఈ పాఠంలో మనం వాటిలో కొన్ని ముఖ్యమైన విశిష్టతల గురించి నేర్చుకొన్నాం. ప్రాథమిక హక్కులకు సంబంధించిన విస్తృతమైన నిబంధనలు మన సంవిధానం యొక్క మరొక ముఖ్యమైన విశిష్టత. దాని గురించి మనం రాబోవు పాఠంలో నేర్చుకొందాం.

## అభ్యాసం

**1. సమాఖ్య ప్రభుత్వ పద్ధతి ననుసరించి అధికార విభజన ఏ విధంగా చేయబడినదో దాని పట్టికను కింది పటంలో తయారు చేయండి.**

| సమాఖ్య ప్రభుత్వం | రాష్ట్ర ప్రభుత్వం | రెండు ప్రభుత్వముల వద్ద ఉండే అంశాలు |
|---|---|---|
| (1) ______ | (1) ______ | (1) ______ |
| (2) ______ | (2) ______ | (2) ______ |
| (3) ______ | (3) ______ | (3) ______ |

**2. సరియైన పదం రాయండి.**

(1) సంపూర్ణ దేశం యొక్క పరిపాలన చేసే యంత్రాంగం -

(2) ఎన్నికలు నిర్వహించే యంత్రాంగం -

(3) రెండు జాబితాలు కాకుండా మరో జాబితా -

**3. రాయండి.**

(1) సమాఖ్య దేశంలో రెండు స్థాయిల్లో ప్రభుత్వాలు ఉంటాయి.

(2) ఉత్తరాధికారం అనగా నేమి?

(3) సంవిధానం న్యాయవ్యవస్థను స్వతంత్రంగా ఉంచింది.


**4.** స్వతంత్ర న్యాయవ్యవస్థ యొక్క లాభాలు మరియు నష్టాలు అను విషయంపై తరగతిలో సమూహ చర్చను ఏర్పాటు చేయండి.

**5.** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (EVM) ఉపయోగించడం వలన ఏ లాభాలు కలుగుతాయో వివరాలు సేకరించండి.

**ఉపక్రమం:**

తరగతిలో ఎన్నికల సంఘాన్ని స్థాపించండి. ఆ ఎన్నికల సంఘం మార్గదర్శనంలో తరగతి ఎన్నికలు నిర్వహించండి.

# 4. ప్రాథమిక హక్కులు - 1వ భాగం




వార్తా పత్రికల్లో మరియు ఇతరత్రా మీరు ఇటువంటి బోర్డులు (ఫలకాలు) చూసే ఉంటారు. ఏదేని ఊరేగింపు (ర్యాలీ)లో ఏదైనా కోరుతూ ఉంటారు. ఆ కోరికలు వారి హక్కులు అని చెప్పబడతాయి.

మనకు జననంతోనే హక్కులు ప్రాప్తిస్తాయి. జన్మించిన ప్రతి శిశువుకు జీవించే హక్కు ఉంటుంది. ఆ శిశువుకు మెరుగైన ఆరోగ్యం లభించాలని సంపూర్ణ సమాజం మరియు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంది. అన్యాయం, పీడన, భేదభావం, వంచనలు మున్నగువాటి నుంచి వ్యక్తులందరికి సంరక్షణ లభించినట్లయితేనే వ్యక్తులు తమలోని సద్గుణాలను మరియు కౌశల్యాలను అభివృద్ధి పరచుకొంటారు. మన సొంత మరియు సంపూర్ణ ప్రజాసమూహాల అభివృద్ధి కొరకు అనుకూల పరిస్థితిని కోరుట, అందుకోసం పట్టుబడటం అనగా హక్కులను కోరడం.

సంవిధానం అటువంటి అనుకూల పరిస్థితిని ఏర్పాటు చేయుట కొరకు భారత దేశంలోని పౌరులందరికి సమాన హక్కులను కల్పించింది. ఈ హక్కులు ప్రాథమిక హక్కులు.

**వెదకుదాం పద!**

* పిల్లల యొక్క హక్కులు మీకు తెలిసే ఉంటాయి. వారి యొక్క ముఖ్యమైన రెండు హక్కులను మీరు చెప్ప గలరా?
* స్త్రీల హక్కులు, ఆదివాసుల హక్కులు, రైతుల హక్కులు వంటివి కూడా మనకు తెలుసు. ఈ హక్కుల గురించి మన అందరికి కొన్ని సందేహాలు ఉన్నాయి.
* హక్కుల ఉపయోగమేమిటి? వాటిని ఎవరు ఇవ్వవలసి ఉంటుంది?
* హక్కులను హరించ వచ్చునా?
* అలా జరిగినచో దానికి వ్యతిరేకంగా ఎక్కడకి వెళ్ళి న్యాయం కోరాలి?

వాటిని సంవిధానంలో పేర్కొనడంతో వాటికి చట్టపరమైన హోదా ఉన్నది. ఈ హక్కులను పాటించడం అందరికి చట్టరీత్యా తప్పనిసరి.

**ఊహించండి మరియు రాయండి.**

కుక్క, పిల్లి, ఆవు, గేదె, మేక వంటి జంతువులను మీరు పెంచుతుండవచ్చు. మీరు వాటిని చాలా జాగ్రత్తగా చూచుకొంటారు. వాటిపై చాలా ప్రేమ కురిపిస్తారు.

ఈ జంతువులకు మాట్లాడటం వస్తే అవి మీ దగ్గర నుండి ఏ హక్కులను కోరుకొనేవి?

**సంవిధానంలో నమోదు చేసిన మన హక్కులు:** సంవిధానంలో భారత పౌరుల యొక్క హక్కుల గురించి నమోదు చేయబడింది. ఆ హక్కులు ఏవో చూద్దాం.

**సమానత్వపు హక్కు :** సమానత్వపు హక్కు ననుసరించి దేశం భారత పౌరులలో ఉచ్చ-నీచ, శ్రేష్ఠ-కనిష్ఠ, స్త్రీ-పురుష భేదాలు పాటించ కూడదు. చట్టం అందరికి సమానమే. చాల చట్టాలు మనకు సంరక్షణ కల్పించేవిగా ఉంటాయి. ఉదా: విచారణ చేయకుండా నిర్బంధంలోకి తీసుకోవడం నుండి మనకు రక్షణ ఉంటుంది. ఇటువంటి రక్షణనిస్తున్నప్పుడు కూడా ప్రభుత్వానికి భేదభావం చూపడానికి వీలులేదు.



**చర్చిద్దాం పద!**

చట్టం ముందు అందరిని సమానంగా భావించడం మరియు అందరికి చట్టపరంగా సమాన రక్షణ ఇవ్వడం వలన లాభాలు ఏమిటి?

సమానత్వపు హక్కులో ఇంకా ఏ అంశాలు వస్తాయి? ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తున్నపుడు ప్రభుత్వానికి కులం, మతం, లింగం, జన్మస్థలాన్ని బట్టి భేదభావం చూపరాదు. మన దేశంలోని అస్పృశ్యతను పాటించే పాత ఆచారాన్ని చట్టబద్ధంగా రూపు మాపడం జరిగింది. అస్పృశ్యతను పాటించుట అనునది నమోదు చేయదగిన నేరంగా పరిగణిస్తారు. భారతీయ సమాజంలో సమానత్వం నిర్మించడానికి ఈ ఆచారాన్ని నిర్మూలించడం జరిగింది.

ప్రజల్లో శ్రేష్ఠ మరియు కనిష్ఠ అను భేదాన్ని చూపు బిరుదులు ఇచ్చుటపై సంవిధానం నిషేధం విధించింది. ఉదా: రాజా, మహారాజా, రాజబహద్దూర్ మొదలగునవి.



**మీకు తెలుసా?**

వైషమ్యాలను పెంచు, సమాజంలో చీలికలు తెచ్చు మరియు పౌరుల మధ్య భేదాలను సృష్టించు బిరుదులను దేశం ఇవ్వకూడదు. కాని సమాజంలోని విభిన్న రంగాలలో గౌరవనీయమైన కార్యం చేసిన వారికి మాత్రం ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ వంటి బిరుదులు ఇస్తుంది. భారత రత్న అనునది మన దేశంలోని అత్యున్నత పురస్కారం లేదా బిరుదం.

రక్షణ దళంలోని పనితనానికి పరమ వీర చక్ర, అశోక చక్ర, శౌర్యచక్ర గౌరవ పతకాలు ఇవ్వబడతాయి. అటువంటి బిరుదుల వలన ఇతర పౌరులకు లేనటువంటి ఎలాంటి ముఖ్యమైన హక్కు లేక విశేషాధికారం ఆ వ్యక్తులకు లభించదు. కాని వారి కార్యకౌశల్యానికి తగిన గౌరవం కలిగించే బిరుదు ఇవ్వబడుతుంది.

**స్వాతంత్ర్యపు హక్కు :** సంవిధానం ఇచ్చిన అత్యంత ముఖ్యమైన హక్కు. అందులో వ్యక్తి పరంగా అవసరమయిన అన్ని రకాల స్వాతంత్ర్యాలకు హామీ ఇవ్వబడింది.

పౌరులుగా మనకు -

- మాట్లాడుట మరియు భావవ్యక్తీకరణ స్వాతంత్ర్యం.
- శాంతియుతంగా ఒకచోట గుమిగూడుట మరియు సభలు నిర్వహించు స్వాతంత్ర్యం.
- సంస్థలు మరియు సంఘాలు స్థాపించుకొను స్వాతంత్ర్యం.
- భారతదేశ ప్రాంతంలో ఎక్కడయినా తిరిగే స్వాతంత్ర్యం.
- భారతదేశ భూభాగంలో ఎక్కడయినా స్థిర నివాసముండే స్వాతంత్ర్యం.
- మనకు ఇష్టమైన వ్యాపారం, వృత్తి చేసే స్వాతంత్ర్యం.



**చేసి చూడండి**

అ', 'బ' మరియు 'క' చేసిన కొన్ని పనులు ఇక్కడ ఇవ్వబడినవి. పైన పేర్కొన బడిన ఏ స్వాతంత్ర్య రకంతో వాటిని జతపరచెదవు?

'అ' ఆదివాసుల సమస్యలు తీర్చుటకు (నివారించుటకు) 'ఆదివాసీ సహకార్య మంచ్' స్థాపించాడు.

'బ' తన తండ్రి బేకరీ ఉత్పత్తిని గోవా నుండి మహారాష్ట్రకు తీసుకొని వచ్చుటకు నిర్ణయించు కొనెను.

'క' వ్యక్తికి ప్రభుత్వం యొక్క నూతన పన్నుకు సంబంధించిన ధోరణిలో లోపాలు కనిపించినవి. దానికి సంబంధించి ఆ వ్యక్తి ఒక నివేదిక రాసి వార్తా పత్రికకు ఇచ్చాడు.



**మీకు తెలుసా?**

సంవిధానం మనకు అనేక హక్కులు ఇచ్చింది. కాని వాటిని బాధ్యతా రాహిత్యంతో ఉపయోగించరాదు. అలా ప్రవర్తించడం వలన ఇతరులకు నష్టం కలుగకుండా మనం జాగ్రత్త తీసుకోవలెను. మనకు మాట్లాడే హక్కు ఉంది. కాని ఉద్రేకపరచే రచనలు లేక ఉపన్యాసాలు చేయరాదు.

సంవిధానంలోని స్వాతంత్ర్యపు హక్కుతో కేవలం సంచారం-తిరుగుట లేక మాట్లాడుటయే కాక మనం సురక్షితంగా ఉండాలని మనకు రక్షణను అందజేయడం జరిగింది. చట్టపరమైన ఈ సంరక్షణ అందరికి సమానంగా ఇవ్వడం జరిగింది. దానిని ఎవరికి కూడా నిరాకరించబడదు. ఉదా: మనందరికి జీవించే హక్కు ఉంది. చూడడానికి ఆ హక్కు సులభంగా అనిపిస్తుంది. కాని అందులో చాలా అర్థం దాగి ఉంది. జీవించుటకు హామీ లభించుట, జీవించుటకు పరిపుష్టమైన వాతావరణం కలిగి ఉండటం అని దాని అర్థం. ఏ వ్యక్తి ప్రాణాన్ని ఎవరైనను బలవంతంగా తీయడానికి లేదు. కారణం లేకుండా ఏ వ్యక్తినైనను నిర్బంధించి ఒకచోట నిలుపరాదు. స్వాతంత్ర్యపు హక్కులో ఇప్పుడు విద్యా హక్కును కూడా చేర్చడం జరిగింది. 6 నుండి 14 సంవత్సరాల బాలబాలికలందరికి విద్యను పొందే ప్రాథమిక హక్కు ఉన్నది. ఈ హక్కు వలన విద్య నుండి ఎవ్వరును వంచితులుకారు.



**ఆలోచించండి.**

ప్రాణాన్ని తీయకుండా ఉండే హక్కుకు ఇంకా కొన్ని పూరక (అదనంగా) హక్కులు ఉన్నాయి. ఉదా: ఒకే నేరానికి రెండు సార్లు శిక్ష పడదు. ఏ వ్యక్తికైనను శిక్ష వేయుటకు ముందు అతనిపై ఉండే ఆరోపణను ధృవీకరించ వలసి యుండును. ఈ పని న్యాయస్థానం చేస్తుంది. ఆరోపికి సంబంధించిన రుజువులు సేకరించడం మరియు కేసు (వ్యాజ్యం) నమోదుచేయు పని పోలీసులు చేస్తారు. 'నేను నేరం చేశాను' అని చెప్పిన వ్యక్తికి కూడా వెంటనే శిక్ష పడదు. ఆ వ్యక్తిపై గల ఆరోపణ కూడా చట్టబద్ధంగా నిరూపించవలసి వస్తుంది. ఈ మొత్తం న్యాయస్థాన ప్రక్రియకు సమయం పడుతుంది. కాని ఏ నిర్దోషికి లేక నేరం చేయని వ్యక్తికి శిక్ష పడకుండ ఉండుటకు ఇదంతా అవసరం అవుతుంది.

**పీడనాన్ని నిరోధించు హక్కు :** పీడనాన్ని ఆపుటకు పీడనానికి బలి కాకుండా ఉండుట, మనం పీడనకు లేక శోషణకు గురి కాకుండా కాపాడు హక్కు అనగా పీడనాన్ని నిరోధించు హక్కు.

సంవిధానం ఒకవైపు నుండి పీడనాన్ని నిరోధించు హక్కు ద్వారా అన్ని రకాల శోషణపై నిషేధం విధించింది. అయితే అందులో రెండవ వైపు నుంచి పిల్లల పీడనాన్ని (శోషణను) నిర్మూలించుటకు ప్రత్యేక నిబంధన చేసింది. దాని ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలను ప్రమాదకర చోట్లలో పనిలో పెట్టుటను నిషేధించింది. కర్మాగారాలు, గనులు వంటి చోట్లలో పిల్లలను నియమించి వారి నుండి పని చేయించుకోరాదు.

వెట్టిచారికి లేక నిర్బంధంగా ఒక వ్యక్తికి ఇష్టం లేకుండా అతనితో పని చేయించుకోవడం, కొంత మందిని బానిసలుగా వినియోగించుకోవడం, వారి పనికి తగిన ప్రతిఫలం ఇవ్వకపోవడం, వారితో ఎక్కువగా పని చేయించుకోవడం, వారిని పస్తులుంచడం లేక వారిపై దౌర్జన్యం చేయడం ఇవి పీడనం యొక్క రకాలు. సాధారణంగా స్త్రీలు, పిల్లలు, బలహీన వర్గాలు మరియు శక్తిహీనులైన ప్రజల పీడనం జరుగుతుంది. ఏ రకమైన పీడనం అయినను దానికి వ్యతిరేకంగా నిలవడానికే ఈ హక్కు.

**చర్చిద్దాం పద.**

- ఇక్కడ బాలకార్మికులు పని చేయరు.
- ఇక్కడ కార్మికులకు రోజుకు రోజు వేతనం ఇవ్వబడును. ఇటువంటి బోర్డులు (ఫలకాలు) చాల దుకాణాలలో మరియు హోటళ్ళలో మీరు చూస్తుంటారు. వాటికి మరియు సంవిధానంలోని ఈ హక్కులకు ఏమి సంబంధం ఉండవచ్చును?

**చర్చిద్దాం పద!**

పీడనం జరగకూడదని మరియు ప్రతి వ్యక్తి స్వాతంత్ర్యం అనుభవించాలని ప్రభుత్వం చట్టాలు చేసింది. కొన్ని చట్టాలను ఇక్కడ పేర్కొనడం జరిగింది. ఇంకా అటువంటి ఏ చట్టాలు ఉన్నాయో వెదకండి మరియు చర్చించండి.

- కనిష్ఠ వేతన చట్టం - కర్మాగారాలలో పని గంటలు, విశ్రాంతి సమయం గురించిన నిబంధనలు
- స్త్రీలకు గృహహింస నుండి సంరక్షణ నిచ్చే చట్టం

...............................................................

భారత సంవిధానంలోని సమానత్వము యొక్క, స్వాతంత్ర్యము యొక్క మరియు శోషణమునకు విరుద్ధమైన హక్కుల గురించి మనం చదువుకున్నాము. ముందు పాఠం లో మనం ఇంకా కొన్ని ప్రాథమిక హక్కుల గురించి తెలుసుకుంటాము.

## అభ్యాసం

**1. కింది ప్రశ్నలకు సంక్షిప్తంగా జవాబులు రాయండి.**

(1) ప్రాథమిక హక్కులనగా నేమి?

(2) వివిధ రంగాలలో గౌరవనీయమైన కార్యములు చేయు వారికి ప్రభుత్వం ద్వారా ఏయే పతకాలు/బిరుదులు ఇవ్వబడతాయి?

(3) పద్నాలుగు సంవత్సరాలలోపు పిల్లలను ప్రమాదకరమైన స్థలంలో పనిలో పెట్టుకొనుటను ఎందుకు నిషేధించడం జరిగింది?

(4) సంవిధానం భారతదేశంలోని పౌరులందరికి సమాన హక్కులు ఎందుకు ఇచ్చింది?

**2. 'స్వాతంత్ర్యపు హక్కు' అను అంశంపై చిత్రాల జాబితా తయారు చేయండి.**

**3. కింది వాక్యాలను సరిచేసి మరల రాయండి.**

1) ఏ వ్యక్తికైనా హక్కులు జన్మతః లభించవు.

(2) ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చునపుడు ప్రభుత్వం మతం, లింగ, జన్మస్థానాల ఆధారంగా భేదభావం చూపి మిమ్ములను ఉద్యోగం నుండి దూరంగా ఉంచవచ్చును.

**4. కింది సంకల్పనా చిత్రాన్ని పూర్తి చేయండి.**

స్వాతంత్ర్యపు హక్కు

| మాట్లాడే హక్కు | | | సంచార స్వాతంత్ర్యం | | వృత్తి స్వాతంత్ర్యం |
|---|---|---|---|---|---|

**ఉపక్రమం:**

(1) సమాచార హక్కు, విద్యా హక్కు వంటి ముఖ్యమైన హక్కుల గురించి వార్తా పత్రికలలో వచ్చిన వార్తలను సంగ్రహించండి.

(2) మీ పరిసరాలలో భవన నిర్మాణపు పనులు జరుగుచున్నపుడు చిన్న పిల్లలు పనిచేస్తూ కనబడితే వారితో మరియు వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని ఆ సమస్యలను తరగతిలో ప్రదర్శన రూపంలో సమర్పించండి.

# 5. ప్రాథమిక హక్కులు - 2వ భాగం

కింది పాఠంలో మనం భారత సంవిధానం ఇచ్చిన కొన్ని ప్రాథమిక హక్కుల గురించి నేర్చుకొన్నాం. స్వాతంత్ర్యం, సమానత్వాలతోబాటు పీడనను నిరోధించే హక్కు గురించి నేర్చుకొన్నాం. ఈ పాఠంలో మనం మత స్వాతంత్ర్యపు హక్కు, సాంస్కృతిక మరియు విద్యా హక్కు గురించి తెలుసుకోబోతున్నాం. అటులనే ప్రాథమిక హక్కులకు గల న్యాయాలయ సంరక్షణ గురించి కూడా మనం తెలుసు కోవలసి ఉంది.

**మత స్వాతంత్ర్యపు హక్కు :** భారతదేశం ప్రపంచంలోని లౌకిక దేశాలలో ఒకటి అని మనకు తెలుసు. కింది తరగతులలో కూడా దీని గురించి నేర్చుకొన్నాం. కాని దాని గురించి సంవిధానంలో ఏమి రాయబడిందో తెలుసుకోవాలనే కుతూహలం ఉంది కదా? అయితే అది మత స్వాతంత్ర్యపు హక్కులో పేర్కొనబడింది. దానిననుసరించి భారతదేశంలోని ప్రతి పౌరునికి ఏ మతాన్నయినా అవలంబించే హక్కు మరియు మత సంబంధ అంశాల కోసం సంస్థలను నెలకొల్పు హక్కు ఉంది.

మత స్వాతంత్ర్యపు హక్కు ఇంకా విస్తృతం చేయాడానికి సంవిధానం మత విషయంలో రెండు అంశాలకు అనుమతిని ఇవ్వలేదు. (1) ఏ పన్ను ఒక ప్రత్యేక మతాన్ని ప్రోత్సహించడం కోసం ఉపయోగించబడునో అటువంటి పన్నును ప్రభుత్వం విధించలేదు. సంక్షిప్తంగా, మతం పన్ను విధించడాన్ని సంవిధానం ఒప్పుకోదు. (2) ప్రభుత్వ సహాయం తీసుకొనే విద్యా సంస్థలలో మత బోధన (విద్య) తప్పనిసరి చేయరాదు.

**సాంస్కృతిక మరియు విద్యా హక్కు :** పండుగలు, ఉత్సవాలు, ఆహారం మరియు జీవన విధానంలో మన దేశంలో చాలా వైవిధ్యం ఉంది. అది మనం చూస్తున్నాం. మీరు పెండ్లి వేడుకలు చూసినట్లయితే మీకు అందులోని వైవిధ్యం అర్థమైయుండవచ్చును. ఈ అంశాలన్ని ఆయా ప్రజాసమూహాల సంస్కృతిలోని భాగాలు. మన సంవిధానం వివిధ ప్రజాసమూహాలకు తమ సాంస్కృతిక వైవిధ్యాన్ని సంరక్షించుకొనే హక్కు ఇచ్చింది. దానిననుసరించి తమ భాష, లిపి, సాహిత్యాల సంరక్షణతో బాటు వాటి అభివృద్ధి కొరకు ప్రయత్నం కూడా చేయవచ్చును. భాషా వికాసం కొరకు సంస్థలు స్థాపించుకోవచ్చును.

**వెదకండి మరియు చర్చించండి**

- సంవిధానం ఎన్ని భాషలకు గుర్తింపు నిచ్చింది?
- మరాఠీ భాష యొక్క అభివృద్ధి కొరకు మహారాష్ట్ర ప్రభుత్వం ఏ సంస్థలను స్థాపించింది?



**చర్చిద్దాం పద!**

మహారాష్ట్రలో ప్రభుత్వం మరియు న్యాయస్థానం యొక్క పనులన్ని మరాఠీ ద్వారా జరగాలని మీకు అనిపిస్తుందా? అందుకోసం ఏం చేయవలసి ఉంటుంది?

**సంవిధానాత్మక పరిహారపు హక్కు :** హక్కులకు భంగం కలిగినపుడు న్యాయస్థానానికి వెళ్ళి న్యాయం కోరే హక్కు కూడా ఒక ప్రాథమిక హక్కే. దానిని సంవిధానాత్మక పరిహారపు హక్కు అని అంటారు. హక్కుల భంగానికి వ్యతిరేకంగా న్యాయాస్థానాన్ని న్యాయం కోరే నిబంధన సంవిధానమే చేసింది. దానిననుసరించి న్యాయస్థానానికి కూడా హక్కుల సంరక్షణ చేయుట తప్పనిసరి అవుతుంది.

సంవిధానం ఇచ్చిన హక్కులపై కొన్ని సమయాలలో ఉల్లంఘన జరుగవచ్చును మరియు మనకు హక్కులను ఉపయోగించుకొనుటకు వీలుకాదు. దానినే మనం మన హక్కుల భంగం జరిగిందని అంటాం. హక్కుల భంగం గురించి మన ఫిర్యాదు (వ్యాజ్యం)ను న్యాయస్థానం విచారణకు స్వీకరిస్తుంది. దానిని పరిశీలిస్తుంది. వాస్తవంగా హక్కుల భంగం జరిగింది లేక సంబంధిత వ్యక్తిపై అన్యాయం జరిగిందని భావిస్తే న్యాయస్థానం సరియైన తీర్పునిస్తుంది.

**హక్కుల భంగం యొక్క కొన్ని రకాలు:**

- కారణం లేకుండా ఎవరినైన నిర్బంధించడం.
- సరియైన కారణం లేకుండా ఎవరినైనా పట్టణం/ గ్రామం నుండి బహిష్కరించడం.
- కారాగారం (జైలు)లోని ఖైదీలకు ఆహారపానీయాలు మరియు వైద్య చికిత్సను నిరాకరించడం.

### హక్కుల భంగాన్ని నివారించుటకు న్యాయస్థానం యొక్క ఆదేశం:

పౌరుల హక్కులను కాపాడుటకు న్యాయస్థానానికి వివిధ ఆదేశాలు ఇచ్చే అధికారం ఉన్నది.

(1) హబియస్ కార్పస్ (బందీని హాజరు పరచుట) చట్ట విరుద్ధంగా (అరెస్టు) నిర్బంధించి నిలపడం నుండి సంరక్షణ.

(2) మాండమస్ (Mandamus) : (పరమాదేశం): లోకహితం కొరకు ప్రభుత్వానికి ఏదేని పని చేయుటకు న్యాయవ్యవస్థ ఇచ్చే ఆదేశం.

(3) నిషేధం (Prohibition) : కనిష్ఠ న్యాయస్థానం తన అధికార పరిధిని దాటి వెళ్ళకుండా ఉండే ఆదేశం.

(4) అధికారాన్ని ప్రశ్నించుట (Quo Warranto) : ఏ అధికారంతో ఈ పని చేశావని ప్రభుత్వ అధికారిని జవాబు ఇవ్వమని న్యాయస్థానం యొక్క ఆదేశం.

(5) ఉత్ప్రేక్షణం (Certiorari) : కనిష్ఠ (కిందికోర్టు) న్యాయస్థానం ఇచ్చిన తీర్పును రద్దు చేసి ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు)లో వ్యాజ్యం నమోదు చేయుటకొరకు ఆదేశం.

**ప్రభుత్వ అధికారుల ఈ ప్రతిక్రియ (ప్రతిస్పందన) సరియైనదా కాదా?**

నిరాశ్రయుల కొరకు ఉండే ఒక పథకం యొక్క లబ్ధి పొందాలని అవసరమైన అన్ని దస్తావేజులు సమర్పించిన స్త్రీని 'నీవు నిరాశ్రయురాలిగా కనిపించుట లేదు' అని లబ్ధి కూర్చుటకు నిరాకరించిన ప్రభుత్వ అధికారి యొక్క ఈ పని సరియైనదా? కాదా?

పై సంఘటనలో స్త్రీ యొక్క హక్కుకు భంగం వాటిల్లిందని మీకు అనిపిస్తుందా? ఆమె న్యాయం కోరాలనుకుంటే ఎక్కడికి వెళ్ళాలి?



న్యాయస్థానం యొక్క కార్యకలాపాలు

ప్రాథమిక హక్కులకు ఈ విధంగా న్యాయస్థానం యొక్క సంరక్షణ ఉండడం వలన పౌరులు తమ హక్కులను సరియైన విధంగా ఉపయోగించుకోవచ్చును. వారు అధిక జాగరూకులై బాధ్యతాయుతంగా మరియు క్రియాశీల పౌరులుగా తమ భూమిక (పాత్ర)ను నిర్వహించగలరు. ప్రాథమిక హక్కుల గురించి ఆలోచించినప్పుడు మనం విధులను కూడా గుర్తుంచుకోవలసి వస్తుంది. దాని గురించి మనం రాబోవు పాఠంలో నేర్చుకోబోతున్నాం.



## అభ్యాసం

**1. రాయండి.**

(1) మతం పన్ను విధించుటను సంవిధానం నిషేధిస్తుంది.

(2) సంవిధానాత్మక పరిహారపు హక్కు అనగా నేమి?

**2. సరియైన పదం రాయండి.**

(1) చట్ట విరుద్ధంగా నిర్బంధించి నిలిపివేయుట నుండి సంరక్షణ -

(2) ఏ అధికారంతో ఈ పని చేశావని ప్రభుత్వ అధికారిని జవాబు అడిగే న్యాయస్థాన ఆదేశం.

(3) లోకహితం కొరకు ప్రభుత్వానికి ఏ పనినైనా చేయడానికి ఇవ్వబడే న్యాయస్థాన ఆదేశం -

(4) కనిష్ఠ న్యాయస్థానం తన అధికార పరిధిని దాటకుండా ఉండుటకు ఇచ్చే ఆదేశం -

**3. మనం ఇది చేయవచ్చును. దానికి సంబంధించి కింద కారణాలు నమోదు చేయండి.**

(1) భారత పౌరులందరికి అన్ని పండుగలు ఆనందంగా జరుపుకోవచ్చును. కారణం .........

(2) నేను తెలుగు భాషా మాధ్యమం ద్వారా విద్య నేర్చుకోవచ్చును. కారణం .........

**4. ఖాళీలలో ఏ పదం రాయాలి మరి!**

(1) హక్కుల భంగం మన ఫిర్యాదును ................ విచారణకు స్వీకరిస్తుంది.

(2) ప్రభుత్వం యొక్క ఆర్థిక సహాయం తీసుకొనే పాఠశాలలో ................ బోధన తప్పనిసరి చేయరాదు.

**ఉపక్రమం**

మీ పాఠశాలలో న్యాయమూర్తి, న్యాయవాది, పోలీసు అధికారుల ముఖాముఖిని ఏర్పాటు చేయండి.

▣ ▣ ▣

HJ8FD9

# 6. ఆదేశిక సూత్రాలు మరియు ప్రాథమిక విధులు

కింది పాఠంలో సంవిధానం ఇచ్చిన హక్కుల గురించి మనం నేర్చుకొన్నాం. దాని ద్వారా భారత పౌరులకు ఏ హక్కులు ఉంటాయో తెలుసుకొన్నాము. అంతే కాకుండా హక్కులకు న్యాయాలయపు సంరక్షణ ఉంటుందని కూడా మనం తెలుసుకొన్నాం. ప్రాథమిక హక్కులతో మన వ్యక్తిగత జీవనం మరియు సార్వజనిక జీవనంలోని ప్రాముఖ్యత కూడా తెలుసుకొన్నాము. ఈ నేపథ్యంలో మనం ఆదేశిక సూత్రాలు అనగా ఏమిటో తెలుసుకొందాం.

ప్రాథమిక హక్కులు ప్రభుత్వం యొక్క అధికారంపై ఆంక్షలు విధిస్తాయి. కింది జాబితాను చదివినచో ప్రభుత్వం పై ఏ ఆంక్షలు ఉంటాయో తెలుస్తుంది. ఉదా:

- ప్రభుత్వం పౌరుల మధ్య కుల, మత, వంశ, భాష మరియు లింగ ఆధారిత భేదభావం చూపకూడదు.
- ఎవరికైనను చట్టం ముందు సమానత్వం మరియు చట్టం యొక్క సంరక్షణను నిరాకరించకూడదు.
- ఏ వ్యక్తి జీవితాన్ని బలిగొనరాదు.
- మత సంబంధ పన్ను విధించరాదు.

ప్రభుత్వం ఏమి చేయవలెను అనే విషయంపై కొన్ని సూచనలు సంవిధానం స్పష్టం చేసింది. సంవిధానం యొక్క పీఠికలో వివరించిన ఉద్దేశ్యములను పొందడానికి చేసిన మార్గదర్శనమే ఆ సూచనల వెనుక ఉన్న హేతువు. కాబట్టి ఈ సూచనలను 'ఆదేశిక సూత్రాలు' లేదా 'మార్గదర్శక సూత్రాలు' అంటారు.

### ఆదేశిక సూత్రాలు ఎందుకు చేర్చబడినవి?

భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు ఈ దేశంలో సువ్యవస్థ ఏర్పాటు చేయుట. నిరాటంకంగా పరిపాలన జరిపే గొప్ప సవాలు మన ముందు ఉండెను. పేదరికం, వెనుకబడిన తనం, నిరక్షరాస్యత నిర్మూలించి దేశం యొక్క పరిస్థితిని చక్కదిద్ద వలసి యుండెను దేశ నిర్మాణ కార్యం చేయవలసి ఉండెను. అందుకోసం కొత్త కొత్త ధోరణులు తీసుకురావడం, వాటిని అమలు చేయడం అవసరమై ఉండెను. ప్రజల సంక్షేమమనే ఉద్దేశ్యాన్ని సాధించ వలసి ఉండెను. సంక్షిప్తంగా చెప్పాలంటే భారతదేశాన్ని ఒక నూతన వికసిత మరియు ప్రగతిశీల దేశంగా రూపాంతరం చేయవలసి ఉండెను. అందుకోసం కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం ఏ విషయాలకు ప్రాధాన్యతనివ్వాలి, ప్రజా సంక్షేమం కొరకు ఏ పథకాలను రూపొందించాలి అను విషయంపై సంవిధానం ఆదేశిక సూత్రాల ద్వారా వివరించింది. రాష్ట్రాల ధోరణులకు అవి ఆధారమైనవి. ప్రతి ఆదేశిక సూత్రంలో రాష్ట్ర ధోరణి కొరకు ఒక అంశం ఉన్నది. ఆ అంశం యొక్క ప్రాతిపదికన నూతన ధోరణి రూపొందించాలనే ఆకాంక్షను సంవిధానం వ్యక్త పరచింది. ఈ ధోరణులన్ని వెంటనే మరియు ఒకే సమయంలో నిర్వహించుటకు చాలా ఆర్థిక సహాయం అవసరమవుతుందని సంవిధానకారులు గుర్తించారు. కావున వారు ఆదేశిక సూత్రాలను ప్రభుత్వానికి ప్రాథమిక హక్కుల వలె తప్పనిసరి పాటించాలనే కట్టడి చేయలేదు. రాష్ట్రాలు మెల్ల మెల్లగా కాని నిశ్చయంగా వాటిని అమలు చేయాలనే ఆకాంక్షను వారు వ్యక్తపరచారు.

### కొన్ని ముఖ్యమైన ఆదేశిక సూత్రాలు:

- ప్రభుత్వం ఉపాధి వనరులను అందరికి లభ్యం చేయాలి. స్త్రీ మరియు పురుషుడు అనే భేదాలు చూపరాదు.
- స్త్రీలకు మరియు పురుషులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.
- ప్రజల ఆరోగ్యం మెరుగుపరచుటకై పథకాలను చేయాలి.
- పర్యావరణాన్ని సంరక్షించాలి.
- దేశం దృష్ట్యా ముఖ్యమైన స్థలాలు అనగా స్మారకాలు, కట్టడాలను సంరక్షించాలి.
- సమాజంలోని బలహీన వర్గాలకు ప్రత్యేక సంరక్షణ నిచ్చి వారి అభివృద్ధికి అవకాశాలు కల్పించాలి.
- ముసలితనం, అంగవైకల్యం, నిరుద్యోగం సందర్భాలలో పౌరులను సంరక్షించాలి.
- భారతదేశంలోని పౌరులందరి కొరకు సమాన పౌర చట్టాలు చేయాలి.



**చెప్పుకోండి చూద్దాం**

వేతన సందర్భంలో 'సమాన పనికి సమాన వేతనం' అనే ఆదేశిక సూత్రం ఉన్నది. దీని నుండి సంవిధానంలోని ఏ ఉద్దేశ్యాలు సాధ్యపడునని మీకు అనిపిస్తున్నది? స్త్రీ పురుషులు సమానంగా పని చేసినను పురుషుల కంటె స్త్రీలకు తక్కువ వేతనం ఇచ్చే పద్ధతి ఎందుకు కనిపిస్తుంది?



**చేసి చూడండి.**

పై ఆదేశిక సూత్రాలకు అదనంగా ఇతర ఆదేశిక సూత్రాలు ప్రభుత్వం ప్రజా సంక్షేమం కొరకు ఏమి చేయాలనే దానిని స్పష్టంచేస్తాయి. కింద కొన్ని అంశాలు ఇవ్వబడినవి. ఆ సందర్భంలో ఏ ఆదేశిక సూత్రం ఉన్నదో ఉపాధ్యాయుని సహాయంతో వెదకండి.

ఉదా.: విదేశ ధోరణి: ప్రపంచ శాంతి మరియు సత్సంబంధాలకు ప్రాధాన్యత.

(అ) ఆడపిల్లల విద్య: ......................

(ఆ) ఆరోగ్యవంతమైన మరియు ఆనందమయ వాతావరణంలోపిల్లల పెంపకం:......................

(ఇ) వ్యవసాయ సంస్కరణ: ...........................

ఆదేశిక సూత్రాలు మరియు ప్రాథమిక హక్కులు అనునవి ఒకే నాణెమునకు గల రెండు పార్శ్వాలు. ప్రాథమిక హక్కుల వలన పౌరులకు అత్యావశ్యకమైన స్వాతంత్ర్యం లభిస్తే ఆదేశిక సూత్రాలు ప్రజాస్వామ్యం వర్ధిల్లుటకు పరిపుష్ట వాతావరణం కలుగజేస్తాయి. అనగా ఏదేని ఆదేశిక సూత్రాన్ని ప్రభుత్వం అమలు పరచకపోతే దానికి వ్యతిరేకంగా మనము న్యాయస్థానానికి వెళ్ళలేము. కాని వివిధ మార్గాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవచ్చి ధోరణిని రూపొందించమని మనం కోరవచ్చును.

ప్రభుత్వం విద్యార్థుల కొరకు ఇంకా ఏమి చేయవలెనని మీకు అనిపిస్తుంది? మీ కోరికల జాబితానొకటి తయారు చేయండి. మీరు కోరిన కోరికలు సరియైనవని ఎలా ఒప్పించగలరు?

ప్రభుత్వం యొక్క ఈ సౌకర్యాల వలన ఏ సంస్కరణ జరుగుతుందని మీకు అనిపిస్తుంది.

(అ) సార్వజనిక స్వచ్ఛతా గృహాలు.

(ఆ) స్వచ్ఛమైన నీటి సరఫరా.

(ఇ) పిల్లలకు టీకాలు.

### ప్రాథమిక విధులు:

ప్రజాస్వామ్యంలో పౌరులపై రెండు విధాల బాధ్యతలు ఉంటాయి. ఒకవైపు వారికి సంవిధానం కల్పించిన హక్కుల విషయంలో జాగరూకులై ఉండవలసి వస్తుంది. హక్కులపై అనవసర ఆంక్షలు (పరిమితులు) రాకుండా అప్రమత్తంగా ఉండవలసి ఉంటుంది. మరోవైపు కొన్ని విధులు, బాధ్యతలు నిర్వర్తించ వలసి ఉంటుంది. భారతీయులందరి సంక్షేమం జరగాలని సంవిధానం ప్రాథమిక హక్కులు మరియు ఆదేశిక సూత్రాల ద్వారా అనేక నిబంధనలను చేసింది కాని పౌరులు వారి ప్రాథమిక విధులను నిర్వర్తించనంతవరకు ప్రభుత్వం చేసిన సంస్కరణల లబ్ధి అందరికి ప్రాప్తించదు. ఉదా.: 'స్వచ్ఛ భారత్' అభియాన్ కింద ప్రభుత్వం స్వచ్ఛతా కార్యక్రమాలు అనేకం చేపట్టింది. కాని సార్వజనిక ప్రదేశాలలో అస్వచ్ఛత వ్యాపింప జేసే అలవాటును ప్రజలు మానుకోవాలి. భారత పౌరులకు తమ బాధ్యతల అవగాహన కలగవలెననియే సంవిధానంలో ప్రాథమిక విధులను చేర్చడం జరిగింది. భారత పౌరుల యొక్క ప్రాథమిక విధులు కింది విధంగా ఉన్నాయి.

- ప్రతి పౌరుడు సంవిధానాన్ని పాటించాలి. సంవిధాన లోని ఆదర్శాలను, జాతీయ జెండా మరియు జాతీయ గీతాన్ని ఆదరించాలి.

- స్వాతంత్ర ఉద్యమానికి ప్రేరణ నిచ్చే ఆదర్శాలను పాటించాలి.

- దేశం యొక్క సార్వభౌమత్వం, ఐక్యత మరియు అఖండతను సురక్షితంగా ఉంచుటకు ప్రయత్నశీలులై ఉండాలి.
- మన దేశాన్ని రక్షించండి. దేశ సేవను చేయండి.
- అన్ని రకాల భేదభావాలను మరచి ఐకమత్యాన్ని పెంచండి మరియు సౌభ్రాతృత్వ భావనను పెంపొందించండి. స్త్రీల గౌరవ ప్రతిష్ఠలను తగ్గించే సంప్రదాయాలను విడిచి పెట్టండి.
- మన యొక్క భిన్న సంస్కృతి వారసత్వాన్ని కాపాడండి.
- నైసర్గిక పర్యావరణాన్ని కాపాడండి. సజీవుల పట్ల దయాగుణాన్ని కలిగి యుండండి.
- శాస్త్రీయ దృక్పథం, మానవతావాదం మరియు జిజ్ఞాసవృత్తి కలిగి యుండవలెను.
- ప్రజా (సార్వజనిక) సంపదను కాపాడండి. హింసను విడనాడండి.
- దేశం యొక్క భవిష్యత్తులో అభివృద్ధి జరుగుటకు వ్యక్తిగత మరియు సామూహిక కార్యంలో ఉన్నత స్థాయిని చేరుకొనుటకు ప్రయత్నం చేయండి.
- 6 నుండి 14 సంవత్సరాలున్న తమ పిల్లలకు తల్లిదండ్రులు విద్యావకాశాన్ని కల్పించాలి.

**జాబితా తయారు చేయండి.**

- ఇంటిలో నీవు ఏ హక్కులను కోరతావు మరియు ఏ విధులను నిర్వర్తిస్తావు?
- పాఠశాలలో నీవు ఏ బాధ్యతలను నిర్వర్తిస్తావు? అక్కడ ఏ బాధ్యతలు నీకు వద్దు అనిపిస్తాయి?



కట్టడంపై పేరు వేయుచున్న బాలుడు



వ్రేలాడ దీసిన నిమ్మకాయ, మిరపకాయ



బస్సు విధ్వంసం



రోడ్డుపై చెత్త వేయుచున్న బాలిక

**ఈ చిత్రాలలో ఏ విధులను పాటించుటలేదని మీకు అనిపిస్తుంది.**




పై సంభాషణల ద్వారా మనకు ఏ విధుల గురించి తెలుస్తుంది? హక్కులు మరియు విధులు వీటి మధ్య సంబంధం ఏమైనా ఉంటుందా? విధులను పాటించుట వలన ఏం జరుగుతుందని మీకు అనిపిస్తుంది?

**మీకేమనిపిస్తుంది?**

6 నుండి 14 సంవత్సరాల బాల బాలికలకు ప్రాథమిక విద్యా హక్కు లభించింది. ఆ వయస్సులోని బాల బాలికలందరు పాఠశాలలో ఉండటం అవసరం. అయినను చాలా కారణాల వలన బాల బాలికలు పాఠశాలకు వెళ్ళలేకపోతున్నారు. తల్లిదండ్రులకు ఆర్థిక సాయం చేయుటకొరకు వారికి పని చేయవలసి వస్తుంది. అటువంటి పిల్లలను పాఠశాలకు తీసుకురావడానికి పట్టుబడితే అది వారిపై అన్యాయపు చర్య అని మీకు అనిపిస్తుందా?

భారత సంవిధానం యొక్క ఉద్దేశ్యాలు మరియు విశిష్టతల పరిచయం మనకు ఈ పాఠ్యపుస్తకంలోని ప్రారంభ అధ్యాయాలలో జరిగింది. భారత పౌరుల హక్కులు, ఆ హక్కులకు ఉండే రక్షణ గురించి కూడా మనం తెలుసుకొన్నాం. మన ప్రాథమిక భాధ్యతలు ఏమిటో మనకు అవగతమయ్యాయి. రాబోవు సంవత్సరం మనం మన దేశం లోని ప్రభుత్వ పరిపాలన ఎలా చేయబడుతుందో అభ్యసిద్దాం.



## అభ్యాసం

**1. ప్రభుత్వంపై ఏ ఆంక్షలు ఉంటాయి. దానికి సంబంధించిన జాబితాను కింది పటములో తయారు చేయండి.**

- ..............................................
- ..............................................
- ..............................................

**2. కింది వాక్యాలను చదవండి. వాటికి అవును/కాదు అని జవాబు రాయండి.**

(1) వార్తా పత్రికలో ఇచ్చిన ఉద్యోగ ప్రకటనలో స్త్రీ, పురుషులందరి కొరకు అవకాశాలు (భర్తీలు) ఉంటాయి. ..........

(2) ఒకే కర్మాగారంలో ఒకే పని చేయు స్త్రీ - పురుషులకు వేరువేరు వేతనాలు లభిస్తాయి. ................

(3) ప్రభుత్వం ద్వారా ఆరోగ్యాన్ని బాగు పరచుకొనే వివిధ ఆరోగ్య పథకాలు నిర్వహింప బడతాయి. .............

(4) దేశం దృష్ట్యా ముఖ్యమైన కట్టడాలు, స్మారకాల సంరక్షణ చేయాలి. ...............

**3. ఎందుకో చెప్పండి.**

(1) చారిత్రక కట్టడాలు, భవనాలు, స్మారకాల సంరక్షణ చేయుట.

(2) వృద్ధుల కొరకు పెన్షన్ యోజన (పింఛను పథకం) నిర్వహింపబడును.

(3) 6 నుండి 14 సంవత్సరాల లోపు బాల బాలికలకు విద్య నేర్చుకొనుటకు అవకాశం కల్పించబడినది.

**4. సరియైనదా, సరియైనది కాదా ఎందుకు చెప్పండి. సరికాని వాక్యాన్ని సవరించండి.**

1) జాతీయ జెండాను నేలపై పడనీయకుండుట.

(2) జాతీయ గీతం ఆలపిస్తున్నప్పుడు సావధాన స్థితిలో నిలుచుండుట.

(3) మన చారిత్రక కట్టడాలపై మన పేరు లిఖించడం.

(4) ఒకే విధమైన పనికోసం పురుషులకంటే స్త్రీలకు తక్కువ వేతనం ఇచ్చుట.

(5) సార్వజనిక ప్రదేశాలను స్వచ్ఛంగా (పరిశుభ్రంగా) ఉంచుట.

**5. రాయండి.**

(1) సంవిధానంలోని కొన్ని ఆదేశిక సూత్రాలు పాఠ్యపుస్తకం లో ఇవ్వబడినవి అవి ఏవి?

(2) భారత సంవిధానంలోని ఆదేశిక సూత్రాలలో పౌరులందరికొరకు సమాన పౌర చట్టానికి సంబంధించిన నిబంధనలు ఎందుకు చేయబడినవి?

(3) ఆదేశిక సూత్రాలు మరియు ప్రాథమిక హక్కులు అనునవి ఒకే నాణేనికి రెండు పార్శ్వాలు అని ఎందుకు చెప్పబడతాయి?

**6. పర్యావరణ పెంపు మరియు సంరక్షణ పౌరులు ఏ విధంగా చేయగలుగుతారో ఉదాహరణలతో రాయండి.**

**ఉపక్రమం**

(1) విద్య మన హక్కు కాని ఆ సందర్భంలో మన విధులు ఏమిటో వాటిపై సమూహ చర్చ చేయండి.

(2) దేశం దృష్ట్యా ముఖ్యమైన కట్టడాలు, స్మారకాలను కాపాడుటకు రాష్ట్రాలు పథకాలను చేయాలని ఆదేశిక సూత్రం ఉన్నది. కోటల సంరక్షణకొరకు రాష్ట్రం ఏమి చేసిందో వెదికి జాబితాను తయారు చేయండి.

(3) పిల్లల ఆరోగ్యం కొరకు ప్రభుత్వం ఏమి పథకాలు అమలుపరుస్తుందో ఆ విషయంపై వివరాలు సేకరించండి.

## కాల పట్టిక : 8వ శతాబ్దం నుండి 19వ శతాబ్దం
## ముఖ్య సంఘటనల అవలోకనం

సంఘటన క్రమాన్ని 'క్రింది నుండి పైకి' చదవాలి

**8వ శతాబ్దం**
- రాష్ట్రకూట రాజవంశం
- పాల్ రాజవంశం
- గుర్జర - ప్రతీహారుల అధికారం
- రాజపుత్రులు, గాహడ్వాలులు పరమార్ వంశం
- మహమ్మద్ బిన్ కాసిం సింధు ప్రాంతంపై దండయాత్ర

**9వ శతాబ్దం**
- చోళ వంశం
- శిలాహార్ వంశం

**10వ శతాబ్దం**
- రాజా జయపాల్ సబక్తగీన్‌ల పోరాటం

**11వ శతాబ్దం**
- హోయసలుల వంశం
- భారతదేశం పై తురుష్కుల దండయాత్ర
- భారతదేశంపై గజనీ ప్రాంతపు మహమ్మద్ యొక్క దండయాత్ర

**12వ శతాబ్దం**
- యాదవ వంశం
- భారతదేశంపై ముహమ్మద్ ఘోరీ యొక్క దండయాత్ర మరియు పృద్వీరాజ్ చౌహాన్ పరిపాలన అంతం

**13వ శతాబ్దం**
- బాల్బన్, సుల్తాన్ రజియా అల్తమశ్‌ల పరిపాలన కుతుబుద్దీన్ ఐబక్ ఢిల్లీకి సుల్తాన్ అగుట
- ఖిల్జీ వంశ రాజ్యం
- మహాను భావ సంప్రదాయం
- వార్కరీ సంప్రదాయం

**14వ శతాబ్దం**
- ఢిల్లీపై తుఘ్లక్ అధికారం, రాజధానిని ఢిల్లీ నుండి దేవగిరికి మరియు తిరిగి ఢిల్లీకి మార్చుట భారతదేశంపై తైమూర్ లంగ్ దండయాత్ర
- విజయనగర రాజ్యస్థాపన
- బహమనీ రాజ్యస్థాపన

**15వ శతాబ్దం**
- ఆదిల్‌షాహీ, నిజాంషాహీ, బరీద్‌షాహీ ఇమాద్‌షాహీల రాజ్యం

**16వ శతాబ్దం**
- ఢిల్లీపైగల సుల్తానుల పరిపాలన సమాప్తం
- మొఘల్ పరిపాలన ప్రారంభం, బాబర్ హుమాయూన్ యొక్క పరిపాలన
- అక్బర్ చక్రవర్తి యొక్క మహారాణా ప్రతాప్ చాంద్ బీబీ రాణీ దుర్గావతీలతో పోరాటం


**17వ శతాబ్దం**
- జహంగీర్
- శాహాజహాన్
- ఔరంగజేబ్
- మొఘల్ - సిక్కుల పోరాటం
- మహారాష్ట్రలో కరవు
- ఛత్రపతి శివాజీ మహారాజు యొక్క పరిపాలనాకాలం
- స్వరాజ్య స్థాపన
- ఛత్రపతి శివాజీ మహారాజు పట్టాభిషేకం
- ఛత్రపతి సంబాజీ మహారాజు
- ఛత్రపతి రాజారాం మహారాజు
- మహారాణీ తారాబాయి యొక్క పరిపాలన


**18వ శతాబ్దం**
- ఛత్రపతి శాహూ మహారాజు పరిపాలన
- మొదటి బాజీరావు పేశ్వ యొక్క పరిపాలన
- మరాఠీయుల ద్వారా పోర్చుగీసుల ఓటమి
- నానా సాహెబ్ పేశ్వా
- పానిపట్ యుద్ధం
- మొదటి మాధవ రావు
- నారాయణ రావు
- సవాయి మాధవ రావు
- స్వరాజ్యం నుండి సామ్రాజ్యం
- రెండవ బాజీరావు పేశ్వాపరిపాలన


**19వ శతాబ్దం**
- ఆంగ్లేయుల ద్వారా మరాఠీయుల ఓటమి

# छत्रपती शिवाजी महाराज स्मृतिग्रंथ

- सामान्य रयतेच्या कल्याणासाठी स्थापन केलेल्या स्वराज्य स्थापनेची कथा उलगडणारे पुस्तक.
- छत्रपती शिवाजी महाराजांच्या उत्तुंग कार्य व त्यामागची तेवढीच उत्तुंग व उदात्त भूमिका वाचकांसमोर आणणारे प्रेरणादायी वाचन साहित्य.
- इतिहास वाचनासाठी पूरक असे संदर्भ पुस्तक.








- इतिहास वाचनासाठी पूरक अशी संदर्भ पुस्तके.
- निवडक लेखक, इतिहासकारांचे प्रेरणादायी लेख.

**पुस्तक मागणीसाठी www.ebalbharati.in, www.balbharati.in संकेतस्थळावर भेट द्या.**

**साहित्य पाठ्यपुस्तक मंडळाच्या विभागीय भांडारांमध्ये विक्रीसाठी उपलब्ध आहे.**

ebalbharati

विभागीय भांडारे संपर्क क्रमांक : पुणे - ☎ २५६५९४६५, कोल्हापूर- ☎ २४६८५७६, मुंबई (गोरेगाव) - ☎ २८७७१८४२, पनवेल - ☎ २७४६२६४६५, नाशिक - ☎ २३९१५११, औरंगाबाद - ☎ २३३२१७१, नागपूर - ☎ २५४७७१६/२५२३०७८, लातूर - ☎ २२०९३०, अमरावती - ☎ २५३०९६५






మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్య ప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె.

इतिहास व नागरिकशात्र इ. ७ वी (तेलुगु माध्यम )

₹ 40.00